






# ప్రభువు - పరిశుద్ధ స్త్రీలు - 3

రచయిత : కెజియా వరప్రసాద రెడ్డి






# ప్రభువు – పరిశుద్ధ స్త్రీలు – 3


రచయిత్రి

**కెజియా వరప్రసాద రెడ్డి**



పబ్లిషర్స్ :

**టి.పి. వరప్రసాద రెడ్డి**

**షాలోము చర్చి, 1/183, విద్యానగర్, JNTUC పోస్టాఫీసు,**

**అనంతపురము– 515 002. (ఏ.పి.), సౌత్ ఇండియా**

**సెల్ : 9440285883, 9440669494**

# ప్రభువు – పరిశుద్ధ స్త్రీలు – 3

( కెజియా వరప్రసాదరెడ్డి

@ All rights reserved with publishers
Any part of this book not to be copied

**1st Edition - 14-02-2021**

**Copies available at :**

2) T.P. Varaprasad Reddy, Shalom Church, JNTU Post, Ananthapur - 515 002. Cell : 9440285883

3) Moreh Christian Assembly
1088, 3rd Phase, KPHB Colony
Hyderabad - 72, Cell : 9866604438

4) T. Rathna Reddy
Manager, Muthoot Finance, Giddaluru,
Prakasam Dt. Cell : 9490000789

## విషయసూచిక

1) సంతోషముఖిగా మార్చబడిన దుఖముఖి...
2) సుబుద్ధి గల రూపసి – అబీగయీలు...
3) శేబాదేశపు రాణి
4) మారువేషముతో మందిరమునకు వచ్చిన స్త్రీ – యెరోబాము భార్య
5) కుటుంబములో స్త్రీ పాత్ర
6) పరిశుద్ధ ఆభరణములు

# సంతోషముఖిగా మార్చిబడిన దు:ఖముఖి (హన్నా)

ఎల్కానాకు ఇద్దరు భార్యలున్నట్లు చదువుచున్నాము. దేవుడు ఆదాముకు ఒక భార్యనే ఇచ్చాడు కానీ ఇద్దరినివ్వలేదు. క్రొత్త నిబంధనలో దేవుడు పురుషులను ఏకపత్నీవ్రతులుగానే వుండమన్నాడు. కానీ, మొదటి భార్యకు సంతానము లేకపోతే పాతనిబంధన భక్తులు సహితము కొద్దిమంది ఇద్దరేసి భార్యలను చేసుకున్నట్లు చూస్తున్నాము. అందుకే ఎల్కానా హన్నా తనకు ప్రియమైన భార్యగా వున్నప్పటికీ, సంతానం కొఱకు పెనిన్నా అనే రెండవ భార్యను పెండ్లి చేసుకున్నట్లు వాక్యములో గమనిస్తున్నాము. ఇప్పుడు అంశాలవారీగా హన్నా జీవితాన్ని గమనిస్తున్నాం.

**1. సమూ 1-5వ.లో కుటుంబంలో హన్నా :-** ఇపుడు పరిశుద్ధ స్త్రీయైన హన్నాను గురించి ఆలోచన చేద్దాం. 'హన్నా' పేరుకు దయగలది లేదా కృపగలది అనే చక్కటి అర్థమున్నది. ఎఫెసి 8వ వచనం ప్రకారం "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షించబడియున్నారు. ఇది మీవలన కలిగినది కాదు. గనుక ఎవడును అతిశయపడ వీలులేదు". అన్న మాట ప్రకారము హన్నా దేవుని కృపవలన రక్షించబడిన వ్యక్తిగా మనకు కనబడుచున్నది. ఆమె విశ్వాసిగా మనకు అర్థమగుచున్నది. ఎల్కానా యొక్క రెండవ భార్య పేరు పెనిన్నా. 'పెనిన్నా' పేరుకు 'కెంపురత్నము' లేక 'పగడము' అనే అర్థాలున్నాయి. యెష 1:18వ.లో మీ పాపములు కెంపువలె ఎఱ్ఱనివైనను అవి గొఱ్ఱెబొచ్చువలె తెల్లనివగును అని వ్రాయబడినట్లు కెంపురత్నము పాపమునకు గుర్తుగా వున్నది. దీనిని బట్టి పెనిన్నా పాపికి గుర్తుగా కనిపిస్తున్నది. హన్నా రక్షించబడినదిగా వుండగా పెనిన్నా పాపిగా వున్నది. హన్నా ఆత్మ సంబంధి. పెనిన్నా లోకసంబంధి. ఇట్టి పెనిన్నాకు పిల్లలు కలిగిరి. కానీ ఆత్మీయురాలైన హన్నాకు పిల్లలు లేకపోయిరి అని వ్రాయబడింది. భక్తిగల హన్నాకు పిల్లలను ఎందుకు దేవుడు యివ్వలేదు? అని మనకినిస్తుంది. ఏదో ఒక లోపము మనలో ఉండినపుడే మనము దేవునికి దగ్గరగా రాగలము. మనమెక్కువగా ప్రార్థించగలము. అదే దేవుని సన్నిధిలో మన హృదయాన్ని కుమ్మరించే ప్రార్థన చేయగలము. కీర్త 37:28 వ.లో వ్రాయబడినట్లు పెనిన్నా అనే భక్తిహీనురాలి సంతతి నిర్మూలమయ్యింది. 34వ. భక్తిహీనులు ఎల్లప్పుడు ఎంతో ప్రబలి ఉంటారు. వారు మొలచిన చోటనే విస్తరించిన చెట్టువలె వుంటారు. అయినను ఆ దారిని పోయి చూడగా వాడు లేకపోయెను అని వ్రాయబడి వుంది.

కానీ కీర్తన 37:28వ.లో వ్రాయబడినట్లు దేవుడు హన్నాలాంటి తన భక్తులను విడువడు. 26వ.లో 'నీతిమంతుల సంతానపువారు ఆశీర్వదింపబడుదురు' అని వ్రాయబడింది. ఇపుడు అంశాలవారీగా హన్నా జీవితాన్ని ధ్యానిద్దాం.

**1) కుటుంబంలో భర్తకు ప్రియముగా (విధేయురాలుగా) వున్న హన్నా 1:25.**

ఎఫెసి 5:22వ.లో స్త్రీలారా ! ప్రభువునకు వలె మీ స్వంత పురుషులకు విధేయులై ఉ ండుడి అని ప్రభువు చెప్పారు. ఉద్యోగములో మనకిష్టమున్నా లేకున్నా మన యజమానులైన అధికారులకు లోబడుతున్నాం. గృహములో మన స్వంత పురుషులైన భర్తలకు, సంఘము క్రీస్తుకు లోబడినట్లుగా లోబడవలెనని ప్రభువు చెబుతున్నాడు. 1 పేతురు 3:1,2 వ.లలో అటువలె స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడివుండుడి. అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ పవిత్ర ప్రవర్తనను చూచి వాక్యము లేకుండానే తమ భార్యల నడవడి వలన రాబట్టబడవచ్చు అని వ్రాయించారు. ప్రియులారా ! ఏ భార్య విధేయురాలుగా భర్తకు వుంటుందో ఆమెయే భర్తకు ప్రియమైనదిగా వుంటుంది. అట్లు ఎల్కానా విధేయురాలైన తన భార్యయైన హన్నాకు బల్యర్పణలో రెండు పాళ్ళు ఇచ్చినట్లు చూస్తున్నాము. కానీ మన పరమ భర్తయైన యేసుప్రభువు తనకు విధేయతతో వెంబడించిన వారికందరికీ మార్కు 10:29 వ.లో నిమిత్తము, సువార్త నిమిత్తము ఇంటినైనను ‘అన్నదమ్ములనైనను, అక్కచెల్లెండ్రనైనను, తల్లిదండ్రులనైనను, పిల్లలనైనను, భూములనైనను విడిచినవాడు, ఇప్పుడు ఇహమందు హింసలతో పాటు నూరంతలుగా పాళ్ళు ఇవ్వబోతున్నాడని గ్రహించడం మనకెంత సంతోషదాయకమో కదా ! ఎంత ప్రోత్సాహకరమో కదా !

అలాగే అపో.కా. 5:32వ.లో దేవుడు తనకు విధేయులైన వారికి పరిశుద్ధాత్మను అనుగ్రహిస్తాడని కూడా వ్రాయబడింది. మత్త 3:17లో తన ప్రియ కుమారుడు, విధేయతతో బాప్తీస్మము పొందిన వెంటనే నీళ్ళలోనుండి ఒడ్డుకు వచ్చినపుడు ఆకారము తెరవబడగా దేవుని ఆత్మ పావురము వలె ఆయన మీదికి దిగి వచ్చినట్లు చూస్తున్నాము. అలాగున విధేయతను చూపించినవారికి అన్నిటికంటే విలువైన పాళ్ళు పరిశుద్ధాత్మను తండ్రి ద్వారా పొందుకుంటాము.

ప్రియ సోదరీ ! నేను, నా భర్తలాగానే చదువుకున్నాను. జీతం సంపాదిస్తున్నాను. చెప్పాలంటే ఆయనకంటే ఎక్కువే జీతాన్ని సంపాదిస్తున్నాను. నేనెందుకు నా భర్తకు లోబడాలి అని అనుకొనకూడదు. ఇది దేవుని ఆజ్ఞ. 1 పేతురు 3:5వ.లో అటువలె దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీలును తమ స్వపురుషులకు లోబడి వుండుట చేత తమ్మును తాము అలంకరించుకొనిరి అని వ్రాయబడింది. 4వ.లో స్త్రీలు సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండాలని వ్రాయబడింది. 6వ.లో శారా అబ్రహామును యజమానుడని పిలుచుచు అతనికి లోబడియుండెనని, మీరును యోగ్యముగా నడచుకొనుచు ఏ భయమునకు బెదరకయున్న యెడల ఆమెకు పిల్లలగుదురని వ్రాయబడింది. పై లేఖములన్నిటిని బట్టి క్రైస్తవ సోదరీలమైన మనమందఱము మన భర్తలకు అన్ని విషయములలో లోబడి వుండాలి. అభిప్రాయాలు,

ఒకరితో నొకరు వెలిబుచ్చుకోవచ్చు కాని తుది తీర్మాణము భర్తదే. కనుక లోబడే గుణమనే అంతరంగ స్వభావముచే స్త్రీలమైన మనమందరము మన స్వపురుషులకును మన ప్రభువైన యేసుక్రీస్తునకును విధేయులమై వుండుటకు తీర్మాణించుకుందాం.

**2. 1:6-8 శ్రమలలో వున్న హన్నా :-** హన్నాకు సంతానము లేని కారణముచేత పెనిన్నాచే ఆమెకు శ్రమలు మొదలయ్యాయి. ఆమెకు సంతానం లేకపోవడానికి హన్నా కారణం కాదు. కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము. గర్భఫలము ఆయన ఇచ్చు బహుమానము అని కీర్తన 127:3 వ.లోని వాక్యము సెలవిస్తుంది. అలాగైతే దేవుడు పిల్లలనివ్వకపోతే అది ఆమె తప్పుకాదు కదా ! హన్నాకు పిల్లలు లేకపోవుట చేత ఆమె వైరియగు పెనిన్నా హన్నాను విసికించుటకై ఆమెకు కోపము పుట్టించుచు వచ్చెనని 1:6వ.లో వ్రాయబడి వున్నది. మానవులందరి జీవితాల్లో నిండుకుండలుగా ఎవరమూ ఉండలేము. అనేక లేములు మన జీవితాల్లో వుంటాయి. కొందరి జీవితాల్లో కొన్ని లేములు వుంటే మరికొందరి జీవితాల్లో మరికొన్ని లేములు వుంటాయి. అంతమాత్రాన అన్నీ మాకున్నాయి, అనుకునేవారు లేమిలో వుండేవారిని చూచి వారిని విసికించాలా ? వారికి కోపము పుట్టించాలా ? మనలో ఎవరమూ, పరిపూర్ణులు కాము. మన 'లేమి'లు తీర్చడానికే ప్రభువు కీర్త 23:1 వ.లో ఆయన మన కాపరిగా వున్నాడు.

ఆయనను మన కాపరిగా చేసుకుంటే లేమి మనకు కలుగదు. అవి ఆధ్యాత్మికమైనవైనా, శరీర సంబంధమైనవైనా సరే వాటిని బట్టి ఏ తృణీకారములను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభువు వాటన్నిటినీ సమకూర్చువాడైయున్నాడు. తనకంటే వెనకాల కుటుంబంలోకి ప్రవేశించినదైనను ముందొచ్చిన చెవుల కంటే వెనకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్లు పెనిన్నా జోరు, జులుం హన్నా మీద ఎక్కువగా ఉండింది. యోబు 36:4వ.లో "దేవుడు బలవంతుడు గాని ఆయన ఎవనిని తిరస్కారము చేయడు" అని వ్రాయబడింది. పెనిన్నా తనకు పిల్లలు కలిగియున్నంత మాత్రాన పెద్ద భార్యయైన హన్నాను తిరస్కరించవచ్చునా ? ప్రియ సోదరీలారా ! దేవుడు మనకిచ్చిన దీవెనలను, ఆశీర్వాదాలను బట్టి మనము అతిశయించకుండా ఆ మేళ్ళను బట్టి దేవుణ్ణి స్తుతించాలే కానీ, అవి లేనివారిని తిరస్కరించి, వారిని కించపరచకూడదు. అలాంటి వారిని ఆదరించాలే కానీ, తృణీకరించి అవమానపరచ కూడదు.

అలాగున పెనిన్నా తనను విసికించి కోపము పుట్టిస్తూ వుండగా హన్నా భోజనము చేయక ఏడ్చుచూ వచ్చెనని 7వ వచనములో చదువుచున్నాము. ఎవరైనా మనల్ని విసికిస్తూ, తృణీకరిస్తూ వుంటే మనమేమి చేయాలో దేవుడు హెబ్రీ 12:3వ వచనములో ఈలాగున వ్రాయించాడు. మీరు అలసటనొందకయు, మీ ప్రాణములు విసుకకయు వుండునట్లు పాపాత్ములు తనకు వ్యతిరేకముగా (తమ సొంత హానికే) చేసిన తిరస్కారమంతయు ఓర్చుకొనిన ఆయనను తలంచుకొనుడి.

ప్రియులారా ! మన జీవితాల్లో ఏ పెనిన్నాల్లాంటివారు మనల్ని విసికించి తృణీకరిస్తూ వున్నారో వారు తమ స్వంత హానికే అలాగు చేస్తున్నారని ప్రభువు చెబుతున్నాడు. పిల్లలు లేరని హన్నాను తృణీకరించిన పెనిన్నాకు కలిగిన హాని ఏంటి ? అనేది బైబిలులో మనకు వ్రాయబడలేదు కానీ, సమూయేలు పుట్టిన తరువాత హన్నా సమూయేలును దేవుని మందిరములో ఏలీ ముందఉ దేవునికి ప్రతిష్టించే సమయంలో పెనిన్నా తన పిల్లలలో ఇద్దరు చనిపోగా ఆ ఇద్దరు పిల్లలకు భూస్థాపన చేసిందని చరిత్రలో మనము చూడగలము. ఈనాడు ఎవరైనా తృణీకరింపబడుతుంటే, అలాగున వారిని తృణీకరించేవారు తమ స్వంత హానికే ఇతరులను తృణీకరిస్తారనే భయంకర సత్యాన్ని తెలుసుకోవాలి. వద్దు, ఎవ్వరినీ తృణీకరించవద్దు. మీకు మీరే హాని తెచ్చుకోవద్దు. ఎప్పటికీ మనదే కాలం అనుకొనవద్దు. తృణీకరించబడిన వారిని మూలకు తలరాయిగా చేస్తాడు ప్రభువు.

అలాగే ప్రభువైన యేసుక్రీస్తు, మనల్ని సృజించినవాడై మనకు భర్తగా వున్న ప్రభువు భర్తవలె కీర్తన 94:19వ.లో ఆదరిస్తున్నాడు. నా అంతరంగములో విచారములు హెచ్చుగా నీ గొప్ప ఆదరణ నా ప్రాణమునకు నెమ్మది కలుగజేయుచున్నది. అవును మన విచారములు ఎన్ని హెచ్చుగా వున్నప్పటికి, ఆయన ఆదరణ మనకు గొప్పగానే వుంటుంది. ఇలాంటి ఆదరణ ఎవ్వరును ఇవ్వలేరు. యెష 54:11వ.లో ప్రయాసపడి గాలివానచేత కొట్టబడి ఆదరణ లేక వున్నదానా నేను నీలాంజనములతో నీ కట్టడమును కట్టుదును. నీలములతో నీ పునాదులను వేయుదును. మాణిక్యమణులతో నీ కోటకొమ్ములను సూర్యకాంతములతో నీ గుమ్మములను కట్టుదును. నీ పిల్లలందరు యెహోవాచేత ఉపదేశము పొందుదురు. నీ పిల్లలకు అధిక విశ్రాంతి కలుగును. నీవు నీతిగలదానవై స్థాపింపబడుదువు. నీవు భయపడనక్కరలేదుద. బాధించువారు నీకు దూరముగా నుందురు. భీతి నీకు దూరముగా వుండును. అది నీ దగ్గరకు రానేరాదు. 17వ. నీకు విరోధముగా రూపించబడిన యే ఆయుధమును వర్ధిల్లదు అని ప్రభువు మనల్ని గూర్చియు, మన పిల్లలను గూర్చియు, మన నివాసములను గూర్చియు యెష 54:5వ.లో భర్తవలె ఆదరిస్తున్నారు.

అలాగే యెష 66:13వ.లో వలె "ఒకని తల్లి వానిని ఆదరించునట్లు నేను మిమ్మును ఆదరించుచున్నాను. యెరూషలేములోనే మీరు ఆదరించబడుదురు" అని తల్లివలె ఆదరిస్తున్నాడు. యెరూషలేములోనే అంటే స్థానిక సంఘములోనే ప్రభువు ఆదరిస్తున్నాడు. అంతమాత్రమే కాక యోహా 14:16వ. ప్రకారము "నేను తండ్రిని వేడుకొందును మీయొద్ద ఎల్లప్పుడు వుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను అనగా సత్యస్వరూపి ఆత్మను మీకనుగ్రహించును" అని తన పరిశుద్ధాత్మ ద్వారా కూడా ప్రభువు మనల్ని ఆదరిస్తున్నాడు.

అంత మాత్రమే కాకుండా చివరకు రోమా 15:4వ. ప్రకారము "లేఖనములను బట్టియు" ప్రభువు మనలను ఆదరిస్తున్నాడు. కనుక ప్రభువు మనలను, భర్తవలెను, తల్లివలెను, పరిశుద్ధాత్మవలనను, లేఖనములవలనను ఇంకను, రోమా 1:11వ.ను బట్టి ఒకరి విశ్వాసము చేత ఒకరు ఆదరించబడే ఏర్పాటును ప్రభువు మనకనుగ్రహించాడు. మనము శ్రమలలో వున్నప్పటికినీ ఇన్ని విధములుగా ప్రభువు మనల్ని ఆదరిస్తుండగా శ్రమలో కృంగిపోక ఆదరణ కలిగి ప్రభువు కొఱకు జీవించుదుము గాక !

హన్నాలో ఎల్కానా పదిమంది కుమారులకంటే నేను నీకు విశేషమైనవాడను కానా! అని ఓదార్చాడు. ఒకవేళ పెనిన్నా తనకు పదిమంది పిల్లలున్నారని విర్రవీగి వుండవచ్చును. కానీ ఆ పదిమందిలో ఏ ప్రత్యేకతయూ లేదు. వారు దేవునియందు భక్తిపరులని గాని, యోగ్యులనిగాని, దేనియందునై నను ప్రావీణ్యులనిగాని మనము వారి విషయమై చదువుటలేదు. కానీ సమూయేలు ప్రవక్తగా, న్యాయాధిపతిగా ఇశ్రాయేలీయులకు రాజ్యాంగ పరిపాలన పద్ధతిని ప్రవేశపెట్టినవాడుగా, ప్రార్థనాపరుడుగా మనము చదువుచున్నాము. తృణీకరింపబడిన హన్నాకు విలువైన కుమారుణ్ణి దేవుడిచ్చాడు. అందుకై దేవునికి స్తోత్రములు. సమూయేలు పేరుతో రెండు గ్రంథాలను దేవుడు బైబిల్లో 1 సమూయేలు, 2వ సమూయేలు అనే గ్రంథాలను దేవుడు పొందుపరిచాడు.

హెబ్రీ 12:3 ప్రకారం అలసటపడకయు మీ ప్రాణములు విసుకకయు వుండునట్లు పాపాత్ములు తనకు వ్యతిరేకముగా చేసిన తిరస్కారమంతటిని ప్రభువు ఓర్చుకొనినట్లు హన్నా ఓర్చుకొనలేక పెనిన్నా తిరస్కారాన్ని బట్టి, కోపము తెప్పించిన దాన్ని బట్టి ప్రాణము విషయమై విసికిపోయి భోజనమును, పానమును విడిచిపెట్టి ఏడ్చుచూ వున్నట్లు ఎల్కానా 1:8వ.లో హన్నాను ఓదార్చుచున్నట్లు మనం గమనిస్తున్నాము. ఆ దినాల్లో హెబ్రీ 12:3వ. హన్నాకు తెలియదు. కనుక ఆమె పెనిన్నా మాటలకు ఓర్చుకొనలేక తాను ఆదరణ పొందలేక తనకు తానే కుమిలి, కుమిలి పెనిన్నా నన్ను ఇలా అనిందే, అలా అనిందే అని ఏడుస్తూ వచ్చింది. కానీ, ప్రభువు ప్రాణాన్ని విసికించినవారు. ఆయనను తిరస్కరించిన వాళ్ళు ఒకరిద్దరు కాదు. కోకొల్లలుగా ఆయనను విసికించి తిరస్కరించారు. కానీ, వారిలో ఏ ఒక్కరి విషయంలో కూడా ఆయన విసుకు పడలేదు. వారిని తిరస్కరించలేదు. దేవుడు బలవంతుడు కానీ ఆయన ఎవరినీ తిరస్కరించడని యోబు 36:4వ.లో ముందే చూచుకున్నాము. సిలువలో అనేకులు తనను బాధిస్తూ వుండగా, ఈ లోకంలో ఏ నేరగాన్నిగాని, ఏ పశువును గానీ, ఏ మృగాన్నిగానీ కొట్టని రీతిగా ఆయనను కొడుతూ, దూషిస్తూ, నిందిస్తూ ఈ దెబ్బలన్నీ చాలవన్నట్టు, ఆయన ముఖంమీద ఉమ్మివేస్తూ వుండగా "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము" అని పాపాత్ములందరిని ఆయన తిరస్కరించకుండా వారికి అనుకూలంగా చేసిన విజ్ఞాపన ఎంత ప్రేమగలదో మనం గమనిస్తున్నాం.

ప్రియ సోదరీలారా ! మన యెడల ఇలా తిరస్కరించిన పెనిన్నాల విషయమై ఈలాంటి ప్రేమగల విజ్ఞాపన ప్రభువులాగ చేస్తున్నావా ? ఆ పెనిన్నా నీ జీవితంలో నీ అత్తగారేమో, ఆ పెనిన్నా నీ మందిరంలో ఒక సోదరి ఏమో. ఆ పెనిన్నా నీతోటి ఉద్యోగి ఏమో, ఆ పెనిన్నా నీ సమీప బంధువేమో ! ఆ పెనిన్నా రక్షించబడిన నీ భర్తగారేమో ? ఆ పెనిన్నా నీ అధికారి ఏమో ! ఆ పెనిన్నా నీ దేహంలో వుంటూ నిన్ను బాధించే, పీడించే ఒక రోగమేమో ! ప్రభువులాగా వారి కొఱకై ప్రేమతో వారిని క్షమించమని విజ్ఞాపన చేస్తానని ఇపుడే తీర్మాణం చేసుకుంటావా ? హన్నాకు హెబ్రీ 13:3వ వచనము తెలియదు గనుక ఆమె ఏడుస్తూ వచ్చింది. క్రొత్త నిబంధన హన్నాలమైన మనము మన విరోధుల మాటలను సారిసారికి గుర్తుచేసుకుంటూ ఏడ్వకుండ ప్రభువు ఓర్చుకున్నట్లు ఓర్చుకుంటూ మన విరోధులను, ప్రత్యర్థులను, మనలను బాధించిన వారిని మనకు విరోధముగా విమర్శించిన వారిని మన మీద అపద్ధముగా చెడ్డ మాటలను పలికినవారిని ప్రేమించి వారికి అనుకూలంగా ప్రభువును విజ్ఞాపన చేద్దామా ?

అట్లుకాక హన్నాలాగ వూరకనే ఏడుస్తూ ఉండటం ద్వారా కీర్తన 37:8 వ.లో వున్నట్లు కోపపడకుము. ఆగ్రహమును విడిచిపెట్టుము. వ్యసనపడకుము. అది కీడుకే కారణము అన్నమాట ప్రకారం హన్నాకు కీడు కలిగేది. కానీ, ఆమె ఎల్కా నాచే ఆదరించబడిన తరువాత దేవున్ని ప్రార్థిస్తూ ఏడ్చింది. వట్టి ఏడ్పు వ్యసనము, కీడుకు కారణమయ్యేది. కానీ, ప్రార్థనలో దేవుని దగ్గర ఏడ్చింది. కనుక దేవుడు ఆమె మొఱ్ఱ విన్నాడు. ఏడ్చుచున్న హన్నాను భర్త ఆదరించాడు. కొద్దిమంది భర్తలు భార్యలను ఆదరించే పని చేయలేకపోతున్నారు. వారి ఏడ్పు గమనించలేకపోతున్నారు. అసలు వారు తిన్నారో లేదో కూడా గమనించే ప్రయత్నం కూడా చేయలేకపోతున్నారు. భర్త ఆదరణను బట్టే ఆమె నిజముగా ఆదరించబడిందని గ్రహిస్తున్నాము. మన ప్రభువు కూడా కీర్తన 94:18లో నా అంతరంగములలో విచారములు హెచ్చగా నీ గొప్ప ఆదరణ నా ప్రాణమునకు నెమ్మది కలుగచేయుచున్నది అను మాటతో సంఘ భార్యను ఆదరిస్తున్నాడు. 119 కీర్త 50వ. ప్రకారం ఆయన వాక్యమే బాధలో నెమ్మది కలుగజేస్తున్నది. కీర్తన 119:165వ. ప్రకారం ఆయన ధర్మశాస్త్రమును ప్రేమించేవారికి కూడా ఎంతో నెమ్మది కలుగుతుంది. కనుక మనకు ఆదరణ, నెమ్మది లేనపుడు ఆయన వాక్యాన్నే మనము ఆశ్రయించాలి.

8వ వచనంలో ఎల్కానా హన్నాను ఓదార్చుచూ హన్నా నీవెందుకు ఏడ్చుచున్నా వన్నపుడు, మనమే ఆమె స్థానములో వుండినట్లయితే వెనిన్నా నన్ను విసికించి, కోపము పుట్టిస్తున్న కారణాన్ని బట్టి ఏడుస్తున్నానని చెప్పేవారిమేమో ! ఆదాముతో దేవుడు "నేను తినవద్దని చెప్పిన పండు వృక్షఫలమును తింటివా అనినపుడు, ఇదిగో నీవిచ్చిన స్త్రీ నాకియ్యగా నేను

తింటిని అని, స్త్రీని అడుగగా ఆ సర్పము నన్ను మోసగించింది అని ఒకరిమీద ఒకరు చెప్పుకున్నారేగానీ, హన్నా మాత్రము తన ఏడ్పుకు కారణము పెనిన్నా కారణమని భర్తతో చెప్పలేదు. లోపమంతా తనదేనని, నేను పిల్లలను కనకపోవుటచేతనే కదా ఏడ్పించబడుచున్నానని తన లోపం కొఱకే ఏడ్చింది. కానీ, పెనిన్నా తన ఏడ్పుకు కారణం భర్తకాదు, పెనిన్నా కాదు. పిల్లలనియ్యని దేవుడు కాదు. వారినెవ్వరినీ ఆమె నిందించ ప్రయత్నం చేయలేదు. తన గొడ్రాలి స్థితికొఱకే ఏడ్చింది. ప్రియ సోదరీలారా, అస్తమానము ఎవరో ఏదో మనల్ని అన్నారని ఏడ్చుట కాదుగానీ, దేన్ని బట్టి ఎవరు మనల్ని గూర్చి ఏమనుకుంటున్నారో ఆ లోపమేంటో సరిచేయుమని మన ప్రభువుని ప్రార్థించి లోపాన్ని సరిచేసికోవడమే సరియైన మార్గమని మనము తెలిసికొనవలసిన వారముగా వున్నాము.

పైగా ఆమె దేనికొఱకు ఏడుస్తుంది ? దేవుని సేవ కొఱకు మగ పిల్లవాడు కావాలని ఏడుస్తోంది. అంటే పిల్లవాడు తనకొరకు కాదట, దేవుని కొఱకే. తన ఏడ్పు దేవుని కొఱకే. అలా దేవుని కొఱకే ఏడ్చిన మరో సోదరి క్రొత్త నిబంధనలో వుంది. ఆమె మగ్దలేని మరియ. దూత – "అమ్మా ఎందుకు ఏడ్చుచున్నావు ?" అంటే – యోహా 20:13లో 'నా ప్రభువును ఎవరో ఎత్తికొనిపోయిరి' అని ప్రభువు కొఱకు ఏడ్చింది.

ప్రియ సోదరీ ! ఈనాడు నీ ఏడ్పులు దేనికొఱకు ? ఎవరి కొఱకు ? పనికిమాలిన వాటికొఱకు ఏడ్చుచున్నావా ? ఆత్మీయ విషయాలకు కొఱకు ఏడ్వడం, హన్నావలె, మగ్దలేను మరియవలె నేర్చుకుందామా ? సంఘాలలో సమూయేలులు, దానియేలులు, దావీదులు, ఎస్తేరు రూతులు, యెఫ్తా కుమార్తెలు పౌలు, సీలలు, అకుల ప్రిస్కిల్లలు కావలెనని కన్నీటితో వేడుకుందామా ! మన ఏడ్పులు విలువైనవాటి కొఱకై వుండాలని గమనిద్దాం.

ఎల్కానా హన్నాను ఆదరించిన మాట – పదిమంది కుమారులకంటే నేను నీకు విశేషమైన వాడనుకానా ? అని చెప్పాడు. ఈ మాట ప్రకారం హన్నా 10 మంది కుమారులకంటే భర్తకే విశేషతను చూపిస్తుందన్న మంచి సాక్ష్యము భర్తగారి ద్వారా పొందుతోంది. మన భర్తలను మన పిల్లలకంటే విశేషమైనవారిగా మనము ఎరుగుతున్నామా? సాధారణంగా పిల్లలు పుట్టిన తరువాత తల్లి పిల్లల విషయంలో ఎంతో ఎక్కువ శ్రద్ధ చూపిస్తూ వుంటుంది. వారి విషయమై ఎన్నో పనుల్లో తలమునకలై వుంటుంది. అయినప్పటికీ భర్తను నిర్లక్ష్యపెట్టకూడదని ఆయననే విశేషముగా చూడాలని, మొదటి ప్రాముఖ్యత భర్తలకే ఇవ్వాలని ఎల్కానా మనకు నేర్పిస్తున్నాడు. ఈ విషయాన్ని మన పరమ భర్తయైన ప్రభువు విషయంలో ఆలోచిస్తే మన పిల్లలకంటే మన పనులకంటే, మన ఉద్యోగాల కంటే, మన ప్రభువు, మన పరలోక ప్రియుడు మనకు విశేషముగా వున్నాడా ? పరమ గీతాల్లో వేరు ప్రియునికంటే నీ ప్రియుని విశేషమేమి అని యెరూషలేము కుమార్తెలు షూలమ్మితిని అడిగినపుడు ఆమె తన ప్రియుని విశేషతను గురించి

పర 5:10-16 వ. వరకు అతని శిరస్సు మొదలుకొని ఆయన పాదాల వరకు వర్ణిస్తూ ఇతడే నా ప్రియుడు, ఇతడే నా స్నేహితుడు అని అనర్గళముగా వర్ణించింది.

ప్రియ సోదరీలారా ! మిమ్మల్ని ఎవరైనా వేరేదే వుండ్లకంటే నీ దేవుని విశేషత ఏమిటి? అని అడిగితే షూలమ్మితిలాగా నీవు నీ ప్రభువుని గూర్చి అనర్గళముగా వర్ణించగలవా? ఆయన ప్రేమను ఆయన దయ, కనికరమును, ఆయన ప్రభావాన్ని, ఆయన మంచితనాన్ని, ఆయన ప్రభావాన్ని, ఆయన విశేషగుణములన్నిటినీ వర్ణించగలవా? అలాగైతే ఆ ప్రభువు యొక్క విశేషతను వాక్యాధారంగా ఎలాగు వివరించగలమో కొంతమేరకు ధ్యానిద్దామా ? ఈ లోకంలో దేవుండ్లు, దేవతలు అనేవారు ఎంతమంది ఉన్నను మన యెహోవా దేవుడు ఎలాంటివాడు.

1) యెహో 2:22వ.లో "దేవుళ్ళలో యెహోవాయే దేవుడు, యెహోవాయే దేవుడు" అని యెహోషువ చెబుతున్నాడు. యెష 43:10వ.లో నాకు ముందుగా ఏ దేవుడును నిర్మింపబడలేదు. నా తరువాత ఏ దేవుడును వుండడు. నేను నేనే యెహోవాను. నేను తప్ప వేరొక రక్షకుడు లేడు. ప్రకటించినవాడను నేనే రక్షించినవాడను నేనే. ఈ మాటలను బట్టి యెహోవా దేవుడు ఇతర దేవుండ్లకంటే విశేషమైనవాడని అందరును గ్రహించ వలసినవారుగా వున్నారు.

2) యెష 57:15వ.ను బట్టి యెహోవా దేవుడు మహాఘనుడు, పరిశుద్ధుడు, నిత్యనివాసియు, మహోన్నతమైన పరిశుద్ధ స్థలములో నివసించువాడను అయినను వినయముగల వారి రపాణమును ఉజ్జీవింపచేయుటకును, నలిగినవారి ప్రాణమును ఉజ్జీవింప చేయుటకును, నలిగినవారి ప్రాణమును ఉజ్జీవింపచేయుటకును, వినయముగల వారి యొద్దను దీనమనస్సుగలవారి యొద్దను నివసించుచున్నానని చెప్పిన గొప్ప తగ్గింపు గలిగిన దేవునిగా ఇతర దేవుండ్లేకంటే విశేషత కలిగిన దేవుడుగా ఉంటున్నాడు.

3) రోమా 9:5వ. బట్టి యేసుక్రీస్తు సర్వాధికారియైన దేవుడైయుండి నిరంతరము స్తోత్రార్హుడైయున్నాడు అను మాట యేసుక్రీస్తుకు సర్వాధికారాలున్నాయి. పాపములను క్షమించుటకును, దయ్యములమీదను, రోగములమీదను, సృష్టిమీదను, అందరి మీదను, దేవదూతలమీదను ఆయనకు అధికారముగలవాడై వున్నాడు. కొద్దిమంది దేవుండ్లు అని పిలువబడుతున్నవారు అగ్నికో దేవుడు, గాలికొక దేవుడు, భూమికొక దేవత. చదువుకొక దేవత ఇలా ఒక్కోదానిమీదే అధికారముగలవారుగా వారిని గూర్చి వింటున్నాము. యేసుక్రీస్తు సర్వాధికారియైన దేవుడుగా వున్నాడు. యేసుక్రీస్తు నిరంతర స్తోత్రార్హుడైయున్నాడు. కొద్దిమంది దేవుండ్లనబడేవారు వారమునకొక రోజు మాత్రమే స్తోత్రించబడుచున్నట్లు, శనివారము మాత్రమే సుప్రభాతము ద్వారా స్తోత్రింపబడు చున్నారు. మరికొద్ది మంది శుక్రవారము మాత్రమే. మరికొద్దిమంది, మంగళవారము

మాత్రమే స్తోత్రించబడుచున్నారు. ఒక్క యేసుక్రీస్తు దేవుడు మాత్రమే నిరంతరము నాన్‌స్టాప్‌గా స్తోత్రించబడుచున్నాడు గనుక ఈ విషయములో కూడా యేసుక్రీస్తు విశేషత మనకు కనిపిస్తుంది.

4) "పరిశుద్ధతను బట్టి ఆయన మహనీయుడు. నేను పరిశుద్ధతను అని లేవి 11:45 వచనమును బట్టి ఆయన పుట్టుకలో పెరుగుటలో, చనిపోవుటలో పరిశుద్ధుడే. హెబ్రీ 7:26వ. బట్టి ఆయన పవిత్రుడు, నిర్దోషి, నిష్కల్మషుడు, పాపులలో చేరక ప్రత్యేకముగా వున్నవాడు, ఇట్టి ప్రధాన యాజకుడు మనకు సరిపోయినవాడు" అను మాటను బట్టి ఆయన అనేక దేవుండ్లందరిలో ఆయన విశేషత కలవాడు. మిగతా వారందరూ పుట్టుకలో, పెరుగుటలో, చచ్చుటలో అనేక పాపములు చేసినవారుగా కనిపిస్తున్నారు.

5) వేదములలో వ్రాయబడినట్లు ప్రజల పాపపరిహారము కొఱకు ప్రాణము పెట్టి చనిపోయి, తిరిగే మృత్యుంజయుడుగా లేచిన ఏకైక దేవుడుగా విశేషత గలవాడుగా యేసుప్రభువు వున్నాడు.

6) వేల్పులలో నీతో సముదెవడు అను మాటను బట్టి, మింటను నీకు సాటియైన వాడెవడు అను అనేక మాటలను బట్టి ప్రభువు అనేక దేవుండ్లకంటే విశేషమైనవాడుగా అసమానుడుగా సాటిలేని సత్యదేవుడుగా ఉండగా ఇట్టి దేవుని గూర్చి ప్రియ సోదరీ! నీవు నేను లోకంలో ఆయనను షూలమ్మితివలె వర్ణించాలి.

7) కీర్తన 96:4ను బట్టి సకల దేవతలకంటెను ఆయన పూజనీయుడు. కీర్తన 97:7ను బట్టి సకల దేవతలు ఆయనకు నమస్కారము చేయును అను మాటలను బట్టి ఈ ప్రభువు అందరికంటే విశేషత గల దేవుడై వున్నాడు.

అలాగున షూలమ్మితి మరియు హన్నా మనకు పాఠముగాను, మాదిరిగాను వున్నారు.

**3) ప్రార్థనలో హన్నా 1:9-17 :-** శ్రమలలో వున్న హన్నా ప్రార్థించుట నేర్చుకుంది. అందులోను ఆమె దేవుని ఆలయంలో ప్రార్థన చేయుటకు షిలోహుకు వెళ్ళింది. ప్రార్థనలను మనం ఇళ్లలోను, మందిరంలోను, జంటగాను, గుంపుగాను, లేక వ్యక్తిగతంగాను చేయగలం. ఇపుడు హన్నా దేవుని ఆలయంలో వ్యక్తిగతంగా బహుగా ఏడుస్తూ యెహోవా సన్నిధిలో ప్రార్థన చేస్తోంది. దావీదు కూడా 18వ కీర్తన 6వ వచనంలో నా మొఱ్ఱ ఆయన సన్నిధిలో చేరి ఆయన చెవులలో జొచ్చెను. అపుడు భూమి కంపించి అదిరెను. పర్వతముల పునాదులు వణికెను. 10 వచనములో కెరూబుల మీద ఎక్కి ఆయన యెగిరి వచ్చెను. గాలి రెక్కల మీద ప్రత్యక్షమాయెను. 17వ.లో బలవంతులగు పగవారు నన్ను ద్వేషించువారు నాకంటె బలిష్ఠులైయుండగా వారి వశములో నుండి ఆయన నన్ను రక్షించెను" అని వ్రాయబడి యున్నది.

దావీదు మందిరములో చేసిన ప్రార్థనకు ఎంతగా ప్రభావవంతముగా జవాబును పొందుటే కదా ! అందుకే యెష 56:7వ.లో నా ప్రార్థనా మందిరములో వారిని ఆనందింప చేసెదనని దేవుడు చెబుతున్నాడు. ఎప్పుడు తన బిడ్డలను ఆనందింపచేస్తాడు ? వారు ప్రార్థన మందిరములో ప్రార్థించినపుడు దేవుడు వారికి జవాబును ఇస్తే అప్పుడే వారు ఆనందాన్ని పొందుతారు. కనుక మందిరానికెళ్ళి ప్రార్థించేవాళ్ళు ఈనాడు చాలామంది లేరు. వారి ప్రార్థనా విన్నపములు సంఘసేవకునికి, పెద్దలకు, పేపర్లో వ్రాసి ప్రార్థన చేయమంటారు. కానీ వారు మాత్రము ప్రార్థన మీటింగ్‌కు రారు. ఎవనికి నొప్పివుందో వాడే డాక్టర్‌కు చెప్పితే డాక్టర్ వాడికి సరియైన మందు యివ్వగలడు. రోగి పక్షాన వేరేవారు చెబితే దాని ఫలితము వేరుగా ఉంటుంది.

ప్రియ సోదరీ ! నీ యేడ్పు, నీ బాధ, నీ నొప్పి, నీ చింత, నీ రోగము గూర్చి నీవు చెప్పినట్లు భారముతో ఎవ్వరూ చెప్పలేరు. నీకోసం, నీ పిల్లల కోసం, నీ సమస్య కోసం నీవు యేడ్చినట్లు ఎవరునూ ఏడ్వలేరు. ఈ పాఠ్యభాగములో తన సమస్యకోసం హన్నా బహుగా యేడ్చి ప్రార్థించినట్లు ఎవరునూ ఆమె పక్షములో అంతగా యేడ్చి ప్రార్థించలేరు. ఎంత దు:ఖముతో ఆమె ప్రార్థించిందో అంత ఆనందముతో ఆమె జవాబుగా పొందింది. కనుక మందిరములో ఆమె చేసిన ప్రార్థనకు ఎంత త్వరగా జవాబు ఆనాడే వచ్చిందో చూడండి.

అలాగే హేరోదురాజు పేతురును చెఱలో వేయించగా సంఘమంతయు ఆయన కొఱకు ప్రార్థన అపో.కా. 12:5వ.లో చేయగా ప్రభువు సంఘప్రార్థనలు ఆలకించి ఆ రాత్రియే పేతురుకు విడుదల కలిగించాడు. సంఘ ప్రార్థనలు బలీయమైనవి. అందుకే యెష 56:7వ.లో దేవుడు నా మందిరము సమస్త జనులకు ప్రార్థన మందిరమనబడును అన్నారు. కనుక ఆలయములో ప్రార్థనలకు, సమస్త జనులు రావలెనని ప్రభువు కోరుతున్నారు. అపో.కా. 12:12వ.లో మరియ యింటిలో పేతురు విడుదల కొరకై అనేకులు కూడి ప్రార్థన చేస్తున్నట్లు వ్రాయబడింది. అందులో ఆ ప్రార్థన కూడికకు 'రొదె' అనే చిన్నమ్మాయి వచ్చినట్లు మనం చూస్తున్నాము.

ఇక్కడ హన్నా కన్నీటి ప్రార్థన చేసింది. హిజ్కియా కన్నీరు విడిచి ప్రార్థించాడు. దావీదు కీర్తన 56:8వ.లో నా కన్నీరు నీ బుద్దిలో వుంచబడియున్నవని వ్రాశాడు. యిర్మి 9:1 వ.లో దివారాత్రము కన్నీరు విడుచునట్లు నా తలను జలమయముగా చేసుకున్నానని యిర్మియా వ్రాశాడు. యోవే 2:12వ.లో కన్నీరు విడుచుచు దు:ఖించుచు మన:పూర్వకముగా తిరిగి నా యొద్దకు రండి అని యెహోవా తన ప్రజలతో చెబుతున్నాడు. యోబు కూడా 10:1 వ.లో "నా బ్రతుకునందు నాకు విసుకు పుట్టినది. నేను అడ్డు లేకుండా అంగలార్చెదను" అన్నాడు. ఈలాగు దేవుడు మన కన్నీటికి, రోదనకు, అంగలార్పుకు విలువనిచ్చాడు. యిర్మి 9:17వ.లో రోదనము చేయు స్త్రీలను కనుగొనుడి. వారిని పిలువనంపుడి. తెలివిగల స్త్రీలను కనుగొనుడి.

వారిని పిలువనంపుడి. 18వ.లో మన కన్నులు కన్నీళ్ళు విడుచునట్లుగాను మన కనురెప్పలనుండి నీళ్ళు ఒలుకునట్లుగాను వారు త్వరపడి మానక రోదన ధ్వని చేయవలెను అని సైన్యములకు అధిపతియగు యెహోవాయే యిర్మీయా ద్వారా సెలవిచ్చినట్లు చదువుచున్నాము. 20వ.లో "స్త్రీలారా, యెహోవా మాట వినుడి – మీరు చెవియొగ్గి ఆయన నోటి మాట ఆలకించుడి. మీ కుమార్తెలకు రోదనము చేయ నేర్పుడి. ఒకరికొకరు అంగలార్పు విద్య నేర్పుడి" అని ప్రభువగు యెహోవా యిన్ని వచనాలలో సెలవిస్తుండగా కన్నీటి, రోదన, అంగలార్పు ప్రార్థన ఎంత ప్రాముఖ్యమైనదో ప్రియ సోదరీలారా ! మనమందఱము గ్రహించి అలాంటి ప్రార్థనలు చేసి జవాబులు పొందాలని మనవి చేస్తున్నాను.

హన్నా 11వ వచనంలో తన శ్రమను చూడమని దేవుణ్ణి ప్రార్థిస్తోంది. ప్రియ సోదరీలారా! విశ్వాసులమైన మనకు శ్రమలు నానా రకాలుగా వస్తాయి. దరిద్రతను బట్టి శ్రమలు (లాజరువలె) పిల్లలు కలుగకపోతే శ్రమలు (హన్నావలె) అందము లేకపోతే శ్రమలు (లేయావలె) వాక్యము నిమిత్తము శ్రమలు (అపోస్తలులవలె) రకరకాలుగా వస్తాయి. కానీ మనమనుభవించే శ్రమలన్నీ ప్రభువు చూచే దేవుడు. నన్ను చూచినవానిని నేనిక్కడ చూచితిని అని యెహోవా దేవునికి అన్యస్త్రీయైన హాగరు ఆ పేరు దేవునికి పెట్టింది. దేవుడు ఆమెను చూచాడు. ఆమె గర్భములో వున్న ఇష్మాయేలు కుమారుని చూచాడు దేవుడు.

ప్రియ సోదరీ ! నీవునూ శ్రమలో వున్నావా ? యెష 25:3వ.లో వున్నట్లు మన శ్రమను చూచే దేవుడు మాత్రమే కాక, దరిద్రులకు కలిగిన శ్రమలో మనకు శరణ్యముగాను, గాలివాన తగులకుండ ఆశ్రయముగాను, వెట్ట తగులకుండ మనము పరలోక రాజ్యములో చేరాలని ప్రభువు చెబుతున్నాడు. యోహా 16:3వ.లో లోకములో మీకు శ్రమ కలుగును. అయినను ధైర్యము తెచ్చుకొనుడి. నేను లోకమును జయించి యున్నానన్నాడు. రోమా 12:12వ.లో శ్రమలో ఓర్పుగలవారై ప్రార్థనయందు పట్టుదల కలిగి వుండాలని ప్రభువు హెచ్చరిస్తున్నాడు ప్రభువు. అసలు ఈ శ్రమలు దేవుడు ఎందుకు మన జీవితంలో అనుమతిస్తారు ? శ్రమనొంది యుండుట నాకు మేలాయెను. ఏలయనగా నీ కట్టడలు నేను నేర్చుకున్నానని కీర్తన 119:71వ.లో దావీదు అంటున్నాడు. హెబ్రీ 2:10వ.లో ప్రభువును తండ్రియైన దేవుడు శ్రమల ద్వారా సంపూర్ణుని చేసినట్లు మనల్ని కూడా తండ్రి శ్రమలలో సంపూర్ణులుగా చేస్తారు. 1 పేతురు 5:10వ.లో సర్వకృపానిధియైన దేవుడు కొంచెము కాలము మనము శ్రమపడిన పిమ్మట తానే మనల్ని పూర్ణముగా చేస్తాడు. కనుక శ్రమలలో మేలుంది. కానీ, చాలాసార్లు శ్రమలంటే మనము ఒప్పుకోడానికి యిష్టపడము కానీ ప్రక 1:9వ.లో యోహాను యేసునుబట్టి కలుగు శ్రమలోను, రాజ్యములోను, సహనములోను పాలివాడను అని వ్రాస్తున్నాడు. మనమే యోహాను స్థానములో వుంటే పై మూడింటిలో రాజ్యము ఒక్కటే కోరుకుంటాం. కానీ యోహాను

శ్రమలోను, సహనములో పాలివాడను అంటున్నాడు. కనుక ప్రియులారా ! ప్రభువును బట్టి శ్రమలు, సహనము కూడు మనము అనుభవించడానికి మనకు ఇష్టము లేకున్నా సమ్మతించాలి.

ఎందుకంటే, మన ప్రభువు కూడ మనమెవ్వరును అనుభవించలేని శ్రమలను ప్రభువు అనుభవించాడు. విలా 1:12వ.లో "యెహోవా తన ప్రచండ కోపదినమున నాకు కలుగచేసిన శ్రమవంటి శ్రమ మరి ఎవరికైనను కలిగినదో లేదో మీరు నిదానించి చూడుడి. పరమునుండి ఆయన నా ఎముకల మీదికి అగ్ని ప్రయోగించియున్నాడు. అది యెడతెగక నన్ను కాల్చుచున్నది". ఈ వచనాన్ని బట్టి ప్రియులారా, మనలో ఎవ్వరికినీ కలుగనటువంటి శ్రమలు ప్రభువుకు వచ్చాయి. ఆయన పొందిన దెబ్బలు మేకుల దెబ్బలు, ముళ్ళ దెబ్బలు, కొరడాల దెబ్బలు, మాటల దెబ్బలు, రక్తము చివరి బొట్టువరకు కార్చినంతటి దెబ్బలు. పైన సూపర్‌ఫిషియల్‌గా మాత్రమేకాదు పరము నుండి యెహోవా తన ప్రచండ కోపమును బట్టి తన కుమారుని ఎముకలమీదికి అగ్నిని ప్రయోగించి యున్నాడని ఆ అగ్ని ఆయనను ఎడతెగక కాల్చుచున్నదని అంటే యోబు 30:30వ.లో యోబు నా చర్మము నా మీద నల్లబడి నా మీదనుండి వూడిపోవుచున్నది. నా ఎముకలు ఆ వేడిమితో కాల్చబడి వున్నవి అన్నాడు. ప్రియులారా ! యోబుకు వచ్చిన శ్రమకంటే అనేకరెట్లుగా శ్రమ ప్రభువు పొందాడు. ధవళవర్ణుడు, రత్నవర్ణుడు, అతికాంక్షణీయుడు. అది మనోహరుడైన ఆ ప్రభువు తండ్రి ప్రయోగించిన ఆ ఉగ్రతాగ్నితో ఆయన శరీర చర్మము ఎంత నల్లగా మాడిపోయిందో ఊహించగలమా ? శరీరములోని ఎముకలు ఆ ఉష్ణమునకు ఎంతగా ఎడతెగకుండ కాలిపోయాయో ఊహింపశక్యమా ? అలాటి బాధ మనమెవ్వరైన కొంతయైన రుచి చూచివుంటే కొంతైన గ్రహింపవచ్చునేమో ! కానీ మనలో ఎవ్వరము కూడా అలాంటి శ్రమను అనుభవించలేదు. అనుభవించడం మన చేతకాదు. ఈ చలికాలంలో దేహంలో వచ్చే నొప్పులనే భరించలేక మనము ఎంతో ఏడుస్తాము. ఇక యెడతెగకకుండా అగ్ని మన చర్మాన్ని, ఎముకలను ఎముకల గుజ్జును లేక బోన్‌మ్యారోను కాల్చితే ఆ నొప్పిని భరించగలమా ? అట్టి శ్రమను ఊహించలేమే ? ఇక భరించగలమా ? అది మన చేతకాదు. మన పాప ఖర్మ మనము భరించలేనంత గొప్పది ప్రియులారా ! ఇట్టి శ్రమ మన పాపాల్ని బట్టి మనమే అనుభవించాలి. కానీ దేవుడు అపరాధములను మనమీద మోపక క్రీస్తునందు లోకమును తనతో సమాధానపరచుకొన్నాడు. కాబట్టే మనము దేవుని ఉగ్రతను తప్పించుకున్నాము. ప్రభువు అలాగున ఎముకల లోపలి వరకు ఎముకలలోని గుజ్జు వరకూ కాల్చుచూ వుండగా ఆయనకు ఎంత దాహమై వుండిందో, గనుకనే నేను దప్పిగొనుచున్నానని ఆయన అన్నపుడు, ఎవ్వరు నీళ్ళివ్వలేదు కదా ! ఆయనకు చేదు చిరకనిచ్చినపుడు అదెంత వర్ణనాతీతమైన, వివరించలేని బాధయో కదా ! ఇలా ఆలోచిస్తుంటే మన పాప ఫలితము ఎంత ఘోరమైనదో కదా !

మౌనముతో ఇదంతా ప్రభువు ఏలాగున అనుభవించాడో అందుకొరకై ఏలాగున ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలో, అర్థము కాదు కదా ! ఎంతగా ఆయన ముఖము, దేహమంతా కాలిపోయి, చూడనొల్లని వాడుగా మారిపోయాడో కదా ! యెష 52:14వ.లో నిన్ను చూచి, యే మనిషి రూపముకంటె అతని ముఖమును, నరరూపముకంటె, అతని రూపమును చాలా వికారమని చాలామంది విస్మయమొందునట్లుగా ఆయన మారిపోయినందుకు ప్రియులారా ! ఆయనకేమి చెల్లిస్తే మనమాయన రుణము తీర్చుకోగలము ? అది యెన్నటికి తీరక అట్లుండవలసినదే కదా !

ప్రియులారా ! మన ప్రభువే మన కొఱకు శ్రమలు పొందగా పై వచనాలన్నిటిని బట్టి మనమును 1 పేతు 1:6వ. ప్రకారము అవసరమును బట్టి నానా విధములైన శోధనల చేత ప్రస్తుతము కొంచెము కాలము మనకు దు:ఖము కలుగుచున్నను నశించిపోవు సువర్ణము అగ్ని పరీక్ష వలన శుద్ధిపరచబడుచున్నట్లు దానికంటే అమూల్యమైన మన విశ్వాసము ఈ శోదనల చేత పరీక్షకు నిలిచినదై యేసుక్రీస్తు ప్రత్యక్షమైనపుడు మనకు మెప్పు, మహిమ, ఘనత కలుగుటకు కారణముగా ఉండాలనే ప్రభువు మనందరి జీవితాల్లో కొద్దిగానో, గొప్పగానో శ్రమలు అనుమతిస్తున్నారు. ఆ శ్రమల్లో ప్రభువు మన మహిమను పెంచుతారు. ఆయన కూడా మహిమ పొందుతారు. ఇందుకై దేవునికి స్తోత్రము.

సాధారణముగా దేవుణ్ణి ఏదైన ఒక విషయాన్ని అడుగుటయే ప్రార్థన అనుకుంటాం. మనలో చాలామంది దేవున్ని అడగటమే నేర్చుకున్నాము. ఆ అడిగినది ప్రభువు మనకిచ్చినట్లయితే సంతోషిస్తాము. ఆ అడిగినదాన్ని మనకొఱకే వుంచుకొనుటకు అడుగుతాము. కానీ హన్నా తాను దేవుణ్ణి అడిగి పొందుకున్న ఆ కుమారుణ్ణి, ఆ కుమారుడు బ్రతుకు దినములన్ని యెహోవాకే అర్పిస్తానని మ్రొక్కుబడి చేసికొని ప్రార్థించడము, ముఖ్యముగా స్త్రీ లోకానికే మాదిరికరముగా వున్నది. ఆమె అడిగిన ఆ కుమారుడు ఆమె కొఱకు కాదు. దేవుని కొఱకే అడిగింది. ప్రియ సోదరీలారా ! ప్రభువు కొఱకు, ఆయన సేవ కొఱకు, మనమేమైనా ప్రార్థించి పొందుకుంటున్నామా ? అన్నీ మనవులు మన స్వంతము కొఱకే అడుగుచున్నాము కదా ! సాధారణముగా మన పిల్లలు మనల్ని ముసలి కాలమందు చూచుకోవాలని చాలామంది కోరుకుంటారు. సమూయేలు ఏదో 20 సం॥ – 50 స॥లు వచ్చేవరకు ఆ 30 సం॥లు మాత్రమే యెహోవా సన్నిధిలో ఉంటాడని హన్నా మ్రొక్కుకొనలేదు. కానీ, బ్రతుకు దినములన్నీ యెహోవాకు అప్పగింతునని కుమారుని విషయమై మ్రొక్కుబడి చేసింది. స్వార్థములేని మనవిని తాను చేసింది.

హన్నా తన ప్రార్థనలో మగపిల్లను దయచేయుమని ప్రార్థించడములో ఆమె ఆడపిల్లలకు వ్యతిరేకి కాదు. గానీ దేవుని సేవ చేయాలంటే వారి సంతానము మగ పిల్లవాడైతే యాజకుడుగా

దేవుని సేవ చేయుటకు అనుకూలముగా వుంటుంది. అందులోను ఆ రోజుల్లో యాజకులైన ఏలీ పిల్లలైన హొఫ్నీ, ఫీనెహాసులు యెహోవాను ఎరుగనివారై మిక్కిలి దుర్మార్గులైయుండగా, అందువలన జనులు యెహోవాకు నైవేద్యము చేయుట మాని వారియందు అసహ్యపడుటకు ఆ యవనులు కారణమయ్యారు కనుక తన సంతతి దేవుని సేవ చేయుటకు మగపిల్లవాడు కావలెనని అడుగుటలో కూడ ప్రత్యేక కారణము లేకపోలేదు. హన్నా మాత్రమే కాదు ప్రియులారా! నేడు మన పిల్లలందరూ దేవుని సేవ చేయాలని మనమందఱము ప్రార్థన చేసికోవడము కంటే మంచిది మరొకటి లేదు. ఈలాగున హన్నా దేవునికి యిచ్చే మ్రొక్కుబడి ప్రార్థన చేసింది. నేడు మనము దేవుని దగ్గర తీసుకునే ప్రార్థనలే జలగవలె ఇమ్ము; ఇమ్ము అనే జలగ ప్రార్థనలు చేస్తున్నాం.

ప్రియ పాఠకులారా ! నా తల్లికి మేము ఆరు మంది సంతానము. నేను జ్యేష్ఠ పుత్రికను. నా తరువాత ఐదుమంది అమ్మకు కుమారులే పుట్టారు. నా తల్లి తన ప్రార్థనలో ప్రభువా ! నా పిల్లలు డాక్టర్స్ ఇంజనీర్స్ కావాలని నేను కోరడం లేదు. వారినందరినీ నీ సేవకులుగా చేసికొమ్మని ప్రార్థించేది. దేవుని పొందు మనకు మన పిల్లలకు రక్షణకరము. ధన్యకరము (కీర్తన 73:28). నేడు ఇంచుమించు అందఱము ప్రత్యక్షంగానో, అప్రత్యక్షంగానో దేవుని సేవలో వుంటున్నాము. యెహె 16:20వ. మరియు నీవు నాకు కనిన కుమారులు అని యెహోవా ఇశ్రాయేలీయులతో అన్నాడు. కనుక స్త్రీలారా ! మనము మన పిల్లలను మన కొఱకు కాదట, ఆయన కొఱకే కన్నామట. యెహోషువ 24:15వ.లో నేనును, నా యింటివారు యెహోవాను సేవించెదము అన్నాడు. కనుక మనము, మన పిల్లలు దేవుని కొఱకే అని సమర్పించడమే శ్రేష్ఠము. అదే దేవుని ఉద్దేశము. ప్రియ సోదరీ! నీవు నిన్ను, నీ పిల్లలను ప్రభువుకు సమర్పించుటకు ఇష్టపడుచున్నావా ?

హన్నా ఆలాగున యెహోవా సన్నిధిని ప్రార్థన చేయుచుండగా ఏలీ ఆమె నోటిని కనిపెట్టుచుండెను అని వ్రాయబడింది. కానీ దేవుడు మన మనసును కనిపెడతాడు. రోమా 8:27వ.లో మరియు హృదయములను పరిశోధించువాడు ఆత్మయొక్క మనసు ఏదో ఎరుగును. కనుక మనము ఆత్మతో ప్రార్థించాలి. మనసుతోను ప్రార్థించాలి. హన్నా తన మనస్సులోనే చెప్పుకొనుచుండెను అని 1:12వ.లో వ్రాయబడింది. ఆమె పెదవులు మాత్రము కదలుచుండెను. ఆమె స్వరము వినబడక వుండెను గనుక ఏలీ ఆమె మత్తురాలై వున్నదనుకొని, ఎంతవరకు నీవు మత్తురాలవై వుందువు ? నీవు ద్రాక్షారసమును నీయొద్దనుండి తీసివేయుమని చెబుతున్నట్లు 14వ.లో చదువుచున్నాము. ఇంట్లో హన్నాను విసికించి, కోపము పుట్టించేది పెనిన్నా కాగా, ఇపుడు హన్నా దేవుని సన్నిధిలో ప్రార్థిస్తూ ఈ మంచి పని చేస్తుండగా ఆమె మద్యముచేత మత్తురాలై ఉన్నదని మత్తును నీ యొద్దనుండి తీసివెయ్యమని ఏమో, తాను

చూచినట్లే ఏలీ ఆమెకు శత్రువైనట్లు తప్పుగా ఆమెను 16వ.లో అపార్థము చేసుకుంటున్నాడు. పనికిమాలిన దానిగా ఎంచవద్దు అని హన్నా ఏలీతో అనింది. ఇలా మాట్లాడటం ఆమెకు బాధ కలిగించడమే అవుతుంది. కానీ హన్నా ఏలీ మీద కోపపడక "అదికాదు నా యేలినవాడా ! అని సంబోధిస్తోంది. ఎప్పుడు ఏలీ ఈమెను ఏలాడు ? కానీ హన్నా తన్ను విమర్శించి, మాటలతో తనను బాధించిన వానిని వినయముతో నా యేలినవాడా ! అని సంబోధించడంలో దైవజనునికి ఎంత మర్యాద యిస్తోందో అనిపిస్తుంది. ఒకవేళ మనమే ఆమె స్థానములో వుండి వుంటే ఏలీతో మరుక్షణమే కస్సు, బుస్సుమని ఇష్టమొచ్చినట్లు "నీకు కళ్ళు వున్నాయా లేవా? అందుకే దేవుడు నీకు మందదృష్టి ఇచ్చాడు. ఊరకనే కాదు. నేను మత్తురాలనా ? నా దగ్గర నుండి ద్రాక్షారసము తీసెయ్యాలా ? నీ పిల్లలకు బుద్ధి చెప్పుకో. మేము నీకంటే, నీ పిల్లలకంటే బాగున్నాము' అని అనే వారమేమో ? కానీ, ఎంత శాంతముగా హన్నా – "అది కాదు నా ఏలినవాడా! అని సంబోధిస్తుందో ఎంత చల్లని మనసును కలిగినదో, ఎంత నిదానస్తురాలో మనకర్థమౌతుంది. మనమైతే కోపం, బి.పి. పెంచుకుంటామేమో ఉడుకు రక్తంతో ఊగిపోతామేమో ? అందుకే యాకో 1:19లో కోపించుటకు నిదానించువారునై వుండాలని వ్రాయబడింది. అబ్బా ! హన్నా ఎంత కామ్‌పర్సన్‌లాగ వుంది కదా ! ఆమె జీవితం ఎంతో ప్రశంసనీయమైంది. కానీ, ఏలీ 16వ.లో ఆమెను పనికిమాలినదానిగా భావిస్తున్నాడు. కానీ ఆమె నిదానాన్ని, నిబ్బరాన్ని, ఆమె మంచితనాన్ని గమనించిన తరువాత 17వ.లో తండ్రి భావంతో ఆమెను దీవించి పంపిస్తున్నాడు. అందుకే మత్త 5:11,12 వచనాల్లో 'నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి అబద్ధముగా చెడ్డ మాటలెల్ల పలుకునపుడు మీరు ధన్యులు. సంతోషించి, ఆనందించుడి. పరలోకమందు మీ ఫలము అధికమగును" అని ప్రభువు చెప్పారు. ఈ వచనాలు హన్నాకు తెలియవు. కానీ, ప్రభువు మనసు ఆమెలో ఎంతగా వుందో మనము గమనిస్తున్నాము. కనుక త్వరపడి ఎవరినీ మనమాటల ద్వారా బాధించకూడదు. కానీ, ఓర్చుకుని భక్తునికి మర్యాద యిచ్చిన హన్నా ఫలము పరలోకమందు ఎన్ని రెట్లు అధికమై వుంటుందో కదా ! ఆయనకంటే కళ్ళు కానరాని మంద దృష్టిగలవాడైయున్నాడు. నేడు దేవుని నమ్మిన కళ్ళున్న విశ్వాసులే ఇతర విశ్వాసులను నిందించడం, మాటలతో హింసించడం అబద్ధముగా చెడ్డమాటలు చెప్పే పరిస్థితుల్లో నేటి సంఘాలున్నాయి కానీ, హన్నాలవలె మనము ఎదుటివారిని ప్రేమతో, నిదానముతో, క్షమాగుణముతో క్రీస్తు మనసుతో అటువంటి వారిని ఓర్చుకొంటూ వెళ్తే మనం దీవించబడుతారు. మరియు మన ఫలము పరలోకమందు అధికమవుతుంది. హన్నా 15వ.లో ఏలీతో, నేను మనోదు:ఖముగలదాననైయున్నాను. నేను ద్రాక్షారసమునైనను, మద్యమునైనను పానము చేయలేదు కాని, నా ఆత్మను యెహోవా సన్నిధిని కుమ్మరించు కొనుచున్నాను. నీ

సేవకురాలనైన నన్ను పనికిమాలినదానిగా ఎంచవద్దు. అత్యంత కోప కారణమును బట్టి బహుగా నిట్టూర్పులు విడుచుచు నాలో నేను దీనిని చెప్పుకొనుచుంటిని అనింది. ఇక్కడ ఏలీ హన్నాను పనికిమాలినదానిగా ఎన్నిక చేశాడు. పనికిమాలినవారంటే ఎవరు ? ఈనాడు ప్రార్థన చేయకుండా ఉన్న వారందరూ మత్తురాండ్రే. ఏ రీతిగా వారు మత్తురాండ్రుగా వున్నారు ? లూకా 21:34లో "మీ హృదయములు, తిండివలనను, మత్తు వలనను ఐహిక విచారము వలనను మందముగా వున్న యెడల ఆ దినము అకస్మాత్తుగా మీ మీదికి ఉరివచ్చినట్టు రాకుండా మీ విషయమై మీరు జాగ్రత్తగా ఉండుడి. కాబట్టి మీరు జరుగబోవు వీటినెల్లను తప్పించుకొని, మనుష్యకుమారుని యెదుట నిలువబడుటకు శక్తిగలవారగునట్లు ఎల్లప్పుడును ప్రార్థన చేయుచు మెలకువగా వుండుడి" అని ప్రభువు చెప్పుచుండగా మరియు యోవే 1:5వ.లో మత్తులారా మేలుకొని కన్నీరు విడువుడి అని చెప్పుచుండగా మన మత్తునుండి మేలుకొని పగటివారముగా వుందాము.

కానీ, హన్నా ఏలీతో తన ఆత్మను యెహోవా సన్నిధిని కుమ్మరించుకొనుచున్నాను అంటోంది. ఒక కడవను కుమ్మరించినట్లు హృదయమంతయు దేవుని సన్నిధిలో ఏమియు తనలో వుంచుకొనక సమస్త భారము సమస్త సమస్య ఆయన మీద వేసింది. యోబు, దావీదు ఇలాంటివారందరు అలాగే తమ హృదయాలు, మనసులు దేవుని సన్నిదిలో కుమ్మరించుకున్నారు. 16వ. వచనములో హన్నా తాను సేవకురాలని తనను పనికిమాలిన దానిగా ఎంచవద్దని అత్యంత కోపకారణమును బట్టి బహుగా నిట్టూర్పులు విడుచుచు తనలో తానే దీనిని చెప్పుకొనుచుంటినని చెబుతోంది. హన్నా ఇక్కడ తనను గూర్చి సేవకురాలని చెబుతోంది. ఆమె ఏమి సేవచేసింది ? అనుకుంటే ఆమె చేసింది ప్రార్థన సేవ. బోధించే సేవ బాహాటముగా అందరికీ కనబడుతుంది. కానీ తెర వెనకాల, గదిలో తలుపు మూసి చేసే ప్రార్థనా సేవ అన్నిటికన్నా శక్తివంతమైన సేవ. బోధించే సేవకు కావాల్సిన శక్తినిచ్చేదే ప్రార్థనా సేవ. ఆమె తన ప్రార్థన సేవకు ప్రసిద్ధికెక్కినది. ఈనాడు ఆమె ప్రార్థన సేవయే విశ్వాసులమైన మనకందరికీ స్ఫూర్తిదాయకముగా వున్నది. లూకా 12:37వ. వచనములో ప్రవక్త్రి 84 యేండ్లు చేసిన సేవ కూడా ప్రార్థన సేవయే. హన్నా ప్రార్థించి, పొందుకున్న కుమారుడు ఇశ్రాయేలీయుల మధ్య ప్రార్థనాపరుడైయున్నాడు. 1 సమూ 12:23వ.లో నేను మీ నిమిత్తము ప్రార్థన చేయుట మానుట వలన యెహోవాకు విరుద్ధముగా పాపము చేసినవాడనగుదును. అది నాకు దూరమగును గాక అని సమూయేలు ఇశ్రాయేలీయులతో అంటున్నాడు అంటే సమూయేలు ఎంత ప్రార్థనాపరుడో మనకు అర్థమవుతోంది. దీన్ని బట్టి హన్నా ప్రార్థనా ప్రభావము కుమారుని మీద ఎంతగా వుండిందో మనము గ్రహించవచ్చు. ప్రియ సోదరీ ! మన ప్రార్థనా జీవితం మన పిల్లలను ప్రభావితము చేస్తున్నదో లేదో మనము

కూడా ఆలోచించుకోవాల్సింది కదా ! హన్నా, ఆ తరువాత తన కుమారుడు ఇశ్రాయేలీయుల మధ్య చేయబోతున్న సేవ కొఱకు కూడా ఎంతగా ప్రార్థన చేసివుంటుందో మనము వూహించుకోవచ్చు. మనం ఏ పాపము చేయకపోవచ్చు. కానీ, ప్రార్థన చేయకపోతేనే పాపము చేసినట్లు అంటే మన జీవితం ప్రార్థనతో ఎంత ముడిపడి వుండవలెనో అర్థమవుచున్నది కదా ! ఈ సంగతి ప్రార్థనాపరుడైన సమూయేలు ద్వారా తెలుసుకుంటున్నామంటే, ఆ సమూయేలును కనిన తల్లి మరెంత ప్రార్థనా సేవకురాలుగా వుంది కదా ! కనుకనే అవే ప్రార్థన బీజాలను తన కుమారునిలో హన్నా వేయగలిగింది.

తన కుమారుడైన సమూయేలు పాలు విడువకముందు తన యింటి యొద్ద తనతో వున్న ఆ మూడు లేక ఐదు యేళ్ళ ప్రాయములోనే ఆ హన్నా ఎంతగా ప్రార్థన జీవితాన్ని అలవాటు చేసి వుంటుందో కదా ! అందులోను కన్నీటి ప్రార్థన ఎలా చేయాలో కుమారుని నేర్పి వుంటుంది. ఎందుకంటే, కన్నీటితో హృదయ కుమ్మరింపుతో ప్రార్థించే ప్రార్థనలకు నాంది పలికిన స్త్రీ బైబిల్లో ఈమెయే. అంతకు ముందు ఏ స్త్రీ కన్నీటి ప్రార్థన చేసినట్లు బైబిల్లో రికార్డ్ చేయబడలేదు. యిర్మి 9:20వ.లో వ్రాయబడినట్లు మన పిల్లలకు మనము రోదనము చేయనేర్పుడి. ఒకనికి ఒకరు అంగలార్పు విద్య నేర్పుడి అనే మాటలు స్త్రీలమైన మనకొఱకై దేవుడు వ్రాయించారు. కనుక మనము ఏడ్చి ప్రార్థిస్తే కదా ! మన పిల్లలు అలా ఏడ్చి ప్రార్థించగలరు ? మన కన్నీటి ప్రార్థన మన పిల్లలు ఎరుగుదురా ? ఈ విషయం మనము ఎంత 'ఛాలెంజింగ్'గా తీసుకోవాలో కదా ! అటువంటి మంచి మాదిరి తల్లిని బట్టియే సమూయేలు ఇశ్రాయేలీయుల కొఱకు ప్రార్థిస్తూ, తను అలా ప్రార్థించకపోతే పాపం చేసినట్లే అంటున్నాడు.

ప్రియ సోదరీ ! దేవుడు మనల్ని ఏ యింటిలో, ఏ సంఘంలో, ఏ సమాజంలో, ఏ చోట వుంచాడో ఆ ప్రజలందరి కొఱకు మనం ప్రార్థించాలని ప్రభువు కోరుతున్నాడు. మనుషులందరి కొఱకు కూడా ప్రార్థించమంటున్నాడు. అలా చేయకపోవడము పాపము చేసినట్లే. ఈ రోజు ప్రార్థించామా ? ఎన్ని రోజులైంది ? ఎన్ని నెలలైంది ప్రార్థించక ? అంతకాలము నుండి నీవు పాపము చేసినట్లే. ప్రార్థనా జీవితాన్ని సరిచేసికొని మన పిల్లల్ని కూడా ప్రార్థించే పిల్లలుగా తయారుచేద్దాం. అప్పుడే యోబు 16:44వ.లో వున్నమాట తల్లి ఎట్టిదో బిడ్డయు అట్టిదే అనే సామెత నెరవేరుతుంది.

హన్నా మాటలు వినగానే ఎలీ ఆమెతో 17వ.లో నీవు క్షేమముగా వెళ్ళుము. ఇశ్రాయేలు దేవునితో నీవు చేసికొనిన మనవిని ఆయన దయచేయును గాక! అని తండ్రివలె దీవెన వచనము పలుకుతున్నాడు. 14వ.లో ఎంతవరకు మత్తురాలవైయుందువు ? అని శత్రువువలె అపార్థము చేసుకున్న ఏలీ 17వ.లో యిపుడు తండ్రివలె ఆమెను దీవిస్తున్నాడు. 1 పేతు

3:13వ.లో మీరు ఒకవేళ నీతి నిమిత్తము శ్రమపడినను మీరు ధన్యులే. వారి బెదిరింపునకు భయపడకుడి. నిర్మలమైన మనసాక్షి కలవారై మీలో ఉన్న నిరీక్షణను గూర్చి హేతువడుగు ప్రతివారికిని సాత్వికముతోను, భయముతోను, సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడును సిద్ధముగా నుండి మీ హృదయములయందు క్రీస్తును ప్రభుగా ప్రతిష్ఠించుడి. అప్పుడు మీరు దేని విషయమై దుర్మార్గులని దూషించబడుదురో దాని విషయమై క్రీస్తునందున్న మీ సత్ ప్రవర్తన మీద అపనింద వేయువారు సిగ్గుపడుదురు. దేవుని చిత్తమాలాగు వున్న యెడల కీడుచేసి శ్రమపడుట కంటె, మేలు చేసి శ్రమపడుటయే బహు మంచిది.

ప్రియులారా ! పై వచనాలు హన్నాలో ఖచ్చితముగా కనబడుచున్నాయి. ఆమె ఏలీచే విమర్శించబడింది. విమర్శించిన ఏలీకు “నా యేలినవాడా ! నీ సేవకురాలైన నన్ను పనికిమాలినదానిగా ఎంచవద్దు” అని నిర్మలమైన మనస్సాక్షితో, సాత్వీకముతో, దేవుని సేవకుడని భయముతో సమాధానము చెప్పింది. దీని విషయమై మత్తురాలని, ద్రాక్షారసము తన వద్ద వుంచుకున్నదని, పనికిమాలినదానిగా అపనింద వేయబడిందో, దాని విషయమై ఆమె సత్ప్రవర్తన మీద అపనింద వేసిన ఏలీ యిపుడు సిగ్గుపడుతూ దీవించి పంపిస్తున్నాడు. ఇదంతా హన్నా జీవితంలో ఎందుకు జరిగిందంటే, అలా జరగటం దేవుని చిత్తమయ్యింది ? ఎలా జరగటం దేవుని చిత్తం అంటే, కీడుచేసి శ్రమపడుట కంటే, మేలుచేసి శ్రమపడుటే ఆయన చిత్తమని అది మనకు బహు మంచిదని దేవుడు తెలియచేస్తున్నాడు. పైన వున్న పేతురు పత్రికలోని మాటలు హన్నా జీవితకాలంలో అవి వ్రాయబడలేదు. అయినా ఆత్మ ద్వారా దేవుడామెకు ఇచ్చిన ప్రేరేపణ ద్వారా ఆ మాటలు ఆమె నెరవేర్చి తన జీవితంలో చూపించింది. మరి, ఈ వేళ మన జీవితాల్లో ఆమె మాదిరి చూపించలేకపోతున్నామంటే పైన చెప్పబడిన మాటలు మనము చదువుతున్నామా ? లేక చదివినది గుర్తుండుట లేదా ? లేక చదివింది వేరు, జీవించేది వేరుగా వుంటున్నదా? లేక వాక్యం వాక్యమే, మన ధోరణి మన ధోరణిగానే వుంటుందా? క్రీస్తు మాదిరి చూపించలేక పోతున్నామా ? క్రీస్తు కూడ తన్ను దూషించి, బెదిరించిన వారిని దూషించలేదు, బెదిరించలేదు. మనకు మంచి మాదిరిని చూపించి వెళ్ళారు. ఆ విషయాలను మన జీవితాల్లో అనుసరించాలని వ్రాతల్లో కూడా వ్రాయించారు. వాటిని చదివినా అలా జీవించలేకపోతే ప్రభువు లెక్క అడుగుతాడని గ్రహించుకొని అలా జీవించడానికి తీర్మాణించుకుందాం. ఈ విషయమై హన్నా ఎంత మంచి మాదిరిగా వున్నదో కదా ! నేనైతే ఎంతో మెచ్చుకుంటున్నాను హన్నాను. ఆమె ప్రాక్టికాలిటి నాకెంతో నచ్చింది. మనమును అలాగే ఎప్పుడైతే హన్నానా యేలినవాడా ! అని సంబోధించిందో అప్పుడు ఏలీ తండ్రివలె జీవించుటకు కారణమేమి అని మనం వుండాలి. ధ్యానిస్తే సామి 16:17వచనములో వ్రాయబడినట్లు ఒకని ప్రవర్తన యెహోవాకు ప్రీతికరమైనపుడు ఆయన శత్రువులను ఆయన మిత్రులనుగా చేయును అని వ్రాయబడినట్లు, మిత్రునివలె మారిపోయి ఏలీ ఆమెను దీవించాడు.

ఏలీ, హన్నాను అలా దీవించగానే ఆమె 18వ. వచనములో ఏలీతో – నీ సేవకురాలైన నేను నీ దృష్టికి కృపనొందుదునుగాక ! అని అనింది. దాని అర్థమేమంటే "ఇంతవరకు కృపలేకుండా మాట్లాడావు. ఇప్పటినుంచైనను కృపా సహితంగా, విమర్శలే లేక మాట్లాడమని చెబుతోంది. ఫిలి 4:6 ప్రభువు "మీ సంభాషణ ఉప్పువేసినట్లు కృపా సహితంగా వుండాలని చెప్పాడు. ప్రభువు దగ్గరినుండి మనము కృప పొందుకొని మన ఎదుట వారికి మనం ధర్మశాస్త్రాన్ని రుద్దితే ఎలా? అందుకే హన్నా నీ దృష్టికి కృపనొందును గాక ! అని ఏలీతో అనింది. దేవుని కృప మన యెడల ఆకాశమంత ఎత్తయినది అని కీర్తన 7:9 వచనములో వ్రాయబడింది. ప్రభువునుండి సర్వవిధములైన కృపలను రుచి చూచి మనము ఎదుటి మనుషులకు కొంత కృపనైనా చూపాలి కదా ! అంతట హన్నా తన దారిని వెళ్ళిపోయి భోజనము చేయుచు నాటనుండి దు:ఖముఖిగా వుండుట మానెను అని వ్రాయబడింది. ఆమె దు:ఖముఖిగా వుండుట మానెను అని వ్రాయబడింది. ఆమె దు:ఖముఖాన్ని ఆనంద ముఖముగా మార్చింది ఏమిటి ? అని మనము ఆలోచిస్తే అది ఆమె ప్రార్థనయే అని మనము చెప్పగలము. ప్రియ సోదరీలారా ! మీ మీ వ్యక్తిగత, కుటుంబ, సంఘ, సేవా, సామాజిక జీవితాల్లో మీరును అనేక దు:ఖాలు ఎదుర్కొంటూ వుండవచ్చు. మీ దు:ఖములన్నిటిని తీర్చి మిమ్ములను సంతోషముఖులుగా చేసేది మీ ప్రార్థనా జీవిత మొక్కటేనని మీరు గ్రహించాలని దేవుని సేవకురాలిగా ప్రార్థిస్తున్నాను. అందుకొఱకే ఈ హన్నా జీవితానికి శీర్షికగా నేను సంతోషముఖిగా మారిన దు:ఖముఖి అని పేరు పెట్టడం జరిగింది. యెష 60:20 వ.లో నీ దు:ఖ దినములు సమాప్తములగునని ప్రభువు వ్రాయించారు. ఇక నూతనమైన యెరూషలేము పట్టణములో దు:ఖమైనను, ఏడ్పైనను, వేదనయైనను ఉండదు అని ప్రక 3:14వ.లో వ్రాయబడింది.

**4) జవాబు పొందిన హన్నా :–** 1 సమూ 1:17-20. 17వ వచనములోనే దేవుడు ఏలీ మాట ద్వారా హన్నాకు జవాబునిచ్చాడు. నీవు క్షేమముగా వెళ్ళుము. ఇశ్రాయేలు దేవునితో నీవు చేసికొనిన మనవిని ఆయన దయచేయును గాక ! అని ఏలీ ఆమెను దీవించి పంపాడు. ఇక్కడ ఇశ్రాయేలు దేవుడు మనవులను దయచేయువాడని వ్రాయబడింది. ఇక్కడ ఇశ్రాయేలు దేవుడికి ఆమె మనవి చేసుకుందని మనం చదువుచున్నాము. ఆయన ఇశ్రాయేలీయులకే దేవుడు కాదు. ఆయన రోమా 3:29 వ.లో యూదులకు మాత్రమే దేవుడా ? అన్యజనులకు దేవుడే అని వ్రాయబడింది. యిర్మి 32:37వ.లో ఆయన సర్వశరీరులకు దేవుడనని చెబుతున్నాడు. దాని 2:47వ.లో ఆయన "దేవతలకు దేవుడు" అని నెబుకద్నెజరు రాజు చెబుతున్నాడు. ద్వితి 10:17వ.లో నీ దేవుడైన యెహోవా దేవుడు అని యెహోవా దేవుడే చెబుతున్నాడు. కనుక ఆయన ఇశ్రాయేలీయులకే కాదు, యూదులకు, అన్యజనులకు, సర్వశరీరులకు, దేవతలకు, వ్యక్తిగతంగా ఆయన నీకును దేవుడని వాక్యంలో దేవుడు

వ్రాయిస్తున్నాడు. ప్రియ సోదరీ ! నీవు ఆ దేవున్ని నీ దేవునిగా చేసికున్నావా ? నీ పాపాలన్నీ ప్రభువు దగ్గర ఒప్పుకొని ఆయన రక్తంలో కడుగమని ఆయన్ను వేడుకో. ప్రభువు నిన్ను క్షమించి, రక్షిస్తారు. నీ పేరు జీవగ్రంథములో వ్రాసుకుంటారు. తద్వారా ఆయన నీ దేవుడు అవుతారు. అప్పుడు నీ దేవుడు నీ మనవులకు కూడ హన్నావలె జవాబిస్తారు. అందుకే కీర్త 20:5వ. నీ ప్రార్థనలన్నియు యెహోవా సఫలపరచును గాక. కీర్తన 21:2వ.లో అతని పెదవులలో నుండి వచ్చిన ప్రార్థన నీవు మానక అంగీకరించుచున్నావు అని వ్రాయబడింది. కీర్త 20:9వ.లో మేము మొఱ్ఱపెట్టునపుడు రాజు మాకుత్తరమిచ్చును గాక అని వ్రాయబడింది. 1 రాజు 10:3వ.లో షేబ దేశపు రాణికి సొలొమోను రాజు తన ప్రభావమునకు తగినట్లు యిచ్చినది పోగా ఆమె కోరిన ప్రకారము ఆమె ఇచ్ఛాపూర్తిగా కోరినట్టుగా ఆమెకిచ్చెనని వ్రాయబడింది. అలాగే మన పరలోకపు రాజైన మన ప్రభువు కూడా మనము కోరిన ప్రకారము చేయగల దేవుడైయున్నాడు. కీర్తన 66:30 వ.లో దేవుడు నా ప్రార్థనను త్రోసివేయలేదు అని వ్రాయబడినట్లు నీ, నా ప్రార్థనలను ఆయన అంగీకరించాడు.

ఈలాగున, తండ్రి దేవుడు మన అందరి మనవులు, మొఱ్ఱలు వింటున్నాడు. కానీ తన ప్రియ కుమారుని మనవిని, మొఱ్ఱను ఆయన వినలేదు. కీర్తన 22:1-2 వచనాల్లో "నా దేవా, నా దేవా, నీవు నన్నేల విడనాడితివి ? నన్ను రక్షింపక నా ఆర్తధ్వనిని వినక నీవేల దూరముగా వున్నావు ? నా దేవా, పగలు నేను మొఱ్ఱపెట్టుచున్నాను. రాత్రివేళను నేను మౌనముగా వుండుట లేదు. అయినను నీవు ఉత్తరమియ్యకున్నావు ? 4 వ.లో పితరులు నీయందు నమ్మికయుంచిరి. వారు నీయందు నమ్మికయుంచగా నీవు వారిని రక్షించితివి. వారు నీకు మొఱ్ఱపెట్టి విడుదలనొందిరి. మరి నా మొఱ్ఱ నీవు వినుటలేదని తండ్రికి ఆయన మొఱ్ఱపెట్టి విడుదల పొందలేకపోయాడు. దానికి కారణం, కుమారునికి, తండ్రియైన దేవుడు సిలువనుండి విడుదల యిచ్చి వుంటే మానవులమైన మనకు రక్షణ కలిగేది కాదు కనుక దేవుడు తన కుమారుని మొఱ్ఱ వినలేదు. యిర్మీయా 29:12వ.లో మీరు నాకు మొఱపెట్టుదురేని, నేను మీ మనవి నాలకింతును. మీరు నన్ను వెదకిన యెడల నన్ను గూర్చి విచారణ చేయునెడల మీరు నన్ను కనుగొందురని ప్రభువు చెప్పారు. కనుక మొఱ్ఱపెడదాం.

ఇక్కడ హన్నా మనవిని ఆయన దయచేయుచున్నాడని 19వ.లో చదువుచున్నాము. వారు యింటికి వెళ్ళిన తరువాత ఎల్కానా తన భార్యయైన హన్నాను కూడెను. యెహోవా ఆమెను జ్ఞాపకము చేసికొనెను అని వ్రాయబడింది. అంటే, ఇంతకాలము దేవుడు హన్నాను మరచిపోయాడా ? యెష 49:14,15 వచనాలలో అయితే సీయోను - యెహోవా నన్ను విడిచిపెట్టియున్నాడు. ప్రభువు నన్ను మరచియున్నాడని అనుకొనుచున్నది. 15వ. స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండా తన చంటిపిల్లను మరచునా ? వారైన మరచుదురు

కానీ, నేను నిన్ను మరువను. 16వ. చూడుము నా అరచేతులలో నిన్ను చెక్కియున్నాను. నీ ప్రాకారములు నిత్యము నా యెదుట వున్నవి. ఈ మాటలను బట్టి దేవుడు ఆనాటి హన్నాను మరచిపోలేదు. ఈనాటి నిన్ను నన్ను కూడ మరచిపోలేదు. అరచేతిలో చెక్కియున్నాడట. మన కుటుంబసభ్యుల, స్నేహితుల 'ఫొటోలు' మనము ఫొటో ఆల్బమ్‌లో అప్పుడప్పుడు చూచుకుంటూ వుంటాము. కానీ ప్రభువు తన అరచేతిలోనే మనల్ని చెక్కుకుని చూచుకుంటూ వుంటాడు. మన తల్లి తాను నిద్రిస్తున్నప్పుడైనా మనల్ని మరచిపోతుంది. నిద్రిస్తున్నప్పుడు ప్రక్కనున్న తమ పిల్లల మీద పడిపోతుంది. నిద్రిస్తున్నప్పుడు ప్రక్కనున్న తమ పిల్లల మీద పడి వారిని చంపుకున్న తల్లులున్నారు. కాని ప్రభువు కునుకక, నిద్రించక రాత్రింబగళ్ళు మనల్ని కాపాడుచున్నాడు. మన చుట్టూ నిత్యము తన ప్రాకారములను వుంచియున్నాడట. అబ్బా ! మన మీద ఆయనకు ఎంత ప్రేమ ! ఇక మనల్ని ఆయన మరచిపోయాడని ఎలా చెప్పగలము ?

కీర్తన 136:28వ.లో మనము దీనశలో నున్నపుడు ఆయన మనలను జ్ఞాపకము చేసికొనెను. అదే వచన ప్రకారము సంతానలేమిని బట్టి పెనిన్నాచే తృణీకరింపబడుచు, విసికించబడుచున్న అందరిచే మరుబడిన దీనస్థితిలో వున్న ఈ హన్నాను దేవుడు జ్ఞాపకము చేసికొన్నాడు. మనము ఉన్నత స్థితిలో వున్నపుడు దేవుడు జ్ఞాపకము చేసికొన అవసరము అంతగా వుండదు. మనము దీనస్థితిలో వున్నప్పుడే ఆయన మనల్ని జ్ఞాపకం చేసికోవాలి కదా ! అలాగున దేవుడు యాకోబు చేతను, రాహేలు చేతను ద్వేషించబడుచు దీనదశలో వున్న చెద్దకండ్ల లేయాను దేవుడు ఆది 30:22లో జ్ఞాపకం చేసుకున్నట్లు మనం చదవగలము. అలాగే సంసోను చనిపోయే ముందు "ప్రభువా దయచేసి నన్ను జ్ఞాపకము చేసికొనుము అన్నపుడు న్యాయా 16:28 వ.లో దేవుడు ఆయన్ను జ్ఞాపకం చేసికొన్నాడు. హబ 3:2వ.లో కొన్నిసార్లు కోపించుచునే ఆయన మనమీద వాత్సల్యమును జ్ఞాపకము చేసికొంటున్నాడు.

కానీ మనల్ని జ్ఞాపకము చేసికొనుచూ వున్న ఆయన్ను మనము జ్ఞాపకము చేసికొంటున్నామా ? "నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడి" అని లూకా 23:42 వ. ఆయన చెప్పిన మాట ప్రకారము ప్రతి ఆదివారం ఆరాధన కూడికలో జ్ఞాపకము చేసికొని ఆయన్ను ఆరాధిస్తున్నామా ? ప్రియ సోదరీ ! నీవు ఆరాధనలో ఆయనను జ్ఞాపకము చేసికొనక ఎన్ని వారాలయ్యింది ? ఎన్ని నెలలయ్యింది ? అలా నిన్ను జ్ఞాపకం చేసికొనుచున్న ఆ ప్రభువుని మరచావా ? యెష 44:21వ.లో దేవుడు "ఇశ్రాయేలూ నేను నిన్ను మరచిపోజాలను అని అంటున్నాడు. కానీ యిర్మి 2:32వ.లో "నా ప్రజలు లెక్కలేనన్ని దినములు నన్ను మరచియున్నా"రని అంటున్నాడు. ప్రియ సోదరీ ! నిన్ను యింతవరకూ మరచిపోజాలని ప్రభువును నీవు లెక్కలేనన్ని దినములుగా మరచావా ? మారుమనస్సు పొంది నీ క్షేమము కొఱకే ఆయన్ను జ్ఞాపకము చేసికొనమని ప్రభువును బట్టి హెచ్చరించ బడుచున్నాము.

**5) కుమారునికి పేరుపెట్టిన హన్నా 1:20 :-** హన్నా తన కుమారునికి ఒక అర్థసహితమైన పేరు పెట్టినది "యెహోవాకు మ్రొక్కుకొని వీనిని అడిగితిని" అని అనుకొని సమూయేలు అను పేరు పెట్టింది. ఈమె దేవుని స్పెషల్‌గా అడిగినట్లు చూస్తున్నాం. మనమైతే దేవుణ్ణి ప్రార్థనలో అడుగుతామే కానీ, ఆమె మ్రొక్కుకొని అడిగింది. ఇకనుండి మనమును మ్రొక్కుబడి చేసికొని అడుగుదాం. కీర్తన 132:2,3 వచనాలలో యెహోవాకు ఒక స్థలము చూచువరకు నావాస స్థానమైన గుడారములో ప్రవేశించను. నేను పరుండు మంచము మీది కెక్కను. నా కన్నులకు నిద్ర రానియ్యను. నా కనురెప్పలకు కునికిపాటు రానియ్యను అని మ్రొక్కుబడి చేస్తున్నాడు. మ్రొక్కుకొని అడిగితే దాని ప్రభావము గొప్పదిగా వుంటుదని హన్నా విషయంలో మనము తెలుసుకుంటున్నాము. మ్రొక్కుకుని అడిగితినన్న అర్థసహితమైన పేరు హన్నా పెట్టింది. ఈనాడు చాలామంది నామకార్థ క్రైస్తవులు విశ్వాసులు కూడా అర్థములేని అన్యులు పెట్టుకునే పేర్లు, లోకస్థులు పెట్టుకునే పేర్లను, ఇంటర్‌నెట్‌లో చూచి ఆ పేర్లను పెట్టుకుంటున్నారు. మగపిల్లలకు అర్థసహితమైన బైబిల్ పేర్లను పెట్టుకుంటే ఆ అర్థాలను బట్టి మన పిల్లలు జీవించగలుగునట్లు మనము వారి జీవితాలను ప్రభావితం చేయగలం. కనుక ప్రియ సహోదరీలారా ! ఇకనుండియైనా, మీ పిల్లలకు, మీ మనుమండ్లకు, మనుమరాండ్రకు బైబిల్ పేర్లను పెట్టుకొనుటకు తీర్మాణించుకొనవలెనని ప్రభువును బట్టి మనవి చేస్తున్నాను.

మొట్టమొదటిగా పేర్లుపెట్టే పని దేవుడు ఆదాముకు అప్పగించాడు. ఆయన సమస్త పశు, పక్ష్యాదులకు, పెట్టిన పేర్లు పెట్టకుండా పెట్టాడు. దానికి ఎంతో తెలివి, జ్ఞానము, ఆలోచనా శక్తి, జ్ఞాపకశక్తి కావాలో కదా ! కానీ ఈ వేళ మనకు పుట్టిన ఒకరు ఇద్దరు పిల్లలకు పేర్లు పెట్టడానికి ఎంతో కాలం తీసుకుంటున్నాం. పిల్లలకు పేర్లు పెట్టాల్సినపుడు దైవసహాయాన్ని ప్రార్థనలో దేవున్ని అర్థించాలి. ప్రార్థనలో కనిపెట్టాలి. బైబిల్‌లో కొద్దిమంది తల్లులు తమ పిల్లలకు తామే పేర్లుపెట్టారు. వారిలో మొట్టమొదటిది హవ్వ తన పిల్లలలో యిద్దరికి కయీను, హెబెలు అని, లేయా తన ఆరుగురు పిల్లలకు, అంతేకాక తన దాసి యొక్క ఇద్దరి పిల్లలకు, అలాగే రాహేలు తన ఇద్దరి పిల్లలకు తన దాసి యొక్క ఇద్దరి పిల్లలకు, ఫరో కుమార్తె మోషేకు, మానోహ భార్య తన కుమారుడైన సంసోనుకు రూతు కుమారుడైన ఒబెదుకు పేరు పెట్టిన పొరుగు స్త్రీలు వీరందరూ తమ పిల్లలకు పేర్లుపెట్టారు. ఇపుడు హన్నా కూడా తాను దేవున్ని అడిగి కుమారుని పొందింది కానీ, మ్రొక్కుబడి చేసి అడిగి పొందితిని అను అర్థము వచ్చునట్లుగా సమూయేలు పేరు పెట్టడంలో ఆమెకు ఆమెయే సాటి. ఈ విషయంలో ఆమెకు పోటీ సాటి ఎవరునూ లేరు. అందుకే అటువంటి 'స్పెషల్ బాయ్' పేరట బైబిల్‌లో రెండు గ్రంథాలు వ్రాయించడం దేవునికి యిష్టమయ్యింది. దేవునికి స్తోత్రం. ప్రియ సోదరీ ! దేవుని మహిమ కొరకై నీవెప్పుడైనా హన్నాలాంటి మ్రొక్కుబడి

ప్రార్థన దేనికొఱకైనా లేక ఎవరి కొఱకైనా చేసి పొందిన దేనికైన, ఎవరికైన అర్థసహితమైన పేర్లు పెట్టావా ? అలా దేవుని నీవు అడిగి అర్పించిన నీ సమూయేలు దేవుని సేవలో వున్నాడా ? దేవుని సన్నిధిలో బ్రతుకు దినములన్నియు సేవ చేస్తున్నాడా? లేదా నీవడిగిన ఏ అంశమైన, ఆరోగ్యమైనా, ఏ వస్తువైనా అది దేవుని సేవలో వాడబడుతోందా ? అలాగైతే ప్రియ సోదరీ ! నీవు కూడా హన్నాను పోలియున్నావు. అందుకై దేవునికి స్తోత్రము. లేదా ఇకముందుకైనా దేవున్ని అడిగి పొందుకున్న వాటిని దేవుని కొఱకై ప్రతిష్ఠించడాని కిష్టపడుచున్నావా ?

**6) కుమారునికి పాలిచ్చి పెంచిన హన్నా (1 సమూ 1:21-23 వ.) :-** దేవునికి తాను మ్రొక్కుబడి చేసికొనిన ప్రకారమే మాట తప్పకుండా హన్నా తన కుమారుని దేవునికి ప్రతిష్ఠ చేయదలచి 1:21వ.లో తన కుటుంబీకులు మరుసటి సంవత్సరము షిలోహుకు బలి అర్పించుటకు వెళ్ళు సమయంలో బిడ్డ పాలు విడుచు వరకు తాను రానని చెబుతోంది. ఒకసారి తన కుమారుడు యెహోవా సన్నిధిని అగుపడితే తిరిగి రాక అక్కడనే వుండునట్లు తాను తీసికొని వస్తానని తన పెనిమిటితో చెప్పి ఆ సంవత్సరము షిలోహుకు వెళ్ళలేదు. కానీ సమూయేలుకు పాలు మాన్పించువరకు నిచిలియుందుము. యెహోవా తన వాక్యమును స్థిరపరచును గాక అని ఎల్కానా హన్నాతో చెప్పినట్లు 1:23 వ.లో మనము చదవగలము.

కనుక హన్నా తనకు పుట్టిన బిడ్డకు పాలు ఇచ్చుచున్నట్లు గమనిస్తున్నాం. తల్లులమైన మనము మన పిల్లలకు శరీర సంబంధమైన పాలు ఇవ్వాలి. అదే సమయంలో ఆత్మీయమైన వాక్యమనే పాలు కూడా ఇవ్వాలి. ఇలా ఆత్మీయపాలు ఇచ్చి ప్రభువు కొరకు మనము వారిని పెంచితే ఫరో కుమార్తె యొకెబెతుకు జీతమిచ్చినట్లు ప్రభువు పరలోకంలో మనకు జీతమిస్తాడు. విలాప 4:3 వ.లో నక్కలైనను చన్నిచ్చి తమ పిల్లలకు పాలిచ్చును. నాజునుం కుమారి యెడారిలోని ఉష్ట్రపక్షులవలె క్రూరురాలాయెను. దప్పి చేత చంటి పిల్ల నాలుక వాని అంగిటికి అంటుకొనును. పసిపిల్లలు అన్నమడుగుదురు. ఎవడును వారికి పెట్టడు." అని వ్రాయబడింది. ప్రియులారా ! టక్కరి నక్కలకు తమ పిల్లల మీద వున్న ప్రేమ కూడా మానవులైన కన్నతల్లులకు లేనట్లుగా వాక్యములో ప్రభువు తెలియచేస్తున్నారు. పిల్లలు బైబిల్ కథలు చెప్పమని మనల్ని తరచూ అడుగుచూ వుంటారు. కనుక ఈనాడు వారు మన యొద్దకు వచ్చి మన దగ్గర వినాలని కోరుకుంటున్న సమయంలోనే వారికి మనము దేవుని వాక్యాన్ని వినిపించాలి. రేపు వయసు పెద్దగయ్యాక మనము పిలిస్తే వారు రాలేని సందర్భాలొస్తాయి. చదువుని బట్టి తీరిక లేకుండా వుండే సమయాలొస్తాయి. కనుక వారు మన యొద్దకు వస్తున్న తరుణంలోనే వారికి దేవుని వాక్యం చెప్పాలి.

ఎఫె 6:4 వ.లో తండ్రులారా ! మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను, బోధలోను వారిని పెంచుడి అని ప్రభువు చెబుతుండగా ఎంతగా ఈ విషయములో పిల్లలను పట్టించుకోవాలో కదా ! ద్వితి 6:6–9 వరకు 'నీవు నీ కుమారులకు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు వారికి అభ్యసింపచేసి నీ యింట కూర్చుండునపుడు త్రోవను నడుచునపుడు, పండుకొనునపుడు, లేచునపుడు, వాటిని గూర్చి మాటలాడవలెను. సూచనగా వాటిని నీ చేతికి కట్టుకొనవలెను అన్నాడు. న్యాయా 6:18వ. గిద్యోను "మా పితరులు మాకు వివరించిన అద్భుత కార్యములు" అన్నాడు. కీర్తన 78:3లో ఆసాపు మాకు మా పితరులు వివరించిన సంగతులు అన్నాడు. యెహోవా స్తోత్రార్హ క్రియలను ఆయన బలమును, ఆయన చేసిన ఆశ్చర్యకార్యములను దాచకుండా వాటిని వారి పిల్లలకు మేము చెప్పెదము. రాగల తరములలో పుట్టబోవు పిల్లలు దానిని యెరుగునట్లు వీరును దేవునియందు నిరీక్షణ గలవారై దేవుని క్రియలను మరువకయుండి, యదార్థ హృదయులు గాక దేవుని విషయమై స్థిరమనసు లేనివారై తమ పితరులవలె తిరుగబడకయు మూర్ఖతయు తిరుగుబాటును గల ఆ తరమును పోలివుండకయు, వారు ఆయన ఆజ్ఞలను గైకొనునట్లును ఆయన యాకోబు సంతతికి శాసనములను నియమించెను. ఇశ్రాయేలు సంతతికి ధర్మశాస్త్రమును అనుగ్రహించెను. మన పితరులు మన పుత్రులకు దానిని తెలుపవలెనని వారికాజ్ఞాపించెను" అని వ్రాయబడి వుండగా తల్లిదండ్రులమైన మనము మన పిల్లలకు బైబిల్ నేర్పించాలని ప్రభువు కోరుకున్నట్లు గమనిస్తున్నాం. ఆలాగున 2 తిమోతి 3:14లో తిమోతి తల్లియైన యునేసి తన కుమారునికి బాల్యమునుండే శక్తిగల పరిశుద్ధ లేఖనములను నేర్పించింది.

అందుకే సామి 22:6లో 'బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. పెద్దవాడైనప్పుడు దానినుండి వాడు తొలగిపోడు" అని ప్రభువు వ్రాయించాలి. అలాగే యవ్వనంలో కూడ తన కుమారునికి దేవోక్తిని బెత్షెబసామి 31వ అధ్యాయంలో వుపదేశించింది. కనుక సోదరీలారా ! మనమందఱము మన పిల్లలకు జన్మనిచ్చుట మాత్రమే కాక వారికి వాక్యమనే పాలనిచ్చికూడ పెంచాలి. అలాగున మన పాఠ్యభాగములో సమూయేలుకు పాలిచ్చిన హన్నా కొంతకాలమైన తరువాత పాలు మాన్పించి ఆ బిడ్డను దేవుని మందిరమునకు పంపించబోతోంది.

**7) కుమారుని దేవునికి ప్రతిష్ఠించిన హన్నా :– 1:24–28 వ.** పాలు మాన్పించిన తరువాత అతడు ఇంకా చిన్నవాడుగా వుండగా ఆమె ఆ బాలుని ఎత్తికొని మూడు కోడెలను తూమెదు పిండిని ద్రాక్షారసపు తిత్తిని తీసికొని షిలోహులోని మందిరమునకు వచ్చెను అని 24 వ.లో చదువుచున్నాము. మూడు కోడెలు ఎందుకు? బహుశా మూడు సం॥ల నుండి ఆమె దేవుని సన్నిధికి రావడము లేదు కనుక 3 సం॥లుగా పెండింగ్‌లో వున్న కానుకగా ఆమె మూడు

కోడెలు తీసుకొచ్చింది. ఈనాడు కొద్దిమంది ఎన్నో వారాలుగా దేవుని సన్నిధికి గైర్హాజరు అవుతూ వుంటారు. ఆ వారాల కానుక అంతా ఏమైవుంది ? దానిని ప్రభువు సన్నిధికి హన్నాలాగ తీసుకుని వస్తే ఎంతగా దేవుని దీవెన వుంటుంది మనకు ? నీ దేవుని సన్నిధిని వట్టి చేతులతో నీవు కనబడకూడదని ద్వితి 16:17వ.లో వాక్యము చెబుతుంది కదా ! ఆమె ఆ సమూయేలు ఇంకా చిన్నవాడై వుండగా వానిని ఎత్తికొనివచ్చి షిలోహులోని దేవుని మందిరములో వున్న ఏలీ యొద్దకు తీసికొనివచ్చి నా యేలినవాడా, నా యేలినవాని ప్రాణముతోను నీ యొద్ద నిలిచి ప్రార్థన చేసిన స్త్రీని నేనే అని తనను తాను ఏలీకి పరిచయము చేసుకుంది. గత మూడేళ్ళుగా ఆమె దేవుని సన్నిధికి రాలేదు. కనుక ఏలీ వృద్ధుడు ఆమెను మరచిపోయి వుండవచ్చు. కనుక నీ యొద్ద నిలిచి ప్రార్థన చేసిన స్త్రీని నేనే అని చెబుతోంది. మనమైతే అదిగో మూడేళ్ళ క్రితం నేను దేవుని సన్నిధిలో ప్రార్థిస్తూ ఉండగా "నీ యొద్దనుండి ద్రాక్షారసము తీసివేయుము అని చెప్పావే ఆమెనే నేను" అని సామె 17:9వ.లో వ్రాయబడినట్లు జరిగిన సంగతిని మాటిమాటికి ఎత్తి మిత్రబేధము చేయువారివలె వుందుమేమో. కానీ, ఆమె మాత్రము "నా యేలినవాడా ! అని గౌరవంగా సంబోధిస్తూ ఆనాడు నీయొద్ద నిలిచి ప్రార్థన చేసిన స్త్రీని నేనే" అని చెబుతోంది. ప్రియ సోదరీలారా ! నిన్ను గూర్చి ''ప్రార్థన చేసిన స్త్రీని నేనే" అని ఎవరితోనైనను సగర్వంగా, నిజంగా, యదార్థంగా సాక్ష్యం చెప్పగల ధైర్యం నీకుందా ? మిస్సెస్ ఎల్కానాను నేను అని చెప్పుకునేవాళ్ళు వున్నారేమో నేటి సమాజంలో కానీ ప్రార్థన చేసిన స్త్రీని నేనే అని చెప్పుకునే వారు లేరేమో అనిపిస్తుంది. ఆమె జీవితం ప్రార్థనకు ప్రతీకగా వున్నది. 27 వ.లో ఈ బిడ్డను దయచేయుమని యెహోవాతో నేను చేసిన మనవిని నాకనుగ్రహించెను గనుక నేను ఆ బిడ్డను యెహోవాకు ప్రతిష్ఠించుచున్నాను. తాను బ్రతుకు దినములన్నిటను వాడు యెహోవాకు ప్రతిష్ఠింతుడు అని ఏలీతో చెప్పింది. అలా ప్రతిష్టించుచున్నాను అని చెబుతుంటే ఆ మూడేళ్ళ పసిబాలుడైన సమూయేలు యెహోవాకు అక్కడనే మ్రొక్కాడని వ్రాయబడింది. ఈ రోజుల్లో మూడుయేళ్ళ పిల్లలు ఎంతమాత్రము దేవుణ్ణి మ్రొక్కుతున్నారు ? హన్నా ఈ మూడేళ్ళలో సమూయేలుకు దేవుని మందిరంలోని ఏలీ తాత దగ్గరే చిన్న ఏఫోదును ధరించి యెహోవాకు పరిచర్య చేస్తూ, మందిరంలో తాత చెప్పిన పనంతా చేస్తూ ఇంటికి రాకుండా బ్రతుకు దినములన్నీ అక్కడే వుండాలని ఎంతగా నేర్పించిందో, తల్లిదండ్రులను, ఇంటివారినందరినీ ఏలాగున మరిపించిందో నాకర్థమే కావడము లేదు. ఈ విషయములో ఆమెకు, ఆమెయే సాటి.

తన కుమారుని సేవకునిగా, ప్రార్థనాపరునిగా ఎంతగా మలిచిందో అనిపిస్తుంది. ఆమె తన కుమారుని దేవునికి ప్రతిష్ఠించింది. మనమందఱము దేవుని సన్నిధికి నిర్జీవ కానుకలను తీసికొని వస్తుండగా హన్నా తన సజీవుడైన, తన ముద్దుల కుమారుని ఏకైక కుమారుని

(అప్పటికి తనకింకా పుత్రులు పుడతారని తెలియనప్పుడే) దేవునికి ప్రతిష్ఠించింది. బలిగాను, అర్పణముగాను అలాగే మన తండ్రియైన దేవుడు తన ఏకైక అద్వితీయుడైన కుమారునిలో సజీవంగా లోతైన గాయాలు, బలమైన గాయాలు పొంది, అన్యాయపు తీర్పునొంది, దారుణముగా ముళ్ళ, మేకులతో కొఱడా దెబ్బలతో కొట్టబడుటకు హింసించబడి, వస్త్రహీనుడై వ్రేలాడబడుటకు, ఎఱ్ఱటెండలో రక్తమంతా కార్చి దాహమడిగినా, ఒక్క చుక్క నీరైనా దొరకని దిక్కులేని మరణాన్ని అనుభవించడానికి మన అందరి కొఱకు కృపాదానముగా అర్పించి ఆ దేవదేవుని మనమందఱము ఎంత కొనియాడితే, ఎంత ఆరాధిస్తే, ఎంత సేవిస్తే తీరుతుంది ఆయన ఋణము ?

సరే, ఈనాడు ముందు మనమేమి మన దేవునికి సమర్పించుకోవాలి. 1 పేతు 3:16 వ.లో "మీ హృదయములలో క్రీస్తు ప్రభువుగా ప్రతిష్టించుడి" అని వ్రాయబడింది. మొట్టమొదట మనము హృదయములో ప్రభువుకు స్థానమిచ్చి ప్రతిష్టించుకోవాలి. అందుకే దేవుని వాక్యము సామె 23:26 వ.లో కుమారుడా ! నీ హృదయము నాకిమ్ము అంటున్నాడు. రెండవదిగా యోహా 17:17 వ.లో వాక్యమనే సత్యమందు వారిని ప్రతిష్ట చేయాలి అని వ్రాయబడింది. మన హృదయమందు ప్రభువును ప్రతిష్ఠించుకున్న తరువాత వాక్యంతో ప్రతిష్ఠించాలి. అలా వాక్యమందు ప్రతిష్ఠించడానికి ప్రభువు తనను ప్రతిష్ఠ చేసుకున్నానని చెబుతున్నాడు. ఒకరికి మనము వాక్యము చెప్పేముందు మనము వాక్యము చెంతచేరి ధ్యానించి హృదయములో భద్రపరచుకోవాలి. ప్రియ సోదరీ ! ప్రభువుకు హృదయమిచ్చిన నీవు వాక్యముతో నీ హృదయాన్ని నింపుకుంటూ ప్రతిష్ఠించుకుంటున్నావా? మూడవదిగా నిర్గ 13:2 వ.లో వ్రాయబడినట్లు "ఇశ్రాయేలీయులలో మనుషుల యొక్కయు, పశువుల యొక్కయు, ప్రథమ సంతతి అనగా ప్రతి తొలిచూలు పిల్లను నాకు ప్రతిష్ఠించుము" అని వ్రాయబడినట్లు మన పిల్లలను కూడా ప్రభువుకు ప్రతిష్ఠించవలసినవారమై వున్నాము. లేఖనాలలో పిల్లలను దేవునికి ప్రతిష్ఠించే పని హన్నా, ఎల్కానా, మానోహా దంపతులు ఎలిజబెతు, జెకర్యా, అలాగే యేసుక్రీస్తు తల్లిదండ్రి అనబడిన మరియ, యోసేపులు మాత్రమే చేశారు. ప్రియ సోదరీలారా ! ఈనాడు మనమందరమూ మన పిల్లలలో కనీసము ఒక్కరినైన ప్రభువు పనికి ప్రతిష్ఠించడము న్యాయము కాదా ? యెహోవా తండ్రి తనకిష్టుడు, జనితైక కుమారుడు, అద్వితీయుడైన తనకు ఒక్కడైయున్న తన కుమారుని అప్పగించ డానికి వెనుతీయక, యోహాను 10:36 వ. వ్రాయబడినట్లు తాను ప్రతిష్ఠ చేసి ఈ లోకానికి పంపించిన ఆ ప్రభువు కొఱకు మన పిల్లలను ప్రతిష్ఠించడము మన కనీస బాధ్యతయైయున్నదని గ్రహించి, అర్పించడానికి, దేవునిచే హెచ్చరించ బడుచున్నాము. నాలుగవదిగా లేవీ 27:14 వ.లో యిల్లు ప్రతిష్ఠ, 16 వ.లో పొలము ప్రతిష్ఠ, 28 వ.లో జంతువుల ప్రతిష్ఠ యివన్నీ దేవుని మీద ప్రేమతో మనము ప్రతిష్ఠ చేయవచ్చు.

అలాగు హన్నా 28 వ.లో కాబట్టి ఈ బిడ్డను యెహోవాకు ప్రతిష్ఠించుచున్నాను. తాను బ్రతుకు దినములన్నియు వాడు యెహోవాకు ప్రతిష్ఠితుడు అని చెప్పగానే సమూయేలు యెహోవాకు అక్కడే మ్రొక్కినట్లు వ్రాయబడింది. పాలు మానిన ఆ చిన్న సమూయేలు తల్లి ఏమి చెబుతోందో ఎంత చక్కగా చురుకుగా అప్రమత్తతతో వింటున్నాడు. అదే సమయంలో తల్లి చెప్పిన మాటకు విధేయుడై దేవునికి మ్రొక్కుతున్నాడు అంటే ఆ చిన్న లేత పసిప్రాయంలోనే ఎంత విధేయత కలిగి, దేవునికి మ్రొక్కడము అంటే దేవున్ని ఆరాధించడం నేర్చుకున్నాడో, హన్నా ఎట్లు నేర్పిందో ఇవన్నీ బహు ఆశ్చర్యంగా కనిపిస్తున్నాయి మనకు. అలా మన పిల్లలను, మనుమండ్లను, మనుమరాండ్రను పెంచడానికి దేవుడు మనకందరికిని అలాంటి జ్ఞాన వివేకములను అనుగ్రహించు గాక ! ఇంతటితో మొదటి అధ్యాయం ముగిసింది.

రెండవ అధ్యాయంలో హన్నా చేసిన విజ్ఞాపన వ్రాయబడింది. ఈ రెండవ అధ్యాయంలో మొదటి పది వచనాలు ఆమె చేసిన విజ్ఞాపనగా వున్నాయి. ఈ పది వచనాలలో ఎనిమిది వచనాలలో యెహోవాను గూర్చియే మాట్లాడింది. రెండు వచనాలు మాత్రమే ఇతరులను గూర్చి మాట్లాడింది. ఈనాడు మన మాటల్లో గానీ, ప్రార్థనల్లోగానీ దేవుణ్ణి గురించి ఎక్కువ మాట్లాడుతున్నామా ? లేక మనల్ని గురించి గానీ, ఇతరులను గురించిగానీ మాట్లాడు తున్నామా?

1వ వచనం నుండి 3వ వచనము వరకు అలాగే 6వ వచనం నుండి 10వ వచనం వరకు యెహోవాను గురించే మాట్లాడింది. మొదటి వచనంలో నా హృదయము యెహోవాయందు సంతోషించుచున్నదని హన్నా చెబుతోంది. ఆమె సంతోషము లేకలేక పుట్టిన తన గారాలపట్టియైన సమూయేలునందు కాదట. కానీ యెహోవాయందే ఆమె సంతోషముందట. ప్రత్యేకించి యెహోవా రక్షణను బట్టి ఆమె సంతోషిస్తుందట. లూకా 2:48వ.లో మరియ కూడా నా ఆత్మ నా రక్షకుడైన దేవునియందు ఆనందించెను" అని చెబుతోంది. హబక్కూకు కూడా 3 అ. 17-18 వ. వరకు అంజూరపు చెట్లు పూయకుండినను ద్రాక్షచెట్లు ఫలింపకపోయినను, ఒలీవ చెట్లు కాపులేకయుండినను, చేనిలో పైరు పంటకు రాకపోయినను గొఱ్ఱెలు దొడ్డిలో లేకపోయినను, సాలలో పశువులు లేకపోయినను, నేను యెహోవాయందు ఆనందించెదను. నా రక్షణకర్తయైన నా దేవునియందు నేను సంతోషించెదను అన్నాడు. అవును, రక్షించబడిన మన అందరి ఆనందము దేవుడు మనకిచ్చిన ఇహసంబంధ ఆశీర్వాదాలలో లేదు. కానీ, ఆత్మసంబంధమైన రక్షణ ఆశీర్వాదములోనే మన ఆనంద సంతోషాలు వున్నాయి. అట్టి మన ఆనంద సంతోషాలకు కారణమైన రక్షణనిచ్చిన రక్షకుడైన మన ప్రభువైన యేసుక్రీస్తుకు స్తుతులు చెల్లించబద్ధులమై వున్నాము.

అలాగే మొదటి వచనములోనే హన్నా యెహోవాయందు నాకు మహాబలము కలిగెను" అని చెబుతోంది. దేనికి మహాబలము కలిగెను ? గొడ్రాలుగా ఇంతవరకు వుండిన హన్నా సమూయేలును కనుటకు మహాబలము యెహోవా ద్వారానే కలిగిందని చెబుతోంది. 10వ వచనంలో నాకే కాదు, తాను అభిషేకించిన రాజుకు కూడా అధిక బలమును కలుగచేస్తాడని హన్నా చెబుతోంది. పరిశుద్ధాత్మ అభిషేకము పొందిన మనకందరికీ బలము ధరింపచేయువాడు యెహోవాయే. హెబ్రీ 11:11వ.లో శారాయు విశ్వాసమును బట్టి వాగ్దానము చేసినవాడు, నమ్మదగినవాడని ఎంచుకొనెను. గనుక తాను వయసు గతించినదైనను గర్భము ధరించుటకు శక్తిపొందెను" అని వ్రాయబడింది. యెష 39:29వ.లో సొమ్మసిల్లిన వారికి బలమిచ్చువాడు ఆయనే. శక్తిహీనులకు బలాభివృద్ధి కలుగచేయువాడును ఆయనే అని వ్రాయబడింది. ఈ బలము ఎలా వస్తుంది అంటే యెష 39:30 వ.లో యెహోవా కొఱకు ఎదురుచూచుచు వారు నూతన బలము పొందుదురు. ఆ నూతన బలముతో వారు పక్షిరాజు వలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు. అలయక పరుగెత్తుదురు. సొమ్మసిల్లక నడచిపోవుదురు. కీర్తన 29:12వ. ప్రకారము బలమును పరాక్రమమును ఆయన దానములే. కీర్తన 6:11వ. ప్రకారము బలము తనదని దేవుడు సెలవిచ్చెనని వ్రాయబడింది. ఊరకుండి ఆయనను నమ్ముకొనుట వలన బలము కలుగునని యెష 30:15వ.లో వ్రాయబడింది. ఈ రెఫరెన్సులన్నియు కలిగిన సంపూర్ణ వాక్యము ఈనాడు మనకు అందుబాటులో వుంది కనుక ఈ వాక్యవచనముల ద్వారా బలము దేవునిదే అని మనకర్థమౌచున్నది. వాక్యము పూర్తిగా అందుబాటులో లేని ఆ దినాల్లోనే హన్నా ఇంత వాక్యము తెలుసుకోగలిగిందంటే దేవుని ఆత్మ ప్రత్యక్షత తన జీవితంలో కలిగి వుంటుందో కదా ! ఎంతగా సమయము దేవుని సన్నిధిలో ఆమె ఈ ప్రత్యక్షత కొఱకు నీ దేవున్ని గూర్చి ఏమి ధ్యానించావు ? ఆయనని గూర్చి నీ అభిప్రాయమేమి ? ఆయన స్వభావ గుణలక్షణాలు, ఆయన ప్రేమ, అసలు ఆయనను గురించి నీ అవగాహన, నీ అనుభవము ఎలా వున్నాయి ? ఆయన గురించి నీవుఏమి చెప్పాలని, ఏమి సాక్ష్యమివ్వాలి అనుకుంటున్నావు?

హన్నా "నా విరోధుల మీద నేను అతిశయపడుతున్నాను" అంటోంది. దేన్నిబట్టి ఆమె అతిశయపడుతోంది. కుమారున్ని కన్నాను అని అతిశయమా ? వెండి, బంగారులు, మేడ మిద్దెలు, భర్తనుండి రెండు పాళ్ళు వస్తున్నాయనా ? ఆమె అతిశయ కానే కాదు. మనమందరము ఈనాడు దేన్ని బట్టి అతిశయించాలి ? యిర్మీ 9:23 వ.లో వ్రాయబడినట్లు – జ్ఞాని తన జ్ఞానమును బట్టి, శూరుడు తన శౌర్యమును బట్టి అతిశయించకూడదు. అతిశయించువాడు దేనిని బట్టి అతిశయించవలెననగా, భూమి మీద కృపచూపుచు, నీతిన్యాయము జరిపించుచున్న యెహోవాను నేనే అని నన్ను పరిశీలనగా తెలిసికొనుట బట్టియే అతిశయింపవలెను" అని వ్రాయబడింది. ఈ వాక్య ప్రకారము గొడ్రాలైన హన్నాకు దేవుడు కృపను చూపించి, గర్వించి,

అంతగా గర్వపు మాటలు పలికి తనను విసికించుచు, కోపమును పుట్టిస్తూ వచ్చిన పెనిన్నా విషయములో తనకు నీతి న్యాయములు జరిగించిన యెహోవాయే దేవుడని గ్రహించి ఆయనను పరిశీనలగా తెలుసుకొనుటయందే ఆమె అతిశయించింది. అలా తాను పరిశీలన తెలిసికొనిన ఆ దేవుని యందు తాను కనుగొనిన విషయాలను 1 సమూ 2వ అధ్యాయములో ఆమె తాను చేసిన విజ్ఞాపనలో తెలియజేస్తూ వున్నది. ఈలాగున దేవుణ్ణి పరిశీలనగా తెలుసుకుని అందు నిమిత్తము అతిశయించు వారి విషయములో అనగా హన్నాలాంటి వారి విషయములో ఆనందించువాడని వ్రాయబడింది. అట్టి మాదిరిగా నున్న హన్నాను బట్టి దేవునికి స్తోత్రములు.

హన్నా 2వ వచనంలో యెహోవా వంటి పరిశుద్ధ దేవుడు ఒకడును లేడు. నీవు తప్ప మరి ఏ దేవుడును లేడు. మన దేవునివంటి ఆశ్రయదుర్గమేదియు లేదు అని చెప్పింది. నిర్గ 15:11 వ.లో వున్నట్లు "వేల్పులలో అనగా దేవుండ్లలో ఆయనవంటివాడు లేడు. పరిశుద్ధతను బట్టి మహనీయుడు. స్తుతి కీర్తనలను బట్టి పూజనీయుడు, అద్భుతములు చేయువాడు. ఆయన వంటివాడెవడును లేడు. కీర్త 86:8వ.లో ప్రభువా నీవు మహాత్మ్యము గలవాడవు. ఆశ్చర్యకార్యములు చేయువాడవు. నీవే అద్వితీయుడవు" అని వ్రాయబడిందంటే, ఆయన ఒక్కడే. ద్వితీయుడు లేడని అర్థము. కీర్త 89:6-8 వ.లో మింటను యెహోవాకు సాటియైన వాడెవడు ? దైవపుత్రులతో అనగా దేవదూతలలో యెహోవా వంటి వాడెవడు? పరిశుద్ధ దూతల సభలో ఆయన మిక్కిలి భీకరుడు. తన చుట్టునున్న వారందరికంటె భయంకరుడు. యెహోవా వంటి బలాఢ్యుడెవడు ? అని వ్రాయబడింది. ఈ వచనాలన్నింటిలో యెహోవా దేవుడులాంటి దేవుడు ఎవరును లేరని హన్నా చెప్పడం వాస్తవమేనని మనకు అర్థమవుతుంది. యెహోవా దేవుడు అసమానుడు. ఆయనే కీర్తన 89:6లో అన్నారు. ఎవనితో నన్ను పోటీ చేస్తారు. ఎవరితో నన్ను సాటి చేస్తారు అని.

3వ వచనంలో హన్నా యెహోవా యొక్క అనంత జ్ఞానాన్ని గూర్చి చెప్పింది. రోమా 11:33లో పౌలు దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గొప్పది అని చెప్పాడు. యోబు 11:8వ.లో దేవుని పరిపూర్ణ జ్ఞానము ఆకాశవీధియంత ఉన్నతమైనది. అది పాతాళమంత లోతుగా వున్నది. దాని పరిమాణము భూమికంటె అధికమైనది. దాని వెడల్పు సముద్రము కంటె అధికమైనది అని వ్రాయబడింది. యెష 40:14వ.లో ఆయనకు జ్ఞానమును అభ్యసింపచేసినవాడెవడు ? అని వ్రాయబడింది. యెష 40:28 వ.లో ఆయన జ్ఞానమును శోధించుట ఎవనికి సాధ్యము ? 1 కొరిం 1:25వ.లో దేవుని వెఱ్ఱితనము మనుషుల జ్ఞానముకంటే జ్ఞానము గలదని వ్రాయబడింది. ఇక ఆయన జ్ఞానము ఎంతటిదని వివరించగలము ? యాకోబు 3:15వ.లో దేవుని జ్ఞానము అది పైనుండి వచ్చే జ్ఞానము మొదట అది పవిత్రమైనది. తరువాత సమాధానకరమైనది మృదువైనది. సులభముగా

లోబడునది, కనికరముతో, మంచి ఫలములతోను నిండుకొనినది పక్షపాతమైనను, వేషధారణయైనను లేనిదియనై వున్నది. ఇట్టి ప్రభువైన యేసుక్రీస్తు యొక్క అతి శ్రేష్ఠమైన జ్ఞానమును పొందుకొను నిమిత్తము పౌలు సమస్తమును నష్టముగా ఎంచుకున్నట్లు ఫిలి 3:8వ.లో చెబుతున్నాడు. ప్రియ సోదరీ ! అట్టి జ్ఞానాన్ని మనమందఱమును పొందు కోవాలనుకుంటే మనమును ఈ లోకములో మనకు లాభకరములైన వాటినన్నిటిని క్రీస్తు జ్ఞానాన్ని పొందుకొను నిమిత్తము సమస్తమును నష్టముగా ఎంచుకోవాలట. అందుకే సామి 5:5వ.లో జ్ఞానము సంపాదించుకొనుము అన్నాడు. సామి 5:7వ.లో జ్ఞానమును సంపాదించుకొనుటయే జ్ఞానమునకు ముఖ్యాంశము అని దేవుడు వ్రాయించారు. అలాగున మన సంపాదన అంతయు ఇచ్చి క్రీస్తుయేసు గూర్చిన అతిశ్రేష్ఠ జ్ఞానాన్ని హన్నావలె తెలిసికొని పొందుకొందుము గాక ! మనకిన్ని వాక్యపు రెఫరెన్సులు వున్నాయి కానీ, ఇంత వాక్య వివరముల లేని ఆ రోజుల్లో హన్నా దేవుని అనంత జ్ఞానాన్ని గూర్చి చెప్పిందంటే ఆయనను గూర్చిన ఆమె ధ్యానము, అవగాహన, ఎంత గొప్పవో కదా !

మరియు 3వ వచనంలోనే ఆయన క్రియలను పరీక్షించువాడు అని హన్నా యెహోవాను గూర్చి చెప్పింది. ఇంగ్లీషులో ఆయన క్రియలను తూనిక చేయువాడు. లేదా క్రియలను కొలుచువాడు అని అర్థము. సామి 24:12 వ. ప్రకారము నరులకు వారి వారి పనుల ప్రకారము వారికి ప్రతీకారము చేయును అని వ్రాయబడింది. ఈ వచనాలను బట్టి దేవుడు మనము రోజూ చేస్తున్న క్రియలను కొలుచువాడుగా వుంటున్నాడు. అదే సమయంలో మన క్రియలను బట్టి మనకు ప్రతీకారము కూడా చేస్తాడు. ప్రక 2:23వ.లో మీలో ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున ప్రతిఫలము ఇచ్చెదనని ప్రభువు చెప్పుచుండగా మన క్రియల విషయములో మనము ఎంతో కడు జాగ్రత్తగా వుండవలసినవారముగా వున్నాము. ఎందుకంటే ఏమి విత్తుతామో అదే కోస్తాము గనుక జాగ్రత్తగా వుండాలి.

చీకటి క్రియలు మనము చేయకూడదు. మన క్రియలు యెహోవాకు కోపము పుట్టించేవిగా ద్వితి 31:29లో ఉన్నట్లు వుండకూడదు. యిర్మి 15:4వ.లో వ్రాయబడినట్లు మనష్షే యెరూషలేములో చేసిన క్రియలను బట్టి ఇశ్రాయేలీయులను సకల రాజ్యములలోనికి అటు ఇటు చెదరగొట్టినట్టు చూస్తున్నాం.

దేవుని క్రియలు ఘనమైనవని ప్రక 15:3వ.లోను యిర్మి 32:19 వ.లో దేవుడు క్రియల విషయంలో శక్తిమంతుడని వ్రాయబడింది. పరిశుద్ధులమైన మనము నీతిక్రియలు చేయాలని ప్రక 19:8వ.లో వ్రాయబడింది. ఎందుకంటే మనలో వాని వాని క్రియల చొప్పున ప్రతివానికిచ్చుటకు ఆయన జీతము పట్టుకొని వస్తున్నాడని ప్రక 22:12వ.లో వ్రాయబడింది. మనము మనకిష్టమైన రీతిగా క్రియలు జరిగిస్తే ప్రస 11:9-10వ. యవనుడా, నీ

యవనమందు సంతోషపడుము, నీ యవన కాలమందు నీ హృదయము సంతుష్టిగా వుండనిమ్ము. నీ కోరిక చొప్పునను నీ దృష్టియొక్క యిష్టము చొప్పునను ప్రవర్తింపుము. అయితే వీటన్నిటిబట్టి, దేవుడు నిన్ను తీర్పులోనికి తెచ్చును అని జ్ఞాపకముంచు కొనుమని దేవుడు చెప్పుచున్నాడు. చివరకు 2 కొరిం 5:10వ.లో ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందఱమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్ష్యము కావలెనని ప్రభువు చెప్పాడు కనుక మన క్రియల విషయములో మనము చాలా జాగ్రత్తగా వుండుటకు ప్రభువు సహయాన్ని చాలా జాగ్రత్తగా వుండుటకు ప్రభువు సహాయాన్ని కోరుకుందాం.

6వ వచనంలో హన్నా జనులను సజీవులుగా, మృతులుగాను చేయువాడు యెహోవాయే అని చెప్పింది. ద్వితి 32:39వ వచనములో మృతినొందించువాడును, బ్రతికించువాడును నేనే. గాయపరచువాడును, స్వస్థపరచువాడును నేనే అని వ్రాయబడింది. 1 సమూ 2:25 వచనములో అయితే యెహోవా ఏలీ కుమారులను చంపదలంచియుండెను అని వ్రాయబడి వుండగా 34వ వచనములో హొప్నీ, ఫీనెహాసులు ఒక్కనాటియందే వారిద్దరు మరణమౌతారని చెప్పారు. 1 సమూ 4:11వ.లో హొప్నీ, ఫీనెహాసులు హతులైరి అని వ్రాయబడింది. 2 రాజు 5:7వ.లో చంపేవాడుగాని, బ్రతికించేవాడుగాని దేవుడే తప్ప మరియే మనిషి కాడు. ఈ విషయం ఇశ్రాయేలు రాజే చెబుతున్నాడు. ఆది 30:2 వ.లో యాకోబు భార్యయైన రాహేలు యాకోబులో "నీవు నాకు గర్భఫలము నిమ్ము, లేనియెడల నేను చచ్చెదను అని చెప్పినపుడు యాకోబు "నేను నీకు గర్భఫలమునియ్యక పోయినందుకు దేవునికి ప్రతిగా వున్నానా ? అన్నాడు. కనుక పుట్టించేవాడు గిట్టించేవాడు ఆ ప్రభువే. డాక్టర్లు కాదు, మందులు కూడా కాదు.

7వ.లో హన్నా యెహోవా దారిద్ర్యమును, ఐశ్వర్యమును కలుగజేయువాడు, కృంగ చేయువాడును, లేవనెత్తువాడును ఆయనే. లేమిగలవారిని పెంటకుప్పల మీదినుండి లేవనెత్తువాడును ఆయనే. యోబు 5:10వ.లో ఆయన భూమి మీద నీళ్ళు ప్రవహింపచేయువాడు ఆయన పొలములమీద నీళ్ళు ప్రవహింపచేయువాడు. అట్లు ఆయన దీనులను ఉన్నత స్థలములలో నుంచును. దు:ఖపడువారిని క్షేమమునకు లేవనెత్తును అన్నమాట నిజమే. వర్షము ద్వారా దీనులను ఉన్నత స్థలము దేవుడు ఎక్కిస్తాడంటే అది దేవునికి మాత్రమే సాధ్యము. వర్షము కురిపించే వర్షదేవుడు ఆయనే. భూమ్యాంతముల నుండి ఆవిరిని రప్పించి మంచును, హిమమును, వర్షమును కురిపించువాడు ఆయనే. యిర్మీ 5:24 యెహోవాయే తొలకరి వర్షమును, కడవరి వర్షమును దాని దాని కాలమున కురిపించువాడు. జెకర్యా

10:1వ.లో కడవరి వానకాలమున వర్షము దయచేయుమని యెహోవాను వేడుకొనుడి. ప్రతివాని చేనిలోను పైరు మొలుచునట్లు యెహోవా మెరుపులను పుట్టించును. ఆయన వానలు మెండుగా కురిపించును. అలాగున ఆ ప్రభువు వర్షము కురిపించుట ద్వారా దీనులను క్షేమమునకు లేవనెత్తువాడు. కీర్తన 113:8వ.లో ఈలాగున ఆయన నేల నుండి దరిద్రులను లేవనెత్తువాడు. పెంటకుప్పల మీద నుండి బీదలను లేవనెత్తువాడు. దావీదును, యోసేపును రాజుగా, ప్రధానమంత్రిగా లేవనెత్తాడు. మొర్దెకైని, ఎస్తేరును, ప్రధానమంత్రిగా, రాణిగా చెరలోనుండి పైకి లేవనెత్తాడు. బబులోను చెరలో నుండి దానియేలు, షద్రక్, అధిపతులుగా ప్రభువు హెచ్చించాడు.

యోబు 36:7వ.లో "నీతిమంతులను ఆయన చూడకపోడు. దీనులకు ఆయన న్యాయమును జరిగించును. సింహాసనము మీద కూర్చుండు రాజులతో ఆయన వారిని నిత్యమును కూర్చుండబెట్టును. వారు ఘనపరచబడుదురు. ఈలాగున దేవుడు దరిద్రులను అధికారులతో కూర్చుండబెడతారు. రేపు రెండవ రాకడ తరువాత వెయ్యేళ్ళ పరిపాలనలో పాపమును బట్టి దరిద్రులమైన మనల్ని క్రీస్తు అను సర్వాధికారియైన దేవునితో కూడ ఏలుబడి చేయుటకు ప్రభువు లేమిగల మనల్ని పెంటకుప్పల మీద వుండిన పెంట పురుగులము, చెద పురుగులము, మంటి పురుగులమైన మనల్ని పైకి లేవనెత్తబోతున్నవాడు మన దేవుడే. ఆయనకు కోట్లానుకోట్ల స్తుతులు కలుగును గాక !

8వ.లో హన్నా భూమియొక్క స్తంభములు యెహోవా వశము లోకము వాటి మీద ఆయన నిలిపియున్నాడు అని చెప్పింది. యోబు కూడా తన గ్రంథములో 38:4-6 వచనాల్లో యెహోవాయే భూమి పునాదులు వేశాడని, దాని స్తంభముల పాదులు ఆయనే కట్టాడని, ఉదయ నక్షత్రములు ఏకముగా పాడినపుడు దేవదూతలందరు ఆనందించి జయధ్వనులు చేసినపుడు, భూమికి మూలరాతిని వేసినవాడు ఆయనే అని మనము చదువుచున్నాము. ఈలాగున ప్రియ సహోదరీలారా ! హన్నా మనలో ఒక సామాన్య స్త్రీగా వుండినప్పటికీ యెహోవాను గూర్చి మనకు తెలియని అనేక గొప్ప గొప్ప సంగతులు ఆమె ఎరిగిందంటే ఆమె దేవుని ఆత్మమూలముగా ఆ దేవుని సన్నిధిలో ఎన్ని సంగతులు ఆయనను గూర్చిన ధ్యానములో నేర్చుకుందో కదా ! పురుషులు కూడా ఎరుగని ఈ దైవధ్యానములు యెహోవాను గురించిన జ్ఞానాంశములను తాను గ్రహించిన వాటిని 1 సమూ 2వ అధ్యాయములో రికార్డ్ చేయడములో దేవుడు ఆమె మాటలను ఆమె హృదయ ధ్యానాన్ని కీర్త 19:14వ.లో ఉన్నట్లు ఆయనకు ఎంత అంగీకారమయ్యాయో కదా ! ప్రియులారా ! ఎన్ని రీతులుగా హన్నా మనకు మాదిరికరముగా, హెచ్చరికముగా వున్నదో కదా !

9వ. వచనములో హన్నా యెహోవా తన భక్తుల పాదములను తొట్రిల్లకుండ వారిని కాపాడుతాడని చెప్పింది. కీర్త 91:11వ.లో దావీదు కూడా నీ పాదములకు రాయి తగులకుండ వారు నిన్ను తమ చేతులమీద ఎత్తి పట్టుకొందురు" అని దేవుని మూలమున ఆత్మ ప్రేరేపితుడై వ్రాశాడు. 121:3వ. ఆయన నీ పాదములను తొట్రిల్లనీయడు అని వ్రాయబడింది. ఇశ్రాయేలీయులు దేవుని మందిరమునకు వెళ్ళు సమయంలో ఆ కొండల మీద ప్రయాణము చేయునపుడు ఆ కొండలు ఏటవాలుగా జారవలసిన పరిస్థితులు ఉన్నపుడు సదా వారి పాదములు జారితొట్రిలనీయకుండ యెహోవా వారి పాదములను కాపాడుతారట. ఇది ఇశ్రాయేలు వారికి అలాగే ఆత్మీయ ఇశ్రాయేలీయులమైన మనకును ఒక ప్రత్యేకమైన వాగ్ధానముగా వున్నది. హన్నా 9వ వచనములోనే దుర్మార్గులు అంధకారమందు మాటుమణుగుదురు అని చెప్పింది. మత్త 8:13వ.లో ఈ లోక రాజ్యసంబంధులై ప్రభువును విశ్వసించని దుర్మార్గులు వెలుగైన యేసుప్రభువు దగ్గఅకు రాక వెలుపటి చీకటిలోనికి త్రోయబడుదురు. వారంతకు వారు వెళ్ళరు. వెళ్ళుటకు యిష్టము లేకపోయినను త్రోయబడుదురు. అక్కడ ఏడ్పును, పండ్లు కొరుకుటయు వుండునని వ్రాయబడింది. కానీ ప్రభువుని నమ్మిన అనేకులు తూర్పు, పడమర నుండి వచ్చి అబ్రహాము ఇస్సాకు, యాకోబులతో కూడా పరలోక రాజ్యమందు కూర్చుంటారని వ్రాయబడింది. క్రొత్త నిబంధనలో ఈ మాటలు చదివి మనము తెలుసుకుంటున్నాము. కాని పాత నిబంధన కాలములో వున్న హన్నా ఏలాగు ఈ సంగతులు గ్రహించిందనే విషయాలు ప్రతి వచనములో మనల్ని ఎంతగా ఆశ్చర్యచకితులనుగా చేస్తున్నాయో కదా !

అలాగే హన్నా 9వ.లో బలముచేత ఎవడును జయమునొందడు అని చెప్పింది మానవ బలముచేత ఎవడును ఏ జయమును పొందలేడు. బలము నాది అని దేవుడు చెప్పాడు. దేవుడు తన ప్రజలకు బలపరాక్రమములను అనుగ్రహించేవాడు. సంసోనుకు ఆత్మ బలముచే తన చేతిలో ఏమియు లేకపోయినను సింహాన్ని చంపగలిగాడు. అష్కెలోనుకు వెళ్ళి 30 మందిని చంపి వారి సొమ్మును దోచుకొని విప్పుడు కథ చెప్పిన వారికి బట్టలనిచ్చాడు.

కీర్త 33:16వ.లో ఏ రాజును సేనాబలము చేత రక్షింపబడడు. ఏ వీరుడును అధిక బలముచేత తప్పించుకొనడు. గుఱ్ఱముల బలమునందును, నరుల కాళ్ళ సత్తువయందును దేవుడు ఆనందించడు. మన బలము ద్వారా మనకు జయము కలుగదు. జయాపజయములు దేవుని ఆధీనములు. 144 కీ. 10వ.లో రాజులకు విజయము దయచేయువాడు యెహోవాయే అని దావీదు చెబుతున్నాడు. గుఱ్ఱాలు సైన్యము కాదు. దేవుడే రాజులకు బలమిచ్చువాడు. 2 కొరిం 2:14వ.లో వ్రాయబడినట్లు విజయోత్సవముతో ఊరేగించువాడు దేవుడే కాని మన బలాన్ని బట్టి కాదు. 1 యోహా 5:4వ. బట్టి దేవుని మూలముగా పుట్టినవారు మాత్రమే

లోకమును జయిస్తారు అని వ్రాయబడింది. ఈ వాక్యములను బట్టి దేవున్ని బట్టియే జయము కానీ మానవ జ్ఞాన బలములను బట్టి కాదు. మనకు యిట్లే అర్ధమవుచున్నది. మనకు ఇన్ని రెఫరెన్సులున్నాయి కాబట్టి అర్ధము చేసుకుంటున్నాము. ఆనాడు హన్నాకు ఈ రెఫరెన్స్‌లు ఏమియు లేకున్నను ఆత్మలో ఆమె స్వంత బలముతో ఎవడును జయించలేడు అని ఎంత చక్కగా చెప్పిందో ఆశ్చర్యమనిపిస్తుంది కదా !

10వ వచనంలో "యెహోవాతో వాదించువారు నాశనమగుదురని హన్నా చెబుతోంది. ఆది 6:3వ.లో యెహోవా నా ఆత్మ నరులతో ఎల్లప్పుడును వాదించదు అని అంటున్నప్పుడు, మనము సృష్టికర్తయైన దేవునితో వాదించవచ్చునా ? యోబు 40:2 వ.లో ఆక్షేపణలు చేయజూచువాడు సర్వశక్తుడగు దేవునితో వాదించవచ్చునా ? అని వ్రాయబడింది. యెష 45:9 వ.లో పెంకులో ఒక పెంకై తన్ను సృజించినవానితో వాదించు వానికి శ్రమ అని వ్రాయబడినది. సంఖ్యా 26:9,10 వచనాలలో యెహోవాతో వాదించిన దాతాను, అబీరాము భూమి నెరవిడిచి ప్రాణాలతోనే మ్రింగి వేయబడిరి అని వ్రాయబడింది. యిర్మి 12:1లో యెహోవా నేను నీతో వాదించునపుడు నీవు నీతిమంతుడవుగా కనబడుదువు అని వ్రాయబడింది. కనుక మానవుడు దేవునితో వాదించి జీవించలేడు. ఫిలి 1:17వ.లో వ్రాయబడినట్లు పౌలువలె సువార్త పక్షమున వాదించాలే గాని, దేవునితో వాదించి ప్రయోజనం లేదు.

దేవునితో అంధకారము మాటుమణుగుదురు అని కూడా చెప్పింది. మత్త 8:12వ.లో అనేకులు తూర్పు నుండియు, పడమట నుండియు వచ్చి అబ్రహాముతో కూడను, ఇస్సాకుతో కూడను, యాకోబుతో కూడను పరలోక రాజ్యమందు కూర్చుందురు కాని, రాజ్య సంబంధులు వెలుపటికి చీకటిలోనికి త్రోయబడుదురు. దుర్మార్గులు అంటే ప్రభువును నమ్మనివారందరూ దుర్మార్గములోనే నడుచుకొనుచూ వుంటారు. అనేకులు తూర్పు, పడమరల నుండి పరలోక రాజ్యాన్ని ప్రవేశించియుండగా దుర్మార్గులందరూ వెలుపటి చీకటిలో త్రోయబడతారట. వారు చీకటిలోనికి ఇష్టపడకపోతే ఇతరులు వచ్చి వారిని త్రోసివేస్తారట. ఈలాగు జరుగకుండా నేడే అందరు ప్రభువును విశ్వసించినచో మేలు పొందగలరు.

బలముచేత ఎవడును జయమునొందడని హన్నా చెప్పడం వాస్తవమే. కీర్తన 33:15వ.లో ఏ రాజును సేనాబలముచేత రక్షించబడడు. ఏ వీరుడును అధిక బలముచేత తప్పించుకొనడు. రక్షించుటకు గుఱ్ఱము అక్కరకు రాదు. గుఱ్ఱముల బలమునందు కానీ, నరుల కాలి సత్తువయందుకాని ఆయన ఆనందించువాడు కాదు. యాబీను రాజు తన తొమ్మిది వందల యినుప రథములతో ఇశ్రాయేలీయులతో యుద్ధానికి వచ్చినను తాను తన రథము దిగి యాయేలు యింటికి వెళ్ళి ఆ స్త్రీతో చనిపోవడం జరిగింది. ఆయన ఇనుప రథాలు, ఆయన గుఱ్ఱాల బలము ఆయనను రక్షించలేదు.

అలాగే అష్షూరు రాజైన సన్హెరీబు బహు గొప్ప సమూహముతో రష్షాకేను హిజ్కియా రాజు మీదికి పంపినా, అతనికి జయము కలుగలేదు. అతడు వదంతిని విని తన దేశమునకు వెళ్ళి కత్తి చేత దేవుడతనిని కూలచేశాడు. కనుక జయాపజయములు దేవుని వశమే.

యెహోవాతో వాదించువారు నాశనమగుదురని కూడా హన్నా చెబుతోంది. కీర్త 2:3 వ.లో భూరాజులు యెహోవా ఆయన అభిషిక్తునికిని విరోధముగా నిలుచుచున్నారు. అలాగు దేవునితో వాదించువారిని, విరోధము వున్నవారిని దేవుడు కీర్త 2:9వ.లో ఇనుప దండముతో వారిని నలుగగొడతాడు. కుండను పగులకొట్టినట్లు వారిని ఆయన ముక్కచెక్కలుగా పగులగొడతాడు.

"పరమండలములో నుండి ఆయన వారిపైన ఉరుమువలె గర్జించును" అని కూడా హన్నా చెబుతోంది. ఎవరైతే దేవునికి విరోధముగా నిలబడుతారో వారి మీద దేవుడు ఉరుమువవలె గర్జిస్తాడట. 1 సమూ 7:10 వ.లో దేవుడు ఫిలిష్తీయుల మీద మెండుగా ఉరుములు ఉరిమించి వారిని తారుమారు చేయగా వారు ఇశ్రాయేలీయుల చేత ఓడిపోయారని చదువుతాము. కీర్త 18:13 వ.లో కూడా యెహోవా ఆకాశమందు గర్జన చేశాడని, సర్వోన్నతుడు తన ఉరుమును పుట్టించాడని, వడగండ్లను, మండుచున్న నిప్పులను రాల్చాడని వ్రాయబడింది. సొదొమ, గొమొఱ్ఱా పట్టణముల మీద అగ్ని గంధకములను కురిపించడని వ్రాయబడింది. ఆయనకు ఈనాడు ఎదురు తిరుగుతున్న మతోన్మాదులందరికి, సిలువ శత్రువులందరికీ రేపు ప్రొద్దున ఆయన రాకడలో ఇలాగే జరుగబోతోంది.

చివరిగా లోకపు సరిహద్దులలో నుండువారికి ఆయన తీర్పు తీర్చుతాడని హన్నా తన మాటలు ముగించింది. మత్తయి 25:31, 32 వచనాలలో మనుష్య కుమారుడు తన మహిమతోను తన సమస్త దూతలతోను వచ్చునపుడు ఆయన తన మహిమ గల సింహాసనము మీద కూర్చుండి, తన కుడివైపున గొఱ్ఱెలను, ఎడమవైపు మేకలను నిలువబెటివ్ట తీర్పుతీర్చి మేకలను నరకానికి, గొఱ్ఱెలను పరలోకానికి పంపించు దేవుడుగా వున్నాడు.

హన్నా ఎంత చక్కగా యెహోవా దేవుని గూర్చి బైబిల్‌లో ఏ స్త్రీ కూడా చెప్పని లోతైన విషయాలు ఆత్మజ్ఞానముతో నింపబడి ఎంత లోతైన సంగతులు చెప్పినదో మనకర్థమౌతుంది. ఆమె అందరు స్త్రీల వలె లౌకికమును గురించి మాట్లాడక, దేవుని గూర్చిన సంగతులు మర్మాలు మనకు తెలిపిందంటే, స్త్రీలయైన మనమును ఈ అంత్య దినాలలో ప్రభుని గూర్చి యిర్మి 9:24 వ.లో వ్రాయబడినట్లు పరిశీలనగా తెలిసికొనుటను బట్టియే ఆయన ఆనందించువాడని నేర్చుకుంటున్నాము. అలా చేయడానికి ప్రభువు తన కృపను మెండుగా మనమీద కుమ్మరించును గాక !

# సుబుద్ధి గల రూపసి – అబీగయీలు

అబీగయీలు భర్త ఒక ఆస్తిపరుడు. బహు భాగ్యవంతుడు అయినప్పటికి ఆయన ఒక మోటువాడు, దుర్మార్గుడు, త్రాగుబోతు, కఠినముగా మాట్లాడేవాడు. అబీగయీలు అనే పదానికి అర్థము తండ్రి యొక్క ఆనందము. అంగడిలో వున్నా అల్లుని నోట్లో శని అన్నట్లు ఒక త్రాగుబోతు ఇంట్లో ఏమి సంతోషము వుంటుంది ? అబీగయీలు ఆనందము భర్తకున్న ఆస్తి, భాగ్యవంతమైన స్థితిని బట్టి కాదుగాని పరలోకపు తండ్రి యొక్క సంతోషానందాలు ఆమె జీవితంలో ఉండినాయి.

ప్రియ సోదరీ ! నీ భర్త సంగతి కూడా అలాగే వుందా ? ఆయనను బట్టి నీకు ఏ సంతోషమూ లేదా ? అట్లయితే నీకు కూడా తండ్రి యొక్క ఆనందము వుంది.

**1) తండ్రి యొక్క ఆనందము పొందుచున్న అబీగయీలు :–** కీర్త 51:11వ. ప్రకారము రక్షణ ఆనందము దేవుడు అబీగయీలుకు యిచ్చాడు. ప్రియ సోదరీ ! దేవుని సువార్త విని మారుమనసు పొంది మన పాపములను ప్రభువు దగ్గర ఒప్పుకొనినపుడు ప్రభువు మనల్ని తన రక్తధారలలో కడిగినపుడు నరకమును పోగొట్టుకొని పరలోక రాజ్య భాగ్యమును పొందినపుడు మనము రక్షణ ఆనందాన్ని మొట్టమొదట పొందుకోగలిగాము. ఈ ఆనందము మొట్టమొదటగా ప్రభువు మనకిచ్చారు అమ్మా ! ఈ ఆనందం నీకు వున్నదా ?

2) లూకా 10:20 వచనములో "అయినను దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక, మీ పేరులు పరలోకమునందు వ్రాయబడియున్నవని సంతోషించుడి అని వ్రాయబడినట్లు ప్రియ సోదరీ ! మన పేర్లు భూలోకంలో స్కూల్లో కాదు, న్యూస్ పేపర్లో కాదు, కాలేజీలో కాదు, పరలోకంలో వ్రాయబడియున్నాయని సంతోషించమని ప్రభువు చెబుతున్నాడు. మన పేరేదైనా, అది మోడు పేరైనా సరే, అది పరలోకంలో ప్రభువు వ్రాసి పెడతాడు. ఈ లోకంలో మన పేరును పట్టించుకునే నాధుడే వుండకపోవచ్చు. మన పేరంటే చాలామందికి నచ్చకపోవచ్చు కానీ, మన పేరుని ప్రభువు పరలోకంలో జీవగ్రంథములోను మంచి చెడ్డల గ్రంథములోను వ్రాసిపెట్టాడు. అది మనకు ఆనందం కలిగించేదిగా వుంది.

3) కీర్త 119:174వ.లో నీ ధర్మశాస్త్రము నాకు సంతోషకరము అంటున్నాడు దావీదు. రాజైన దావీదుకు తన సింహాసనము. కిరీటము, రాజ్యము, సంతోషము కాదది. గాని దేవుడిచ్చిన ధర్మశాస్త్రమే సంతోషమట. ప్రియ సోదరీ ! నీవు ఏ ఏ విషయాల్లో సంతోషిస్తున్నావు ? కొద్దిమందికి వారి ఆహారము, వారి బట్టలు, వారి ఫంక్షన్స్. వారి టి.వి. వారి హాబీలు సంతోషకరము. కానీ దావీదుకు దేవుని ధర్మశాస్త్రమే సంతోషకరమట. ధర్మశాస్త్రమంటే 5

గ్రంథాలు మాత్రమే. ప్రభువు ఈ కృపాయుగంలో 66 గ్రంథాలు బైబిల్‌లో పొందుపరచారు. బ్రదర్. ఆర్.ఆర్.కె. మూర్తిగారు "బైబిల్ దేవుడు మనకిచ్చిన ప్రేమలేఖ" అన్నారు. ఇంత పెద్దలేఖను ఏ ప్రేమికుడైనా తన ప్రేయసికి ఎప్పుడైనా వ్రాసిచ్చాడా ? రక్షించబడిన మనకు ఏ ప్రేమికుడినుంచైనా ప్రేమలేఖలు రాకూడదు కానీ, ఎవరైనా వ్రాసిన ప్రేమలేఖను అక్కడ కొంచెము, ఇక్కడ కొంచెము చదువుతామా ? టాప్ టు బాటం చదవమా ? అనేకసార్లు చదవమా ? అండర్‌లైన్ చేసికొని చదవమా ? బైబిల్ నీకు సంతోషకరమైతే నీవెన్నిసార్లు, ఎంతసేపు చదువుచున్నావు ? నీ బైబిల్ నీవు వాడుతున్నందువల్ల అది పాతబడింది ? అది అండర్‌లైన్ చేసికొని చదువుచున్నావా ? లేక వాడుట లేదు కాబట్టి అది చెక్కుచెదరకుండా క్రొత్తగా వుంటూ వుందా ? చాలామంది బైబిల్ చదవటం మరచిపోతున్నారు.

హోషే 4:6 వ.లో వ్రాయబడినట్లు నీవు నా ధర్మశాస్త్రమును మరచితివి గనుక నేనును నీ పిల్లలను మరతును అని ప్రభువు చెబుతున్నాడు. మన పిల్లలను ఆయన మరిస్తే మనము తట్టుకోగలమా ? ఇది ఎంత భయంకరమైన మాట ! ఈ లోకంలో ఎన్ని వున్నా అవన్నీ ఏవియు మనకు సంతోషమివ్వలేవు. ఈ రోజు బైబిల్ చదువుచుండగా ఒక విషయం మనకర్థమైనట్లయితే ఎంతో సంతోషము కలుగుతుంది. ఒక వాగ్ధానం బయలుపడితే ఎంతో సంతోషం కలుగుతుంది. ఒక మర్మం బయలుపడితే సంతోషం కలుగుతుంది. లోకమిచ్చే సంతోషం కాదది. ప్రియ సోదరీ ! నీకు సంతోషం కావాలంటే బైబిల్‌కు ప్రత్యేకమైన సమయమిచ్చి ఆనందించు. కీర్తన 1:2 వ.లో వ్రాయబడినట్లు దేవుని వాక్యాన్ని దివారాత్రములు నీవు కూడా ధ్యానిస్తే ఆ ఆనందాన్ని పొందగలవు.

4) కీర్తన 122:1వ.లో వ్రాయబడినట్లు దేవుడు తన మందిరములో కూడా మనలను ఆనందింపచేస్తాడు. ఆదివారం మాత్రమే గాక ప్రతి నియామక కూడికలో మన పాదములు ఆయన మందిర గుమ్మములో నిలవాలి. అనేకుల పాదాలు ఈ దినాల్లో లౌకిక సంతోషం కలిగించే సినిమా హాల్స్‌లో, షాపింగ్ కాంప్లెక్స్‌లలో, బట్టల షాపుల్లో, బ్రాంది షాపుల్లో, ఆయా స్టేడియమ్స్‌లో వుంటున్నాయి. కీర్తన 122:4వ.లో యెహోవా యొక్క పండెంద్రు గోత్రములన్నీ యెరూషలేము మందిరానికి వెళ్ళి సంతోషిస్తున్నారట. ప్రియ సోదరీ ! అందరూ మందిరానికి వెళ్ళి ఆయన వాక్య సంతోషాన్ని అనుభవిస్తుంటే ప్రభువు దినాన్ని నీ స్వంత పనులు, వంట పనులు, వ్యాపారపు పనులు చేసికొనేందుకు వాడుకుంటున్నావా? మందిరములోనే నిజమైన సంతోషాన్ని అనుభవిస్తున్నాడు. దావీదు మరి నీ సంతోషమెక్కడ?

5) యెషయ 16:24 వ.లో ఇది వరకు మీరేమియు నా పేరట అడుగలేదు. మీ సంతోషము పరిపూర్ణమగునట్లు అడుగుడి. మీకు దొరుకును అని వ్రాయబడింది. మనము పరిపూర్ణ సంతోషము పొందాలంటే అడగాలట. అంటే అడుగుట అనగా ప్రార్థించుట. ప్రార్థిస్తే దేవుడు

మనమడిగింది ఇస్తాడు. ఇస్తే మనము సంతోషిస్తాము. అంటే ఎక్కడ అడగాలి. యెష 57:7వ.లో నా ప్రార్థనా మందిరములో నేను వారిని ఆనందింప చేసెదను అన్నాడు. ప్రార్థన ఇంటిలో చేసికోవచ్చు. అంతమాత్రమే కాక మందిరములో జరిగే విజ్ఞాపన ప్రార్థనలు, ఉపవాస ప్రార్థనలకు కూడా మనము రావాలి. గొడ్రాలైన హన్నా వందల కొద్ది ప్రార్థనలు రామాలోని తన యింటిలో చేసికొని వుంటుంది. కానీ, షిలోహులోని దేవుని మందిరములోకెళ్ళి తను చేసి ప్రార్థనలు దేవుడు ఆలకించి తన గర్భములో సమూయేలును పడవేసిన తరువాత ఆమె దు:ఖముగా వుండుట మాని సంతోషముఖి మారటంలో జరిగింది. కీర్తన 18:6 వ.లో వ్రాయబడినట్లు దావీదు దేవుని ఆలయంలో తన ప్రార్థన ఆలకించబడినట్లు చెబుతున్నాడు. కనుక ప్రియ దేవుని బిడ్డలారా ! ప్రార్థన ఆలయంలో మన ప్రార్థనకు దేవుడు జవాబిచ్చినపుడు మనకెంతో ఆనందం కలుగుతుంది.

కనుక పై వచనాలను ఆధారము చేసుకుంటే ఆత్మీయులమైన మన సంతోషమంతా లోకంలో, ఇంట్లో, ఆస్తి పాస్తుల్లో, భర్తల్లో, పిల్లలలో, తిండిలో బట్టలలో లేదు. కాని, పరలోకంలో, మందిరాల్లో, బైబిల్లో, ప్రార్థనలో మాత్రమే ఉందని తెలుస్తుంది. అబీగయీలుకు కూడా ఈ ఆత్మీయ సంతోషాలే ఆమె జీవితంలో ఉండినాయి అని మనకర్థమవుతోంది. పరలోకపు తండ్రి ఆనందమే తనలో వుండింది. ఈ ఆత్మీయ ఆనందాలతోనే ఆ త్రాగుబోతు కుటుంబములో ఇన్నాళ్లు ఆమె జీవించగలిగింది" అని మనం తెలుసుకోవచ్చు. లేకపోతే ఇలాంటి కుటుంబంలో జీవించడం చాలా కష్టం. నీవు కూడా సోదరీ ! ఈ సంతోషాన్ని ప్రభువు ద్వారా పొందుకోవచ్చు.

**2) సుబుద్ధిగల అబీగయీలు :–** ఈమె రూపసి అని ఆమెను గురించి వ్రాయకముందు దేవుడు ఆమె బుద్ధిని గురించి ముందు వ్రాయించాడు దేవుడు. ఈనాడు వివాహాల సమయంలో ఎంత ఆత్మీయులైనా బాహ్య రూపాన్ని ఆశిస్తున్నారు. ఆత్మీయతకు రెండవ స్థానాన్నిస్తున్నారు. కానీ దేవుడు, బుద్ధిని గురించి ముందు వ్రాస్తున్నాడు. సామె 19:14 వ.లో సుబుద్ధిగల భార్య యెహోవా యిచ్చిన దానము అని ప్రభువు వ్రాయించారు. గృహమును, విత్తము అనగా ఐశ్వర్యమును పితరులిస్తారేమోగానీ, సుబుద్ధి గల భార్యను యెహోవాయే ఇస్తాడట. ఈ మాట ప్రకారం పెళ్ళిళ్లలో ఇలాటి భార్యల కోసం, ఇలాంటి కోడళ్ళ కోసం ప్రభువునే మనం అడగాలి. అబీగయీలు, ఎటువంటి సుబుద్ధి గలదో ఈ అధ్యాయంలోనే మనము చూడవచ్చు.

ఈమెకు మగ సంతానం కూడా ఉన్నారు కాబట్టి నాబాలుతో ఈమె ఎన్ని యేళ్ళు కాపురం చేసిందో మనకు తెలియదు. ఏ త్రాగుబోతుతో కూడా ఏ భార్య సంతోషించదు. ఈయన మోటువాడు, దుర్మార్గుడు, కఠినుడు. ఎవనిని తనతో మాటలాడనీయడు ఇక భార్యను మాటలాడనిస్తాడా ? కనుకనే 25:18వ.లో అబీగయీలు దావీదుకు కానుకను తీసుకెళ్లేటప్పుడు

నాబాలుతో ఏమియు చెప్పకుండా వెళ్ళింది. ఈమె మాట్లాడితే ఆయన వినడు, కఠినుడు, త్రాగుబోతు మాట్లాడితే ఎంతో తేడాగా వుంటాయి ఆ మాటలు. దూషణ మాటలుగా వుంటాయి. దుర్మార్గపు మాటలుగా ఉంటాయి. బెదిరించే మాటలుగా ఉంటాయి. 25:17వ. మన యజమానుడు బహు పనికిమాలినవాడు అని పనివారు అమ్మగారి ఎదుటనే భయపడకుండా అంటున్నారు. అందుకు ఆమె "నా భర్తను అలా అనడానికి మీకెన్ని గుండెలు ?" అని భర్తను వెనుకేసుకుని రాలేదు. అది వాస్తవ విషయమే. భర్త రాజులు విందులు చేసినట్లు తనతో ఎప్పుడు విందులు చేయిస్తూ వుంటాడు. అప్పుడప్పుడు విందులు అంటే ఎవరైనా చేస్తారు. అతడు రాజైతే అలా చేయవచ్చు. రాజుకాదు. కానీ విందులు చేయించేవాడు, త్రాగేవాడు, బహు సంతోషించేవాడు. భార్య తన విషయమై సంతోషంగా ఉందో లేదో గమనించేవాడు కాదు. కొద్దిమంది భర్తలకు తమ సంతోషమే ప్రాముఖ్యం. కానీ భార్యల సంగతి పట్టించుకోరు. భార్య అంటే కొద్దిమందికి వంటలు చేసే వంటమనిషి. బట్టలు వుతికే చాకలిది. భార్యను కొద్దిమంది భోగవస్తువుగా చూస్తారు. శృంగారానికి మాత్రమే ఆమెను వాడుకుంటారు.

నాబాలు ఇపుడు దావీదును అవమానించి, ఉపకారం చేసిన అతనికి అపకారం చేసి దావీదు ఎవడు ? యెష్షయి కుమారుడు ఎవడు ? అని అమర్యాదగా మాట్లాడి, తన మగ సంతానానికి, తనకు దావీదు ద్వారా అపాయాన్ని తెచ్చుకున్నవాడు. దమ్మిడికి పనికి తరుమయ్యేవాడు కాదు. బహు పనికిమాలినవాడై ఇంటిలోని తనకు, తన కుమారులకు అపాయము తెచ్చుకుని మత్తుడై వుండగా, తన యింటిల్లిపాదిని రక్షించుకోవడం ఇప్పుడు అబీగయీలు పనయ్యింది. ఎంతో కీడు తెచ్చిపెట్టాడు నాబాలు. ఇట్టి పనికిమాలిన భర్తను రక్షించుకునే పనిలో సుబుద్ధి చూపిన అబీగయీలును ఇపుడు మనము ధ్యానిస్తున్నాము.

ఇన్ని పాపాలు, పనికిమాలిన పనులు చేస్తూ నేడు మింటికి కీడు తెచ్చిన భర్త కొఱకు క్షమాపణ వేడడానికి అబీగయీలు 24వ.లో దావీదుకు సాష్టాంగ నమస్కారము చేసి అతని పాదములు పట్టుకొని భర్త దోషాలు చెప్పలేదు. ఆయన మీద తంటాలు చెప్పలేదు. కాని భర్త దోషాన్ని క్రీస్తువలె తనమీద వేసుకోవడం పనికిమాలిన తన భర్త యెడల తన సుబుద్ధి ఎంతగా చూపిందో అర్థమౌతున్నది. ఇన్ని యేండ్లుగా తనను బాధిస్తున్న భర్తను చంపడానికి వస్తుండగా దావీదుచే దేవుడే అతనిని చంపిస్తున్నాడులే, తన పీడ విరుగుడవుతుందిలే అనుకోలేదు. అటువంటి భర్తను రక్షించడానికి ప్రయత్నించింది. అటువంటి మోటుభర్తకు విడాకులిచ్చి తల్లిగారింటికి వెళ్ళాలని కూడా ప్రయత్నించలేదు. ప్రియ సోదరీ ! నీ భర్త కూడా అలాగే వున్నాడా ? దుర్మార్గపు భర్తలను, త్రాగుబోతు, వ్యభిచారులైన భర్తలను కలిగినవారు వారికి విడాకులిచ్చి తల్లి యింటికైతే వారిని ఎవరు రక్షిస్తారు ?

25వ.లో దుష్టుడైన నాబాలును లక్ష్యపెట్టవద్దని దావీదు హితవు పలికింది. ఆయన మాట్లాడిన కఠినమైన, అవమానపరచిన మాటలను లక్ష్యపెట్టవద్దని చెప్పింది. మనము కొన్నిసార్లు ఎవరైనా మనల్ని తమ మాటలతో నొప్పించి వుంటే అస్తమానము ఆ మాటలనే గుర్తుచేసుకుంటూ ఏడుస్తూ బాధపడుతూ వుంటాము. ఒక స్త్రీ, విశ్వాసిగా ఒక ఆత్మీయుడైన పురుషునితో దుష్టుడైన త్రాగుబోతు మాటలను లక్ష్యపెట్టవద్దని చెబుతోంది. లేఖనాలలో కీర్తన 119:6వ. దేవుని ఆజ్ఞలను లక్ష్యపెట్టాలని దేవుడు వ్రాయించాడు. కీర్తన 28:5 వ.లో దేవుని కార్యాలను లక్ష్యపెట్టాలని వ్రాయబడింది. ఇలా దేవుని ఆజ్ఞలను, ఆయన కార్యాలను లక్ష్యపెట్టాలేగాని, అనవసరంగా నాబాలులాంటి వారి పనికిమాలిన మాటలను లక్ష్యపెట్టి కాలము వ్యర్థము చేసికొనకూడదు.

దావీదును నాబాలు కొఱకు క్షమాపణ అడిగి తిరిగి 35 వచనంలో తన యింటికి అదే భర్తతో సంసారం చేయుటకు వచ్చింది. దీన్ని బట్టి వివాహములో ఆమె భర్తతో చేసిన వివాహ నిబంధనలకు, ప్రమాణాలకు కట్టుబడి వుందని మనకర్థమవుతుంది. అట్టి పనికిమాలిన త్రాగుబోతు భర్త విషయమై ఆమె కలిగియున్న సుబుద్ధి ఇక్కడ మనకు కనిపిస్తుంది.

బి) తన యింటికి శత్రువుగా వస్తున్న దావీదు మీద, ఆయన సంతతి మీద, ఆయన పనివారి మీద ఆయన సేవకుల మీద చూపిన సుబుద్ధిని గురించి ధ్యానిద్దాం. 18 వ.లో ధారాళమైన కానుకను అర్జంట్‌గా సిద్ధపరచి కానుకను గార్దభముల మీద ముందుగా పంపించి, తాను గార్దభము ఎక్కి అరణ్యములో దావీదును కలుసుకుంది. ఆమె జీవితంలో ప్రార్థన ముందు కాదు. ఆకలితోను వస్తున్న కోపంతోను వస్తున్న వారి ఆకలి తీర్చటానికి ముందు వారి కడుపు చల్లబరచడానికి కానుక పంపింది. సమయము వున్నట్లయితే ఇంకా ఎక్కువగా పంపివుండేది. తెల్లవారులోగా రాబోతున్న దావీదుకును అతని జనులకును అర్జంటు కానుకను పంపింది. సామె 18:16 వ.లో ఒకరు యిచ్చు కానుక వానికి వీలు కలుగజేయును అని వ్రాయబడింది. మనమిచ్చే కానుక మనకే వీలు, మేలు కలుగచేస్తుందట.

ఒక విదేశంలో 'కెల్లీ' అనే ఒక చిన్న అబ్బాయి ఒక రోజు తనకు చాలా ఆకలి అవుతున్న సమయంలో తన యింటి వీధిలో వున్న ఒక స్త్రీ యింటికి వెళ్ళి 'నాకు చాలా ఆకలిఔతున్నదని ఆమెతో చెప్పాడట. ఆ స్త్రీ తన యింటి లోపలికి వెళ్ళి ఒక పెద్ద గ్లాస్ నిండుగా పాలు తెచ్చి యివ్వగా కెల్లీ ఆ పాలు త్రాగి ఆకలి నుండి తృప్తిపొందాడు. ఆ సంగతిని ఆయన మరచిపోలేదు. చాలా యేండ్ల తరువాత ఈ స్త్రీ చాలా అనారోగ్యంతో ఒక పెద్ద పట్టణంలోని హాస్పిటల్‌లో వైద్యము కొఱకు అడ్మిట్ అయ్యింది. అక్కడ వున్న ఒక డాక్టర్ ఆమెకు ఒక ఖరీదైన వైద్యమిచ్చి బాగుచేశాడు. ఈ స్త్రీ ఆరోగ్యము పొంది డిశ్చార్జి అయ్యి తన ఊరిలోని యింటికి వెళ్ళవలసి వుండగా డాక్టర్ మెడికల్ బిల్ చీటి ఆమెకు ఇవ్వబడింది. చాలా అధికమైన డాక్టర్ బిల్‌ను

ఆమె చూచి తన దగ్గర వున్న ఆస్తినంతా ఇచ్చినా, ఆ మెడికల్ బిల్‌కు సరిపోదు అని అనుకుంటూ, ఆ మెడికల్ బిల్ పేపర్ క్రింది వైపు చూడగా, నీ మెడికల్ బిల్ అంతా ఒక పాల గ్లాసుతో పూర్తిగా చెల్లించబడింది అని డాక్టర్ కెల్లీ అనే సంతకాన్ని ఆమె చూస్తుంది. ఆ కెల్లీ డాక్టర్ ఎవరంటే చాలాకాలం క్రిందట ఆమె యింటికి వచ్చి పాలు త్రాగిన ఆ చిన్నవాడే యిపుడు డాక్టర్ అయ్యి ఆమె మెడికల్ బిల్ అంతా ఆ కెల్లీ డాక్టరే చెల్లించాడు. ఆలాగున ఆ స్త్రీ ఇచ్చిన చిన్న కానుక ఆమెకు వీలు కలుగచేసింది. తన ఆస్తి అంతా తనకే మిగిలింది. ఆమె యిచ్చిన గ్లాస్ పాలు అనే చిన్న కానుక తన మెడికల్ బిల్ చెల్లించడానికి వీలు కలుగచేసింది. ఈ కానుకను నాబాలు ఇవ్వలేకపోయాడు.

కానీ అబీగయీలు యిచ్చిన ఆ కానుక వలన తన భర్తను, తన మగ సంతానమును మరణము నుండి తప్పించుటకు వీలు కలుగచేసింది. ఆమె జీవితంలో కానుకముందు ప్రార్థన వెనుకపెట్టింది. మనమైతే ప్రార్థన విన్నపాలు ముందుంచుతాం. ప్రార్థన నెరవేరిన తరువాతనైనా దేవునికి కానుక చెల్లించము. కృతజ్ఞత కూడిక పెట్టినా, కూడికకు వచ్చిన వారికి భోజనాలు పెడతాం కానీ దేవునికి కానుక కృతజ్ఞతగా ఇచ్చేది మరచిపోతున్నాం.

అబీగయీలు ఆ ఐదు గొఱ్ఱెల మాంసమును దావీదుకు పంపిన సంగతిని బట్టి నాబాలు మందను లెక్కించుకున్నపుడు ఐదు గొఱ్ఱెలు తగ్గాయని తెలుసుకుని నేను ఇవ్వనపుడు నీవెందుకు దావీదుకిచ్చావు ? నీకు దావీదుకున్న సంబంధమేమని నాబాలు ఆమె మీద అనుమానపడే అవకాశము లేకపోలేదు. అయినను తన ఇంటివారిని రక్షించుకునేందుకు ఆమె ఈ ఆలోచన చేసింది.

**దావీదు సంతతి మీద ఆమె చూపిన బుద్ధి :–** 25:22వ వచనంలో దావీదు అబీగయీలు సంతానపు వారిలో ఒక్క మగ పిల్లవానినైనను తెల్లవారునప్పటికి నేనుండనియ్యను. లేదా దేవుడు మరిగొప్ప అపాయము దావీదు శత్రువులకు కలుగచేయునుగాక అని ప్రమాణము చేసి వుండగా అబీగయీలు 28 వ.లో దావీదుకు శాశ్వతమైన సంతతి దేవుడు ఇవ్వాలని కోరుకోవడం ఆమె ఎంత మంచి సుబుద్ధి గలదో మనకర్థమౌతుంది కదా ! మన పిల్లలను ఎవరైనా చంపటానికి వస్తూ వున్న మన శత్రువుల పిల్లలను మనము దీవించగలమా ? లేదా శాపనార్థాలు పెడుతున్నామా ? వారి మేలు కోరుతున్నామా ? మీ శత్రువులను దీవించుడి గానీ శపించవద్దు అనే క్రొత్త నిబంధనలోని మాటలు, వాక్య వివరాలు అబీగయీలు కాలములో ఆమెకు లేవు. అయినా తన శత్రువులను, వారి పిల్లలను దీవించుటలో అబీగయీలు ఆత్మలో ఎంత మంచి బుద్ధి కలిగి వున్నదో కదా!

చివరకు 40వ వచనములో అబీగయీలును పెండ్లి చేసుకొనుటకై ఆమెను తోడుకొని రండని దావీదు తన సేవకులను పంపగా ఆమె "నా యేలిన వాని సేవకుల కాళ్ళను

కడుగుటకై నేను సిద్ధముగా వున్నానని చెప్పుటలో దావీదు సేవకుల యెడల ఆమె ఎంత సుబుద్ధి కలిగివున్నదో మనకర్థమగుచున్నది. ఆమె మనకెంత మాదిరియో కదా ! ఈలాగున ఆమె తన సుబుద్ధి ద్వారా ఆశీర్వదించబడినట్లు 33 వచనములో మనము గమనించగలము. ఆమె సుబుద్ధికి మెచ్చి దావీదు చివరకు ఆమెను పెళ్ళి చేసికొనగా దావీదు రాజు అయినపుడు ఈమె రాణిగా, సింహాసనము కిరీటము అంత:పుర నివాసము, వీటన్నిటిని ఆశీర్వాదముగా పొందింది.

**3) రూపసియైన అబీగయీలు :-** దేవుడు అబీగయీలుకు మంచి అందాన్ని యిచ్చినట్లు తెలుస్తుంది. కానీ సామె 31:30వ. ప్రకారము అందము మోసకము సౌందర్యమును వ్యర్థము అన్నాడు. అందాన్ని బట్టి మురిసిపోయి, గర్వించలేదు. అబీగయీలు యెహోవాయందు భయభక్తులు గల స్త్రీగా కొనియాడబడింది. యిర్మీ 4:30లో నిన్ను నీవు అలంకరించుట వ్యర్థమే అన్నాడు దేవుడు. అబీగయీలుకు యెహోవాయందు భయభక్తులున్నాయో లేదో చూద్దామిపుడు. 25:27-31వ. వరకు ఆమె యెహోవాయందు భయభక్తులు కలిగివున్నది కాబట్టే యెహోవాను గూర్చి ఐదు మాటలు మాట్లాడింది.

యెహోవాను గూర్చి అబీగయీలు దావీదుతో మాటలాడిన మాటలలో మొదటి మాట 26 వ.లో వ్రాయబడింది. ప్రాణహాని చేయకుండా యెహోవా దావీదును ఆపాడట. ప్రత్యక్షంగా దావీదును ఆపింది అబీగయీలే. కాని ఆ మహిమను ప్రభువుకే ఆపాదించింది. మన దేవుడు ప్రాణహాని చేయడంలో ఆనందించువాడు కాడు. పాపములచేత అపరాధముల చేత వున్న మన ప్రాణాలకు హానిచేయడం యిష్టము లేక తండ్రియైన దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకానికి పంపాడు. పాపులను రక్షించుటకై క్రీస్తుయేసు ఈ లోకానికి వచ్చాడని 1 తిమో 1:15వ.లో వాక్యం సెలవిస్తుంది. నశించిన దానిని వెదకి రక్షించుటకు క్రీస్తుయేసు ఈ లోకమునకు వచ్చెనని లూక 19:19వ.లో వాక్యము సెలవిస్తుంది. అపో.కా. 16:28వ.లో పౌలు చెరసాల నాయకుడితో "నీవు ఏ హానియు చేసికొనవద్దు" అని చెప్పాడు. కనుక మనము హాని చేసికొనకూడదు. ఎవనికి నీ హాని చేయకూడదు. ఎందుకనగా మన దేవుడు ప్రాణహాని చేయువాడు కాదు.

అబీగయీలు యెహోవా విషయములో మాటలాడిన 2వ మాట 28వ.లో వ్రాయబడింది. అదేంటంటే దావీదు యెహోవా యుద్ధములు చేయుచున్నాడని చెప్పింది. పాత నిబంధనలో యెహోవా యుద్ధాలను దావీదు చేసినట్లు ఈనాడు మన యుద్ధాలను చేస్తున్నవాడు మన ప్రభువైన యేసుక్రీస్తే. ఆయనే మన పక్షమున వ్యాజ్యమాడువాడుగా వున్నాడు. "యెహోవా తన జనుల నిమిత్తము వ్యాజ్యమాడు దేవుడు" అని యెష 51:22లో వ్రాయబడింది. 1 సమూ 17:47లో దావీదు "యుద్ధము యెహోవాదే" అన్నాడు. కాబట్టి నేడు ఆత్మీయ

ఇశ్రాయేలీయులమైన మన యుద్ధాలు, వ్యాజ్యాలు మన ప్రభువే చేస్తాడు. ఈనాడు మనకున్న వాక్య రెఫరెన్సులు, ఆనాడు అబీగయీలుకు లేవు. కానీ యెహోవా విషయంలో ఆమె ఎంతమంచి అవగాహన కలిగి వుందో కదా !

యెహోవాను గురించి ఆమె పలికిన 3వ మాట 29వ వచనంలో వ్రాయబడి వున్నది. దావీదు ప్రాణము యెహోవా యొద్దనున్న జీవపు మూటలో కట్టాడని అబీగయీలు చెబుతోంది. ప్రియులారా ! నేడు ప్రభువుని నమ్మిన మన అందరి ప్రాణాలను తన జీవపు మూటలో కట్టియున్నాడు. కొలొ 3:3వ.లో వ్రాయబడినట్లు మన జీవము క్రీస్తుతో కూడా దేవునియందు దాచబడియున్నది. కానీ తండ్రియైన దేవుడు తన కుమారుని ఈ లోకానికి మన రక్షణ నిమిత్తమై పంపినపుడు ఆయన ప్రాణముతో వుండగనే "సజీవుల భూమిలోనుండి ఆయన పేరు కొట్టివేయబడింది. ఎవరైన చనిపోయిన తరువాత ప్రజా సంఖ్యలో నుండి వారి పేరు కొట్టివేయబడుతుంది. కానీ బ్రతికియుండగానే ఆయన పేరును మనము కొట్టివేశాము. కానీ, పరలోకపు తండ్రి మనము తన ప్రియ కుమారుని యందు విశ్వాసముంచి తక్షణమే మన పేర్లు పరలోకంలోని జీవగ్రంథములో వ్రాయించాడు. ఎంత గొప్ప ప్రేమయో కదా ! ఆయన ప్రియ కుమారుని ప్రాణాన్ని మనము ముళ్ళ, మేకుల, కొరడాల దెబ్బల చేత బాధించాము.

అబీగయీలు యెహోవాను గూర్చి చెప్పిన నాలుగవ మాట 30వ వచనములో వ్రాయబడింది. యెహోవా, దావీదును గురించి చెప్పిన మేలంతటిని చేస్తాడట. అవును దావీదు విషయములో మాత్రమే కాదు. ఆయనయందు విశ్వసించిన మన అందరి విషయమై యెహోవా తాను మనకు సెలవిచ్చిన వాగ్ధానములన్నిటి ప్రకారము నెరవేర్చే దేవుడు. కీర్తన 89:34 "నా నిబంధనను నేను రద్దుపరచను. నా పెదవులగుండా బయలు వెళ్ళిన మాటను నేను మార్చను. 37 వ.లో నా పరిశుద్ధ తోడని నేను ప్రమాణము చేసితివి. దావీదుతో నేను అబద్ధమాడను అని దేవుడు చెబుతున్నాడు. ఈ వచనములో దావీదు అనే పేరు తీసివేసి నీ పేరు, నా పేరు పెట్టుకొని చదివితే ఎంత ధైర్యము పొందుకుంటామో కదా ! ప్రభువు విషయమై తన పెదవుల గుండా బయలుపడిన వాగ్ధాన మాటను మార్చడట. మనతో ఆయన అబద్ధమాడడట. ఆయన అబద్ధమాడుటకు నరమాత్రుడు కాడట. ఆయన అబద్ధమాడనేరని దేవుడు. యిర్మి 1:12వ.లో ఆయన చెప్పిన వాక్యము నెరవేర్చుటకు ఆయన ఆతురపడు ఆలస్యము చేస్తున్నట్లు అనిపిస్తుంది ? కీర్తన 105:19వ.లో "అతడు చెప్పిన సంగతి నెరవేరువరకు యెహోవా వాక్కు అతని పరిశోధించుచుండెను" అను వాక్య ప్రకారము కొన్నిసార్లు దేవుడు మనల్ని దేవుడు పరిశోధిస్తాడని మనకు తెలుస్తుంది.

ఆది 28:15వ. యెహోవా దేవుడు యాకోబుతో ఇలా చెప్పాడు. "ఇదిగో నేను నీకు తోడైయుండి, నీవు వెళ్ళు ప్రతి స్థలమందు నిన్ను కాపాడుచు ఈ దేశమునకు నిన్ను మరల

రప్పించెను. నేను నీతో చెప్పినది నెరవేర్చువరకు నిన్ను విడువనని" చెప్పాడు ప్రభువు. యాకోబుతో మాత్రమే కాదు ఈనాడు నీతో, నాతో కూడా ఈ మాటే చెబుతున్నాడు. ఆయన మనతో చెప్పిన వాగ్దానములన్నిటిని నెరవేర్చువరకు ఆయన మనల్ని విడువడట. ఇది మనము నమ్మాలి. లూకా 8:24 వ.లో మీరు అడుగు వాటినెల్ల పొందియున్నామని నమ్ముడి. అప్పుడు అవి మీకు కలుగునని ప్రభువు వ్రాయించాడు. కనుక మనము నమ్మితే ఆయన నెరవేర్చుతారు. లాజరు అక్క మరియమ్మతో ప్రభువు "నీవు నమ్మితే నా మహిమను చూస్తావు" అన్నారు. మనము కూడా నమ్మితే ఆయన మహిమనే చూస్తాము.

అబీగయీలు యెహోవాను గూర్చి మాటలాడిన 5 మాట 31వ.లో ఈలాగున వ్రాయబడింది. "యెహోవా నే యేలినవాడవైన నీకు మేలుచేసిన తరువాత నీవు నీ దాసురాలనగు నన్ను జ్ఞాపకము చేసికొనుము" అనెను. యెహోవా నీకు మేలు చేసిన తరువాత నీవు నన్ను జ్ఞాపకము చేసికొనుమని అబీగయీలు తనకొఅకు ఒక చిన్న ముక్క ప్రార్థన చేసింది. అలాగునే దేవుడు మనకు చెప్పినదంతయు మనకు నెరవేర్చిన తరువాత మనమును ఇతరులను జ్ఞాపకము చేసికోవాలి. గల 2:10వ.లో బీదలను జ్ఞాపకము చేసికోవాలని దేవుడు కోరుతున్నాడు. అలాగే 2 తిమో 2:8వ.లో మృతులలో నుండి తిరిగి లేచిన యేసును జ్ఞాపకము చేసుకోవాలి.

ఈలాగు అబీగయీలు తన ఇబ్బందిలో, తన శ్రమలో యెహోవా దేవుని గురించి 5 మాటలు సాక్ష్యమిచ్చింది. యెహోవాను ఎంతగా ఎరిగిందో మనకర్థమవుతుంది. దీనిని బట్టి ఆమె సుబుద్ధి కలిగిన సుగుణాలరాశి మాత్రమే కాదు, అందాల రాశి మాత్రమే కాదు, కొనియాడతగిన యెహోవాయందలి భయభక్తురాలు అని కూడా పై ఐదు మాటల వలన మనము ఆమెను గూర్చి సాక్ష్యము చెప్పగలుగుచున్నాము.

ప్రియ సోదరీ ! నీవు ఎవరితోనైనను మాటలాడునపుడు నీ సంభాషణలో యెహోవాను గూర్చి ఎంతగా సాక్ష్యమిచ్చి మాట్లాడుతున్నామా ? నీ శ్రమలలో నీ శ్రమలను గురించే చెప్పుకుంటూ వున్నావా ? యెహోవాను గూర్చిగానీ, ఆయన కుమారుని గూర్చిగానీ, ఆయన ప్రేమను, ఆయన జ్ఞానాన్ని, మహిమను, ఆయన మంచితనాన్ని, ఆయన గుణగణాలను, ఆయన ప్రభావాన్ని, ఆయన త్యాగాన్ని, ఆయన సమర్పణను గూర్చి ఏమైన ప్రస్తావించుచున్నావా? అంతా నీ గొడవేనా ? నీ గోడును గురించేనా మాట్లాడుతున్నావు? యెహోవాను గురించి, నీ జ్ఞానమేమి ? యెహోవాను గూర్చి నీ అవగాహనయేమి? యెహోవాను గూర్చి నీ అనుభవమేమి ? యెహోవాను గూర్చి నీ సాక్ష్యమేమి ? యెహోవాను గూర్చి నీకేమి తెలుసు ? యెష 11:9వ.లో లోకము యెహోవాను గూర్చిన జ్ఞానముతో నిండియుండును అని వ్రాయబడింది. లోకమంటే మనమే. నీలో నాలో యెహోవాను గూర్చి ఎంత జ్ఞానముతో నిండియున్నాము ? ఫిలి 3:8 వ.లో క్రీస్తుని గురించిన అతిశ్రేష్ఠమైన జ్ఞానము నిమిత్తము

సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాను అన్నాడు. అలాగే పౌలు 2 కొరింథి 2:14వ.లో మా ద్వారా ప్రతి స్థలమందును క్రీస్తును గూర్చిన జ్ఞానము యొక్క సువాసనను కనుపరచుచు ఆయనయందు మమ్మును ఎల్లపుడు విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవునికి స్తోత్రము అని వ్రాస్తున్నట్లు మనమును క్రీస్తు జ్ఞానాన్ని గురించి తెలుసుకోవాలంటే వాక్యము చెంత అత్యధిక సమయము గడుపవలసినవారముగా వున్నాము. కనుకనే అబీగయీలు, పౌలు క్రీస్తు యేసును గూర్చిన అతిశ్రేష్ఠమైన జ్ఞానమును సంపాదించుకున్నారు. మనమందరమును అట్టి జ్ఞానమును సంపాదించుకొని ఆయనను గూర్చి సాక్ష్యమిచ్చుదుము గాక ! ఆ జ్ఞాన సంపాదన కొఱకై సమస్తమును నష్టపరచు కొరకైనా, ఇష్టపడుదుము గాక !

**4) వివేకము గల అబీగయీలు :–** ఇంతవరకు అబీగయీలును, సుబుద్ధిగలదిగా, రూపసి అనగా సుగుణాల రాశిగా, అందాలరాశిగా అంతమాత్రమే కాక, యెహోవాయందలి భయభక్తులు గలదిగా కూడా చూశాం. ఇపుడు ఆమె వివేకము గల స్త్రీగా చూడబోతున్నాం. నాబాలు తన అన్నపానములను దావీదు పనివారికి ఇవ్వడానికి ఒప్పుకొనలేదు. కాబట్టి తెల్లవారక మునుపే దావీదు మాయోనులోని నాబాలు ఇంటికి వచ్చి నాబాలు మగ సంతతిని చంపబోతున్నాడు కనుక తన పిల్లలను, భర్తను రక్షించుకోడానికి అబీగయీలు ఆకలిగొనిన దావీదు దగ్గరికి, అతని పనివారి దగ్గరికి కానుకను తీసుకెళ్ళేప్పుడు వివేకముతో నాబాలుకు ఏమియు చెప్పలేదు. ఎందుకంటే ఆయన దావీదుకు కానుక ఇవ్వనియ్యడు. ఇచ్చుటకు ఒప్పుకోడు. ఒకవేళ ఆ సంగతి అతనికి తెలిస్తే నేను వద్దని చెప్పినా, అతనికి ఇచ్చావంటే దావీదుతో నీకు వున్న కనెక్షన్ ఏంటి ? అని దావీదు, అబీగయీలు జీవితాల విషయమై అనుమానాలను కూడా వ్యక్తపరచి లేనిపోని సమస్యలు క్రియేట్ చేసే అవకాశము కూడా లేకపోలేదు. కనుక ఆమె ఆ విషయము నాబాలుకు తెలుపకయే కానుకను పంపడం అది ఆమె వివేకానికి తార్కాణం. లేకపోతే ఆమె ఒట్టి అందాన్ని మాత్రమే కలిగియుండి వివేకము లేనిదైతే సామె 11:22 వచనములో వ్రాయబడి వున్నట్లు పంది ముక్కున వున్న బంగారు కమ్మిలాంటిదిగా ఉండేది. పంది తన ముక్కు బురదలో పెట్టినపుడు, దాని అందమైన ముక్కు కమ్మి కాకుండా బురద అంటుకొని అందవిహీనంగా కనిపించినట్లు ఆమె అందవిహీనంగానే కనబడి వుండేది. కనుక వివేకము గల స్త్రీగా అబీగయీలును గమనిస్తూ వున్నాము.

అంతేకాక 36వ వచనములో ఆమె దావీదు దగ్గర నాబాలు కొఱకు క్షమాపణ అడిగి ఇంటికి వచ్చినపుడు నాబాలు రాజులు విందు చేసినట్లు చేసి త్రాగుచు, బహు సంతోషించుచు మత్తుగా వుండినపుడు ఆ త్రాగుడు మత్తులో వున్న వాడికి సువార్త మాటలు చెప్పినా, ఉపదేశపు మాటలు చెప్పినా అవి అతని మనసుకు పట్టవు, కనుక వివేకముతో ఆ సమయములో

కొద్దిగాగాని, గొప్పగాగాని, అతనిలో ఏమియు చెప్పక ఉదయ వివేకముగా ప్రవర్తించిందని మనము గ్రహిస్తున్నాము.

**5) చేయవలసిన దానిని జాగ్రత్తగా ఆలోచించిన అబీగయీలు (25:17) :-** దావీదు తన యింటివారికి కీడు చేయ నిశ్చయించాడు. నీవు చేయవలసిన దానిని జాగ్రత్తగా ఆలోచించమని పనివారు అబీగయీలుతో చెప్పినపుడు ఆమె యెహోవా దేవునితో ఆలోచించి వుంటుంది. కనుకనే దైవ ఆలోచన ప్రకారం ఆమె ప్రవర్తించింది. దేవుడు మంచి ఆలోచన ప్రకారం ఆమె ప్రవర్తించింది. దేవుడు మంచి ఆలోచన ద్వారా ఆమెను నడిపించారు. యెష 9:6 వ.లో మన దేవుని పేర్లలో ఆయన ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్తగా వున్నాడు. ఆశ్చర్యకరమైన ఆలోచనను మనకందిస్తాడు. నిజముగా, ఎంత మంచి ఆలోచనకర్తగా వున్నాడు కదా ! యెష 28:27 వ.లో "ఆశ్చర్యకరమైన ఆలోచనాశక్తి, అధిక బుద్ధియు అనుగ్రహించువాడు ఆయనే అని వ్రాయబడి వున్నది. యిర్మీ 32:19 వ.లో ఆలోచన విషయములో నీవే గొప్పవాడవు. క్రియలు జరిగించు విషయములో శక్తి సంపనున్నదవు అని వ్రాయబడి వున్నది. ఆయన ఇచ్చే ఆలోచన గొప్ప ఆలోచన. కీర్త 92:5వ.లో ఆయన ఆలోచనలు అతి గంభీరములు అని వ్రాయబడింది. ఆయన అతి గంభీరమైన ఆలోచనలిస్తాడు. కీర్తన 32:8వ.లో ఆయన మన మీద దృష్టియుంచి మనకు ఆలోచన చెబుతాడని వ్రాయబడి వున్నది. ఎవరికి కావలసిన ఆలోచనను వారి మీద ప్రత్యేక దృష్టి నిలిపి ఇస్తారట.

ఇట్టి ఆశ్చర్యకరమైన ఆలోచనను గంభీరమైన ఆలోచనను, గొప్ప ఆలోచనను దృష్టియుంచి చెప్పే ఆలోచనను దేవుడు అబీగయీలుకు యిచ్చాడు. ప్రియులారా ! పై వాక్య రెఫరెన్స్‌లు ఈనాడు మనకున్నాయి. కానీ ఆ రోజుల్లో ఈ వాక్యాలు అబీగయీలుకు లేవు. అయినా ఆత్మ ద్వారా ఇవన్నీ ఆమెకు దేవుడు తెలిపి వుంటాడు. ఆయన యొద్ద కనిపెట్టినపుడు పై వాక్యాలన్నీ దేవుని యొద్ద ఆమె నేర్చుకొని వుంటుంది. ఈలాగున అబీగయీలు తన యింటి వారి మీదికి ముంచుకొని వస్తున్న ప్రమాదం నుండి తన జ్ఞాన వివేకములతో వారిని కాపాడింది.

**6) చురుకైన అబీగయీలు :-** 1 సమూ 28:18వ.లో కానుకను సిద్ధపరచుటలో త్వరపడి అనే మాట చదువుచున్నాము. 23 వ వచనములో గార్ధభమును దిగుటలో 'త్వరగా' అనే మాటను చదువుచున్నాము. 34వ వచనంలో దావీదును ఎదుర్కొనే విషయంలో 'త్వరపడి' అనే మాటను గమనిస్తున్నాము. 42 వ.లో దావీదు సేవకుల కాళ్ళు కడుగటానికి నేను సిద్ధంగా వున్నానని చెప్పి గార్ధబమును ఎక్కేటప్పుడు 'త్వరగా' ఎక్కెను అని 4 సార్లుగా కనబడుచున్న 'త్వరగా' అనే మాటను బట్టి అబీగయీలు ఏ పని చేసినా అనగా ఎక్కుటలో, దిగుటలో కానుక సిద్ధపరచుటలో, దావీదుకు విజ్ఞాపన చేయుటలో అన్నిటిలో త్వరితముగా ముందుకెళ్తుంది. అన్నింటిలోనూ చురుకుగా వున్నట్లు మనకు తోస్తుంది.

సామె 12:27 వ.లో "చురుకుగా వుండుట గొప్ప భాగ్యమట. ఆమె భర్త ఆస్తిలో భాగ్యవంతుడే. కాని అబీగయీలులో వున్న భాగ్యము ఆత్మీయమైన చురుకుగా వుండే భాగ్యాన్ని మనము చూస్తున్నాము. మనలో చాలామందికి ఒక పనిని అర్జెంట్‌గా చేయమని అప్పగిస్తే ఆరు నెలలు సమయాన్ని తీసుకుంటామేమో ! ఇక మీ యిష్టమొచ్చినంత సమయాన్ని తీసుకోండి అంటే ఎన్ని సంవత్సరాలు తీసుకుంటామో కదా ! అలా ఎంతో సమయం తీసుకుంటున్నామంటే, మనలో శ్రద్ధ లేదేమో, సోమరితనంలో వున్నామేమో. సామె 12:24వ.లో శ్రద్ధగా పనిచేయువారు ఏలుబడి చేయుదురు. సోదరులు వెట్టి పనులు చేయవలసి వచ్చును అని వ్రాయబడింది. ఉద్యోగంలో ఇంటిలో, సేవలో ఏవైన పనులు మనము చేయవలసినపుడు చురుకుదనముతో చేయాలి. పని నానబెట్టడం, అశ్రద్ధ చేయడం, సోమరిగా వుంటూ పనిని వాయిదా వేయటం, విస్మరించటం చేస్తే రేపు వెట్టిపనులు చేయాల్సిస్తుందని వాక్యం చెబుతోంది. సామె 10:4వ. ప్రకారం "పనిలో శ్రద్ధగలవాడు ఐశ్వర్యవంతుడగును". పై వచనముల ప్రకారము చురుకుగా అబీగయీలు దావీదును పెళ్ళి చేసికొనుట ద్వారా దావీదు ఆస్తిని బట్టి భాగ్యవంతురాలయ్యింది. దావీదు రాజైనపుడు అలాగే ఐశ్వర్యవంతురాలిగా కూడా అయ్యింది.

ఈలాగున అబీగయీలు సుబుద్ధి ద్వారా ఆశీర్వదించబడింది. చురుకుగా వుండుట వలన భాగ్యవంతురాలిగాను, శ్రద్ధగా పనిచేయుట వలన రాణిగా యేలుబడి చేసేదిగాను, ఐశ్వర్యవంతురాలిగాను అయ్యింది.

**7) తన్ను తాను తగ్గించుకొని దావీదును హెచ్చించిన అబీగయీలు :-** అబీగయీలు తాను ఒక భాగ్యవంతుని, భార్యయైనప్పటికీ, దావీదు ఆ సమయంలో తిండికి కూడా నోచుకొనక, ఇబ్బందిలో వున్న ఒక దరిద్రుడుగా వున్నప్పటికీ తగ్గింపుతో 23 వచనంలో ఆయన పాదములు పట్టుకొని తగ్గింపుతో సాష్టాంగ నమస్కారము చేసి 1 సమూ 25:23-42 వరకు వున్న వచనాలలో 16 సార్లు దావీదును నాయేలినవాడా ! అని సంబోధించడం, మనం చేస్తాము. అలాగే నీ దాసురాలను అని తనను గురించి 5 సార్లు తగ్గించి చెప్పుకున్నట్లుగా చూడగలము. అబీగయీలును దావీదు ఎప్పుడు ఏలాడు ? కానీ దావీదు రాజుగా అభిషిక్తుడయ్యాడని ముందే ఆమె ఎరుగును. రాజరికము ఇంకా దావీదు దేవుడు ఇంకా ఇవ్వకపోయినా రానున్న దినములలో దేవుడు ఆయన్ను రాజుగా చేయక మునుపే దేవుని అభిషేకం దావీదు మీద వుండుట ఎరిగి ఆయన్ని నా యేలినవాడా! అని సంబోధించి హెచ్చించింది. నేడు ఒక భాగ్యవంతుని భార్యగా తాను వుంటున్నప్పటికి దావీదు రానున్న దినములలో రాజవ్వబోతున్నాడు. గనుక ఆమెను దావీదు క్రింద వున్న దాసురాలుగా చెప్పుకొని తగ్గించుకుంది.

దేవుని యెదుట పరమ ప్రభువు యెదుట 1000 యేండ్ల పరిపాలనలో రారాజుగా ఏలబోయే యేసయ్య ఎదుట నేడు సంఘానికి శిరస్సుగాను, రక్షకుడుగాను వున్న ప్రభువు యెదుట మనల్ని మనము తగ్గించుకొని ఆయన్ని మనము హెచ్చించవలసినవారముగా వున్నాము.

యాకో 4:10వ.లో వ్రాయబడి వున్నట్లు ప్రభువు దృష్టికి మనల్ని మనము తగ్గించుకోవాలి.

యోహాను ప్రభువును చూచి ఆయన హెచ్చవలసినది నేను తగ్గవలసినదని యోహా 3:30 వ.లో చెప్పాడు. ఇదిగో ఈయన లోకపాపములను మోసికొని పోవు దేవుని గొఱ్ఱెపిల్ల నా వెనుక వచ్చువాడు నాకంటే ప్రముఖుడు. ఆయన చెప్పులవారును విప్పుటకు నేను పాత్రుడను కాను. అని యోహా 1:29 వ.లో తన్ను తాను తగ్గించుకొన్నాడు. మత్తయి 18:4 వ.లో తన్ను తాను తగ్గించుకొను వాడెవడో వాడే గొప్పవాడు అన్న వాక్య ప్రకారము తన్ను తాను తగ్గించుకొన్న అబీగయీలు భవిష్యత్తులో అలాగే 25:41వ.లో దావీదును అబీగయీలును పెండ్లి చేసికొనుటకు రమ్మన్నపుడు ఆమె తన్ను తాను తగ్గించుకుని దావీదు సేవకుల కాళ్ళు కడుగుటకు సిద్ధముగా వున్నానని చెప్పటం, ప్రభువు తన శిష్యుల పాదాలను కడుగుటను చూపిస్తుంది. అబీగయీలు క్రీస్తు వలె తగ్గించుకొని రాణిగా హెచ్చింపబడింది. యేసు మనసును మనమును కనుపరచవలసినవారముగా వున్నాము.

ఫిలి 2:8వ.లో ప్రభువు "దేవునితో వుండుట విడచిపెట్టకూడని భాగ్యముగా ఎంచుకొనలేదు గాని మనుషుల పోలికగా పుట్టి దాసుని స్వరూపము దాల్చి తన్ను తానే రిక్తునిగా చేసికొని ఆకారమందు మనుషుడుగా కనబడి మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకున్నాడు. అందుచేతనే ఫిలి 2:9 వచనములో దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను.

ఈ వాక్యాలను చదువుచున్న మనమును మన ప్రభువు వలె తగ్గించుకొని ఆ తరువాత హెచ్చింపబడుదుము గాక !

**8) నాబాలును లక్ష్యపెట్టవద్దని దావీదుకు హితవు చెప్పిన అబీగయీలు :-** 1 సమూ 25:25 వ.లో "నా యేలినవాడా ! దుష్టుడైన నాబాలును లక్ష్యపెట్టవద్దు" అని అబీగయీలు నాబాలుతో చెప్పింది. దావీదు తన మామగారైన సౌలును అనేకసార్లు ఓర్చుకుంటున్నాడు. గుహలో ఒకసారి సౌలు దొరికినా ఆయన దుప్పటిని కత్తితో కోయడానికి యిష్టపడలేదు కానీ ఏనుగును చూచి కుక్క మొరిగినట్టు దావీదు యెవడు ? యెషయి కుమారుడు ఎవడు? అనిన నాబాలు మీద కోపగించుకొని ఆ మాటలను లక్ష్యపెట్టవద్దని అబీగయీలు చెబుతోంది.

మనము వేటిని మాత్రమే లక్ష్యపెట్టాలో దేవుని వాక్యములో నుండి చూద్దాము. కీర్తన 119:6 వ.లో ఆయన ఆజ్ఞల మీద లక్ష్యముంచాలట. కీర్తన 28:5 వ.లో యెహోవా హస్త కార్యములను లక్ష్యపెట్టాలట. చాలాసార్లు ఎవరైన మనల్ని మాటల ద్వారా నొప్పించిన దేవుడు వాటినే లక్ష్యపెట్ట వారు అనిన మాటలను మాటిమాటికి జ్ఞాపకం చేసికొంటూ ఏడుస్తూ వుంటాము. కానీ మనుషుల పెట్టు నిందకు భయపడకుడి. వారి దూషణ మాటలకు దిగులుపడకుడి. వస్త్రమును కొరికి వేయునట్లు చిమ్మట వారిని కొరికి వేయును. బొద్దీక గొఱ్ఱె బొచ్చును కొరికి వేయునట్లు వారిని కొరికి వేయును" అని యెష 51:7,8 వచనములలో వ్రాయబడింది. కనుక మనుషులను నిందించేవారు చిమ్మటవలె, బొద్దీక వలె కొరికివేయబడతారు. గనుక వారి మాటల మీద మనము లక్ష్యముంచకూడదని మనము నేర్చుకుంటున్నాము.

**9) త్వరపడి దావీదును ఎదుర్కొని అతడు ప్రాణహాని చేయకుండా ఆపిన అబీగయీలు:-** దావీదు సౌలును చంపకుండా చాలా ఓర్చుకుంటున్నాడు. కానీ, నాబాలు తన విషయమై అవమానంగా మాట్లాడని అతనిని మాత్రమే కాక, ఏ పాప మెరుగని అతని మగ సంతానాన్ని కూడా చంపటానికి చాలా దుడుకుగా తీర్మాణం చేసికొని వస్తున్నాడు. తెలుగులో ఒక సామెత వుంది. "బడా సాహెబ్ చేసేది పాపం కాదట. చోటా సాహెబ్ చేసేదే పాపమ"ట. అలాగు దావీదు రాజైన సౌలును (బడా సాహెబ్‌ను) ఓర్చుకుంటూ యెహోవా చేత అభిషేకించిన వానిని నేను చంపను అన్నాడు. కానీ, నాబాలులాంటి వానిని (చోటా సాహెబ్‌ను) ముందు వెనుక ఆలోచించక దేవునిచే విచారించక తొందరపాటు నిర్ణయము తీసుకొని వస్తున్నాడు. పగ తీర్చుట నా పని. నేనే పగ తీర్తునని వాక్యంలో దేవుడు చెప్పాడు. అయినా దావీదును అవమానకరంగా మాట్లాడింది నాబాలు మాత్రమే. అతనిని మాత్రమే కాక ఏ పాపమెరుగని అతని పిల్లలను కూడా నిర్దాక్షిణ్ణంగా చంపడానికి రావడం ఇది దేవుడు మెచ్చని కార్యం. 10 రోజుల తర్వాత దేవుడే నాబాలును మొత్తాడని 38వ వచనములో వ్రాయబడింది. కనుక దేవుడు చేసే పని 10 రోజుల ముందు దావీదే చేయాలనుకున్నాడు. కనుక దావీదు ఆ పొరపాటు చేయకుండా దావీదును ఆపడానికి దేవుడు అబీగయీలును పంపాడు.

ప్రియ సోదరీలారా ! మన భర్తలు, పిల్లలు ఏ పాపము చేయకుండా స్త్రీలము, భార్యలూ తల్లులమైన మనము వారి కొఱకు ప్రార్ధన చేస్తూ వారు తప్పుడు నిర్ణయాలు తీసుకొనకుండా మనము ఆపవచ్చునని అర్ధం చేసుకోవాలి.

**10) దావీదును పెళ్ళి చేసుకొనిన అబీగయీలు :-** అబీగయీలు తన త్రాగుబోతు భర్త మీద అలాగే దావీదు మీద, దావీదు పనివారి మీద, దావీదు సంతతి మీద చూపిన సుబుద్ధి వలన ఆమె ఆశీర్వాదము పొంది దావీదు భార్యయైనట్లు, సంఘమైన మనము కూడా మన ప్రభువు

యొక్క పెండ్లి భార్య అవ్వబోతున్నాము. ఆమె దావీదు నొద్దకు గార్దభము మీద ఎక్కి దావీదు నొద్దకు వచ్చినట్లు, మనమును మేఘముల మీద ఎక్కి మన ప్రభువుని మద్యాకాశములో ఎదుర్కొంటామని వాక్యము 1 థెస్స 4:16 వచనములో చెప్పబడింది. ఇలా నాబాలును పెండ్లి చేసికుననప్పటి నుండి గడచిన 10 దినముల క్రితము వరకు అతనితో అనుభవిస్తూ వచ్చిన కష్టనష్టములన్నింటినుండి అబీగయీలు విడుదల పొంది, సుబుద్ధి గలిగిన ఈమె సుబుద్ధి గలిగిన దావీదుతో వివాహము ద్వారా ఐక్యమై సంతోషకరమైన జీవితం జీవించడానికి ప్రభువు ఆమెకు కృపను చూపారు. ఆమె సంతోషం దావీదుతోనే గానీ, ఏనాడు ఆమె త్రాగుబోతు, దుష్టుడు. ఎవనిని తనతో మాటలాడనీయని, దేవుని బిడ్డలను అవమానపరచేవాడును, ఉపకారానికి అపకారము చేసిన నాబాలుతో ఎన్నడును ఆమె ఆనందించలేదు. అలాగే ప్రభువుతో వివాహము చేయబడిన సంఘమనే అబీగయీలైన మనమందఱము ప్రభువు రెండవ రాకడతో ఈ భవభాంధవ్యాలనుండి, సంకట క్లేశములన్నిటి నుండి విడుదల పొంది ప్రభువుతో యుగయుగములు సదాకాలం ఆనందంగా ఆయన నిత్యరాజ్యంలో వుంటాము. దేవునికి స్తోత్రం.

## నేరస్థాపన చేయు దక్షిణదేశపు రాణి (షేబ దేశపు రాణి) 1 రాజు 10వ అ.

షేబ దేశపు రాణిని గురించి ధ్యానించక మునుపు, షేబ దేశమును గురించియు, ఆ దేశములను గురించియు బైబిల్‌లో ఏమి వ్రాయబడియున్నదో కొంత ఆలోచిద్దాము.

**షేబ దేశము :-**

1) యెష 66:6 వ. ఇక్కడ ఇక్కడ ఏయిఫాల లేత ఒంటెలు బంగారము, ధూపద్రవ్యములు దొరుకుతాయి.

2) యెహె 27:22వ. వారిలో వర్తకు లెక్కువగా వుంటారు. బంగారు రత్నాలు గంధవర్గములు యిచ్చి సరుకులు కొంటారు.

3) అరబ్బీ దేశమందు నైరుతి దిక్కున వుండు ఒక ప్రాచీన రాజ్యము ప్రస్తుతము ఎమెన్ అని పిలువబడుచున్నది. ఈ ప్రాంతమందున్న 'హోము' సంతానమని ఆది 10:7, 1 దిన 1:9ని బట్టి తెలుస్తుంది. గానీ ఆది 10:27, 1 దిన 1:32 ను బట్టి వారు 'షేము' సంతానమని తెలుస్తుంది.

4) వీరు యోబు 1:14వ. బట్టి యితరుల ఆస్థిని దోచుకొని ఆ దోపుడు సొమ్ము పెట్టి వ్యాపారములు చేసినట్లు తెలుస్తుంది.

5) యోబు 6:20వ.లో షేబావారు అవమానం పొందినట్లున్నది. వారు కలవరపడువారని

తెలుస్తున్నది. 19వ. ప్రకారం వారు నీటి కొఱకు కనిపెట్టువారు అని తెలుస్తున్నది. నేటి లోకస్థులందరు వీరిలాగే వున్నారు. లోకస్థులలో అనేకులు అన్యాయము చేసి ధనార్జన చేస్తూ నెమ్మది చేత కలవరపడుతున్నారు. ఆధ్యాత్మికంగా దాహముతో వున్నారు.

6) యోబు 20:4. అలాటి వారికి విజయము కొద్దికాలమే. 12వ వచనములో చెడుతనము వారి నోటికి తీయగా వున్నది.

7) యోవే 3:8వ. షేబాయులు మనుషులను కొనేంతటి ధనవంతులు. వారు బానిస వర్తకం చేసేవారు.

8) యెష 45:14 వ.లో వీరు దీర్ఘదేహులని వ్రాయబడింది. అయినను సంకెళ్ళతో కట్టబడి నీతిమంతుడైన కోరెషు నొద్దకు వచ్చి నిశ్చయముగా నీ మధ్య దేవుడున్నాడు, మరి ఏ దేవుడును లేడని చెబుతారని వ్రాయబడి వున్నది. ఆయన తప్ప వేరొక దేవుడు లేడని చెప్పుచు కోరెషుతో విజ్ఞాపన చేయువారివలె కనబడుచున్నారు.

9) ఈ దేశస్థులు ఎంత స్థితిగలవారైనను చివరకు ఇశ్రాయేలీయులకు లోబడి తమ ధనమును యెహోవాకు అర్పింతురు అను భావమిచ్చు ప్రవచనములున్నాయి. యెష 60:3,6, కీర్తన 72:16.

వీరు ఈలాగు యెహోవా యొద్దకు యెహోవా ప్రజల యొద్దకు వస్తారు అన్న ప్రవచనాల ప్రకారమే షేబ దేశపు రాణి జీవితములో నెరవేరింది. ఆమె ఎంతటి రాణియైనను కలవరం, విస్మయం, శోధించే గుణం ఆమెలో వున్నాయి. ఆమె యెహోవాను గూర్చియు, ఆయనను నమ్మిన సొలొమోనును గూర్చియు వినింది. విని సొలొమోను నొద్దకు సంకెళ్ళు వేసికొని వచ్చిన షెబాయీయుల వలె వచ్చింది. దర్శించింది, మాట్లాడింది. తన యొక్క ప్రశ్నల పరంపరలకు జవాబులు పొందింది. యెహోవాను నమ్ముకుంది. షెబాయీయులు తన ధనాన్ని యెహోవాకు సమర్పించినట్లుగా సొలొమోనుకు ఈమె కానుకలను సమర్పించింది. ముందుగా యెహోవాకు తన హృదయాన్ని కానుకగా యిచ్చింది.

ఇక్కడి నుండి అంశాలవారిగా షేబ దేశపు రాణి గూర్చి ఆత్మీయ పాఠాలు నేర్చుకుందాం.

**1) 1 రాజు 10:1 : యెహోవా నామమును గూర్చి వినిన షేబరాణి :–** ఆమె రాణి. ఉన్నత పదవిని అలంకరించింది. సింహాసనము మీద వున్న ఆమెకు యెహోవా నామమును గూర్చి వినబడింది. దానికి కారణం, యెహోవా నామమును గురించి ఎవరి ద్వారాగానైన చాటించబడి వుండాలి. అవును, చాటింపు ప్రకటింపు లేకపోతే వినుట ఏలాగు జరుగుతుంది? రోమా 14:10వ. ప్రకారము "ప్రకటించువారు లేకుండా వారు ఏలాగు విందురు ?" అన్న మాటను బట్టి యెహోవాను గూర్చి ప్రకటించి వుండాలి. అలాగైతే ఎవరు ప్రకటించి వుంటారు?

ఆ కాలంలో సొలొమోను రాజే ప్రకటించి వుంటాడు. అలాగైతే చిన్న వయసులోనే రాజ్యానికి వచ్చి రాజ్యాన్ని పాలిస్తూ మరోవైపు యెహోవా నామాన్ని సొలొమోను రాజు ప్రకటిస్తూ వుండగా ఈ విషయం భూమ్యాంతాలలో వున్న షేబ దేశపు రాణికి వినబడింది. ఈ దినాల్లో మనము ఎవరికి యెహోవాను గురించి ప్రకటిస్తున్నాం? ఎవరికి వినబడుతోంది? ఈ విషయం మనకు పాఠమే కదా ! రోమా 10:17వ.లో కాగా వినుట వలన విశ్వాసం కలుగుతుంది. వినుట క్రీస్తును గురించిన మాట వలన కలుగును అని వ్రాయబడింది. కనుక ఈ దినాల్లో మనము కూడా యేసుప్రభువు పుట్టుక, మరణం, పునరుత్థానమును గురించిన సువార్త ప్రకటించవలసిన వారముగా వున్నాము. అప్పుడు రోమా 10:18 ప్రకారము వారి స్వరము భూలోకమంతటికి, వారి మాటలు భూదిగంతముల వరకు బయలువెళ్ళెను అని వ్రాయబడినట్లు ఆనాడు సొలొమోను ప్రకటన భూమ్యాంతముల వరకు వెళ్ళగా షేబదేశపు రాణి వాటిని విని ఆ సంగతులు నిజమేనని తెలిసికొని యెహోవాను నమ్ముకున్నది. ఆమె ఒక అన్యురాలుగా వుండి ప్రభువుని నమ్మింది. కానీ రోమా 10:19,20 వచనము చదివితే ఇశ్రాయేలీయులు ఏమి చేశారో తెలుస్తుంది. "నన్ను వెదకని వారికి నేను దొరికితిని. నన్ను విచారింపని వారికి ప్రత్యక్షమైతిని అని అంటూ ఇశ్రాయేలీయుల విషయమై యెదురాడు ప్రజలకు నేను దినమంతయు నా చేతులు చాచితిని అని అన్నాడు. ప్రియ సోదరీ ! పుట్టుక క్రైస్తవురాలని చెప్పుకునే నీవు ప్రభువుని నీ స్వంత రక్షకునిగా నమ్ముకున్నావా ? కానీ అన్యురాలైన షేబరాణి ఒక్కసారి వినగానే విధేయత చూపి యెహోవాను నమ్ముకుంది. కనుక సొలొమోను ప్రకటించుట వలననే షేబరాణి వినగలిగి ప్రభువును నమ్మి ప్రభువుకు చూపింది. 1 కొరి 9:16 ప్రకారము సువార్తను ప్రకటించవలసిన భారము నా మీద మోపబడినది. అయ్యో ! సువార్త ప్రకటించకపోయిన యెడల నాకు శ్రమ అని పౌలు భక్తుడు అంటున్నాడు. రోమా 1:16వ.లో నేను సువార్తను బట్టి సిగ్గుపడువాడను కాను అన్నాడు. ఏలయనగా నమ్మువారికి రక్షణ కలుగుటకై అది దేవుని శక్తియై యున్నది. కనుక దేవుడు తన శక్తి ద్వారా సువార్తను విన్నవారిని రక్షించుకుంటాడు కానీ మనము సువార్త ప్రకటిస్తున్నామా ? దినము ఆయన సువార్తను మనము ప్రకటిస్తూ వుండవలసిన వారముగా వున్నామా ?

ప్రియులారా ! యెహోవాకు ఒకటేంటి అనేక నామములున్నాయి. దేవుని నామాలలో కొన్ని ఇక్కడ వ్రాయబడుతున్నాయి.

1) అబ్రహాముకు సర్వశక్తిగల దేవుడుగా (All mighty God) ప్రత్యక్షమయ్యాడు (ఆది 7:1). ఈ లోకపు శక్తులన్నిటికంటే అత్యధిక శక్తి గలవాడు మన దేవుడు.

2) ఉన్నవాడను, అనువాడను (I am that I am) మోషేతో దేవుడు చెప్పిన పేరు యిది. (నిర్గ 3:13,14)

3) సర్వోన్నతుడు దేవుడు :- (ఆది 14:18,20,22) మెల్కీసెదెకు ఆరాధించిన దేవుని పేరు యిదే. (EL. Elyon)

4) నిత్యదేవుడు (Everlasting God) :- (ఆది 21:33) మనలో ఎవరము నిత్యకాలము జీవించము. ఆయన ఒక్కడే నిత్యుడు.

5) మహిమగల దేవుడు (God of Glory) అపో.కా. 7:2. అది 1 పేతురులో వ్రాయబడినట్లు మహా దివ్య మహిమ గలవాడు.

6) జీవము గల దేవుడు (The living God) (యెహో 3:13)

7) సర్వలోకనాథుడు (Lord of all the earth) యెహో 3:11

8) దహించు అగ్నియు రోషము గల దేవుడు :- (ద్వితి 4:24)

9) కనికరము గల దేవుడు (ద్వితి 4:31)

10) నమ్మదగిన దేవుడు (ద్వితి 7:9)

11) భయంకరుడైన మహాదేవుడు :- (ద్వితి 7:2)

12) పరాక్రమవంతుడు (ద్వితి 10:17)

13) నమ్ముకొనదగిన దేవుడు :- (ద్వితి 32:4)

14) శాశ్వితుడైన దేవుడు :- (ద్వితి 33:27)

15) బలమైన దుర్గము వంటి నామము (సామె 18:10)

16) యేసు నామము (అపో.కా. 4:12)

17) సైన్యములకు అధిపతియగు యెహోవా (యెష 54:5)

ఈలాగున యెహోవా యొక్క నామములలో కొన్నిటిని మాత్రమే మనము చూచాము. కానీ ఈ యెహోవా నామము ఎటువంటిదో కొంత వాక్యములో గమనిద్దాము.

**1) ఘనమైన నామము :-** అంతేకాక మలా 1:11వ.లో తూర్పు దిశ మొదలుకొని, పడమటి దిశ వరకు అన్యజనులలో నా నామము ఘనముగా ఎంచబడునని వ్రాయబడింది. సకల స్థలములలో ధూపమును, పవిత్రమైన అర్పణమును అర్పింపబడును అని వ్రాయబడియున్నది.

**2) ఆయన నామము మహిమగల నామము :-** యెష 42:8 వ. బట్టి ఆయన తన మహిమను మరి ఎవనికిని యిచ్చువాడను కాను అన్నాడు. ఆయనకు రావలసిన స్తోత్రమును విగ్రహములకు చెందనియ్యను అన్నాడు (I will not share my glory with others) కానీ పరలోకానికి వెళ్ళిన తరువాత మన దీన శరీరములను తన మహిమగల శరీరమునకు సమరూపముగా చేస్తాడు.

**3) కీర్త 111:9వ. ప్రకారము ఆయన నామము పరిశుద్ధమైనది, పూజింపతగినది :–** పూజ అంటే ఆయనను ఎలా పూజించాలి ? నిర్గ 15:11వ. బట్టి స్తుతి కీర్తనలు పాడితే ఆయనను పూజంచినట్లే.

**4) ఆయన నామము బలమైన దుర్గము వంటిది :– (సామె 18:10)**

నీతిమంతుడు అందులోనికి వెళ్ళి సురక్షితముగా వుండే నామము.

**5) ఆయన నామము పాపములను క్షమించే నామము :– 1 యోహాను 2:12 వ.**

**6) ఆయన నామము రక్షించే నామము :– అపో. 4:12** ఆకాశము క్రింద యే నామమునను మనకు రక్షణ లేదు. ఈ నామముననే మనము రక్షణ పొందవలసియున్నాము. మన పాపములను బట్టి శిక్షగా వచ్చే నిత్యనరకము నుండి, ఈ లోకము నుండి, సాతాను నుండి, శరీరమునుండి ఆయన రక్షించువాడైయున్నాడు. రక్తము చిందించలేనిది పాప క్షమాపణ లేదు. కనుక రక్తము చిందించి రక్షించిన నామము కలవాడై యున్నాడు.

**7) ఆయన నామమున మొఱ్ఱపెట్టగా వారి మొఱ్ఱను ఆలకించువాడు. జెకర్యా 13:9:–** నా నామమున మీరు తండ్రిని ఏమడిగినను ఆయన మీకు అనుగ్రహించునని దేవుడు వ్రాయించాడు.

**8) యేసునామము అన్ని నామములకంటే పై నామము :–** ఫిలి 2:9–10. పరలోకమందున్న వారిలోగాని, భూమిమీద వున్నవారిలోగాని, భూమి క్రింద వున్నవారిలోగానీ, ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లు దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి అన్ని నామములకంటె పై నామమును ఆయనకు అనుగ్రహించెను. ఎఫె 1:20 ప్రకారము ఆయన బలాతిశయము చేత క్రీస్తును మృతులలో నుండి లేపి, సమస్తమైన ఆధిపత్యముకంటెను, అధికారముకంటెను, శక్తికంటెను, ప్రభుత్వము కంటెను, ఎంతో హెచ్చుగా, పరలోకమందు ఆయనను తన కుడి పార్శ్వమున కూర్చుండ బెట్టుకొనియున్నాడు.

కనుక యెహోవా దేవుడు. ఆయన నామము చిన్నది కాదు, ఆయన చిన్నవాడు కాదు. ఆయన క్షుద్రదేవుడు కాదు. ఆయన గొప్ప దేవుడు.

ఈలాగున యెహోవా దేవునికి అనేక నామములున్నాయి. కానీ, యిన్ని నామములను గూర్చి షేబ రాణి వినలేదు. 'యెహోవా' అనే నామాన్ని గురించి మాత్రమే వినింది. 1 రాజు 10:8 బట్టి సొలొమోను ఎల్లప్పుడు తన సేవకులకు దేవుని జ్ఞానవాక్కులు వినిపించేవాడు. కనుక యీలాగున సొలొమోను దేవుని విషయాలు ప్రకటన చేస్తువుండగా అవి భూదిగంతముల వరకు వ్యాపించి ఫలించాయి.

**2) 1 రాజు 10:2. సొలొమోను కీర్తిని గురించి వినిన షేబ రాణి :-** షేబ రాణి ముందుగా యెహోవా దేవుని నామము యొక్క కీర్తిని, గొప్పతనాన్ని గూర్చి వినింది. ఆ తరువాతనే సొలొమోను కీర్తిని గురించి వినింది. లోకము వినాల్సింది ముందు మన గొప్పతనాలు కాదు. దేవుని గొప్పతనం, ఆయన గుణాతిశయములు, ఆయన కృపాకార్యములు, ఆయన కీర్తి ముందు వినబడాలి. ఆ తరువాతనే మన విషయాలు బయటికి రావాలి. అయినా మనదంటూ గొప్పతనం ఏదీ లేదు. ఒకవేళ వుందంటే అది ప్రభువిచ్చినదే.

యెష 1:2 వ.లో వ్రాయబడినట్లు ఇశ్రాయేలీయులైన తన పిల్లలను పెంచి గొప్పవారినిగా చేసినట్లు మనల్ని కూడా దేవుడు గొప్పవారినిగానే చేశాడు. ఈ లోకరీతిని గొప్ప వంశపువారు కాకపోయినా, ఆత్మీయంగా గొప్పతనాలతో మనల్ని దేవుడు నింపాడు. 1 కొరిం 1:26, సామె 8:18 ఐశ్వర్యము, ధన, ఘనతలు స్థిరమైన కలిమియు ఆయన వద్ద వున్నాయి. సొలొమోను వీటి కొఱకు అడగకపోయినా ఇవన్నిటినీ దేవుడు అతనికి అనుగ్రహించాడు. అందువలన సొలొమోను ఆ దినాల్లో గొప్ప కీర్తికలవాడిగా పిలువబడ్డాడు. ఆనాడు సొలొమోనును దేవుడు శారీరకంగా గొప్పగా చేశాడు. ఈనాడు దేవుడు మనలను క్రీస్తునందు శారీరక ఆత్మీయ విషయాల్లో కూడా మనల్ని భాగ్యవంతులుగా చేశాడు.

సొలొమోనును యేసుక్రీస్తుకు మనము సాదృశ్యముగా తీసికోవచ్చు. మత్తయి 12:42 ప్రకారం సొలొమోను కంటే గొప్పవాడిక్కడ వున్నాడని యేసుక్రీస్తు విషయము వ్రాయబడింది.

**3) గూడార్థమైన మాటలతో సొలొమోను శోధించుటకై వచ్చిన షేబరాణి (1 రాజు 10:1)** షేబరాణి యెహోవాను గూర్చియు ఆయన భక్తుడైన సొలొమోనును గూర్చియు వినింది కానీ, వినబడ్డ సంగతులు నిజమో కాదోనను సందేహముతో ఆయనను శోధించడానికై వచ్చింది. గూఢార్థమైన మాటలతో పెద్ద జ్ఞానియైన సొలొమోనును శోధించడానికి వచ్చిందంటే ఆమె కూడా జ్ఞానియై వుండాలి. గూఢార్థాలు ఎన్నో ఆమెకు తెలుసు. అవి సొలొమోను రాజుకు తెలియునో లేదో అని శోధించడానికి వచ్చింది. ఆయన జ్ఞానాన్ని గూర్చిన సరియైన అవగాహన ఆమెకు లేకపోయింది. మనము కూడా మన ప్రభువైన యేసునొద్దకు వస్తున్నాము. అనేక ప్రశ్నలతో, అనుమానాలతో ఆయనను శోధిస్తూనే ఉన్నాము. దేవుడు యిది చేస్తాడో చేయడో, నా కోరిక తీర్చునో లేదో, నేనడిగినవి యిస్తాడో యివ్వడో అన్న అనేక అనుమానాలు ప్రభువుపై మనకున్నట్లు మన అవిశ్వాసం వ్యక్తం చేస్తాము. ఆయనను మనమెన్నడు శోధించకూడదు. యేసుప్రభువును మొట్టమొదట శోధించినవాడు సాతానుడే. సాతానుతో "నీ ప్రభువైన దేవుని శోధింపవలదని" యేసుప్రభువు చెప్పాడు (లూకా 4:12వ). సాతానుతో చెప్పిన మాటనే ప్రభువు ఈ రోజు మనతో కూడా చెబుతున్నారు. ఆయనను శోధించడానికి మనము ఆయన యొద్దకు రాకూడదు. షేబరాణి తాను సొలొమోను వద్దకు వచ్చిన

ఉద్దేశము ఏదైనను అక్కడి సంగతులు చూచిన తరువాత ఆమె మనసు మారిపోయింది. శోధించడం మానివేసి ఇక పరిశోధించడం మొదలు పెట్టింది. యేసుక్రీస్తును కొన్నిసార్లు సద్దూకయ్యులు, పరిసయ్యులలాంటి వారు శోధిస్తూ కొన్ని ప్రశ్నలు అడిగారు. ఉదా:- మత్త 16:1వ. లో వీరందరు ఒకసారి యేసుప్రభువును ఆకాశము నుండి ఒక సూచక క్రియను అడుగుచున్నారని, అయితే యోనాను గూర్చిన సూచక క్రియయేగాని, మరి ఏ సూచక క్రియయు వారికి అనుగ్రహింపబడదని యేసుప్రభువు చెప్పారు. అలాగైతే శోధించువారికి యేసుప్రభువు "వ్యభిచారులైన చెడ్డతరము వారు" అని తెలుస్తుంది. షేబరాణి శోధించింది కనుక ఆ సంగతులను నమ్మకముందు చెడ్డదిగా వుందని దీనిని బట్టి మనకర్థమవుతుంది. సొలొమోను వద్దకు వచ్చేటపుడు చెడ్డదిగానే వచ్చింది. తిరిగి వెళ్ళేప్పుడు మంచిదిగా వెళ్ళింది.

అలా వెళ్ళిన షేబరాణి ఇదే చెడ్డ తరానికి విమర్శ కాలంలో విమర్శ చేస్తుందని ప్రభువు మత్త 12:4వ.లో చెప్పారు. శాస్త్రులు, పరిసయ్యులు యేసుప్రభువును శోధింపగోరారే గాని, పరిశోధింప కోరలేదు. ఆయన క్రియలను గూర్చి అనేకంగా వినియు, చూచియు, వారాయనను విశ్వసింపలేదు. శోధించడమే వారి పని అన్నట్లుంది వారి సంగతి. ఈనాడు కూడా అనేకమంది విమర్శించడానికే, తీర్పు తీర్చడానికే, శోధించడానికే సంఘాలకు వస్తూ వుంటారు. వారు వచ్చుట యేసుప్రభువును నమ్మడానికి కాదు. యేసుప్రభువు నమ్మిన భక్తులను విమర్శించడానికే సంఘానికి వస్తుంటారు. అట్టివారు శాస్త్రులు. పరిసయ్యుల వలె రక్షణలేని వారుగానే వుండి వ్యభిచారులని, చెడ్డతరమువారని పిలువబడుతారు. యేసుప్రభువును గాని, యేసుప్రభువు భక్తులను గాని విమర్శించుటకు మనమెంతటివారము ? ఈనాడు మనము వారిని గూర్చి విమర్శిస్తే, విమర్శ దినమందు మనము వారిని గూర్చి విమర్శిస్తే, విమర్శ దినమందు మనము మరి ఎక్కువగా విమర్శలపాలవుతాం.

**4) యెరూషలేముకు వచ్చిన షేబరాణి (1 రాజు) :-** షేబరాణి దక్షిణ దేశపురాణి అని యింతకు మునుపే చూశాం. భూమ్యంతముల నుండి సొలొమోను జ్ఞానాన్ని గూర్చి వినుటకై యెహె 38:12వ. బట్టి భూమి నట్టనడుమన వున్న యెరూషలేమునకు విచ్చేసింది. భూమి కొట్టకొనన వున్న దేశస్థురాలు భూమి నట్టనడుమన వున్న యెరూషలేముకు రావాలంటే చిన్న విషయము కాదు. ఎంతో పెద్ద దూరము ప్రయాణము చేయాలి. ఆ దినాల్లో వాహనాల వసతులు లేవు. ఒంటెల మీద ప్రయాణము చేసింది. ఇదేమంత సులువు కాదు. ఆమెకున్న ఆశను బట్టి ఆమెకు ఈ దూర ప్రయాణము కష్టముగా అనిపించలేదు. ఇక్కడ యెరూషలేము స్థానిక సంఘానికి గుర్తుగా వుంది. సొలొమోను జ్ఞానాన్ని తెలిసికొనుటకు షేబరాణి వచ్చినట్లు మనము కూడా దైవజ్ఞానము కొఱకు సంఘానికి రావాలి. యెరూషలేముకు రావాలన్న ఆశ ఆమెకు మార్గాన్ని సుగమం చేసింది. ఈనాడు స్థానిక సంఘాలు మనకు ఏమంత దూరంగా

లేవు. అందుకున్నట్లు సమీపంగానే వున్నాయి. అయినా చాలామంది సంఘానికి వెళ్ళడము లేదు. సమయం లేదని సామాన్య సాకును చెబుతున్నారు.

షేబరాణికి టైమ్ వుండే వెళ్ళిందా ? మనందరికంటే ఎక్కువ పని ఆమెకుండింది. రాణి కాబట్టి ఆమెకు ఎన్నో రాజకార్యాలుంటాయి. భర్త, పిల్లలు వారికి సంబంధించిన పనులు ఎన్నో వుంటాయి. వాటన్నిటిని విడచిపెట్టి వచ్చింది. అది వ్యాపార దేశం. ఎన్నో ఇతర దేశాలతో వ్యాపార సంబంధమైన సంప్రదింపులు, ఎగుమతులు, దిగుమతులులాంటి పనులెన్నో వుండి వుంటాయి. ఆ ప్రయాణం కూడా ఎన్నో రోజులు పట్టి వుంటుంది. తిరిగి వచ్చుటకు ఎన్నో రోజులు పడుతుంది. ఇన్ని దినములు రాజ్యంలో రాణి లేకపోతే మరో రాజ్యం ఈమె రాజ్యం మీదికి దండెత్తే ప్రమాదముంది. అయినా, యివన్నీ సాకులుగా తీసికొని షేబరాణి తన ప్రయాణాన్ని ఆపుచేసుకోలేదు. ఎంతో కొండంత ఆశతో యెరూషలేమును చేరుకుంది. పైగా ఎడారి ప్రయాణం. ఇసుక తుఫానులు, గాలులు ఇవన్నీ ఆమెకు పట్టలేదు. ఇన్ని రోజులు ఎండల్లో, ఎడారుల్లో ప్రయాణిస్తూ వుండగా తన సౌకుమార్య జీవితానికి ఎంతో అసౌకర్యం కలిగి వుంటుంది. పైగా మార్గమధ్యమున దొంగలవలన ఆపద కలుగుతుందేమో నన్న భయాలు కూడా ఆమెను ఆపలేకపోయాయి.

ప్రియులారా ! షేబరాణి యెరూషలేము ప్రయాణము మన హృదయాన్ని కదిలించుట లేదా ? ఆమెకున్న పనులకంటే మనకున్న పనులే ఎక్కువా ? సోదరీ ! నీకు ఒకరిద్దరు పిల్లలుంటేనే ఇల్లు వదలలేకపోతున్నావు. ఆమెకు సమస్త రాజ్యభారము వుంది. తలకు మించిన పనులు ఎన్నో వున్నాయి. అయినా యెరూషలేము చేరింది. ఎన్నో మేలులు పొందింది. సంఘాన్ని మానిన నీవును సంఘానికి తిరిగి వస్తే మంచిది. ఆయన రాకడ మరీ సమీపంగా వున్నది. కనుక మరి ఎక్కువగా సంఘములో కూడుకోవాలి అని హెబ్రీ 10:24వ.లోని వాక్యం చెబుతుంది. చదివి హెచ్చరిక పొందండి.

**5) 1 రాజు 10:2 గొప్ప పరివారముతో, గంధవర్గాలను, రత్నాలను, ఒంటెల మీద ఎక్కించుకొని యెరూషలేముకు వచ్చిన షేబరాణి :-** గొప్ప కానుకతో రాణి సొలొమోనును దర్శించింది. ఈ సందర్భములో యరోబాము భార్య రాణి షిలోహులోని ప్రవక్తయైన అహీయాకు తెచ్చిన వేషధారణ కానుకను, అబీగయీలు అరణ్యములోని దావీదుకు తెచ్చిన ధారాళమైన కానుకను, మీకా 6:6-8 వరకు వ్రాయబడిన యెహోవాకు యివ్వవలసిన కానుకను జ్ఞాపకమునకు తెచ్చుకుందాము. దేవుని సన్నిధిలో వట్టి చేతులతో కనబడకూడదు అనే ద్వితి 16:17లోని వాక్యాన్ని గూర్చి కూడా గుర్తు చేసుకుందాం. ఆమె గొప్ప పరివారముతో సొలొమోను దగ్గరికి వచ్చింది. మరి నీవు నీతోపాటు ఎంతమందిని దేవుని సన్నిధికి తీసుకువెళ్తున్నావు ? కనీసము నీ కుటుంబీకులను, స్నేహితులను, యిరుగు పొరుగువారిని ఎవరినైనా తీసికొని

వస్తున్నావా ? ఎంతమందికి ఫోన్స్ చేసి దేవుని మందిరానికి, కూడికలకు ఆహ్వానిస్తున్నావు? జెక 8:23వ. అన్యజనులలో పదేసి మంది ఒక యూదుని చెంగు పట్టుకుని "దేవుడు మీకు తోడైయున్నాడు. కనుక మేము మీతో కూడా వత్తుము" అనే దినాలు మన మధ్య మనము చూడాలి. ప్రియ సోదరీ ! నీ జీవితములో ఇన్ని యేండ్లలో ఎన్ని ఆత్మలను నీ స్థానిక సంఘానికి నడిపించగలిగావు?

**6) 1 రాజు 1:2 సొలొమోను దర్శనము చేసిన షేబదేశపు రాణి :-** షేబ దేశపు రాణి ఎట్టకేలకు యెరూషలేము వచ్చేసింది. అక్కడ సొలొమోను దర్శనము చేసింది. ఆనాడు ఆమె సొలొమోనును దర్శిస్తే నేడు మనము దేవుని సన్నిధిలో "సొలొమోను కంటే గొప్పవాడైన మన పరమ ప్రభువుని వాక్యము ద్వారా దర్శనము చేసుకుంటున్నామా?

ప్రియ సోదరీలారా ! కీర్తన 4వ. ప్రకారము "నీవు నరపుత్రులను దర్శించుటకు వాడు ఏపాటివాడు" అని వ్రాయబడింది ? మనము ఏపాటివారము. నాసికా రంధ్రములలో వూపిరి గలవారము, గడ్డిపోచలాంటివారము. త్రాసుమీద ధూళిలాంటివారము. చేదనుండి కారు నీటి బిందువులలాంటివారము. అట్టి మానవులను దేవుడు దర్శిస్తూ వున్నాడు. అబ్రహామును, శారాను, దానియేలును, యోసేపును ఇలాంటివారిని తన ప్రత్యక్షతల ద్వారా, కలల ద్వారా, దర్శనముల ద్వారా దర్శించాడు. అయితే మనము కూడా దేవుని దర్శింపతగదా ? దావీదు కీర్తన 17:15లో "నేను నీతిగలవాడనై ఆయన ముఖదర్శనము చేసికొందునన్నాడు. నేను మేలుకొనునపుడు ఆయన స్వరూప దర్శనముతో నా ఆశను తీర్చుకొందును అన్నాడు. ఆలాగు ఆయన ఈ దినాలలో తన వాక్యము ద్వారా దర్శించినపుడు మన ఆశలు, మన కోరికలు తీర్చుకుంటాము.

షేబ దేశపు రాణి యెరూషలేముకు వెళ్ళినపుడు అక్కడ శాస్త్రులు, పరిసయ్యులు, సద్దూకయులు, యాజకులు అక్కడి స్త్రీలు వారి లైఫ్‌స్టైల్, వారి జీవన విధానము ఇలాంటివి దర్శించాలని కోరలేదు. కానీ ఆమె గురి అంతయూ సొలొమోనును దర్శించాలనే... అనుకుంది. కొద్దిమంది చర్చిలో బంధువులను, స్నేహితులను చూట్టానికి చాలా లేట్‌గా వస్తారు. ఒక అబ్బాయి చర్చికి వెళ్తే తన గర్ల్‌ఫ్రెండ్‌ను కలసి మాట్లాడి ఆమెకు ఒక ఉత్తరం వ్రాసి ఇవ్వాలనుకుని ఉత్తరాన్ని వ్రాసి, తన నోట్‌బుక్‌లో పెట్టుకొని వచ్చాడు. ఆ అబ్బాయి ప్రక్కనే కూర్చుని వున్న ఒక సహోదరుడు వూరకనే ఆ పుస్తకాన్ని అనాలోచనగానే తెరచి చూడగా అందులో ఇలా వ్రాసి వున్న పేపర్ ఆ సోదరునికి కనిపించింది. "నీవుండేది ఆ స్కూలులో, నా రాణి నేనుండేది మరో స్కూలులో మనమిద్దరం కలుసుకునేది ఈ చర్చిలోనే అని వ్రాసిన పేపరు ఆ నోట్‌బుక్‌లో వుంది. ఈలాగున రకరకములైన వ్యక్తులు, రకరకాలైన కారణాలతో చర్చికి వస్తున్నారు. పరమ సొలొమోనును దర్శించడానికి కాదు. ప్రియ సోదరీ ! మరి చర్చికి నీవెందుకు వస్తున్నావు. ప్రభువును దర్శించుకోవాలి అని మాత్రమే వస్తున్నావా ? లేదా ఎవరినో కలసి మాట్లాడటానికి వస్తున్నావా ?

పాత నిబంధన భక్తులు అప్పుడప్పుడు చాలా అరుదుగా దేవుని దర్శనాలను అగ్నిజ్వాలలో, వెలుగులో, మహిమలో, సర్వము వినుటలో, కలలలో, కొంతమట్టుకు చూచి, ఆయన వాక్కులను విన్నారు. కానీ, ఈనాటి క్రొత్త నిబంధన క్రింద వున్న ఆయన భక్తులైన మనము వీటన్నిటిలో వేటిద్వారానూ కాదుగాని, వీటన్నిటికంటే స్థిరమైన వాక్యము ద్వారా అనగా ప్రవచన వాక్యము ద్వారా ప్రభువును దర్శించుకొంటున్నాము. యెరూషలేముకు అనగా స్థానిక సంఘానికి వస్తేనే మనకు ఇంట్లో స్వంతగా బైబిల్ చదువుకున్నా అర్థంకాని వాక్యాన్ని సంఘములో వాక్య సేవకుల ద్వారా మనము నేర్చుకుంటాము.

ఆదియందు వున్న దేవుడు కృపాసత్య సంపూర్ణుడుగా మొదటి శతాబ్దములో వున్న దేవుడు ఇప్పుడు వాక్యము ద్వారా మనకు ప్రత్యక్షమగుచున్నాడు. ఈ వాక్యములోని క్రీస్తును అర్థము చేసుకోవడానికి సహాయము చేయుచున్నవాడు పరిశుద్ధాత్మ దేవుడు. పాత నిబంధన భక్తులు చూచినవ దర్శనములు 2 పేతు 1:19వ. ప్రకారము అవి స్థిరమైనవి కావని, ఈనాడు మనము చూస్తున్న వాక్య దర్శనములు స్థిరమైనవని తెలుసుకుంటున్నాము. ఆనాడు వారు ఆదర్శనాలను కొద్ది సమయములో మాత్రమే చూడగలిగారు. కానీ, ఈనాడు మనమైతే వాక్యములో యేసుక్రీస్తును నిత్యము దర్శించవచ్చు. కాబట్టి మన వాక్యదర్శనములే స్థిరమైనవని తెలుసుకుంటున్నాము. షేబరాణి తన జీవితమంతటిలో ఒక్కసారే సొలొమోనును దర్శించ గలిగింది. మరి నీ జీవితంలో నీవు ఎప్పుడు యేసుప్రభువును దర్శించాలి అనుకుంటే అప్పుడే నీవు దర్శింపగలవు. మనకు ఈనాడు వున్న ఏర్పాటు ఎంత గొప్పదో కదా ! నీవు బైబిల్ చదువుటయే ఆలస్యం. ఎచ్చట తెరచినను బైబిల్లో యేసుప్రభువు దర్శనం మనకు కలుగుతుంది. బైబిల్ అంతటికీ యేసే కేంద్రమైయున్నాడు. బైబిల్లోని వాక్యమే దేవుడు. దేవుడే వాక్యము. ఆనాడు బైబిల్ నీ యింట్లో ఉందంటే దేవుడు నీ యింటిలో వున్నట్లే. అలాగైతే ఆయన మన యింట్లో ప్రభువు వుంటే ఆత్మీయంగా, శారీరకంగా మనకే కొదువ వుండదు.

**8) తనకు తోచిన దానంతటిని బట్టి సొలొమోనుతో మాటలాడిన షేబరాణి :–** షేబ దేశపు రాణి తాను ఆలోచించి తనకు తోచిన అంతట ప్రకారము సొలొమోనుతో ప్రశ్నించి మాట్లాడింది. మనమును మన ప్రశ్నలను దేవునితో అడుగవచ్చు. ప్రసంగి 5:2 వ. ప్రకారము మనము అనాలోచనతో కాక ఆలోచించి, హోషేయ 14:2 వ.లో వున్నట్లు మాటలు స్థిరపరచుకొని అంటే ప్రార్థన సిద్ధము చేసికొని కీర్తన 5:3 వ.లో వ్రాసినట్లు ఉదయమున నా ప్రార్థన నీ ప్రార్థన, నీ సన్నిధిని సిద్ధముచేసి కాచియుందును అన్నట్లు మనమందరము సిద్ధపరచుకొని దేవుని ప్రార్థించాలి. షేబరాణి సొలొమోనుతో మాటలాడగా అనగా ప్రార్థించగా అని అర్థము. పరమ 2:14 వచనములో “నీ స్వరము మధురము, నీ ముఖము మనోహరము.

కనుక నీ స్వరము నాకు వినబడనిమ్ము, నీ ముఖము నాకు కనబడనిమ్ము అని సంఘ వధువును కోరుతున్నాడు. ప్రార్థన ఇక్కడ వ్యక్తిగత ప్రార్థనలో మన స్వరాన్ని ప్రభువుకు వినిపించాలి. పరమ 8:13 వ.లో ఉద్యానవనములలో పెంచబడినదానా ! నీ చెలికత్తెలు నీ స్వరము వినగోరుదురు. నన్నును దానిని విననిమ్ము అని ప్రియుడు అంటున్నాడంటే. ఈ ప్రార్థన సంఘములో చెలికత్తెలు మన ప్రార్థన వింటూ వుండగా ప్రభువు సంఘములో కూడా మన ప్రార్థన వినగోరుచున్నాడు. అలాగైతే సంఘ ప్రార్థనలు ప్రభువు వినగోరుచుండగా సోదరీ ! నీవు సంఘానికి వచ్చి ప్రార్థిస్తూ వున్నావా? సంఘమనే ఉద్యోగ వనములో పెంచబడి పెరిగి పెద్దయైనవారముగా ఎదిగియున్నవారమైతే నీ ఎదుగుదలను సూచించే రీతిగా నీవు ప్రార్థించే అనుభవాన్ని కలిగి వుంటున్నావా ? నీ అభివృద్ధి అందరికీ (నీ చెలికత్తెలందరికీ) తేటగా కనబడనిమ్మని 1 తిమో 4:15లో పౌలు భక్తుడు తిమోతిని అదే కోరుచున్నాడు. మన ప్రార్థన ఎదుగుదల ఇతరులకు, ప్రభువుకు కూడా కనబడాలి. అప్పుడు నీవు ఇతరులకు మాదిరిగా జీవించగలవు. మనము సంఘములో అందరిలో మాటలాడుతాము కానీ, ప్రార్థనలో ప్రభువుతో మాత్రము మాట్లాడము. అలా ప్రభువుతో మాట్లాడక, ఎవరేమనుకుంటారేమో అని సిగ్గుపడుతూ, భయపడుతూ నోర్లు మూసికొని ఆ కొద్ది గంటలు మూగవారివలె ప్రవర్తిస్తూ వుంటాము. ఇకనుండైనా ఈ మాటలతో హెచ్చరించబడి సంఘప్రార్థనలలో ప్రభువుతో మాట్లాడుదాం. ప్రార్థన అనేది సంఘానికి శక్తిని, కాపుదలను యిస్తుంది.

**8) 1 రాజు 10:3 వ. తాను వేసిన ప్రశ్నలన్నిటికి మరుగైనదేదియు లేని ప్రత్యుత్తరము పొందిన షేబరాణి :–** గూడార్థములతో ప్రశ్నలు వేసిన షేబరాణి తోచిన దానినంతటిని బట్టి సొలొమోనుతో మాటలాడిన షేబరాణి ఆ ప్రశ్నలలో కొన్నింటికి మాత్రమే కాక అన్నింటికి ప్రత్యుత్తరము పొందింది. 1 దిన 9:2 వ.లో సొలొమోను ఆమె ప్రశ్నలన్నింటికి ఆమెకు విడదీసి చెప్పెను. సొలొమోను ఆమెకు ప్రత్యుత్తరము చెప్పలేని మరుగైన మాట ఏదియు లేకపోయెను. అలాగుననే మన ప్రభువునూ అంతే. మన ప్రభువునూ అంతే. మన ప్రశ్నలన్నింటికీ అసలు జవాబు ఆయనే. ప్రతి సమస్య పరిష్కారము ఆయనే. ఆయనే మరుగు మాటను బయలుపరచు యెహోవాకు మరుగైనదేదైన కలదా ? కొలొ 1:25 వ.లో యుగములలోను, తరములలోను మర్మముగా వున్న దేవుని వాక్యాన్ని ఎఫె 18 వ. ప్రకారము తన దయాపూర్వక చిత్త సంకల్పము చొప్పున తన చిత్తమును గూర్చిన మర్మము మనకు ఆయన తెలియజేశారు. పూర్వపు ప్రవక్తలు ఆ మర్మాలను గురించి వ్రాశారే కానీ, ఆ మర్మాలను దేవుడు అప్పటిలో వారికి బయలుపరచలేదు. మనకైతే ఇప్పుడు తన ఆత్మ ద్వారా, వాక్యము ద్వారా బయలుపరచుచున్నాడు. దాని 2:22వ.లో యెహోవా మరుగు మాటలను, మర్మములను బయలుపరచును అని దానియేలు చెబుతున్నాడు.

అలాగైతే సోదరీల్లారా ! ఈ క్రొత్త నిబంధన కాలములో దేవుడు మనకు ఏఏ మర్మాలు బయలుపరచాడో చూద్దామా ? ఎఫె 3:3 వ.లో **క్రీస్తు మర్మము** దేవదర్శనము వలన నాకు తెలియపరచబడినదని పౌలు తెలియజేస్తున్నాడు. ఎఫె 3:6 వ. ఈ క్రీస్తు మర్మమేదనగా 'అన్యజనులు' సువార్త వలన క్రీస్తుయేసునందు యూదులతో పాటు సమాన వారసులును, ఒక్క శరీరమందు సాటి అవయవములునై వాగ్దానముతో పాలివారునై యున్నారనునదియే. ప్రియులారా ! అన్యజనులమైన మనము ప్రభువును విశ్వసించినపుడు యూదులతో అన్ని విషయములలో సమానులగు చేయబడినందు ప్రభువుకు మనమెంతగానో స్తుతి చెల్లించబద్దులమయ్యాము. ఈ మర్మము పాత నిబంధన భక్తులకు మరుగుగానే వుంది. కానీ, ప్రియ సోదరీ ! నీవు ఈ మర్మమును ఇప్పుడైనా గ్రహించావా?

మత్త 18:10,11 వ.లలో **పరలోక రాజ్య మర్మములు** ఎరుగుట మీకు అనుగ్రహించబడి యున్నది అని శిష్యులతో ప్రభువు చెబుతున్నాడు. మత్త 13 అధ్యాయములో 24 వ.లోను, 31 వ.లోను, 43 వ.లోను, 44 వ.లోను, 45 వ.లోను, 47 వ.లోను 6 సార్లు పరలోక రాజ్యమును గూర్చి దేవుడు వ్రాయించాడు. 24 వ.లో పరలోక రాజ్యము పొలములో వుంచి విత్తమును విత్తిన యొక మనుష్యుని పోలియునదనియు, 31 వ.లో ఒకడు పొలములో విత్తిన ఆవగింజయు పోలియున్నదనియు, 45 వ.లో మంచి ముత్యము కొన వెదకుచున్న వర్తకుని పోలియున్నదనియు, 43 వ.లో పరలోక రాజ్యము సముద్రముతో వేయబడిన నానా విధములైన చేపలను పట్టిన వలను పోలియున్నదనియు, ఈలాగు పరలోక రాజ్య మర్మములను గూర్చిన మర్మములను గూర్చి ప్రభువు సంఘమునకు మరుగులేక వాటిని బయలుపరచినందుకై దేవుని స్తోత్రించబద్దులమై యున్నాము.

ఎఫె 5:31 వ.లో ఈ హేతువు చేత పురుషుడు తన తల్లిని తండ్రిని విడిచి తన భార్యను హత్తుకొనుడు. వారిద్దరు ఏకశరీరమగుదురు. ఈ మర్మము గొప్పది" అని ప్రభువు వ్రాయించారు. పెండ్లియైన అనేక **భార్యభర్తలు ఈ గొప్ప మర్మాన్ని** ఎరుగక భర్త భార్యను, భార్య భర్తను ఒకరికొకరు హత్తుకొనకుండా విడిపోవడానికి ప్రయత్నిస్తున్నారు. పెండ్లయిన భర్త తల్లిదండ్రులను విడుచుట లేదు. అలాగే భార్య తనకు పెండ్లియైనప్పటికీ తల్లిగారింట్లోనేవ వుండాలనుకుంటుంది. ఈ ఇద్దరూ భార్యభర్తలు హత్తుకొని ఏకశరీరులుగా వుండుట గొప్ప మర్మము. ఇది చిన్నది కాదు.

రోమా 11:20 వ.లో అన్యజనుల మర్మము సంపూర్ణమగు వరకు **ఇశ్రాయేలునకు** కఠిన మనస్సు కొంతమట్టుకు కలిగెను. ఈ **మర్మము** మీరు తెలిసికొనగోరుచున్నాను అన్నాడు. 2020 సం॥ వరకు రక్షించబడుటకు దేవుడు అన్యజనులకు సమయమిచ్చాడు. అది ఆయన రాకడ వరకు కొనసాగుతూ వుంటుంది. ఈ కాలము ఇశ్రాయేలీయులకు కొంతమట్టుకు

కఠిన మనస్సు యిచ్చాడట. సంఘము ఎత్తబడిన తరువాత శ్రమల కాలములో ఇశ్రాయేలీయులు ప్రభువును కఠిన మనస్సు లేకుండా నమ్ముకుంటారు.

2 కొరిం 15:51 వ.లో ప్రభువు ఇదిగో మీకొక మర్మము తెలుపుచున్నానని తన **రెండవ రాకడ మర్మము** తెలుపుచున్నాడు. ఈలాగున కీర్త 25:14 వ.లో వ్రాయబడినట్లు యెహోవా మర్మము ఆయనయందు భయభక్తులు కలవారికి తెలిసేయున్నది" అని వ్రాయబడింది. ఈలాగున ప్రభువు క్రొత్త నిబంధన క్రింద వున్న ఆయన సంఘానికి ఈలాటి మర్మాలు తెలిసియున్నాడు. ఈ రీతిగా ప్రభువు మనకు మర్మముగా ఏమియు లేకుండా బయలుపరచి ప్రత్యుత్తరమిచ్చే దేవుడుగా వున్నాడు.

**8) సొలొమోను దగ్గర 8 విషయాలపై విస్మయము నొందిన షేబరాణి :-**

**ఎ) సొలొమోను జ్ఞానమును గూర్చిన విస్మయము :-** 1 రాజు 3:11వ.లో సొలొమోను జ్ఞానము కొరకు ప్రార్థించగా దేవుడతనికి దైవజ్ఞానమును యిచ్చాడు. ఇది గ్రహించిన ఇశ్రాయేలీయులందరు ఆయనకు భయపడ్డారని వ్రాయబడింది. 1 రాజు 4:29 వ.లో దేవుడు ఆయనకు వర్ణింపశక్యముగా వివేకముగల మనస్సును సొలొమోనుకు దయచేశాడు. తూర్పుదేశపు జ్ఞానులాయెను. ఐగుప్తీయుల జ్ఞానము కంటెను, సమస్తమైన వారికంటెను, ఎజ్రాహీయుడైన ఏతాను కంటెను, మహోలు కుమారులైన, హేమానుకల్కోలు, దర్ద అనువారికంటెను, జ్ఞానవంతుడై యుండెను. అతడు 3 వేల సామెతలు, వెయ్యి అయిదు కీర్తనలు రచించెను. మరియు లెబానోనులో వుండు దేవదారు వృక్షమునేగాని, గోడలోనుండి మొలుచు హిస్సోపు మొక్కనే గాని చెట్లన్నిటిని గూర్చి అతడు వ్రాశాడు. మరియు మృగములు, పక్షులు, ప్రాకు జంతువులు, జలచరములు అనువాటిని గూర్చి అతడు వ్రాశాడు. అతని జ్ఞానపు మాటలు తెలిసికొనుటకు, అతని జ్ఞానమును గూర్చి వినిన భూపతులందరిలో నుండియు, జనులందరిలో నుండియు మనుష్యుల సొలొమోను నొద్దకు వచ్చేవారు. సొలొమోను యొక్క ఈ జ్ఞానము చూచి షేబదేశపు రాణి విస్మయమొందినట్లు మనము చదువుచున్నాము.

ప్రియులారా ! సొలొమోను జ్ఞానమే ఇంత విస్మయము కలిగిస్తే ఇక సొలొమోను జ్ఞానమిచ్చిన పరమ సొలొమోను జ్ఞానము ఇంకెంత మనల్ని ఆశ్చర్యపరుస్తుందేమో కదా! ఆయన జ్ఞానమునకు మితిలేదు (కీర్తన 147:5). జ్ఞానము వలన ఆయన భూమిని స్థాపించెను (కీర్తన 147:5). ఆయన జ్ఞానమును శోధించుట అసాధ్యము అని యెష 40:28 వ.లో వ్రాయబడింది. షేబ సొలొమోను జ్ఞానమును శోధించుటకు షేబ దేశపు రాణి సొలొమోను నొద్దకు వెళ్ళింది. కానీ ప్రభువు జ్ఞానాన్ని శోధించుట అసాధ్యము. దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము (రోమా 11:32). జ్ఞాన శౌర్యములు ఆయన యొద్దకే వున్నవి (యోబు 12:12). అంతరింద్రియములలో జ్ఞానముంచినవాడు ఆయనే (యోబు 38:36).

ఆయన ధర్మశాస్త్రము జ్ఞాన సత్యస్వరూపమైన ధర్మశాస్త్రము. రోమా 2:19. ఆయన ఆత్మ "జ్ఞాన వివేకములకు ఆధారమగు ఆత్మ" (యెష 11:2).

1 రాజు 10:7 వ.లో షేబరాణి "నీ జ్ఞానము నేను వినిన దానిని మించియున్నది అని అనింది. నిన్ను చూడక మునుపు నేను నమ్మియుంటిని. ఇపుడు కన్నులారా చూచి నమ్ముచున్నాను. ఉన్న దానిలో సగమైనను నాతో చెప్పబడలేదు. మనము కూడా పరలోక తీరానికి వెళ్ళినపుడు, దేవుని గుణగణాలన్నీ మనము కన్నులారా చూచి ఉన్నవాటిలో, నీవు కలిగిన వాటిలో ఒక బిందువంతైనా మాకు చెప్పబడలేదు. మేము వినియుండలేదని మనమునూ... ఆశ్చర్యచకితులౌతామేమో. ప్రియులారా ! దేవుని వెఱ్ఱితనము మన జ్ఞానము కంటే గొప్పదట. (1 కొరిం 1:25). కనుక ప్రభువు యొక్క జ్ఞానాన్ని పరలోకంలోకి వెళ్ళిన తరువాత చూచి నిజంగా మనం ఆశ్చర్యపడతాం.

**బి) సొలొమోను కట్టించిన మందిరమును గూర్చిన విస్మయము:- 1 రాజు 10:4** సొలొమోను ఇశ్రాయేలు దేశమును ఏలిన 4వ సం॥ 'జీవ్' అను రెండవ మాసమున యెహోవా మందిరము కట్టనారంభించి 7వ సం॥లో ముగించాడు. ఈ మందిరమే షేబ రాణికి విస్మయము కలిగించింది. రాణియైన ఆమె అనేక దేశాలలో దేవాలయాలు దర్శించి వుంటుంది. కానీ అవేవియు ఆమెకు విస్మయాన్ని కలిగించలేకపోయాయి. సొలొమోను దేవుని మచ్చు ప్రకారము అనగా ప్లాన్ ప్రకారము కట్టాడు గనుకనే ఆ మందిరము ఆమెకు విస్మయము కలిగించింది. ఈ మందిరము యొక్క శిల్పియు, నిర్మాణకుడు యెహోవా దేవుడే.

ప్రియులారా ! మన హృదయమే ఆయన కోరిన దేవాలయము. మీ దేహములు దేవుని వలన మీకనుగ్రహించబడి మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయములై యున్నవని మీరెరుగరా అని ప్రభువు 1 కొరిం 6:19వ. వ్రాయించారు కదా. ఈ హృదయ మందిరము దినదినము యితరులకు విస్మయము పుట్టించే రీతిగా కట్టబడాలి.

మరొక రీతిగా సంఘమే ఆయన కట్టించిన ఆత్మీయ మందిరము. ఇది సజీవరాళ్ళతో కట్టబడిన మందిరము. యేసుక్రీస్తు వాక్యము చేతనే అది కట్టబడాలి. ఆ మందిరాన్ని కట్టమన్నాడని మనము మన యిష్టప్రకారము కట్టుటకాదు. ఆయన చిత్తము చొప్పుననే కట్టాలి. ప్రతివాడు దానిమీద ఏలాగు కట్టుచున్నాడో జాగ్రత్తగా చూచుకొనుడి. ఈ ఆత్మ మందిర పునాది యేసుక్రీస్తే. ఈ పునాది మీద మనము బంగారము, వెండి వెలగల రాళ్ళవంటి వాటితో కట్టాలి. కఱ్ఱ, గడ్డి, కొయ్యకాలుతో పనిచేస్తే అది కాలిపోతుంది. అగ్నికి, బంగారం, వెండి వెలగల రాళ్ళు నిలిచి అనేకులకు విస్మయాన్ని కలిగించే విధంగా ఆ కట్టడం వుంటుంది. 1 కొరిం 3:12-13 వ. అలా ఆత్మీయంగా కట్టబడిన మన హృదయ సంఘ మందిరాలు యితరులకు విస్మయాన్ని కలిగించాలి.

**సి) సొలొమోను బల్ల మీద వుంచబడిన భోజన ద్రవ్యములను గూర్చిన విస్మయము:- 1 రాజు 10:5వ.** సొలొమోను ఆమెను భోజనమునకు ఆహ్వానించినపుడు ఆయన భోజనపు బల్ల మీది భోజన ద్రవ్యములు షేబరాణికి విస్మయాన్ని కలిగించాయి. అలాగే తనను నమ్మిన ప్రతి విశ్వాసికి ప్రభువు తన బల్ల మీద విస్మయాన్ని కలిగించే ఆత్మీయ భోజన ద్రవ్యాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ప్రభువు మనకిచ్చే బల్ల అనుభవాన్ని 4 రకాలుగా మనము ఆలోచించవచ్చు.

**1) ప్రభువు తన సంఘ కన్యకకు ఇచ్చే భోజన ద్రవ్యాలు చూద్దాం.** సొలొమోను బల్లమీద 1 రాజు 4:22,23 వ.లో 9 రకములైన భోజన పదార్థములు ఉంచబడ్డాయి. యేసుప్రభువు మనకిచ్చిన బైబిల్ అనే బల్ల మీద 66 రకములైన భోజన ద్రవ్యములున్నాయి. భోజన ద్రవ్యములు బల్లమీద ఉంటేనే చాలదు. వాటిని భుజించడం చాలా అవసరం. ప్రతిరోజు దైవ వాక్యాన్ని ధ్యానపూర్వకంగా చదవాలి. భక్తుడైన దావీదు “దివారాత్రులు దానిని ధ్యానించువాడు ధన్యుడు” అన్నాడు.

**2) యేసుప్రభువుతో వ్యక్తిగత వాక్య భోజనపు బల్ల :- ప్రక 3:20.** మనము ఆయనను నమ్మిన వెంటనే ఆయన మనల్ని వ్యక్తిగతంగా వాక్యపు బల్ల యొద్దకు మనల్ని నడిపించువాడై వున్నాడు. కీర్తన 23వ అధ్యాయములో ఆయన మనకు కాపరియై ఆత్మీయ పచ్చిక చోట్లకు, శాంతికరమైన ఆత్మీయ జలముల యొద్దకు మనల్ని నడిపించువాడై యున్నాడు. ఒక రీతిగా చూస్తే బైబిలే మనకు వాక్యపు భోజన బల్లగా ఉన్నది. (ఇందులో 66 రకములైన భోజన ద్రవ్యాలున్నాయని ముందే తెలుసుకున్నాము.) వీటిని పరిశీలించి, ధ్యానించి, జీర్ణించుకోవాలి. ఇందులో ఒక్కొక్క వాక్యాన్ని ధ్యానిస్తే ఎంతో మధురంగా వుంటుంది. తేనె కంటెను, జుంటి తేనెధారల కంటెను అది మధురమైనది. దేవుని వాక్యము క్రొవ్వు మెదడుల కంటే రుచికరమైనది. ఇశ్రాయేలీయులు ప్రతిరోజు మన్నాను ఏరుకొనినట్లుగా మనమునూ వాక్యాన్ని తరచి, తరచి, ధ్యానించుకోవాలి. ఏరుకోవాలి, కూర్చుకోవాలి. మధురమైన దేవుని వాక్యం, మన జీవితాల్ని మధురం చేస్తుంది.

**3) ఆరాధన బల్ల :-** తనను నమ్మిన ప్రతి విశ్వాసిని ప్రభువు, తన ఆరాదన బల్ల యొద్దకు, తన రక్తమాంసములను సూచించే బల్ల మీద ద్రవ్యముల యొద్దకు మనల్ని నడిపించుచున్నాడు. “ఇది మీ కొఱకు విరువబడనైయున్నదని” తన శరీరాన్ని గూర్చియు “దీనిలోనిది త్రాగుడి” అని తన రక్తమును గూర్చియు చెప్పాడు. విశ్వాసికి ఆ రెండు భోజన ద్రవ్యములకంటే విలువైనవి లేవు. ఈ విలువైన బల్లమీది ద్రవ్యములు మన అనుభవించుటకు వాటిలో మనము పాలుపొందుతూ ఆయన పొందిన శ్రమలను మనము ధ్యానించి, ఆయనను జ్ఞాపకము చేసికొనుటకు ప్రభువు మనకు ఈ ఆరాధన బల్లను యిచ్చియున్నారు.

**4) గొఱ్ఱెపిల్ల వివాహ మహోత్సవ సమయాన భోజనపు బల్ల :–** ఇది పరలోకంలో గొఱ్ఱెపిల్ల వివాహ మహోత్సవ సమయములో మనము అనుభవింపబోయే బల్ల. ఆ భోజనపు బల్ల మీద ద్రాక్షారసము క్రొత్తదిగా త్రాగబోవుచున్నాము. ఆయన మనల్ని భోజనపు పంక్తిలో కూర్చుండబెట్టి నడుముకు తువాలు కట్టి తానే మనకు ఉపచారము చేస్తాడు. ఆ పరమ సొలొమోను వివాహ మహోత్సవ బల్ల ఇంకెన్ని ఆహార పదార్థములలో వుంటుందో అది మనం వర్ణింపజాలము.

ప్రియ సోదరీలారా ! ఈ భూలోకంలో ఇంకనూ వున్నాము గనుక బైబిల్ అనే ఈ బల్ల మనకు సహవాసాన్ని కూడా ఇస్తుంది. ప్రక 3:22లో ఎవరైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల అతనితో నేనును, అతడు నాతోను కలసి భోజనము చేయుదుము అని వ్రాయబడి వుంది. ప్రార్థించినపుడు బైబిలు చదువునపుడు మనము ఆయనతో గడిపే సమయమే భోజనపు బల్ల అనుభవంగా మనము గ్రహిస్తున్నాము. మరి ప్రియ సోదరీ ! ఆయన స్వరాన్ని వినడానికి నీ స్వరాన్ని ఆయనకు వినిపించడానికి ఆయనకు నీ హృదయమనే తలుపును తెరిచావా ? అప్పుడే నీవు మొదటి బల్ల అనుభవాన్ని పొందగలవు. మొదటి బల్ల అనుభవాన్ని పొందినవారే మిగతా 3 భోజనపు బల్లల అనుభవాన్ని పొందగలరు. ఈ లోకస్థులతో కలసి భోజనము చేయుటకంటే, ప్రభువుతో కలసి మహా ఘనుడు, మహోన్నతుడైన ప్రభువుతో కలసి భోజనం చేయుట మరెంత ఘనతయో ఆలోచించు. యేసుకు నీ హృదయ ద్వారము నేడే తెరువు. ఇటువంటి అనుభవాన్ని కలిగియున్న జీవితాల్ని చూచే ఇతరులు విస్మయమొందుతున్నారా ? ప్రియులారా, మన వాక్య పరిచర్య చూచి, విని ఇతరులు ఆశ్చర్యచకితులగుచున్నారా ?

**4) సొలొమోను సేవకులు కూర్చుండు పీఠములను గురించి విస్మయము పొందిన షేబరాణి (1 రాజు 10:5 వ.)** ఈ మాటను బట్టి సొలొమోను రాజుకు సేవకులున్నట్లు, వారికి పీఠములున్నట్లు మనకు తెలుస్తుంది. అలాగే మనమును రారాజైన యేసుప్రభువు సేవకులమైతే ఆయన కూడా మనకు పీఠములను యిచ్చువాడైయున్నాడు. అలాగైతే ఆయన సేవకులుగా మనము వుంటున్నామా ? కేవలము రక్షించబడుట మాత్రమేకాక ఆయనను సేవించే సేవకులుగా వుండాలి. హన్నా దేవుని సేవకురాలుగా ఆమె చేసిన ప్రార్థనను బట్టి మనము అర్థము చేసికొనగలము. యోబు నా సేవకుడు అని ప్రభువే చెప్పాడు. దావీదు తన తల్లి దేవుని సేవకురాలని దావీదే చెప్పాడు. ఈలాగున తనను సేవించువారికే దేవుడు పీఠములనిస్తాడు. పీఠములు వారి వారి స్థానములను సూచిస్తాయి. ఎవరి స్థానం వారిదే. అలాగైతే సంఘములో మన స్థానమేంటో మనము గుర్తెరగాలి. 1 కొరిం 12:28–29 వరకు వున్నట్లు కొందరిని దేవుడు అపోస్తలుల స్థానములోను కొందరిని ప్రభుత్వములు చేయువారిగాను, అటు పిమ్మట దేవుడు కొందరిని బోధకులుగాను, కొందరిని ప్రవక్తలుగాను,

కొందరిని స్వస్థపరచు కృపావరములు గలవారిగాను, కొందరిని నానావిధ భాషలు మాటలాడువారుగాను ఆయా స్థానాల్లో ప్రభువు వుంచుచున్నారు. దేవుడు మనకిచ్చిన స్థానమే మన పీఠము. మన స్థానములలో వుంటూనే ఆయన పిలిచిన పిలుపు ప్రకారం మనము సేవ చేయాలి. దేవుడు మనకిచ్చిన స్థానమును కోల్పోకూడదు. సాతాను దేవుని యొద్ద ప్రధాన దేవదూతగా వుండి, తనకివ్వబడిన స్థానంతో తృప్తిపడక దేవునికంటె ఎత్తైన స్థానం కోరుకున్నాడు. అధోపాతాళానికి త్రోయబడ్డాడు. యూదా యిస్కరియోతు కూడా తనకివ్వబడిన స్థానాన్ని అనగా క్రీస్తు పునరుత్థానాన్ని గురించి ప్రవచించు ఆ స్థానాన్ని పోగొట్టుకొనగా (అపో.కా. 1:25). అతడు పోగొట్టుకొన్న పరిచర్యలో పాలుపొందుటకు మత్తీయ చేర్చబడినట్లు మనకు తెలుస్తుంది. మనకివ్వబడిన తలాంతును, వరమును పెట్టుబడిలో పెట్టి సేవ చేయకుండా వుంటే మన తలాంతులను, వరమును తీసివేసి లేక మన స్థానాన్ని తీసివేసి నమ్మకమైనవారికి దేవుడు వాటిని అప్పగిస్తాడేమో. కనుక మన పీఠాలను కాపాడుకొనవలసిన బాధ్యత మనమీద వున్నది. మన కిరీటమును ఎవడును అపహరించబడకుండ చూచుకోవాలి.

సొలొమోను తన సేవకులకిచ్చిన పీఠములు షేబరాణికి విస్మయాన్ని కలిగించాయి. సొలొమోను తన సేవకుల పీఠములకంటే పరమ సొలొమోనైన ప్రభువు మనకిచ్చిన పీఠములు, స్థానములు మరెక్కువ ఆశ్చర్యాన్ని కలిగించేవిగా వున్నాయా ? సొలొమోను తన సేవకులకు తయారు చేయించిన పీఠముల కొఱకు అతడు వాడిన కలపగానీ, ఆయన వాటిని తయారు చేయించిన తయారీ, వాటి నిర్మాణము, అవి అమర్చబడిన తీరు, వారు వాటి మీద కూర్చున్న క్రమము, వారి వరుసలు ఇవన్నీ ఆమెకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఆత్మీయముగా మన స్థానాల్లో మనముంటూ చేస్తున్న సేవలు ఇతరులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నవో లేవో మనమందఱము పరీక్ష చేసుకోవాలి. దేవుని కార్యాలు ఆశ్చర్యకరములు. ఆయన పేరే ఆశ్చర్యకరుడు. ఆ ఆశ్చర్యకరుని పిల్లలమైన మనమును ఆశ్చర్యాన్ని కలిగించేవారుగా ఉండాలి.

అలాగైతే ప్రియ సోదరీ ! సంఘములో నీ స్థానమేమిటి, నీ పాత్ర యేమిటి ? నీ బాధ్యత యేంటి ? స్త్రీల మధ్యలో మిర్యామువలె పాటల పరిచర్యలో వుంటున్నావా ? దెబోరా ప్రవక్తవలె వాక్యోపదేశాన్ని చేయుచున్నావా ? ఫీబేవలే సంఘ పరిచారికులుగా వుండవచ్చు. భార్యగా భర్తకు లోబడియుండి సాటియైన సహాయముగా వుంటూ, భర్తను సంతోషపరుస్తూ, తల్లిగా పిల్లలను దైవక్రమములో పెంచుచూ, జ్ఞానవంతురాలుగా తన యింటిని కట్టుచూ వుండవచ్చు. దేవుని సేవకులను సారెపతు విధవరాలివలె పోషించువారుగా వుండవచ్చు. ఎస్తేరు వలె బంధు జనాంగాన్ని, రాహాబువలె యింటివారిని, గుణవతియైన భార్యగా అనేకులకు మాదిరిగా మనము మన బాధ్యతలు నిర్వహించవచ్చు.

మనము రక్షించబడక మునుపు లోతైన లోతుల్లో, జిగటగల దొంగ ఊబులలో దిగబడిపోయి, ఏ స్థానము, స్థితి, గతి లేకవుంటిమి కానీ ఇప్పుడైతే క్రీస్తు అనే బండమీద నిలబడ్డాము. ఆయన సేవ చేయుచుండగా పీఠములు కూడా ప్రభువు మనకు భూలోకంలో ఇవ్వకున్నా పరలోకంలో యిస్తారు. ఈ లోకంలో మన స్థానంలో, మన పరిధిలో వుండి సేవ చేస్తే మన పీఠాలను పరలోకంలో మనం సంతరించుకోవచ్చు. సేవకులకే పీఠాలు. కొందఱు సేవ చేయకున్నప్పటికీ పీఠాలు కోరుతున్నారు. మంత్రిపీఠం వేరు. సైన్యాధిపతి పీఠం వేరు. రాజు పీఠం వేరు. దాసుని పీఠం వేరు. ఈ పీఠాలు వారి వారి స్థానాలను తెలియజేస్తాయి. కొద్దిమందికి ఈ బాధ్యతలు, వాటివలన వచ్చే బాధలు అక్కరలేదు. కానీ అగ్ర ఆసనాలు మాత్రం కావాలి. రాజకీయ రంగంలో ఈవేళ ఏమి జరుగుతుందో, ఈ రోజుల్లో సంఘాలలో కూడా అంతే జరుగుతోంది. మేము ఎల్డర్స్ అని, మేము డీకన్స్ అని, మేము ఫలాని బైబిల్ స్త్రీలమని. మేము ఫలాన బిషప్స్‌మని, పెద్ద పెద్ద బిరుదులు కలిగియుండి ఆడంబరాలతో మంచి మంచి జీతాలతో, మంచి మంచి వసతులతో ఎంజాయ్ చేస్తూ వున్నారు. కానీ వారిలో కొంతమంది ఆత్మీయముగా ఏ పనియు చేయలేక పోతున్నారు. కానీ పెత్తనం మాత్రం చేస్తూ వుంటారు. ఇంకా విందులలో, వివాహాల్లో అగ్రస్థానాలు, సన్మానాలు ఆశిస్తూ వుంటారు. సేవకులు అంటే సేవ చేయువారు మినిస్టర్స్ అని ఇంగ్లీషులో భావం. దేవుని ఎదుట తగ్గించుకొని దేవుని ప్రజలకు సేవ చేయవలసినవారు యితరులతో సేవ చేయించుకోవడం జరుగుతోంది. కాని ప్రభువు నడుముకు తువాలు కట్టుకొని శిష్యుల పాదములు కడుగడమనేది ఆయన మనకు చూపించిన మాదిరిగా వున్నది. నేను పరిచారము చేయించుకొనుటకు రాలేదు కాని, అనేకులకు ప్రతిగా నా ప్రాణమును క్రయధనముగా సమర్పించుటకును వచ్చానని ప్రభువు చెప్పారు. ప్రియ సోదరీ ! ఈ మనస్సు నీకున్నదా ? తన పిల్లలకు సేవ చేయాలన్నదే ఆయన మనసులోని అభీష్టం. మనము మన స్వంత కార్యాలే చూస్తున్నాము. కానీ ఇతరుల కార్యాలను చూచుట లేదు. కానీ, సంఘాల్లో పెత్తనము చేయుటవే మన పని అనుకుంటున్నామేమో. పెత్తనం చేయటానికి అలవాటు పడినవారు, పని చేయలేరు. అలాగున పనిచేయనివారు పీఠాలు పొందలేరు కదా ! సొలొమోను సేవకులు పనిచేయువారు కనుకనే వారు పీఠములు పొందగలిగారు. వాటిపైన ఆసీనులయ్యారు. వారి పని వారి ఆధిక్యత వారి పీఠాలను గమనించటం ద్వారా మనకు తెలుస్తుంది.

అలాగైతే యేసుప్రభువును నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ పని వున్నది. అలాగున పనిచేసిన వారికి అనగా సేవచేసిన వారికందరికీ పీఠాలు కూడా వున్నాయి. వాటిని గూర్చి 1 కొరిం 12:28-29 వరకు చదువవచ్చు.

**5) సొలొమోను ఉపచారులు కనిపెట్టుటను గూర్చిన విస్మయము (1 రాజు 10:5).** సొలొమోను ఉపచారులు ఎప్పుడెప్పుడు ఉపచారము చేద్దామా అని కనిపెట్టుకొని వున్నారని,

సిద్ధముగా వున్నారని మనకు తెలుస్తున్నది. పని చేయాల్సి వస్తుందని పని తప్పించుకునే పని దొంగలైన అపచారులు కాదు. రాజు సేవలో అలాగే నిలిచిపోదామనుకునే ఉపచారులు. అలాగే మనమును దేవుని పని ఎప్పుడెప్పుడు చేద్దామా అనే మనసు కలిగి వుండాలి. మత్త 20:28 వ.లో అనేకులకు తన ప్రాణాన్ని క్రయధనముగా యిచ్చు పరిచర్యను చేయుటకు ప్రభువు ఈ లోకానికి వచ్చి ఆయన చనిపోయి తిరిగిలేచి మనల్ని రక్షించాడు.

ఉపచర్య చేయనివారు ఎవరైనా వారు అపచారము చేసినవారే. మేలు చేయుట నీ చేతనైనపుడు ఆ మేలు చేయకపోతే అది అపచారమే. చాలామంది పనిని కనిపెట్టువారుగా వుండరు. కానీ పనిని చెడగొట్టువారుగా వుంటారు. అలాగైతే క్రీస్తుయేసు ఉపచారులలో స్త్రీలు ఎలాగు వుండాలో దైవగ్రంథము ఎలా వుండాలని చెబుతుందో చూద్దాం. 1 తిమో 3:8-13వ.లో పరిచారకులు మాన్యులై వుండాలి. ద్విమనస్కులను, మిగుల మద్యపానాసక్తులును, దుర్లభాపేక్ష కలిగినవారునై యుండక విశ్వాస మర్మమును, పవిత్రమైన మనస్సాక్షితో గైకొనువారునై యుండవలెను. వారు మొదట పరీక్షించబడాలి. ఈనాడు వారు పరీక్షించబడకుండానే ఓట్ల చేత 'డీకన్స్' పరిచారకులు అని పిలువబడుచున్నారు. ఎవరెక్కువ ఓట్లు సంపాదించుకుంటారో వారై 'డీకన్స్' అవుతున్నారు. వారు అనింద్యులుగా నిందలేనివారు వుండాలని వాక్యము చెబుతుంది. స్త్రీలైతే మాన్యులై కొండెములు చెప్పనివారును (సామి 11:13) మితానుభవము గలవారును అన్ని విషయములలో నమ్మకమైన వారునై యుండాలని (ప్రక 2:10, సామె 28:20)లో వ్రాయబడింది. పరిచారకులు ఏకపత్నీ పురుషులుగా వుంటూ, తమ పిల్లలను, తమ యింటివారిని బాగుగా ఏలువారునై యుండాలని వాక్యం చెబుతుంది. ఆ పనిని బాగుగా నెరవేర్చితే మంచి పదవిని సంపాదించుకొని క్రీస్తుయేసునందు విశ్వాసమును బహు ధైర్యముగా వుంటారని 1 తిమోతి 3:8-13వ.లో చదువగలము.

**పరిచర్య చేసిన బైబిలు స్త్రీలు కొందరు :-** 1) బీదలకు వస్త్రాలు కుట్టి పరిచర్య చేసిన తబిత 2) యేసుప్రభువుకు, శిష్యులకు పరిచర్య చేసిన పేతురు అత్త 3) ఏలియాకు కరువులో పరిచర్య చేసిన సారెపతు విధవరాలు 4) పౌలు, సీలకు పరిచర్య చేసిన యువొదియ 5) సుంటుకే 6) కెంక్రేయ సంఘ పరిచారకురాలైన ఫీబె 7) యేసుక్రీస్తుకు పరిచర్య చేసిన మార్త 8) దేవదూతలకు పరిచర్య చేసిన శారా 9) నయోమికి పరిచర్య చేసిన రూతు 10) ఏలియాకు పరిచర్య చేసిన షూనేమియారులు 11) నయమాను భార్యకు పరిచర్య చేసిన ఇశ్రాయేలు దేశపు చిన్నది 12) యేసుక్రీస్తు మాటలు విన్నదాని కొఱకై మనుష్యులను తీసికొని వచ్చిన సమరయ స్త్రీ. వీరందరూ చేసిన పరిచారమును మరచిపోవుటకు ఆయన అన్యాయస్థుడు కాదు. హెబ్రీ 6:10.

**బి) ఎటువంటివారు పరిచారకులై వుండాలి? మత్త 26:20.** దాసుడుగా ఉండేవాడే గొప్పవాడుగా వుంటాడు.

**6) ఉపచారుల వస్త్రములను గురించిన విస్మయము (1 రాజు 10:5వ.)** సొలొమోను తన సేవకులను డ్రెస్ కోడ్ పెట్టినట్లు మనకు తెలుస్తుంది. ఆ వస్త్రములు షేబ దేశపు రాణికి విస్మయాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించాయి. ప్రభువు మనకిచ్చిన ఆత్మీయ వస్త్రాలు. కీర్తన 45:14

1) బంగారు బుట్టా పనిచేసి వస్త్రము 2) విచిత్రమైన పనిగల వస్త్రం. యెష 61:10. 3) శృంగారమైన పాగా 4) యెష 61:3. ఉల్లాస వస్త్రం 5) రక్షణ వస్త్రములు 6) నీతియను పై బట్ట 7) యెష 61:3. స్తుతి వస్త్రం 8) యెష 59:18. ఆసక్తి అనే పై వస్త్రం 9) లూకా 15:22. ప్రశస్థ వస్త్రం 10) 1 పేతు 5:7. దీనమనస్సు అను వస్త్రం. ఈ వస్త్రములను మనము కలిగి వున్నామా ? అలా కలిగి వుండిన జీవితాన్ని మనము జీవిస్తూ వుంటే మనలో ఆత్మీయ వస్త్రాలు వాటి ధరించుకొన్న మన ఆత్మీయ జీవితాలతోను చూచి ఆశ్చర్యపడుతున్నారా? మనల్ని మనం పరీక్షించుకుందాం.

**7) సొలొమోను గిన్నెనందించు వారిని గూర్చిన విస్మయము (1 రాజు 10:5 వ.)** నెహెమ్యా గ్రంథములో నెహెమ్యా అర్తహషస్త అను ఒక అన్యరాజుకు ఇశ్రాయేలీయుడుగా గిన్నెనందించువాడుగా వున్నాడు. గవర్నరు పదవిలో వుంటూ కూడా అతడు రాజుకు నమ్మకంగా వున్నాడు. కనుకనే రాజు అతనిని తనకు గిన్నెనందించువాడుగా వుంచుకున్నాడు. అలాగునే పరమ సొలొమోను రాజకు ఆయన సేవకులుగా ఏ ఏ గిన్నెలు అందించువారముగా వుండాలో ఆలోచిద్దామా ?

**1) హృదయమనే గిన్నె :-** ప్రభువుకు మనము యివ్వవలసిన మొట్టమొదటి గిన్నె మన హృదయమే. సామి 23:26. మన పాపములతో నిండియున్న హృదయాన్ని (మార్కు 7:21) ప్రభువు తన పవిత్ర రక్తముతో దానిని కడిగి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రమైన గిన్నె చేస్తాడు.

2) మనము ప్రభువుకు రెండవదిగా అందించవలసిన గిన్నె రక్షణ పాత్ర. 116 కీర్తన 13వ.లో ఈ గిన్నెను ప్రభువే మనకు యిచ్చారు. కానీ ఈ రక్షణ పాత్రను, ప్రక 5:8వ. ప్రకారము ప్రక 8:6 వ. ప్రకారము ప్రార్థనలతో దానిని నింపవలసినవారముగా వున్నాము. అంతేకాక కీర్తన 116:17వ. ప్రకారము హెబ్రీ 13:15వ. ప్రకారము రక్షణ పాత్రను స్తుతులతో జిహ్వ ఫలములతో నింపాలి. అంతేకాక కీర్తన 116:14వ.లో వ్రాయబడినట్లు మ్రొక్కుబడులతో రక్షణ పాత్రను నింపి ప్రభువుకివ్వాలి. ఆది 28:21వ.లో యాకోబు తన తండ్రి యింటికి వెళ్ళుచున్నపుడు తనకు ఎ) తోడైయుండి బి) తనను కాపాడి సి) తాను తినుటకు ఆహారము

డి) తాను ధరించుటకు వస్త్రములను దయచేస్తే యెహోవా అతనికి దేవుడై వుంటాడని, మరియు తాను స్తంభముగా తాను నిలిపిన ఆ రాయి మందిరముగా చేస్తాడని మరియు దేవుడు తనకిచ్చే యావత్తులో పదియవ వంతు దేవునికిస్తానని మ్రొక్కుబడి చేసికొన్నాడు. మొత్తానికి యాకోబు దేవుడు తనకు చేసిన మేలుల కొఱకై దేవునికి తన రక్షణ పాత్రను మ్రొక్కుబడులతో నింపినట్లు మనము చూస్తున్నాము.

అలాగే కీర్తన 132:3వ.లో యాకోబు బలిష్ఠుడైన ఒకని నివాస స్థలము చూచువరకు తనవాస స్థానమైన గుడారములో ప్రవేశించనని, పరుండు మంచమెక్కనని, కన్నులకు నిద్రరానీయనని, కనురెప్పలకు కునుకుపాటు రానీయనని మ్రొక్కుబడి చేసుకున్నట్లు మనము చదువుచున్నాము. ఇట్లు యాకోబువలె, దావీదువలె, బత్షెబవలె, హన్నావలె మనకు ప్రభువు యిచ్చిన రక్షణ పాత్రను మనమును ఎ) ప్రార్థనలతో బి) స్తుతులతోను సి) మ్రొక్కుబడులతోను నింపి ప్రభువుకు మనము ఆ రక్షణ గిన్నెను పరమ సొలొమోను రాజుకు అప్పగించబద్ధులమై యున్నాము.

మూడవదిగా మత్త 10:40-42వ.లో వ్రాయబడినట్లు నీతిమంతులకు గిన్నెను అందించవలసినవారముగా వున్నాము.

నాల్గవదిగా రోమా 12:19.లో వ్రాయబడినట్లు శత్రువులకు యివ్వలసిన ఆతిధ్యపు గిన్నె జ్ఞాపకము చేసికుందాం. ఈ నాలుగు గిన్నెలను అందించి మనల్ని గమనించువారికి విస్మయము కలిగించేవారముగా వుండాలని నేర్చుకుందాము.

**8) అతడు అర్పించిన బలులను గూర్చిన విస్మయము :-** సొలొమోను అర్పించిన బలులు షేబరాణికి ఆశ్చర్యం కలిగించడానికి కారణం ఆశ్చర్యకరుడైన యేసుని ఆ బలులు సూచిస్తున్నాయి. బలులు ప్రధానంగా రెండు రకములు. ఎ) సువాసనకరమైన బలులు బి) సువాసన లేని బలులు. సమాధాన బలి, నైవేద్యము, సమాధాన బలి, సువాసనకరమైన బలుల క్రిందికి చెందుతాయి. పాప పరిహారార్ధ బలి, అపరాధ పరిహారార్ధ బలి సువాసనలేని బలుల క్రిందికి వస్తాయి.

పైన చెప్పిన బలులన్నీ ఛాయలేకానీ, నిజ స్వరూపము క్రీస్తులోనే వున్నది. ప్రతి బలిలోనూ ప్రభువే కనిపిస్తాడు. కానీ ఈనాడు సంఘమైన మనము యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన బలులు అర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా వుండునట్లు మనము సజీవరాళ్ళవలె వుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడాలని పేతురు తన మొదటి పత్రిక 2:5వ.లో చెబుతున్నాడు. యెష 66:2వ.లో నా బలిపీఠము మీద వారర్పించు దహనబలులు నాకంగీకారములగును అని వ్రాయబడింది. క్రింది లైన్‌లోనే నా మందిరము సమస్త జనములకు ప్రార్థనా మందిరము అనబడును అన్నాడు. మలాకీ 1:11వ.లో సకల

స్థలములలో ధూపమును పవిత్రమైన అర్పణలను అర్పింపబడును అన్నాడు. ధూపము అనగా మనము చేయు ప్రార్ధనయే. మలా 2:13వ.లో వ్రాయబడినట్లు మనము బలిపీఠము మీద అర్పించు ఆత్మసంబంధమైన బలులైన మన ప్రార్ధనగానీ, మన కానుకలు అనే అర్పణలు కానీ, రోమా 12:1వ. వ్రాయబడినట్లు పరిశుద్ధమును, అనుకూలమునైన సజీవ యాగముగా అర్పించే శరీరములను గానీ ప్రభువు వాడు అంగీకరించేవిగా వుండునట్లు పవిత్రముగానే అర్పిద్దాము. మలా 1:13లో దోచబడిన దానిని కుంటిదానిని, తెగులు దానిని బలిపీఠము మీదకు తెచ్చుచున్నారు. ఈలాగుననే మీరు నైవేద్యములు చేయుచున్నారు. మీచేత యిట్టిదానిని నేను అంగీకరితునా ? అంటున్నాడు దేవుడు. మందలో మగది వుండగా యెహోవాకు మ్రొక్కుబడి చేసి చెడిపోయిన దానిని అర్పించు వంచకుడు శాపగ్రస్తుడు" అని దేవుడు వ్రాయించాడు. ప్రియసోదరీ ! మనమందరము మన హృదయములను, ప్రార్ధనలను మన కానుకలను, ప్రథమ ఫలములను, స్వేచ్ఛార్పణలను మాత్రమే కాక మన శరీరములను మరి ముఖ్యముగా పవిత్రమైన సజీవయాగములుగా ఆయన బలిపీఠము మీద మనలను చూచుచున్న వారికి ఆశ్చర్యము విస్మయము కలిగించేవారుగా వుందాము.

ఆయన శరీరమైన సంఘము అనే మనము మచ్చ, మరక, డాగు, అట్టిది ఏమియు లేకుండా మనస్సాక్షికి కల్మషము తోచకుండా వాక్యమను ఉదకముతో స్నానము చేసిన శరీరములను గలవారముగా, ప్రోక్షించబడిన హృదయములు గలవారముగా ఆయన రక్తము వలన పరిశుద్ధ స్థలమునందు మనము ఆయన బలిపీఠము మీద మనల్ని అర్పించుకుందుము గాక. (హెబ్రీ 10:22)

**9) సొలొమోనును జ్ఞానమును అతని కార్యములను నమ్మిన షేబారాణి (10:7 వ.)**

10:2వ.లో తనకు తోచిన దానిని బట్టి మాట్లాడింది. ఇప్పుడు అన్నీ చూచి మాట్లాడుతోంది. అన్నీ చూచిన తరువాత విస్మయమొంది 6 వ.లో నీ కార్యములను గూర్చియు, జ్ఞానమును గూర్చియు నా దేశమందు వినిన మాట నిజమే. అయినను నేను వచ్చి కన్నులారా చూడక మునుపు ఆ మాటలను నమ్మకయుంటిని అనింది. అంటే సొలొమోనును గురించి ఆమె తన దేశమందు వినిన మాటలు అతని వద్దకు వచ్చేంతవరకు అవి నిజము కాదు అనుకుంది. వచ్చి చూడక మునుపు ఆ మాటలను నమ్మకయుంటిని అని అనింది. వచ్చి చూచి నిజమని నమ్మింది.

ఈనాడు చాలామంది, వారి వారి దేశాల్లో ఆయా ప్రాంతాల్లో ప్రభువును గూర్చి వింటున్నారు. సువార్తను వినియు అది నిజము కాదనుకుంటున్నారు. మా దేవుడు మాకున్నాడు అనుకుంటున్నారు. తమ్మును పరిశుద్ధపరచే క్రీస్తు రక్తమును కాళ్ళతో త్రొక్కి కృపకు మూలమగు ఆత్మను తిరస్కరిస్తూ ఎంతో ఎక్కువైన దండనకు పాత్రులుగా ఎంచబడుచున్నారు. ఆమెలాగ

చూచి నమ్మాలంటే కుదరదు. చూచి నమ్మినవారికంటె చూడక నమ్మినవాడు ధన్యుడని ప్రభువు చెప్పుచున్నాడు. దేవుడులేడని బుద్ధిహీనులు తమ హృదయములలో అనుకొనుచున్నారు. వారు చెడినవారని దేవుని వాక్యము చెప్పుచున్నది.

**10) సొలొమోను యొక్కయు, తన జనుల యొక్కయు, తన సేవకు యొక్కయు భాగ్యమును గూర్చి సాక్ష్యమిచ్చిన షేబరాణి (1 రాజు 10:7 వ.)** "ఉన్నదానిలో సగమైనను నాతో చెప్పబడలేదని యిప్పుడు తెలిసికొనుచున్నాను. నీ జ్ఞానము, నీ భాగ్యమును నేను వినినదానిని బహుగా మించియున్నవి." అని షేబరాణి 6, 7 వచనాల్లో చెప్పినట్లు మనము కూడా పరలోకపు యెరూషలేములోనికి వెళ్ళి ప్రభువును ఆయన మహిమను, ఐశ్వర్యాన్ని, ఆయన నిర్మించిన నివాసములను ఆయన పరిశుద్ధులకిచ్చే వాడబారని స్వాస్థ్యమును, గొఱ్ఱెపిల్ల వివాహ మహోత్సవమును, వివాహ విందును, ఆయన మనకిచ్చే మహిమను, కిరీటములను, సింహాసనములను ఈలాగున ఒకటేంటి అన్నింటిని గూర్చి భూలోకములో వినిన దానికంటె బహుగా వున్నాయని మనమును ప్రభువును స్తుతిస్తాము. ఇక్కడ నీ జ్ఞానమును, నీ భాగ్యమును బహుగా మించియున్నవి అని చెప్పుచుండగా సొలొమోను జ్ఞానమును గూర్చి ముందుగానే ధ్యానించాము. అలాగే దేవుని జ్ఞానాన్ని గురించి కూడా ముందే ధ్యానించాము.

ఇపుడు సొలొమోను కంటే గొప్పవాడైన మన పరమ సొలొమోను అయిన ప్రభువు భాగ్యాన్ని గురించి కొంత ఆలోచిద్దాము. ఫిలి 2:6 వ. యేసుప్రభువు దేవుని స్వరూపియై దేవునితో కూడా సమానముగా వుండుట విడిచిపెట్టకూడని భాగ్యముగా ఎంచుకొనలేదని వ్రాయబడింది. అలాగైతే పరలోకమందు యేసుప్రభువు కలిగియున్న భాగ్యము విడచిపెట్టకుండా అలాగే పట్టుకొనవలసిన భాగ్యము. ఎవ్వరికీ యివ్వకుండా తానే వుంచుకొనవలసిన భాగ్యము. చనిపోయిన ప్రభువు సన్నిధికెళ్ళిన మన తల్లిదండ్రుల సంగతిని గూర్చి ఆలోచించండి. భూలోకంలో మనము వారికి ప్రియమైన పిల్లలమైనా ఆ పరలోక భాగ్యాన్ని దైవసన్నిధిని చూచినవారు ప్రభువు భూలోకానికి వెళ్ళండి అని వారిని నెట్టినా, ఆ పరలోక భాగ్యాన్ని విడచిపెట్టి రావడానికి ఇష్టపడరు. అట్టి సమయములో రేపు మనమైనా చనిపోయి ప్రభువు దగ్గరికెళ్ళిన తరువాత భూలోకానికి రావటానికి మనమిష్టపడము. అయితే ప్రభువు తను కలిగియున్న భాగ్యాన్ని మనకొఱకు విడచిపెట్టి వచ్చాడు.

వాక్యము ప్రకారము ఆయన నివాసములు ఎంతో రమ్యములు. ప్రక 21:19-27వ. వరకు పరలోక పట్టణ ప్రాకారమే సూర్యకాంతములతో కట్టబడింది. పట్టణ పునాదులు నానా విధములైన 12 ముత్యముల చేత అలంకరించబడ్డాయి. ఆ ప్రాకారానికి 12 గుమ్మాలు, 12 ముత్యములతో కట్టబడ్డాయి. పట్టణపు రాజవీధి శుద్ధ సువర్ణమయమై స్వచ్ఛమైన స్పటికమును పోలివున్నది. సర్వాధికారి దేవుడగు ప్రభువును, గొఱ్ఱెపిల్లయు దానికి దేవాలయమై యున్నారు.

దేవుని మహిమయే దానిలో ప్రకాశించుచున్నది. గొఱ్ఱెపిల్లయే దానికి దీపము. అనగా యేసుప్రభువే దానికి దీపము మరియు స్ఫటికమువలె మెరయునట్టియు జీవజలములనది దేవుని యొక్కయు, గొఱ్ఱెపిల్ల యొక్కయు, సింహాసనము నొద్దనుండి ఆ పట్టణపు రాజవీధి మధ్యను ప్రవహిస్తూ వుంటుంది. దానికిరువైపుల నెలనెలకు ఫలించు 12 కాపులు కాయు జీవవృక్షములుండెను. ఆయన దాసులు ఆయనను ముఖదర్శనము చేస్తారు. ఆయన నామము వారి నొసళ్ళ మీద వుంటుంది. ప్రభువే వారి మీద ప్రకాశిస్తాడు. "వారు అనగా మనమే యుగయుగములు రాజ్యము చేస్తారు" అని వ్రాయబడింది. ఇట్టి పరలోక రాజ్యభాగ్యాన్ని విడచిపెట్టకూడని భాగ్యమని పాపాత్ములమైన మనకొఱకు ప్రభువు అంత త్యాగము చేశాడు. ఒకరోజు రెండు రోజులు కాదు, ఒక సం॥ 2 సం॥లు కాదు, 33 1/2 సం॥లు ఆ పరలోక భాగ్యాన్ని విడచి పెట్టుకొని వచ్చాడంటే మన యెడల ఆయనకున్న అపారమైన అపరిమితమైన కొలతల కందని, వర్ణింపశక్యము కాని, ఎంతయైన, ఆశ్చర్యకరమైన ప్రేమయే కదా ! విడచిపెట్టకూడని భాగ్యాన్ని విడచి పెట్టుకోవడంలో తన కిరీటాలను, సింహాసనాలను ఆయనకున్న సుఖసౌఖ్యాలను అన్నిటిని విడచిపెట్టుకుని భూలోకానికి వచ్చి ప్రాణత్యాగము చేసిన దేవునికి స్తోత్రము. 8వ.లో నీ జను భాగ్యవంతులు, నీ ముందఱ ఎల్లప్పుడు నిలిచి నీ జ్ఞానవచనములను వినుచుండు నీ సేవకులును భాగ్యవంతులు అనింది. సొలొమోను సేవకులే భాగ్యవంతులైతే సొలొమోనుకు జ్ఞాన ప్రదాతయైన యేసుప్రభువు జ్ఞానవచనములు వినుచున్న సేవకులమైన మన భాగ్యము ఇంకెత భాగ్యమో. అది వివరించలేనిది. సామె 8:34 వ.లో అనుదినము నా గడప యొద్ద కనిపెట్టుకొని నా ద్వారబంధములయొద్ద కాచుకొని నా ఉపదేశము వినువారు ధన్యులు అని సామె 8:34 వ.లో వ్రాయించాడు ప్రభువు. సామె 9,10 అధ్యాయాలు కేవలము జ్ఞానమును గురించే వ్రాయబడ్డాయి. దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గొప్పది (రోమా 11:33). జ్ఞానాధారము నేనే అన్నాడు. ఎవ్నికైనా జ్ఞానము తక్కువగా వుంటే సందేహించక ఆయనను అడగాలని ఆయన వానికి ధారాళముగా జ్ఞానము దయచేయువాడని వాక్యములో చదువుచున్నాము. క్రీస్తే మనకు జ్ఞానము. పరిశు ద్ధత, నీతి, విమోచనమునై యున్నాడు. ఈ లోకజ్ఞానము దేవుని దృష్టికి వెర్రితనమే. దేవుని వెఱ్ఱితనము మన జ్ఞానము కంటే గొప్పది అని వ్రాయబడింది. జ్ఞానకార్యములు ఆయన యొద్ద వున్నవి యోబు (12:13). ఆయన జ్ఞానమునకు మితిలేదు (కీర్తన 147:5). జ్ఞానము వలన ఆయన భూమిని స్థాపించాడు (సామె 3:19). మన అంతరింద్రియములలో జ్ఞానముంచినవాడు ఆయనే (యోబు 38:36). యెహోవా అనంత జ్ఞానము గల దేవుడు (1 సమూ 2:3). కనుక ఇట్టి జ్ఞానము కలిగిన యెహోవా దేవుని జ్ఞాన వాక్యములను వినే ఆయన సేవకుల భాగ్యము ఎంత గొప్పదో వివరించలేము. ఇశ్రాయేలూ ! నీ భాగ్యమెంత

గొప్పదో అని ద్వితి 33:29 వ.లో వ్రాయబడియుండగా ఆయన యిచ్చిన రక్షణ భాగ్యము ఎంత గొప్పదో కదా ? 5 గ్రంథాలు కలిగిన ధర్మశాస్త్రమును కలిగియున్న ఇశ్రాయేలీయులు భాగ్యమే అంత గొప్పదైతే, 5+61 గ్రంథములు మొత్తము 66 గ్రంథములు కలిగిన బైబిలు ఇంకెంత గొప్పదో కదా. ఇంకనూ ఆయన మనకిచ్చిన మరికొన్ని ఆత్మీయ భాగ్యములను గురించి క్రింద పొందుపరుస్తున్నాను.

2వ భాగ్యముగా యాకోబు పత్రిక 3:15వ.లో ఈ లోక విషయములో దరిద్రులైన వారిని విశ్వాస విషయములో భాగ్యవంతులుగాను తన్ను ప్రేమించువారికి తాను వాగ్దానము చేసిన రాజ్యమునకు వారసులుగాను వుండుటకు దేవుడు ఏర్పరచుకున్నాడు. 3వ భాగ్యముగా జెకర్యా 3:7వ. వ్రాయబడినట్లు ఆయన సన్నిధిలో నిలిచే భాగ్యము కూడా మనకిచ్చారు. కీర్తన 16:11వ.లో వ్రాయబడినట్లు ఆయన సన్నిధిలో సంపూర్ణ సంతోషము వున్నది. కీర్తన 97:5 వ.లో వ్రాయబడినట్లు ఆయన సన్నిధిలో పర్వతముల వంటి గడ్డు సమస్యలు మైనము వలె కరిగిపోతాయి. ఆయన సన్నిధి మనకు తోడుగా వచ్చేది. ఇన్ని విధాల ప్రయోజనకరమైన ఆయన సన్నిధిలో నిలిచే భాగ్యము దేవుడు మనకిచ్చాడు. అంత మాత్రమే కాక సామె 12:27 వ.లో నాలుగదిగా చురుకుగా నుండుటే గొప్ప భాగ్యముగా యిచ్చాడు ప్రభువు. అలాగున హెబ్రీ స్త్రీలు, ఐగుప్తు స్త్రీలకంటే చురుకైనవారుగా వుండినారు. ఎంత చురుకుగా వున్నారంటే కాన్పు సమయంలో మంత్రసానులు రాకముందే వారు పిల్లల్ని కనేసి వుండేవారు (నిర్గ 1:19వ.) అలాగే 2 కొరిం 9:10వ.లో వ్రాయబడినట్లు 5వ భాగ్యముగా దరిద్రులకు వెదజల్లి యిచ్చి అభివృద్ధికి వచ్చే ఔదార్యభాగ్యమును ప్రభువిచ్చాడు. పరిశుద్ధుల అక్కరలకు సహాయము కలుగచేయుట మాత్రము కాకుండా అనేకులు దేవునికి చెల్లించు కృతజ్ఞతా మూలముగా విస్తరించుచున్న ఈ ఔదార్యభాగ్యమును బట్టియు చెప్పశక్యము కాని ఈ దర్శనము కొఱకై దేవునికి స్తోత్రము ఆరవ భాగ్యముగా ఆది 30:13వ.లో లేయా ఆషేరును కనినపుడు జనులు నన్ను భాగ్యవతి అంటారు అనింది. అనగా యాకోబుకు పిల్లలను కనేది ఒక భాగ్యముగా ఆమె భావించింది. ప్రియ సోదరీ! పరమ యాకోబైన మన ప్రియ ప్రభువుకు ఆత్మలను కనే భాగ్యవంతులుగా వున్నామా? లేయా నేను యాకోబుకు 6గురిని కనియున్నాను అనింది. ఈలాగున ఆత్మీలను కనే భాగ్యము పొందుకున్నాము.

(1) రాజు 10:8 వ.లో మూడు రకములైన భాగ్యాలు వ్రాయబడివున్నాయి. 1 సొలొమోను భాగ్యము. నేను వినిన దానికంటే ఇప్పుడు నేను చూస్తున్న భాగ్యము మించినది అంటోంది. అలాగైతే పరమ సొలొమోనైన యేసుప్రభువు భాగ్యము ఫిలి 2:5 వ. ప్రకారము అది విడిచిపెట్టకూడని భాగ్యము. మించిన భాగ్యము. (2) జనుల భాగ్యం. ఈ జనులు రాజుకు దగ్గరగా కాక దూరంగా వుండే జనుల భాగ్యంగా చెప్పుకోవచ్చు. పై 6 భాగ్యాలలో ఏవో

కొన్ని వీరు కలిగి వుండవచ్చు. కాని (3)వది సేవకుల భాగ్యం. వారు ఎల్లప్పుడు రాజు సన్నిధిలో నిలువబడి నిత్యము ఆయన జ్ఞానవాక్యములను వినే భాగ్యము. వీరు నిత్యము సొలొమోను దగ్గర వింటూ వుంటారు. ఈ దినాల్లో మనమును సొలొమోను సేవకుల వలె నిత్యము ఆయన గడప యొద్ద సామె 8:35 వ.లో వ్రాయబడినట్లు పరమ సొలొమోను నుండి జ్ఞానవాక్యములను కూర్చుండి మన యిండ్లలోనే ఈ లాక్‌డౌన్ దినాల్లో వింటూ వున్న మన భాగ్యము అందరికన్నా మించియున్నది. ఈ భాగ్యమిచ్చిన ప్రభువుకు స్తోత్రం.

ప్రియ సోదరీ ! నీ భాగ్యము రాజుకు దూరంగా వుంటున్న జనుల భాగ్యమువంటిదా? లేక రాజుకు దగ్గరగా వుంటున్న సేవకుల భాగ్యము వంటిదా ? ఎలాగుంది నీ భాగ్యం? ఆలోచించుకో.

**11) 1 రాజు 10:9వ. యెహోవాను స్తోత్రించిన షేబరాణి :-** 9 వ.లో నీయందు ఆనందించి నిన్ను ఇశ్రాయేలీయులమీద రాజుగా నియమించిన నీ దేవుడైన యెహోవాకు స్తోత్రము కలుగునుగాక ! యెహోవా ఇశ్రాయేలీయుల మీద శాశ్వత ప్రేమ యుంచెను. గనుక నీతి న్యాయములను అనుసరించి రాజకార్యములను జరిగించుటకు ఆయన నిన్ను నియమించెను' అని షేబరాణి సొలొమోనుతో అన్నది.

ఈ వచనాన్ని బట్టి దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయులకు నీతి న్యాయములను అనుసరించి రాజకార్యములను చేయుటకై సొలొమోనును రాజుగా నియమించాడని మనకర్థమౌతుండగా, అలాగే దేవుడు ఈనాడు నిన్ను నన్ను దేనికొఱకు నియమించుకున్నాడో ఆలోచిద్దాము. కీర్త 72:2 వ.లో సొలొమోను తాను వ్రాసిన ఈ కీర్తనలో దేవా ! రాజునకు నీ న్యాయవిధులు రాజకుమారునికి నీ నీతిని తెలియజేయుము అన్నాడు. 2 వ.లో నీతిని బట్టి నీ ప్రజలకును, న్యాయ విధులను బట్టి శ్రమనొందిన నీ వారికిని అతడు న్యాయము తీర్చును అని తాను వ్రాసుకున్నట్లే దీనులకు న్యాయము తీర్చాడు. 1 రాజు 3వ అధ్యాయములో 23 వ.లో న్యాయము తీర్చుటలో దైవజ్ఞానము కలవాడని ఇశ్రాయేలీయులందరూ గ్రహించారు.

ప్రియులారా ! అలాగైతే మన జీవిత దినాల్లో మనమేలాగు నీతిన్యాయాలు చేయాలో వాక్యములోనే చూద్దాం. బైబిల్లో మొట్టమొదటి ఈ తరము వారిలో నీవే నా యెదుట నీతిమంతుడవై యుండుట చూచితినని దేవుడు నోవహుతో ఆది 7:1లో అన్నాడు. దేవుడు నీతిమంతులను ఆశీర్వదిస్తాడట (కీర్తన 5:12) దాక్షిణ్యము కలిగి ధర్మమిచ్చేవారే నీతిమంతులు (కీర్త 37:21) నీతి ప్రవర్తన కలిగి వుండాలి (1 కొరిం 15:34). మన అవయవములను నీతి సాధనములుగా అప్పగించుకోవాలట (రోమా 6:13). ఇంకనూ బాప్తిస్మము తీసుకొనని వారు బాప్తీస్మము తీసికొని, ఆయన ఆజ్ఞలన్నిటిని నెరవేర్చి నీతి యావత్తూ ఈలాగున నెరవేర్చుట మనకు తగియున్నదని మత్త 3:15 సెలవిస్తుంది. ఈలాగున నీతిగా నడుచుకొనువానిని ఆయన అంగీకరించును అని అ.కా. 10:35లో వ్రాయబడింది.

అలాగే న్యాయముతో ఎలా జీవించాలో వాక్యములోనే తెలుసుకుందాము. (1) న్యాయమును బట్టే పొరుగువానికి తీర్పు తీర్చాలట (లేవి 19:15). (2) లంచము పుచ్చుకొని న్యాయమును త్రిప్పివేయకూడదు (1 సమూ 8:3). 3) వెలిచూపును బట్టి కాక న్యాయమైన తీర్పు తీర్చాలట (యోహా 7:4). 4) తండ్రిలేనివారికిని, నలిగిన వారికిని న్యాయము తీర్చాలట (కీర్త 10:18) 5) లలా నాకు న్యాయము తీర్చుము అని ధైర్యముతో అడగవచ్చును. ఏలయనగా మన ప్రభువుకు న్యాయము చేయుట ఇష్టము. నీతి న్యాయములు ఆయన సింహాసనమునకు ఆధారములుగా వున్నాయి (కీర్త 97:3). ఈలాగు నీతి న్యాయము జరిగించుటకే దేవుడు మనల్ని నియమించాడు. అలాగే మన పిల్లలు కూడా నీతి, న్యాయములు జరిగించుటకు వారికి ఆజ్ఞాపించాలని ఆది 18:19వ. ద్వారా కూడా మనకు ఆజ్ఞ ఇవ్వబడియున్నది. అలాగున నీతి, న్యాయములను సొలొమోనులాగ మన జీవిత దినములలోను జరిగించి తద్వారా మన జీవితాలను చూచినవారు మనమూలముగా దేవున్ని షేబదేశపు రాణివలె స్తుతించుదురు గాక!

యిర్మి 1:9వ.లో దేవుడు యిర్మియాతో “నేను నీ నోట నా మాటలు వుంచియున్నాను. పెల్లగించుటకును, విరుగగొట్టుటకును, నశింపచేయుటకును, పడద్రోయుటకును, కట్టుటకును, నాటుటకును, నేను ఈ దినమున జనముల మీదను రాజ్యముల మీదను నిన్ను నియమించుచున్నాను” అని అన్నాడు. అమ్మా ! నిన్నెందు నియమించాడో తెలుసుకున్నావా? ఎఫె 3:13వ.లో క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి నొందునట్లును పరిచర్య ధర్మము జరుగుటకును, ఆయన కొందరిని అపొస్తలులుగాను, కొందరిని కాపరులుగాను, కొందరిని సువార్తికులుగాను, కొందరు ప్రవక్తలుగాను, ఉపదేశకులుగాను నియమించెను అని వ్రాయబడింది.

ప్రియ సోదరీ ! నీ నియామకమేంటో నీవు తెలుసుకున్నావా ? సామె 24:11వ.లో “చావునకై పట్టబడిన వారిని నీవు తప్పించుము. నాశనమునందు పడుటకు జోగుచున్న వారిని నీవు రక్షించవా ? అని ప్రభువు ఎన్నుకోరుతున్నాడు. నీ నియామకమును గురించి ఆలోచించి దేవుని ఆజ్ఞకు లోబడు.

**12) సొలొమోను రాజకు కానుక తెచ్చిన షేబరాణి :-** 10 వ.లో ఆమె రాజుకు 240 మణుగుల బంగారమును, బహు విస్తారమైన గంధ వర్గములను, రత్నములను ఇచ్చెను. ఆమె ఇచ్చిన గంధవర్గములంత విస్తారము మరెన్నడైనను రాలేదని వ్రాయబడింది. అలాగైతే సొలొమోను రాజుకంటే రాజుల రాజైన, ఘనమైన రాజైన, సకల యుగములలో రాజైన, యుగయుగములకు రాజైన ఆ యేసురాజుకు మనమేలాటి కానుక తెస్తున్నాము ? ఆమె విస్తారమైన గంధవర్గము ఎవరునూ తేనంతగా తెచ్చినట్లు చూస్తున్నాము. 1 దిన 9:9వ.లో ఆమె సొలొమోనుకిచ్చిన గంధ వర్గములతో సాటియైనదేదియు లేదని వ్రాయబడింది. ఆమె సాటిలేని కానుక తెచ్చింది. గంధవర్గమిచ్చుటలో ఆమెయే ప్రథమ స్థానంలో వున్నది. యెహె 27:22 వచనమును బట్టి షేబదేశములో బంగారము, రత్నాలు, గంధవర్గములను డబ్బుల్లాగా

యిచ్చి సరుకులు కొనేవారని తెలుస్తుంది. ప్రియ సోదరీ ! ఈనాడు మన దగ్గర ఏమి ఎక్కువగా లేక విస్తారముగా వున్నాయి ? ఏవి ఎక్కువగా మన దగ్గర దొరుకుతున్నాయి ? వాటిలో మన సామర్థ్యము చొప్పునైనా ఇద్దామా ? సొలొమోను జ్ఞానమును, భాగ్యము గూర్చి విని అవి సొలొమోను దగ్గర నిజముగా వున్నాయో లేదో అని చూచి శోధిద్దాము అనుకున్న షేబరాణియే, ఇన్నూట నలువది మణుగుల బంగారము, విస్తారమైన గంధవర్గములను సాటిలేని గంధవర్గములను యిస్తే, మన కొఱకు ప్రాణదానము చేయుటకు మన పాడుబడిన పాప లోకానికే ముప్పది మూడున్నర సంవత్సరములుగా వచ్చి విలువైన రక్షణ కార్యమును సిలువలో చేసి నిత్యజీవభాగ్యము, మోక్ష భాగ్యము మనకనుగ్రహించి పరలోక తీరము చేరేదాక జీవానికి, భక్తికి కావలసిన వాటినన్నిటిని మనకిస్తూ తన రెండవ రాకడ వరకు మనకొఱకు నిత్యమును విజ్ఞాపన చేస్తున్న ఆ ప్రాణప్రియుడు, ప్రాణ స్నేహితుడైన మన ప్రభువుకు ఏమిస్తే సరిపోతుంది? అయినను మన ప్రేమను మన కానుక రూపమున మనము చూపవలసినవారమై యున్నాము. ఆయనక లేకపోయినందున మనమాయన కివ్వడము కాదు ఆయనకు కొదువేమియు లేదు. మనమాయనకిచ్చి గౌరవించడం ప్రాముఖ్యము. మన కానుక మన స్థితికి, స్తోమతకు తగినట్లుగా వున్నదా ?

యరోబాము భార్య షిలోహులోని మందిరమునకు వెళ్తూ మరొకతె అయినట్లు మారు వేషమును వేసికొని వేషధారణ కానుకగా పది రొట్టెలు, బుడ్డి తేనె తీసికొని వెళ్ళింది. అహీయా అంధుడైనను ఆమె కాళ్ళ చప్పుడు విని "యరోబాము భార్యా ! లోపలికి రమ్ము అని ఆమెను గూర్చి శాప వచనాలు చెప్పాడని 1 రాజు 14వ. అధ్యాయములో చదవగలము. తగిన దానికన్నా తక్కువగా యిచ్చి లేమికి వచ్చేవారిని గూర్చి బైబిల్‌లో మనము చదువుతాము కనుక మన ప్రాణనాథునికి ధారాళమైన మనసులో నిశ్చయించుకొనిన కానుకను కృతజ్ఞతగా ఆయన మందిరములోనికి తీసికొని రావలసినవారముగా వున్నాము. ఆయనకిచ్చి నష్టపోయిన వారెవరును లేరు. ప్రభువుకు ప్రభువు పేరిట పరిశుద్ధులకు ఎలా ఇవ్వాలో 2 కొరిం 9వ. అధ్యాయములో వ్రాయబడింది.

2 సమూ 8:10వ.లో దావీదు రాజు హదదెజరు రాజుతో యుద్ధము చేసి అతనిని ఓడించియుండుట హమాతు రాజైన తోయి విని తన కుమారుడైన యోరాము చేతికి వెండి, బంగారు, ఇత్తడి వస్తువులను కానుకగా అప్పగించి కుశల ప్రశ్నలు అడిగి దావీదుతో కూడా సంతోషించుటకై అతనిని దావీదునొద్దకు పంపించెను అని చదువుచున్నాము. ఒకరాజు మరో రాజు ఎన్ని విలువైన లోహాలతో విలువైన కానుకలు పంపిస్తుండగా యరోబాము రాజు తన భార్యతో అహీయ ప్రవక్తకు ఎంత హీనమైన కానుక పంపిస్తున్నాడో కదా ! మన దావీదైన యేసురాజు మనకు గొప్ప రక్షణ నిచ్చిన యేసు రాజైన ప్రభువుకు ఎంత విలువైన కానుకలివ్వాలో కదా !

అలాగే 2 రాజు 8:8,9,10 వచనములలో రాజైన బెన్హదదు రోగియై యుండి దైవజనుడైన ఎలీషా దమస్కుకు వచ్చియున్నాడని తెలిసికొని హజాయేలును పిలిచి, దమస్కులోని మంచి వస్తువులన్నిటిలో నలువది మోతంత కానుకగా తీసికొని అతనిని ఎదుర్కొనుమని చెప్పినట్లు చదువుచున్నాము. ఒక్కొక్క ఒంటె ఇంచుమించు 270 కేజీల బరువు మోస్తుంది. అలాగైతే 40 ఒంటెలు ఎన్ని కేజీల బరువు మోస్తాయి ? 270×40 = 10800 కేజీలు బరువు మోస్తాయి. అలాగైతే ఒకరాజైన బెన్హదదకు ప్రవక్తకు 10,800 కేజీలు బరువు గల మంచి వస్తువులు కానుకగా తీసుకెళ్ళమని పంపించడమును బట్టి మనము ప్రవక్తను మించిన రారాజైన మన ప్రాణప్రియునికి, ప్రాణ రక్షకునికి ఎంత కానుక యిస్తే సరిపోతుందో ఆలోచిద్దాము.

ఎజ్రా 2:69 వ.లో కుటుంబ ప్రధానులలో కొద్దిమంది మందిర పనిని నెరవేర్చుటకు శక్తికొలది ఖజానాకు పదునారువేల మూడువందల తులముల బంగారమును, రెండు లక్షల యేబది వేల తులముల వెండిని, యాజకుల కొఱకు నూరు వస్త్రములను యిచ్చినట్లు తెలుస్తుంది.

మత్త 2:11వ.లో తూర్పుదేశపు జ్ఞానులు తల్లియైన మరియను, ఆ శిశువును చూచి సాగిలపడి ఆయనకు పూజించి తమ పెట్టెలను విప్పి బంగారమును, సాంబ్రాణిని భోళమును కానుకలుగా ఆయనకు సమర్పించిరి అని వ్రాయబడింది.

లూకా 21:1-4 వ.లలో ఒక బీదరాలు, అందులోను విధవరాలు తన దగ్గర వున్న రెండే రెండు కాసులు కానుక పెట్టెలో వేస్తే ఆమెను గురించి ప్రభువు, ఆమె అందరికంటే ఎక్కువగా వేసెనని మీతో నిజముగా చెప్పుచున్నానన్నాడు. అందరూ తమ సమృద్ధిలో నుండి వేశారు. ఈమె తన లేమిలో తనకు కలిగినదంతయు వేసెనని చెప్పబడుచుండగా, పైన వ్రాయబడిన రీతిగా ప్రభువునకు కానుకలు వేసిన వారిని గూర్చి వినిన తరువాత ప్రియ సోదరీ ! నీవు ఎవరిలాగా ప్రభువుకు కానుక యివ్వాలనుకుంటున్నావు ? షేబారాణి సాటిలేని కానుక ఇవ్వగా ఈ బీద విధవరాలు, తన బీదరికంలో, తన లేమిలో, తన జీవనమంతయు ఇవ్వగా ప్రభువు ఈమె అందరికంటే ఎక్కువ వేసిందనే సాక్ష్యము మనము వినుచుండగా ఈ సాక్ష్యము మనతో మాటలాడుచుండగా నేడు నీ కానుక ఎవరి కానుకలాగ వుండాలనుకుంటున్నాడు. నీ కానుకను చూచి ఏమి సాక్ష్యమివ్వాలనుకుంటున్నావు ? నీ తీర్మానమునకే వదిలేస్తున్నాను. ప్రభువు నిన్ను చక్కని తీర్మాణానికి ఒప్పించును గాక !

1 రాజు 10:13వ వచనములో సొలొమోను తన ప్రభావమునకు తగినట్టు షేబదేశపు రాణికి ఇచ్చినది పోగా, ఆమె కోరిన ప్రకారము, ఆమె ఇచ్ఛాపూర్తిగా ఆమెకిచ్చెను అని వ్రాయబడింది. ప్రభువుకు మనమిస్తే ఆయన మన ఋణాన్ని వుంచుకునే దేవుడు కాదు. మలా 3:10వ.లో నా మందిరములో ఆహారముండునట్లు దశమ భాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసుకొనిరండి. దీన్ని మీరు చేసి నన్ను శోధించిన యెడల నేను ఆకాశపు వాకిండ్లను విప్పి పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదనని' ప్రభువు

చెప్పారు. మనమిచ్చేది దశమ భాగమే కానీ, ఆయన యిచ్చేది ఆకాశపు వాకిండ్లు విప్పి పట్టజాలనన్ని దీవెనలు. ఆ పట్టజాలని దీవెనలతో మన పాత యిల్లు సరిపోదేమో ! క్రొత్త యింటికి మారవలసి వస్తుందేమో ! తండ్రియైన దేవుడు ఆయన కుమారునితో పాటు సమస్తమును మనకనుగ్రహించును అని రోమా 8:32లో వ్రాయబడింది.

**11) సొలొమోను చేత కోరికలు తీర్చుకున్న షేబదేశపు రాణి :–** సొలొమోను తన ప్రభావము చొప్పున యిచ్చినది మాత్రమే కాక ఆమె కోరిన ప్రకారము, ఆమె యిచ్ఛాపూర్తిగా ఆమెకిచ్చెను అని వ్రాయబడింది. ప్రభువు మన కోర్కెలు తీర్చువాడు. ఆశలు తీర్చేవాడు (కీర్త 20:4), ఇష్టములు నెరవేర్చువాడు. నీ కోరిక సిద్ధింప చేస్తాను అని ప్రభువు చెప్పాడు. అయినను నాయందు మీరును మీయందు నా మాటలును నిలిచియుంటే మీకేమి కావాలో అడగండి అది మీకు అనుగ్రహించబడుతుంది అని యోహా 15:7వ.లో ప్రభువు చెబుతున్నాడు. కీర్తన 145:19వ. ప్రకారము దేవుడు కూడా తనయందు భయభక్తులు గలవారి కోరిక ఆయన నెరవేర్చును అన్నట్లు సొలొమోను షేబరాణి కోరిక నెరవేర్చాడు. ప్రియ సోదరీ ! మన జీవితంలోను దేవునియందు భయభక్తులు కలిగి దేవుని చేత కోరికలు తీర్చుకుందాము. షేబదేశపు రాణి భౌతికమైన కోరికలు తీర్చుకుందేమో.

కానీ మనమైతే ఆత్మీయమైన కోరికలు కోరదాము. దావీదు కీర్త 119:17వ.లో నేను నీ ఉపదేశములను కోరుకొనియున్నాను అన్నాడు. నీ యొక్క, నా యొక్క కోరిక అదే అయి వుండాలి. ఎందుకంటే కీర్తన 119:93 వ. ప్రకారం ఆయన ఉపదేశములు మనలను బ్రతికిస్తాయి. 119:104 వ. ప్రకారము ఆయన ఉపదేశముల వలన మనకు వివేకము కలుగుతుంది. సామె 6:23వ. ప్రకారము ఆజ్ఞ దీపముగాను, ఉపదేశము వెలుగుగాను వుంటుంది. ద్వితి 32:2 వ.లో ఆయన ఉపదేశము వానవలె కురియును. ఇన్ని రకములుగా ప్రయోజనకరమైన ఉపదేశాన్ని మనము కాపాడితే మనము బ్రదుకుతామని సామెతలు 7:2లో వ్రాయబడినట్లు మనల్ని బ్రదికించే ఉపదేశాన్ని మనమును కాపాడుదాము.

కీర్తన 119:3వ.లో దావీదు నీ నిత్యమార్గమును నేను కోరుకొనియున్నాను అన్నాడు. ఈలాగున దేవుని ఉపదేశములను, సత్యమార్గమును కోరుకోవడం ఇవి ఆత్మీయుల కోరికలు. ప్రియ సోదరీ ! నీవు ఏమార్గమును కోరుకొనియున్నావు ? సత్యమార్గమునా ? జీవమార్గమునా? వాక్యమార్గమునా ? పరలోక మార్గమునా ? అంతయు ఒకటే. నీవు సత్యమార్గాన్ని కోరుకున్నావా ? అబద్ధ మార్గాన్ని కోరుకున్నావా ? సత్యమార్గమంటే ఎవరు? ప్రభువు నేనే మార్గమును, సత్యమును, జీవమును నేనే. నా ద్వారానే తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడని చెప్పియుండగా ప్రియ సోదరీ ! నీవు ప్రభువునే కోరుకుంటావా ?

ఎందుకాయనను కోరుకోవాలంటే ఆయన ద్వారానే రక్షణ కలుగుతుంది. రక్షణను కోరుకొనువారికి రక్షణను యిచ్చే రక్షకుడాయనే. అపో.కా. 4:12వ. ప్రకారము మరి ఎవని వలనను మనకు రక్షణ కలుగదు. ఈ నామముననే మనము రక్షణ పొందవలసి యున్నది. ప్రియ సోదరీ ! మరి నీవు రక్షణ పొందావా ? లేనియెడల ఇదే రక్షణ దినము, ఇదే మిక్కిలి అనుకూల సమయము, రక్షింపబడుటకు.

సరే, రక్షించబడిన మనము దేవునినుండి అనగా పరమ సొలొమోను నుండి ఏమి కోరుకోవాలి ? అహష్వేరోజు రాజును ఎస్తే 5:6వ.లోను, ఎస్తే 7:2 వ.లోను నా మనవిని బట్టి నా జనులును నాకు అనుగ్రహింపబడుదురు గాక !" అని కోరుకుంది. అలాగే మనము కూడా అనేక ఆత్మలను రక్షించమని మన ప్రార్థన విజ్ఞాపణములలో దేవునిని మనము కోరుకోవాలి. రోమా 10:1 వ.లో ఇశ్రాయేలీయులు రక్షణ పొందవలెనని, నా హృదయాభిలాషయు, వారి విషయమై నేను దేవునికి చేయు ప్రార్థనయునైయున్నది" అని చదువుతున్నాము. అనగా ఇశ్రాయేలీయులు రక్షణ పొందాలని పౌలు కోరిక కలిగి వున్నాడు. ప్రియ సోదరీలారా ! మనకు యిట్టి కోరిక కలదా ? ఇట్టి కోరికను కలిగి వుండడానికి ప్రభువును అలాంటి ఆశ, కోరికనిమ్మని ప్రార్థించుకుందాం. అలాగున జీవిద్దాం.

అలాగే యెహోషువ చివరికి 24:15 వ.లో మీరు ఎవరిని సేవింపకోరుకొనినను నేనును, నా యింటివారును యెహోవాను సేవించెదము అని అన్నాడు. ఆయన కోరిక యెహోవాను సేవించాలనే కోరికే. ప్రియ సోదరీ ! నీకు ఈ ఆత్మీయమైన కోరిక వున్నదా? ప్రభువా నీవు నాకు చాలు అని చెప్పగలవా ? కీర్తన 73:25వ.లో ఆకాశమందు నీవు తప్ప నాకెవరున్నారు ? నీవు నాకుండగా లోకములోనిది ఏదియు నాకక్కరలేదు అని చెప్పగలమా ? 28 వ.లో నాకైతే దేవుని పొందే ధన్యకరము అన్నాడు. అలాగున మన కోరిక మన ఆశ ఆత్మీయంగా మన ప్రభువు మీదనే ఆయన సేవ మీదనే, ఆత్మల విషయమై మనం కోరికలు కలిగియుందాము. అలా 2 రాజు 5:3వ.లో కుష్టు రోగము కలిగిన తన యజమానుడైన నయమాను షోమ్రానులోనన్న ఎలీషా ప్రవక్త దగ్గర ఉండాలని ఇశ్రాయేలు దేశపు చిన్నది కోరుకున్నది. చిన్నదానికి చిన్న వయసులో తినాలి, త్రాగాలి, ఎగరాలి, ఆడుకోవాలి, తిరగాలి అనే కోరికలు వుంటాయి కాని యజమానుడు కుష్టురోగము నుండి విడుదల పొందుటకు ఎలీషా దగ్గర వుండాలని కోరుకుంది. ఈనాడు ప్రియ సోదరీ, నీ ఆఫీసు అధికారులు, నీ స్నేహితులు, బంధువులు మన పరలోక ఎలీషా అనగా రక్షకుని చెంత వుండాలని కోరిక గలిగియున్నావా? ప్రియులారా ! ఇట్టి ఆత్మీయ కోరికలు కలిగి వుండవలసినవారమై యున్నామని హెచ్చరిక పొందడానికి ఈ విషయాన్ని హృదయానికి తీసుకుని అలాగుంటేనే కానీ, షేబారాణిని గూర్చి నేర్చుకున్న దానికి ఫలితము వుంటుంది. కానీ ఏ హెచ్చరికను, హృదయానికి తీసుకొనకపోతే మనము ఈ పాఠములు వినినప్పటికి, చదివినప్పటికి వృధానే అవుతుంది. ప్రియులారా! దయచేసి చివరి దినాల్లో వున్నాము. వ్యర్థము చేసికొనవద్దని మిమ్మును బ్రతిమాలుచున్నాను.

# మారువేషముతో మందిరమునకు వచ్చిన స్త్రీ – యరోబాము భార్య

'యరోబాము' అన్న పేరుకు రాజుగా వున్నాడు. జనులు విస్తరించెను, జనులు పోట్లాడుదురుగాక అని అర్థాలున్నాయి. యరోబాము దగ్గర ఇశ్రాయేలు 10 గోత్రాలవారు విస్తారంగా వున్నారు. వారు పోట్లాడే ప్రజలుగా ఉన్నట్లున్నారు. యరోబాము జనుల విస్తరణ కోరుకున్నాడు. యెహోవాను కోరలేదు. కానీ కుమారుడు అబీయా యెహోవాను తన పేరు అర్థమునకు తగినట్లు యెహోవాను తన తండ్రిగా కోరుకున్నాడు. ఈనాడు నీ తండ్రి ఎవడు ? పరలోకమందున్నవాడా ? లేక నరకమందున్నవాడా ?

యరోబాము, ఇశ్రాయేలీయులు పాపము చేయుటకు కారకుడయ్యాడు. అలాంటి యరోబాము 1 రాజు 14:2లో తన భార్యను నీవు యరోబాము భార్యవని తెలియకుండా మారువేషము వేసికొని షిలోహుకు వెళ్ళమంటున్నాడు. ఆమె భర్త చెప్పిన ప్రకారమే మారుమాట్లాడకుండా చేసింది. ఇందును బట్టి భర్త ఇశ్రాయేలీయులు పాపము చేయడానికి కారకుడైతే యరోబాము భార్య ఆయనను అనుసరిస్తూ ఇశ్రాయేలీయులు పాపము చేయడానికి కారకులైయున్నదని చెప్పడానికి, సందేహము లేదు. మారువేషము ఎందుకేసుకోమన్నాడు. 'యరోబాము భార్య' అని తెలియకుండు నిమిత్తమై వేసుకోమన్నాడు. యరోబాము భార్య అని ఎందుకు తెలియకూడదు. అతని చరిత్ర 1 రాజు 12:25 నుండి 14:30 వరకు కొంతవరకు చదవవచ్చు. అతడు రాజుల గ్రంథములలోని 19 మారులు ఇశ్రాయేలీయులు పాపము చేయుటకు కారకుడని చెడ్డ మాదిరిగా వ్రాయబడ్డాడు. అలాంటాయన భార్య కూడా అలా ఆయనలాంటిదే పాపానికి కారకురాలని తెలియబడకుండు నిమిత్తమై 'నీవు మారువేషం' వేసికొని వెళ్ళమన్నాడు. ప్రవక్తయైన అహీయా కళ్ళు కప్పుదామనుకున్నారు. వెలి చూపును బట్టి ఆమె వేసుకున్న వేషాన్ని చూచి మాటలాడువాడు కాడు అహీయా. అహీయా ద్వారా మాటలాడే యెహోవా దేవుడు కూడా అంతే అహీయా పేరుకు యెహోవా నా సహోదరుడు అని అర్థము.

అహీయా వృద్ధుడు కావున ఆయన కళ్ళు మూయవచ్చు అనుకున్నారు. కానీ దేవుని కళ్ళు మూయగలరా ? గ్రుడ్డివానికి కళ్ళు ఇవ్వగలవానిని గ్రుడ్డివానిగా చేయగలరా? ఎంత సాహసం కదా ఆ స్త్రీకి ? ప్రియ సోదరీ ! ఈనాడు దేవుని మందిరమనే షిలోహుకు ఏ వేషంతో రావాలని అనుకుంటున్నావు. నీ మారువేషాలతో భక్తిగలదానివలె, రక్షింపబడిన దానివలె, నటించి నీ సంఘకాపరులను, పరిచారకులను నీ తోటి స్త్రీలను మోసపుచ్చి వారి కళ్ళు కప్పాలనుకుంటున్నావా ? అదే దేవుని సన్నిధిలోనే దేవుడు నీ వేషాన్ని విప్పి నీ నిజస్థితిని చూపించగలదు. మనలో అనేకులం ఈ స్త్రీలాగే ఉన్నాము కాదా ! లేకపోతే ఆ స్త్రీకి తీర్పు

వెంటనే వచ్చింది. మనకు తీర్పు ఆలస్యంగా రావచ్చు. అంతే ఆమెకు మనకు తేడా. ఇదే షిలోహుకు మరొక స్త్రీ వచ్చింది. 1 సమూ 1:7లో మారువేషంతో కాక నిజస్థితితోనే షిలోహుకు వచ్చింది. కనుకనే ప్రార్థించి వెళ్ళేప్పుడు, ఎంతో నెమ్మదిని, విశ్రాంతిని పొంది వెళ్ళిపోయింది. ఆమె దు:ఖం పోయింది. ఈ స్త్రీ కుమారుడు కాయలాపడినా గాని ఆమె వేషాలు వేయడం మానలేదు. యెహో 18:1వ.లో దేవుని ప్రత్యక్ష గుడారమున్న షిలోహుకు వేషం మార్చి వచ్చింది. ఉన్నపాటున వస్తే ఆశీర్వాదం. లేనిపోని హంగులతో, వేషాలతో వస్తే శాపమే. ఆమె షిలోహుకు వచ్చింది ఎందుకోసం ? అహీయా ప్రవక్తను దర్శించడం కోసం. అహీయాను ఇన్ని రోజులు లేనిది ఇప్పుడే ఎందుకు దర్శించాలి. మీకా 6:6. బిడ్డ ఏమౌతాడో అన్న సంగతి అతడు తెలియచేస్తాడు గనుక దర్శించాలి అనుకున్నది. బిడ్డ బాగయ్యేట్లు ప్రార్థించమని అహీయాను కోరుటలేదు. గానీ ఒక జ్యోతిష్కుడిని అడిగినట్లు ఏమౌతుంది బిడ్డకు ? అని అడుగుతోంది. దేవుని సన్నిధి జ్యోతిష్యం చెప్పే స్థలం కాదు. నెమ్మదిని, విశ్రాంతినిచ్చే స్థలం. మన లోటుపాటులు చూపించి సవరించే స్థలం. ఆయన సన్నిధి సంపూర్ణ సంతోషాలనిచ్చే సన్నిధి. జ్యోతిష్యం చెప్పే జ్యోతిష్కుడు మన పరిస్థితులను మార్చే శక్తి లేనివాడుగా వుంటాడు. యరోబాము భార్య తన భర్త చెప్పిన ప్రకారమే మారువేషంతో, వేషధారణ కానుకతో వెళ్ళింది. అహీయా వృద్ధాప్యము చేత కండ్లు కానరానివాడై యున్నాడు. ఆయన కళ్ళైతే మూయగలదు. కానీ, దేవుని కళ్ళు మూయగలదా ? పర 5:12 ఆయన కళ్ళు నదీ తీరమున ఉన్న గువ్వలను పోలియున్నవి. ప్రక 1:14లో ఆయన నేత్రము అగ్ని జ్వాలా సమములు.

భర్త ప్రవక్తకు కానుక తీసికొని వెళ్ళమన్నాడు. 10 రొట్టెలు, అప్పములు, ఒక బుడ్డి తేనె చేతబట్టుకొని దర్శించమన్నాడు. అలాగే తీసుకెళ్ళింది. వేషధారణలో బీదవారు ఇచ్చే కానుకను తీసుకెళ్ళింది. రాజు భార్య రాణి ఇవ్వాల్సిన కానుక అదేనా ? 1 సమూ 25:18లో ఒక ఆస్తిపరుడైన నాబాలు భార్యయే 200 రొట్టెలు, రెండు ద్రాక్షారసపు తిత్తులు, వండిన 5 గొఱ్ఱెల మాంసము. 5 మానికల వేచిన ధాన్యము, నూరు ద్రాక్ష గెలలు, రెండు వందల అంజూరపు అడలు గార్ధబాల మీద వేయించి తెచ్చింది. ఎంత ధారాళముగా భర్త వద్దంటే కూడా అబీగయీలు ఇచ్చింది. ఈమె అయితే వాస్తవానికి రాజు భార్య. కానుక చూస్తే బీద కానుక. మన స్థితికి తగినట్లుగానైనా దేవునికివ్వడం మన కర్తవ్యం కదా ! ప్రియ సోదరీ ! నీవీనాడు దేవునికి ఏలాగు ఇస్తున్నావు. నీకు దేవుని నుండి అనేక మేళ్ళు కావాలి. కానీ నీవు దేవునికిచ్చేది చాలా తక్కువ. అబీగయీలు తన ఇచ్ఛకొలది త్వరగా కానుక దావీదు కిచ్చింది. నష్టపోలేదు. దావీదు తిరిగి ఆమెను వివాహం చేసుకున్నపుడు దావీదు యొక్క ఆస్తిలో అబీగయీలు కూడా భాగం పొందింది. ఈనాడు క్రీస్తుకు మనం కానుక సమర్పిస్తే దానికి 100 రెట్లు ఎక్కువగా పరలోకంలో మన క్రీస్తు నుండి పొందగలం. జీవితం వేషధారణే. వారి

కానుక కూడా వేషధారణ కానుకే. బిడ్డకు రోగమొచ్చినా వేషధారణ తగ్గలేదు. యదార్థవర్తనులు ఆయనకు కేవలము ఇష్టులు. వేషధారణను ప్రభువు మెచ్చడు. ఆమె వచ్చునంతలో ఆమె యరోబాము భార్యయని మారువేషంలో వస్తుందని దేవుడు అహీయాకు చెప్పాడు. అహీయాకు దృష్టి మాంద్యమున్నా, విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. యరోబాము భార్య కాలి చప్పుడు విన్నాడు. యెష 59:1లో కూడా ప్రభువు మన దేవుడైన యెహోవా విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. ఆమె ప్రార్థన వినిపించలేదు. ఆమె కాలి చప్పుడు వినిన అహీయా యరోబాము భార్యా లోపలికి రమ్ము అని పిలిచాడు. ఆమె నిజస్థితి అంతలోనే బయటపడటం లేదూ! ఎంతో సుందరంగా ముస్తాబై వచ్చి మందిరములో కూర్చున్నా, మన నిజస్థితి ప్రభువుకు బయటపడుతూనే ఉంది. "నీవు వేషము వేసికొని వచ్చుట యేల" అంటున్నాడు అహియా. ఈనాడు ఎవరు వేషధారులు యోబు 31:26-27, మత్త వేషధారులనుద్దేశిస్తూ ప్రతీసారి ప్రభువు అయ్యో ! అంటున్నాడు. Owe unto you, Owe unto you అని ఇంగ్లీషులో వ్రాయబడింది. మీకు శ్రమ, మీకు శ్రమ అని దాని అర్థము. ఆ శ్రమ ఎక్కడ అనుభవించాలి ? 23:33లో అనుభవించవలసిన శ్రమయేంటో వ్రాయబడింది. అది నరక శిక్ష కానీ ఇక్కడ ఈ స్త్రీకి చెప్పబడిన కఠినమైన మాటలేంటో చూద్దాం. నేను నిన్ను జనులలో నుండి (1) హెచ్చించాను (2) అధికారిగా నిర్ణయించి (3) రాజ్యమిచ్చాను. అయినను నా ఆజ్ఞలననుసరించి నా దృష్టికి ఏది అనుకూలమో దాని మాత్రమే చేసి నా సేవకుడైన దావీదు చేసినట్లు చేయలేదు. నా దృష్టికి అనుకూలమైన దానిని చేయక, నన్ను బొత్తిగా విసర్జించావని 3 మాటలు దేవుడు పలికాడు. దేవుని 3 ఆశీర్వాదాలు అనుభవించిన యరోబాము దంపతులు 3 రీతులుగా దేవునికి విరోధంగా పాపం చేశారు. ఇందును బట్టి 6 రకాలుగా యరోబాము ఇంటిమీదికి దేవుడు కీడు పంపుతున్నాడు. (1) యరోబాము సంతతికి కీడు పంపించుట (2) ఆయన వంశము నిర్మూలము చేయుట (3) పెంటను ఊడ్చినట్లు వారిని ఊడ్చుట. (4) పట్టణమందు మరణమైన వారిని కుక్కలు తినుట (5) బయట భూమిలో మరణించిన వారిని ఆకాశపక్షులు తినుట (6) యెరోబాము బిడ్డ చనిపోవుట (7) పాపము వలన వచ్చు జీతము మరణమని కుమారుని మరణం ద్వారా తెలుస్తుంది. కుమారుని మరణానికి తల్లిదండ్రులే కారణం. తల్లిదండ్రుల పాపం కొఱకు ఆ పిల్లవాడు ఎందుకు చావాలి? యిర్మి 32:18 నీవు వేవేలమందికి కృపజూపుచు తండ్రుల దోషమును వారి తరువాత వారి పిల్లల ఒడిలో వేయుదువు' అని చదువుచున్నాము. అలాగే దావీదు, బత్షెబలు పాపం చేస్తే దేవుడు వారు కన్న కుమారుని చంపాడు. ఆ చిన్న పసికందు ఏ పాపము చేయలేదు కదా. ఎందుకలా జరిగిందంటే పై వాక్యమే దానికి కారణం. కానీ ఇశ్రాయేలీయులు చెఱనుండి వచ్చాక దేవుడు వారితో క్రొత్త నిబంధన చేయునపుడు

యిర్మి 31:27–30లో “తండ్రులు ద్రాక్షకాయలు తినగా పిల్లలు పళ్ళు పులిసె”నన్న మాట వాడుకొనరు. ప్రతివాడు తన దోషము చేతనే మృతినొందును. ఎవడు ద్రాక్షకాయలు తినునో వాని పళ్లే పులియును” అని చెప్పాడు. ఇప్పుడు ఎవరి పాపమును బట్టి వారే మృతినొందుతారు. అయినా యెరోబాము కుమారుడు ఎలాంటివాడో కొంత చూద్దాం. అతని పేరు అబీయా అనగా ‘యెహోవా నా తండ్రి’ అనే అర్థం ప్రకారం ఆయన దేవున్ని తన తండ్రిగా చేసుకున్నాడు. తండ్రి దూడలను తండ్రిగా చేసికోగా కుమారుడు జీవముగల దేవుని తండ్రిగా కలిగియున్నాడు. అతనియందు మాత్రమే దేవుడు అనుకూలమైన దానిని కనుగొని ఉన్నాడు. అనుకూలమైనది అంటే ఏమిటి ? ఇదియే మిక్కిలి అనుకూల సమయము. ఇదే రక్షణ దినము. ప్రభువును నమ్ముకోడానికి ఇదియే మిక్కిలి అనుకూల సమయము. ఈలాటి అనుకూల సమయంలో ప్రభువు నమ్మిన అబీయా, ప్రభువుకు అనుకూలుడే. కానీ అతనియైన యరోబాము రక్షణ పొంది దేవుని దృష్టికి అనుకూలుడు కాలేకపోయాడు.

ప్రియ సోదరీ ! ఈ రాత్రే నీ రక్షణకు అనుకూలమైన సమయము. ఇదే నీ రక్షణ దినము ఈ అనుకూలమైన రక్షణను దేవుడు నీలో కనుగొంటున్నాడా ? అది తప్ప ఇక మిగతా ఏవి ఉన్నా, అవి దేవునికి అనుకూలంకాదు. చందాలు, పరిచర్య, ధర్మము, భక్తి, ఉద్యోగం, అందం, ఏవి ఉన్నా అవి ఆయనకు అనుకూలం కాదు. అలాగైతే కుమారుడు రక్షించబడ్డాడు. కానీ యరోబాము రక్షించబడలేదు. భార్య కూడా రక్షించబడలేదు. కనుక ఆ అబీయా శవమును మాత్రమే దేవుడు సమాధిలో పెట్టుటకు అనుకూలం చేశాడు. యరోబాబు సంబంధులలో ఇతనియందు మాత్రమే దేవుడు అనుకూలమైనదాన్ని కనుగొన్నాడు. అయినా ఏ తప్పు చేయని ఈ బిడ్డ దేవుని చిత్త ప్రకారం కాయిలాపడి చావాల్సి వచ్చింది. తండ్రి చిత్తానికి ఈ బిడ్డ తన్ను తాను అప్పగించుకున్నాడు. అలా శ్రమ అనుభవించినందుకు ప్రభువతనికి బహుమానం ఇవ్వబోతున్నాడు. తల్లిదండ్రుల పాపాన్ని మోసాడు. అవి తన పాపాలుగా చేసికొని పాపమై చనిపోయాడు. యేసుక్రీస్తుకు గుర్తుగా ఉన్నాడు. 1 పేతురు 2:21–25 వ.లో ఉన్నట్లు క్రీస్తుకూడా మీ కొఅకు బాధపడి మీకు మాదిరిగా ఉంచిపోయెను. ఆయన శ్రమ పడినది మన రక్షణ కొఅకే గదా అని ఎరిగి పాపక్షమాపణ పొందితే రక్షించబడతాము. అలాగు  తమ పాపాలకు బలి అవ్వబోతున్న కుమారుడు మరణవార్త విని కూడా యరోబాము భార్య మనసు మార్చుకోలేదు. అహీయా ప్రవక్త ద్వారా యెహోవా దేవుణ్ణి క్షమాపణ వేడలేదు. యెరోబాముకు ఇచ్చిన తీర్పునే ఆహాబు ఇంటివారికి కూడా దేవుడిచ్చాడు. 1 రాజు 21:19–20 అయితే ఆహాబు ఆ మాటలు విని వస్త్రములు, చింపుకొని గోనెకట్టుకొని ఉపవాసముండి గోనెపట్ట మీద పరుండి వ్యాకులపడ్డాడు. అందుకు దేవుడు ఏలియాతో ఆహాబు నాకు భయపడి వినయముగా ప్రవర్తించుట చూచితివా ? కనుక ఈ అపాయము

అతని కాలములో కాక అతని కుమారుని కాలంలో అతని కుటుంబీకుల మీదికి రప్పిస్తానన్నాడు. ఇలా ఆహాబు తీర్పు తప్పించుకోగలిగాడు. కానీ యెజెబెలు విడువక పాపము చేస్తూ దేవుని తీర్పుకే గురి అయ్యింది. ఆహాబు చేసినట్లు యెరోబాము భార్య తన వేషము చించుకుని వుంటే నిజస్థితి అందరికీ కనబడుతుందేమో అనుకొని కాబోలు తప్పు ఒప్పుకోలేదు. క్షమాపణ లేని జీవితాన్ని శ్రమకు అప్పగించుకుంది. ఆమె 17వ వ. లేచి తిర్సాకు బయల్దేరినట్లు చూస్తున్నాము. ఆమె లేచి తిర్సాకు వెళ్ళి లోపటి ద్వారము నొద్దకు రాగానే ఆ చిన్నవాడు చనిపోయాడు. ఎంత విచారం ? తల్లిదండ్రులు తమ కుమారున్నైనా విడుచుటకిష్టపడ్డారు. కానీ తమ వేషధారణ పాపాలను మాత్రం విడువలేదు. ఇశ్రాయేలు వారందరూ ఆ చిన్నవాని కొఱకై ప్రేమతో అంగలార్చారు. కానీ యరోబాము దంపతులు అంగలార్చినట్లుగా వాక్యంలో లేదు. వారికి ముఖ్యమైనది వేషమే. కష్టమొచ్చినపుడు వారు నిలబెట్టిన దూడకు ప్రార్థించి ఉంటారు. అది వట్టి విగ్రహమని వాళ్ళకు తెలుసు. తెలిసే జీవము గల దేవుని ప్రవక్త యొద్దకు వచ్చారు. కానీ దేవునియొద్దకు రాలేకపోయారు. రాజు అవుతావని దేవుడు అహీయా ప్రవక్త ద్వారా చెప్పిన మాటలు యెరోబాము విన్నాడు కానీ, అదే దేవుడు అదే అహీయా ప్రవక్త ద్వారా ప్రకటించిన తీర్పులకు మాత్రం స్పందించి నమ్మలేదు. తద్వారా యరోబాము కాని యరోబాము భార్య సంతతి కానీ ఎవ్వరును సమాధిని చేరకుండా చావును అనుభవించారు. ఈ లోకంలో యరోబాము కుటుంబము సమాధి చేరకపోయినా పరవాలేదు. కానీ తాము బ్రతికిన కాలంలో దేవుని తీర్పులకు స్పందించి, దేవునికి భయపడి ఆయనను నమ్ముకొని వుండినట్లయితే పరలోకానికి చేరి వుండేవాళ్ళు. కుమారుడు క్రీస్తుయేసుకు సాదృశ్యంగా కనబడితే, తల్లిదండ్రులు పాపికి సాదృశ్యంగా వున్నారు. ప్రియ సోదరీ ! నీవు ఎవరికి సాదృశ్యంగా వున్నావు ? నేడే తేల్చుకో. మారుమనస్సు పొంది ప్రభువును నమ్ముకో. వేషధారణ, నామకార్థ క్రైస్తవ జీవితం విడిచిపెట్టు. దేవుడు నిన్ను రక్షించి దీవిస్తాడు.

## కుటుంబములో స్త్రీ పాత్ర

ఆదియందు దేవుడు స్త్రీని నిర్మించుటలో దేవుని ఉద్దేశమును ప్రతి స్త్రీ తెలుసుకోవడం చాలా ప్రాముఖ్యం. ఆ ప్రాముఖ్యతను ఎరుగకపోవడం వల్లనే అనేకమంది స్త్రీలు పొరపాట్లు చేస్తూ వున్నారు. నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదని దేవుడు సాటియైన సహాయాన్ని ఆదాము కొరకు తానే చేస్తానని చెప్పాడు. అట్లయితే స్త్రీ పురుషునికి సహాయం చేయడానికి దేవునిచేత నిర్మించబడినది. కాబట్టి ప్రతి స్త్రీ భర్తమీద పెత్తనము చేయుట కాక, భర్తను శాసించుట కాక, భర్తపై అధికారము చేయుట కాక, భర్తకు సహాయము అందులోను సాటియైన సహాయము చేయునదిగా ఉండాలి.

**సాటియైన సహాయమిచ్చు భార్య :-** భార్య భర్తకు తగినట్లుగా సహాయము చేయాలి. భర్త కోరిన రీతిగా, ఇష్టపడిన రీతిగా, కొరత లేకుండా ఆయనకు సహాయము అందించాలి. ఆదిమానవుడైన ఆదామునకు దేవుడు అప్పగించిన పనులు 1) తోటను సేద్యపరచుటకు 2) కావలి కాయుటకు

స్త్రీ పురుషుడి నుండే కలిగింది కాబట్టి ఆయన ప్రక్కటెముక ద్వారా నిర్మించబడింది. కాబట్టి ప్రక్కలో ఉండే సహాయము చేయవలసి వున్నది. 1 తిమోతి 2:12లో స్త్రీ మౌనముగా ఉండవలసినదే గాని ఉపదేశించుటకైనను పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను అని దేవుడు వ్రాయించాడు.

ఆదాము దగ్గరకు వచ్చి పేర్లు పెట్టించుకొనిన ఏ జంతువైనను, ఏ పక్షి అయినను, అతనికి సాటియైన సహాయము ఇవ్వలేవు. తన పోలిక చొప్పున నిర్మింపబడిన తనలో నుండి ఏర్పరచబడిన హవ్వ మాత్రమే ఆయనకు సరి సటియైన సహాయము అందించగలదు. అందుకే మానవునికి పశుపక్ష్యాదులతో, వివాహ సంబంధము దేవుడు ఏర్పరచలేదు. కాబట్టి మానవుడు మృగ సంయోగము చేయుట హేయమైన క్రియ. లేవి 18:23 అలా చేయడం విపరీతము అని దేవుని వాక్యము చెప్తుంది. అలాంటి పని చేయువారు ప్రజలలో నుండి కొట్టివేయబడతారని స్త్రీ పురుషులందరూ ఖండితముగా తెలుసుకోవడం అవసరము. అలాగే దేవుడు కూడా తాను చేసిన స్త్రీని మాత్రమే ఆదాము నొద్దకు తీసుకొని వచ్చాడు. పశుపక్షాదులను ఆదాము దగ్గరకు పేరు పెట్టించుకోవడానికి మాత్రమే రప్పించాడు. కానీ స్త్రీని తెచ్చినట్లు ఆ పశుపక్షాదులను దేవుడు ఆదామునొద్దకు తీసికొనిరాలేదు. దీనిని బట్టి స్త్రీ మాత్రమే పురుషునికి సాటియైన సహాయముగా ఇవ్వబడినదని మనము గ్రహించుకొనుచున్నాము. పశుపక్ష్యాదులు రప్పించబడినప్పుడు ఆదామునోట నుండి “నా యెముకలలో ఒక ఎముక నా మాంసములో మాంసము. ఇది నరునిలో నుండి తీయబడెను గనుక నారీ అనబడును” అను ఆనంద గానమును ఆయన నోటనుండి వచ్చినది. కనుక పురుషునికి ఆనందము కలిగించేది స్త్రీయేగాని పశుపక్షాదులు కావని మనకు బాగుగా అర్థమగుచున్నది. ఇట్టి భార్య ఇంటిలో నిర్వహించవలసిన పాత్ర లేక బాధ్యతలు కొన్ని మనం లేఖనాలు ఆధారంగా తెలుసుకుందాం.

**1) లోబడి సాటియైన సహాయం చేసే భార్య :-** ప్రియ సోదరీ ! దేవుని ఉద్దేశ్యము స్త్రీ పట్ల ఈలాగున ఉండగా నీవు నీ భర్తకు దేవుడు అప్పగించిన పనులలో సంపూర్ణమైన సాటియైన సహాయము చేయుటయే మొదటి కర్తవ్యమని గ్రహించగల్గుచున్నావా ? మొదటిగా ఆయన పని తర్వాతయే నీ స్వంతపనులు అని నీవు గ్రహించగల్గుచున్నావా ? పిల్లలు పుట్టిన తరువాత చాలామంది స్త్రీలు భర్తలకు సహాయపడుటలో నిర్లక్ష్యతను చూపిస్తుంటారు. పిల్లల మీద సాకులు చెప్పి భర్త పనులను నిర్లక్ష్యపెట్టకూడదు. స్త్రీకి పిల్లలు ప్రాముఖ్యమే కాని స్త్రీలమైన మనము

ఎవరి నుండి వచ్చామో ఆ పురుషునికి ఏ సాకులు చెప్పక ముందు వారికి సహాయము చేయడం మన ప్రథమ కర్తవ్యం అని తెలుసుకోవాలి. ఉదా : సమూ 1:8 ఎల్కానా తన భార్యయైన హన్నాతో 10 మంది కుమారుల కంటే నేను నీకు విశేషమైనవాడను కానా ? అని చెప్పాడు. గనుక ఈ వాక్యమును బట్టి స్త్రీకి పదిమందివ పిల్లలకంటే తన భర్తయే విశేషమని స్త్రీలమైన మనకు అర్థమవుతుంది.

ఆదాము, హవ్వను నా ఎముకలలో ఒక ఎముక అన్నాడు. పురుషునిలో ఉండే 206 ఎముకలలో స్త్రీ ఒక ఎముక మాత్రమే అని గ్రహించాలి. స్త్రీ శరీర నిర్మాణములో కూడా 206 ఎముకలు వుంటాయి. కానీ తాను ఏ పురుషునిలో నుండి వచ్చిందో ఆ పురుషునికి ఆమె ఒక ఎముకతోనే సమానము అని గ్రహించవలసిన అవసరము ఎంతైనా ఉంది. పురుషునికంటే స్త్రీ తాను ఏ విషయమందును అధికము కాదని గ్రహించాలి. ఈ సంగతి ప్రతి స్త్రీ ఎరిగియున్నట్లయితే తన సొంత పురుషునికి తాను ఎంతగా లోబడవలసినదోనని తాను తెలుసుకోగలదు. అందుకే దేవుడు ఎఫెసి 5:22లో స్త్రీలారా! ప్రభువునకు వలె మీ సొంత పురుషులకు లోబడియుండుడి. క్రీస్తుకు లోబడినట్లుగా భార్యలు ప్రతి విషయములోను తమ స్వపురుషులకు లోబడి వుండాలని వ్రాయించాడు. స్వపురుషులు అంటే లోకములో స్వంతముకాని పరపురుషులు కూడా వున్నారు. చాలాసార్లు లోకములో ఉద్యోగం చేసే చోట వున్న అధికారులకు స్త్రీలు ఉద్యోగ విషయములో లోబడినట్లుగా ఇంటిలో తమ స్వపురుషులకు లోబడుట లేదు. ప్రభువుకు లోబడినట్లుగా లోబడాలని చెబుతున్న దేవుని వాక్యాన్ని స్త్రీలందరు చక్కగా గ్రహించాలి.

నా మాంసములో మాంసము అని ఆదాము అన్నాడు. కాబట్టి భర్తలో ఉన్న మాంసమే తనలో ఉన్న మాంసమని ప్రతి స్త్రీ గమనించాలి. మూలభాషలో ఆదాములో ఉన్న స్త్రీ అంశముగా వున్న జీన్‌ను తీసి స్త్రీగా దేవుడు హవ్వను చేశాడు. భర్తకు వేరుగా భార్య లేదని ప్రతి స్త్రీ తెలుసుకోవాలి. ఏ నరునిలో నుండి వచ్చిందో ఆ వరునికే ఆమె 'నారి' కనుక ఆయనకే ఆమె లోబడాలి. దేవుడు ఆదాముకు గాఢనిద్ర కలుగజేసి ప్రక్కలో గాయము చేయగా ఆదాము యొక్క ఒక ఎముక ద్వారా మాంసము ద్వారా హవ్వ నిర్మితమైనట్లు, తుది ఆదామైన యేసుప్రభువు అనేక గాయములు పొందుట ద్వారా ఆయన రక్త మాంసములు ద్వారా, ఆయన మరణ నిద్ర ద్వారా ఆయన పెండ్లి భార్యయైన సంఘము నిర్మితమైనది. ఆయన సన్నిధికి సంఘము అను పెండ్లి భార్య వచ్చునపుడు తుది ఆదామైన యేసుక్రీస్తు ఆయన పెండ్లి భార్యయైన సంఘమును చూచి ఆనందించగలడా! భార్య ఈ రీతిగా లోబడుట ద్వారా ఆయన చెప్పిన పనులను ఆయన చెప్పినట్లుగానే చేయుట ద్వారా ఆయనకు సాటియైన సహాయము చేయు భార్యగా ఉండాలని దేవుని ఉద్దేశము.

**2) సుబుద్ధి గల భార్య :–** సామెతలు 31:10వ వచనము ప్రకారము కుటుంబములో స్త్రీ గుణవతియైన లేక సుబుద్ధిగల భార్యగా ఉండుటకు దేవుడు స్త్రీని నిర్మించాడు అని అర్థమగుచున్నది. స్త్రీకి అందము, ధనము, విద్య, ఉద్యోగము, ఆస్తిపాస్తులు ప్రాముఖ్యము కాదు గానీ, గుణము ఆమెకు ప్రాముఖ్యము. సుందరవతులు, విద్యావతులు, కళావతులు లోకములో చాలామంది ఉన్నారు కానీ శీలవతులు చాలా అరుదని మనము గ్రహిస్తున్నాము. ఇలాంటి గుణవతులు వారు తెచ్చే కట్నకానుకల కంటే, వెండి బంగారుల కంటే, వజ్ర వైఢూర్యాల కంటే, ఒడ్డాణం, వంకీల కంటె, ముత్యముల కంటే అమూల్యమైనవారు. వాక్యములో అబీగయీలు సుబుద్ధిగలదై రూపసియై ఉండెనని 1 సమూ 25:3లో వ్రాయబడింది. ఆమె రూపాన్ని గూర్చి దేవుడు ముందు వ్రాయించలేదుగాని ఆమె సుబుద్ధిగలదని దేవుడు ముందు వ్రాయించాడు. మనమైతే ప్రత్యేకంగా వివాహ సమయములలో రూపమును ముందు పెట్టి సుబుద్ధి గురించివ అసలు పట్టించుకోవడము లేదు. దేవుడు స్త్రీలో చూడాలని కోరుకునేది సుబుద్ధి మాత్రమే. అందము మోసకరము. సౌందర్యము వ్యర్థము. యెహోవాయందు భయభక్తులు గల స్త్రీ కొనియాడబడును అని ప్రభువు చెప్పాడు. వివేకము లేని సుందర స్త్రీ పందిముక్కున నున్న బంగారు కమ్మివంటిది అని సామె 11:22లో వ్రాయబడింది. కాని సుబుద్ధి గల భార్య యెహోవా యొక్క దానమని సామె 19:14లో వ్రాయబడింది. సుబుద్ధి గల భార్యను ఇచ్చువాడు యెహోవాయే. అయితే దుర్బుద్ధిగల భార్యను ఇచ్చువాడు సైతానుడే అని అర్థమవుతుంది. ఓ స్త్రీ ! నీ భర్తకు నీవు యెహోవా ఇచ్చిన దానమా ? లేక సాతాను ఇచ్చిన బాణమా ? ఒకరి బుద్ధి వారు పెట్టేదానిలో, వారు ఇచ్చే దానిలో, వారి క్రియలలో తెలుస్తుంది. అబీగయీలు బుద్ధి ఆమె దావీదుకిచ్చిన కానుకలో తెలిసింది. తన భర్తను తన పిల్లలను తెల్లవారేలోగా చూపడానికి వస్తున్న శత్రువైన దావీదుకు రాత్రికి రాత్రి ఆమె ఇచ్చిన అర్జంట్ కానుక యొక్క లిస్ట్‌ను చూస్తే ఆయనకు అర్థమయ్యింది. దావీదుతో కూడా 400 మంది అనుచరులు వస్తూ వుండగా తగిన సమయములేని కారణమున 200 రొట్టెలు మాత్రమే చేయగలిగింది. తగిన సమయము దొరికి వుంటే ఎన్ని రొట్టెలైనా చేసి వుండేది. తనకున్న అతి తక్కువ సమయంలోనే రెండు తిత్తులలో ద్రాక్షారసము పంపింది. కానీ ఒట్టి ద్రాక్షలు పంపలేదు. వండిన 5 గొర్రెల మాంసము పంపింది. కానీ పచ్చి మాంసము పంపలేదు. అయిదు మానికల వేచిన ధాన్యము పంపింది కానీ పచ్చి ధాన్యము పంపలేదు. 100 ద్రాక్ష గెలలను పంపింది అంటే, నలుగురికి ఒక్క ద్రాక్షగెల పంపిందని అనుకోవచ్చు. ఆ దినాలలో ఒక ద్రాక్షగెలను ఇద్దరు మోశారని మోషే చెప్పాడు. అంటే ఎంతో సమృద్ధిగా ఆమె ద్రాక్షగెలలను పంపిందని అర్థమవుతుంది. ఇవి మాత్రమే కాక రెండు వందల అంజూరపు అదలను పంపింది. ఇవన్నియు గార్దభముల మీద వేయించి పంపింది. వీటన్నింటిని ఆకలిగొనిన దావీదు, అతని జనులు వెంటనే తినడానికి సిద్ధంగా చేసి పంపింది. ఆకలితో వస్తున్న దావీదుకు, అతని

జనులకు ఈ విధంగా సిద్ధముచేసి ఆమె పంపకపోతే ఆ పర్వతారణ్యములో వారు ఎట్లు, ఎప్పుడు సిద్ధపరచుకోగలరు ? వీటన్నిటిని బట్టి ఆమె సుబుద్ధి ఆమె పంపిన కానుకలో దావీదుకు అర్థమయ్యింది.

ప్రియ సోదరీ ! నీ బుద్ధి నీ ప్రభువుకు ఆదివారము నీవు వేసే కానుక సంచిలో చిల్లర వలె అల్లరి చేస్తున్నదా ? లేదా నీవు వేసిన కానుక మౌనముగా వుంటూ నీ సుబుద్ధిని చాటుచున్నదా ! నీవు చూపిన బుద్ధి విషయమై నీకు ఆశీర్వాదము కలుగును గాక ! అని దావీదు అబీగయీలుతో 1 సమూ 25:33లో అన్నాడు. ఇందును బట్టి ఎవరి సుబుద్ధి వారికి ఆశీర్వాదము కలిగిస్తుందని అర్థమవుతుంది. అలాగే ఎవరి దుర్బుద్ధి వారికే శాపము కలిగిస్తుంది అని మనము తెలుసుకోవాలి. చాలాసార్లు వాళ్ళు నాకెలాగు చేశారో నేను వారికి అలాగే చేస్తాను అని అనుకుంటాము. కీడుకు ప్రతికీడు కాదుగాని కీడుకు ప్రతిగా మేలే చేయాలి. కుటుంబములో అత్తల యెడల ఆడపడుచులు, మరుదుల యెడల సుబుద్ధి చూపించాలి. నేను నిన్నే పెళ్ళి చేసుకున్నాను. కానీ నీ వాళ్ళను కాదు అని భర్తతో అనడం సుబుద్ధి అనిపించుకోదు.

**3) నమ్మకమైన భార్య :–** సామె 31:11వ వచనము ప్రకారము భార్య భర్తకు నమ్మకమైన భార్యగా ఉండాలని అర్థమవుతుంది. ఇటువంటి నమ్మకమైన భార్యలద్వారా భర్తకు లాభప్రాప్తియే కలుగుతుంది. కాని నష్టప్రాప్తి కలుగదు. భార్య అన్ని విషయములలో నమ్మకముగా ఉండాలి. వాటిలో ముఖ్యమైన మూడు విషయములు మాత్రమే ఇక్కడ ఉదహరించ బడుచున్నవి.

**ఎ) భర్త ఇచ్చే డబ్బులో నమ్మకముగా ఉండవలసిన భార్య :–** చాలామంది భార్యలు తమ భర్తల ప్యాంట్స్, షర్ట్స్‌లో ఉన్న డబ్బులు దొంగిలించి తమకిష్టమైన చీరెలు కొనుక్కోవాలి. మా అన్న పెట్టాడు, మా అమ్మ పెట్టింది అని భర్త సొమ్ము విషయమై అపనమ్మకముగా ఉంటున్నారు. భర్తకు తెలియకుండా అప్పులు ఇవ్వడం, అప్పు తీసుకోవడం, చీటీలు కట్టడం ఇలాంటి పనులు చేస్తూ అపనమ్మకముగా ఉంటున్నారు. భర్తలకు తెలియకుండా భర్త డబ్బును తల్లి ఇంటివారికి ఇవ్వడం ద్వారా భర్తకు తప్పుడు లెక్కలు చూపిస్తూ ఉన్నారు. ఇలా అబద్ధాలు ఆడి ప్రభువు బల్లను చాలామంది స్త్రీలు సమీపించలేకపోతూ ఉన్నారు.

**బి) భర్త అప్పగించిన పనిలో నమ్మకముగా ఉండవలసిన భార్య :–** భర్త అప్పగించిన పనిని జాప్యము లేకుండా వెంటనే చేయుట వలన భార్య నష్టానికి దూరంగా ఉండగలదు. పనిలో జాగు చేయువాడు నష్టము చేయువానికి సోదరుడు. పనిలో నిపుణత గలవాడు రాజుల యెదుటనే నిలుచును (సామె 22:29). ఉదా :– ఒక భర్త తన టైలర్ కుట్టవలసిన దానికంటే రెండు అంగుళాలు పొడవు ఎక్కువగా కుట్టిన ప్యాంట్‌కు తన భార్యకిచ్చి రెండు అంగుళాలు పైకి మడత పెట్టి కుట్టమని చెప్పాడు. అలా కుట్టడంలో భార్య జాప్యము (ఆలస్యము) చేయుట

వలన ఆ భర్త తన భార్య చేయని పనిని తన చెల్లికి అప్పగించాడట. అతని చెల్లి కూడా ఆ పనిని చేయుటలో ఆలస్యము చేయగా ఆ భర్త తన తల్లికి ఆ పనిని అప్పగించవలసి వచ్చింది. కుమారుడు చెప్పిన పనిని తల్లి ఆలస్యము చేయక వెంటనే రెండు అంగుళాలు పైకి మడత పెట్టి కుట్టివేసింది. అది తెలియక అతని చెల్లి కాలేజి నుండి ఇంటికి వచ్చాక ఆమె కూడా రెండు అంగుళాలు పైకి మడత పెట్టి ఆ ప్యాంట్‌ను కుట్టేసింది. ఆ సంగతి తెలియక అతని భార్య అన్ని పనులు ముగించుకొని రాత్రి పడుకోబోఏ ముందు భర్త ప్యాంట్‌ను రెండు అంగుళాలు పైకి మడతపెట్టి కుట్టేసింది. ఇప్పుడు ఆ ప్యాంట్ భర్త తొడుక్కోవడానికి పనికి వస్తుందా ? రెండు అంగుళాలు పొడవు ఎక్కువగా ఉండిన ప్యాంట్ ఇప్పుడు 4 అంగుళాలు పొట్టి అయ్యింది. భార్య భర్త చెప్పిన పనిని జాప్యము లేకుండా వెంటనే చేసి ఉంటే ఇతరులకు ఆ పనిని అప్పగించవలసిన అవసరత ఉండేది కాదు. ఆమె ఆలాగు ఆలస్యంగా విధేయత చూపడం వలన నష్టమునకు కారణమయ్యింది.

అలాగున, మన ప్రభువుకు ప్రధానము చేయబడిన మనము కూడా మన పరమ భర్తకు వెంటనే విధేయత చూపించి ఆయన అప్పగించిన పనిని చేయాలి. ఏ రోజు సేవ ఆ రోజే ముగించబడాలి. అప్పుడే ప్రభువు భళా ! నమ్మకమైన మంచి భార్య అని అంటాడు. సౌలు రాజుతో దేవుడు అమాలేకీయుల మీద యుద్ధం చేసి వారందరిని సంహరించాలని, వారి పశువులన్నింటిని చంపివేయాలని అమాలేకీయుల రాజైన అగగును తుత్తునియలుగా చేయాలని చెప్పాడు. సౌలు రాజు అమాలేకీయులనందరినీ దేవుడు చెప్పినట్లు చంపాడు. కాని శపితమగు గొఱ్ఱెలలోను, ఎడ్లలోను ముఖ్యమైన వాటిని యెహోవాకు బలి అర్పించడానికి తీసుకొని వచ్చాడు. అలాగే అమాలేకు రాజును ప్రాణముతో తీసుకొని వచ్చుట వలన దేవుడు చెప్పిన పనిలో సగము విధేయత చూపించి సగము అవిధేయత చూపించాడు కానీ, సౌలు ఇలా చేయుట దేవుని దృష్టిలో సంపూర్ణ అవిధేయతకు సమానము. (In the sight of God partial obedience is equal to complete disobedience)

**సి) శీలములో నమ్మకముగా ఉండవలసిన భార్య :–** భర్త ఇంటిలో ఉన్నా లేకపోయినా, దూరదేశములో ఉన్నా శీలములో భార్య భర్తకు నమ్మకముగా ఉండాలి. క్రైస్తవ వివాహములో కలిమియందును, లేమియందును, ఆరోగ్యమందును, అనారోగ్యమందును, మరణము మనలను ఎడబాపు పర్యంతము నీకే భార్యనైయుందునని ప్రమాణము చేసిన భార్య, భర్తకు శీలములో నమ్మకముగా ఉండాలి. కానీ సామె 7:10–27 వచనములలో వ్రాయబడిన ప్రకారము వేశ్యావేషము వేసుకొనిన కపటము గల స్త్రీ “పురుషుడు ఇంట లేడు, దూరప్రయాణము చేసియున్నాడు. సొమ్ము సంచి చేతపట్టుకొని వెళ్ళాడు. పున్నమి నాటివరకు తిరిగి ఇంటికి రాడు” అని బుద్ధిలేని ఒక పడుచువానిని తన భర్తలేని సమయములో ఆమె ఇంటికి

ఆహ్వానిస్తుంది. ఇటువంటి స్త్రీలు శీలములో అపనమ్మకస్తులు అని అర్థమవుతుంది. ఇహలోకములో భర్త కళ్ళు కప్పినా పరమ భర్త కళ్ళు కప్పగలమా ? సర్వము చూచే దేవుని కంటికి చాటుగా జరిగే పని ఏదియూ లేదు కదా ! కీర్తన 94:9 ప్రకారము కంటిని నిర్మించినవాడు కానకుండనా? ప్రియ సంఘమా ! మన పరమ పురుషుడైన ప్రభువు కూడా పరలోకమును దూరదేశమునకు వెళ్ళాడు. ఆయన వచ్చువరకు ఆయన కొఱకే వేచియున్నావా? ఇటువంటి నమ్మకమైన భార్యల వలన భర్తలకు ఎంతో లాభకరంగా ఉంటారు. ఇంటిలో లాభమే, బయట లాభమే, వ్యాపారమైనా లాభమే. అటువంటి భార్యలు లాభము సంపాదించుటలో కూడా అనుభవము పొందగలదు (సామె 31:18).

ఇటువంటి లాభదాయకమైన నమ్మకత్వము కలిగిన భార్యలు ద్రవ్యమును కూడబెట్టి పొలము చూచి కొంటారట. భర్త కాదు కానీ ఆ భార్యయే అది మెట్ట పొలమా ? బీడు భూమా లేక ఎర్రరేగడి పొలమా ? నల్లరేగడి పొలమా ? సారము కలిగిన పొలమా ? అవి తానే చూచి కొనగలిగిన భార్యగా, పొలము కాని బీడుగా ఉంచక ద్రాక్ష మొక్కలు నాటిస్తుంది. నడికట్టు చేత తన నడుము బలపరచుకొని తానే పనిచేస్తుంది. పైన వ్రాయబడినట్లు ఆ పొలమే ఈ లోకము. ఈ లోకమనే పొలములో ప్రియ సోదరీ ! నీ పరమ భర్త పని కొరకు ఎంత డబ్బును కూడబెట్టావు ? ఎంత పొలాన్ని కొన్నావు ? అనగా ఈ లోకమనే పొలములో నీవు అడుగుపెట్టే ప్రతి స్థలాన్ని నీకు ఇస్తానని చెప్పిన దేవునివ కొరకు ఎన్ని అడుగుల పొలము లేక ఎన్ని ఎకరముల పొలము ప్రభువు కొరకు సంపాదించావు ? ఎంత సమయము అనే ధనాన్ని వెచ్చించి ఆ ప్రభువు పొలములో ఎంత వరకు పనిచేస్తున్నావు ? నీవు ప్రభువు పనికి ధనము ఇవ్వలేక పోవచ్చు. కానీ నీవు సమయము అనే ధనాన్ని ఎక్కువగా ఇవ్వగలవేమో! ఈ లోకమనే పొలములో ఆత్మీయ సేద్యము చేసి ఆత్మలు అను ద్రాక్ష మొక్కలను నాటి సంఘము అను ద్రాక్షతోటను ప్రభువు కొరకు నీవు సిద్ధము చేయవచ్చు. నీ ద్వారా నీ స్థానిక సంఘములో ఎన్ని ఆత్మలు చేర్చబడ్డాయి. అనుదినము సువార్త ప్రకటించి, ఆత్మలను రక్షించి, సంఘములో చేర్చి ప్రభువుకు చక్కని లెక్క అప్పగించగల్గుతున్నావా ? అలా చేయుట ద్వారా నీ పరమ భర్తకు లాభప్రాప్తి కలుగజేసినదానవుగా ఉంటావు. ఇటువంటి నమ్మకమైన భార్యకు సామె 28:20వ వచనము ప్రకారము దీవెనలు మెండు. మోషే దేవుని ఇల్లంతటిలో నమ్మకమైన వాడుగా ఉండి దీవెన పొందాడు. నెహెమ్యా 7:2 ప్రకారము హనన్యా నమ్మకమైన మనుష్యుడై ఉండుట వలన యెరూషలేముపైన అధికారము పొందాడు. అతని నమ్మకత్వము బట్టి అతడు 'అధికారమనే' దీవెన పొందాడు. ఇహలోకములో నీవు జీవించిన నమ్మకమైన జీవితానికి ఇహమందును, పరమందును ఎన్నో దీవెనలు పొందుదువు.

ప్రియ సోదరీ ! ఇప్పటినుండైనా నమ్మకమైన జీవితము జీవించడానికి తీర్మాణము చేసుకొంటావా ? నమ్మకముగా జీవించనివారికి శాపములే మెండు కదా ! ఈనాడు నీవు

అనుభవిస్తున్న నీ కష్టాలకు, శాపాలకు కారణము నీలోని అపనమ్మకత్వమే కారణము కాబోలు ఆలోచించు. తీర్మాణము చేసుకోవలసిన గడియ ఇదే. దేశములో నమ్మకస్థుల కొరకు దేవుడు వెదుకుచున్నాడు (కీర్త 101:6).

**4) భర్తకు మేలు చేసే భార్య :-** సామె 31:12. భార్య దొరికినవానికి మేలు దొరుకును అను వాక్య ప్రకారము భార్య కొద్దికాలమే కాక తాను బ్రతికిన దినములన్నిటను అతనికి మేలే చేయాలి కానీ కీడు చేయకూడదు. ఒక భార్య తన భర్తకు చేయు మేలులన్నింటిని కంటే గొప్పదైన మేలు ఏదనగా భయముతో కూడిన తన పవిత్ర ప్రవర్తన వలన వాక్యము లేకుండానే ముష్కరులైన తమ భర్తలను క్రీస్తునొద్దకు రాబట్టి వారిని రక్షణలోనికి నడుపుటయే. అలాగున లేఖనములలో మీకాలు, అబీగయీలు ఇలాంటి స్త్రీలు మరణించబోతున్న తమ భర్తలను మరణము నుండి రక్షించగలిగారు. కానీ యోబు భార్య యోబు ద్వారా ఎన్నో మేలులను పొందుకున్నది. కానీ నష్టములోను, కష్టములోను, అనారోగ్యములోను ఉన్న తన భర్త యొక్క ఊపిరిని అసహ్యించుకొని దేవుని దూషించి మరణము కమ్మని చెప్పుట వలన భర్తకు మేలు కాదు గాని కీడే చేసిందని మనము గ్రహిస్తున్నాము. ఇటువంటి భార్యలు భర్తలకు మేలు కాదుగాని కొందరు చెప్పినట్లు మేకులుగా, తేళ్ళుగా వుంటున్నారు. యోబు భార్య యోబును రక్షించుకునే ప్రయత్నము చేయలేదు. అన్ని సరిగా సప్లయ్ చేస్తేనే భర్తల దగ్గర ఉండటానికి కొద్దిమంది స్త్రీలు ఈ దినాల్లో ఒప్పుకుంటారు. భర్త ఏ ఒక్కటి తక్కువ చేసినా భర్తను విడిచిపెట్టే ప్రయత్నంలో వాళ్ళు ఉంటున్నారు.

ప్రియ సోదరీ ! మరి నీ సంగతేంటి ? భర్తలు అందంగా ఉన్నపుడు కాదు, కష్టపడి జీతం తెస్తున్నపుడు కాదు, అన్ని అవయవాలు సరిగా పనిచేస్తున్నప్పుడే కాదు, ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే కాదు, ఆక్సిడెంట్ ద్వారా అనారోగ్యమైనా, అందవిహీనమైనా, అవిటివాడై, కష్టపడలేక జీతము లేకున్నా, మంచానికే పరిమితమైన కూడా భార్య తాను బ్రతుకు దినములన్నిటను సామె 31:12 ప్రకారము అతనికి మేలే చేయాలి కానీ కదేమియూ చేయకూడదు. ఉదాహరణకు అబీగయీలు తన భర్త త్రాగుబోతు, పనికిమాలినవాడు, దుర్మార్గుడు, మోటువాడు, విందులు కోరువాడు, ఎవనిని తనతో మాటలాడనీయని కఠినస్థుడైనను అట్టి వానిని రక్షించుటకు దావీదు పాదాలు పట్టుకొని, కానుక ఇచ్చి భర్తను రక్షించే మేలు చేసింది.

**5) ఇంటిలో పనిచేసే భార్య (సామె 31:13)** సామెతలు 31వ అధ్యాయములో 10-12 వచనాలలో గుణవతియైన భార్య చేసే అనేక పనులు వ్రాయబడ్డాయి.

ఎ) ఇంటిలో భర్తపని (సామె 10:12)

బి) ఇంటిలో వంటపని (14-15)

సి) పొలములో ద్రాక్ష తోటపని (16–17)

డి) వ్యాపార పని (18–19)

ఇ) ఇంటిలో వస్త్రముల పని (13 వ.)

ఎఫ్) ఇంటిలో పరుపులు సిద్ధంచేసే పని

జి) కృపగల ఉపదేశం చేసే పని (26 వ.)

హెచ్) ధర్మం చేసే పని (20 వ.)

ఐ) ఇంటివారి నడతలు కనిపెట్టే పని (27 వ.)

**జి) ఉపదేశము చేసే భార్య (సామె 31:27 వ.):–** సామెతలు 31:26 ప్రకారము స్త్రీ జ్ఞానము కలిగి తన నోరు తెరచి కృపగల ఉపదేశము బోధించేదిగా వుండాలి. కృపగల ఉపదేశమే గాని కోపముతో, ద్వేషముతో మనసుతో కష్టము పెట్టుకొని చేయకూడదు. జాన్ వెస్లీ తల్లికి 12 మంది కుమారులైనా, ఎంతో పని ఉన్నప్పటికి పనిచేస్తూ కూడా తన యొద్దకు వచ్చే స్త్రీలందరికి ఉపదేశము చేసేదట. యేసుప్రభువు యొక్క దయగల మాటలు వినడానికి మనం వాక్యంలో చదువుతాము. అలాగు స్త్రీలమైన మనము ఆయన దయారసమును మన పెదవుల మీద కలిగినవారమై దయతోను, ప్రేమతోను, మనుష్యులను పోగొట్టుకొనకుండా రాబట్టుకొనేవారముగా ఉపదేశము చేయవలసినవారముగా ఉన్నాము. అదే సమయములో జ్ఞానము కలిగి మనం నోరు తెరవాలి. జ్ఞానముగా యేసుప్రభువే మన జ్ఞానమైయున్నారు. యేసుప్రభువును గూర్చిన మాటలే మనం మాట్లాడాలి. ఆ ప్రభువును గురించి మనం చెప్పే సువార్త ద్వారా అనేక ఆత్మలను ప్రభువు సన్నిధికి తెచ్చేవారముగా ఉండాలి. దేవుడు మనకిచ్చిన మన పిల్లలకే ముందు ఉపదేశము చేయవలసిన వారమైయున్నాము. హన్నావలె యోకెబెతువలె, లోయి, యునీకేవలె, బత్షెబవలె, స్త్రీలు ఉపదేశము చేయాలి.

**హెచ్) ఇంటివారి నడతలు కనిపెట్టే భార్య :–** గుణవతియైన భార్యకు తీరికలేని పనులు ఎన్ని ఉన్నను తన ఇంటివారి నడతలను బాగుగా కనిపెట్టవలసినదిగా ఉన్నది. ఇంటివారు అనగా కుమారులు, కోడళ్ళు, అల్లుళ్ళు, భర్త, పనిమనిషి ఇంటికి వచ్చేపోయేవారి నడతలను ఆమె జాగ్రత్తగా కనిపెట్టాలి. స్కూల్లో పిల్లల నడత, కాలేజ్‌లో యౌవనస్థుల నడత కనిపెట్టాలి. బాల్య పాపములలో పిల్లలు పడకుండా ఒకవేళ బాల్య పాపములలో పిల్లలు పడినప్పటికీ వాళ్ళను బహిరంగముగా అందరిముందు గద్దించి, కొట్టకుండా ఎలా వారిని మాన్పించాలో ఆ బాధ్యత ప్రథమంగా తల్లిమీదే వుంటుంది. యౌవనస్థులు అసలు కాలేజికి వెళ్తున్నారా లేదా తన స్నేహితులతో ఏమి మాట్లాడుతున్నారో తల్లి గమనించాలి. అప్పుడప్పుడు వారి పుస్తకాలలో లవ్ లెటర్స్ ఏమైనా ఉన్నాయేమో అని పరీక్షించడం మంచిది. ఏ టైమ్‌లో ఇల్లు

చేరుతున్నారో గమనించాలి. పని మనుషుల ప్రవర్తన కూడా ఎలా ఉందో గమనించడం ఈ దినాల్లో చాలా అవసరం. ఒక క్రైస్తవ విశ్వాసుల ఆశ్రమంలో ఉంటున్న ఒక అమ్మాయి బైబిల్ చదవమని తల్లి చెప్తే బైబిల్‌లో నవల పెట్టి చదువుతోందట. పిల్లలు ఎటువంటి మోసాలు చేస్తున్నారో తల్లిదండ్రుల కళ్ళుకప్పి తల్లిదండ్రులను నమ్మించి ఏ ఏ పనులు చేస్తున్నారో తల్లులు గమనించాలి. కాలేజికి వెళ్తున్నామని చెప్పి మ్యాట్నీలకు, హోటళ్ళకు, లాడ్జిలకు వెళ్లే పిల్లలు ఎంతో మంది ఉన్నారు. అప్పుడప్పుడు పిల్లలు తలుపు వేసుకుని కంప్యూటర్‌లో బ్లూ ఫిల్మ్‌లు ఏమైనా చూస్తున్నారేమో గమనించాలి. ఇంటర్‌నెట్‌లో పిల్లలు ఏమి చేస్తున్నారో తల్లులు గమనించాలి.

ఈలాగున గుణవతియైన భార్య పనిచేయకుండా భోజనము చేయదట. రూతు 2:2లో యౌవనస్థురాలైన రూతు తనకు క్రొత్తదైన యూదా దేశములో పొలములోనికి వెళ్లి పరిగె ఏరుకునే పని చేస్తానని అత్తయైన నయోమితో చెప్పడం ఎంతమాదిరికరమో కదా ! 2 థెస్స 3:10 ప్రకారము పనిచేయనివాడు భోజనము చేయకూడదట. కానీ, కొద్దిమంది పనిచేయని దుష్టులుగా ఉంటూ, అక్రమముగా నడుచుకొనుచూ జులాయిగా తిరుగుచున్నారు. 2 థెస్స 3:12 ప్రకారము నెమ్మదిగా పనిచేసుకొనుచు సొంతముగా పనిచేసి ఆహారము భుజించాలని వాక్యములో వ్రాయబడింది. సామె 31:31 ప్రకారము ఆమె చేసిన పనులకు దేవుడు తగిన ప్రతిఫలమిస్తాడు. రూతు 2:12 ప్రకారము రూతుకు దేవుడు సంపూర్ణ బహుమానము ఇస్తాడని బోయజు చెప్తున్నాడు. సామె 31:31 ప్రకారము ఆమె పనులే ఆమెను కొనియాడతాయని వ్రాయబడింది. ఆమె అందమును బట్టి ఆమెను కొనియాడలేదు. కాని ఆమె పనులే ఆమెను కొనియాడుతాయి. తన భర్త దేశాధికారియైనప్పటికి ఆమె తన పనికత్తెలకు పని ఏర్పరచడమేకాక చేతులతో బలముగా పనిచేసేదిగా కనబడుచున్నది. సామె 31:17 ప్రకారము ఒక చేతితోకాక రెండు చేతులతో (బలమును దాచుకొనక) బలముగా పనిచేసేదిగా కనబడుతుంది. కొద్దిమంది పనిచేయవలసి వచ్చినపుడు తమకు బలము ఉన్ననూ, బలము లేనట్టే పని చేస్తారు. ఆమె నడికట్టు చేత నడుమును బలపరచుకొని పనిచేసేదిగా కనబడుతుంది. చీమలు బలములేని జీవులైనను తమకు ఉన్న ఆ చిన్న బలముతోనే వేసవి కాలములో కూర్చుంటాము. మానవులు వెళ్ళే పాతాళములో కాని, పరలోకములో చేయడానికి ఏ పనులూ ఉండవు. కనుకనే భూలోకములో చేతికి వచ్చిన పనిని శక్తిలోపము లేకుండా చేయాలని ప్రసంగి 9:10 వాక్యము చెప్తుంది. అలాగే స్త్రీ సంఘము అనే దేవుని ఇంటిలో కూడా తన వంతు పనిని చేయువారిగా ఉండాలి. సంఘములో స్త్రీ, చేయవలసిన పనులను గురించి సంఘములో స్త్రీ పాత్ర అనే అంశము క్రింద వివరముగా తెలుసుకోవచ్చును.

**6) యోగ్యురాలైన భార్య :–** సామె 12:4 ప్రకారము యోగ్యురాలైన భార్యలు భర్తలకు కిరీటముగా ఉంటారు.

రూతు పొలములో ఉన్న వారందరిచేత 'యోగ్యురాలు' అన్న సాక్ష్యము తెచ్చుకుంది. అన్యురాలైనను భర్తను పోగొట్టుకున్న విధవరాలైనను, యెహోవా దేవుని నమ్ముట చేత మునుపటి ప్రవర్తన కంటే మరీ ఎక్కువైన ప్రవర్తన కలిగియుండుటచే తన యోగ్యతను బట్టి వివాహమైన తరువాత బోయజుకు కిరీటము తెచ్చిన భార్యగా చూస్తున్నాము. కిరీటమంటే అక్షరార్థమైన కిరీటము కాదు గానీ ఆమె యోగ్యముగా భర్తకు తగినట్లు జీవించడమే కిరీటము పెట్టినదానితో సమానము. పెళ్లికాక మునుపు ఏ స్త్రీయైన తాను ఇతరుల చేత పిలువబడునపుడు ఫలాని వ్యక్తి యొక్క కుమార్తె అని పిలువబడుతుంది. తన పెళ్ళైన తరువాత ఫలాని వ్యక్తి యొక్క భార్య అని పిలువబడుతుంది. కనుక భార్య ఏ విషయములోనైనా తప్పుడు జీవితము జీవిస్తే ఆమెను బట్టియే ఆమె భర్తకు చెడ్డ పేరు వస్తుంది. అలా భార్య చెడ్డపేరు తెచ్చినపుడు భర్తకు సిగ్గు కలుగుతుంది. మంచి భార్య ద్వారా కిరీటము పొందే భర్త తల ఎత్తుకొని జీవించగలడు. సిగ్గు తెచ్చు భార్య వలన భర్త తలదించుకొనవలసి వస్తుంది. అటువంటి భార్య తన భర్త యొక్క ఎముకలకు కుళ్ళు (బోన్ టి.బి.) తెస్తుంది.

ప్రియ సోదరీ ! నీ భర్తకు నీవు కిరీటము తెచ్చావా ? లేక సిగ్గును (బోన్ టి.బి.) తెచ్చావా ? బోయజు 3:11 వ.లో నీవు యోగ్యురాలవని నా జనులందరూ ఎరుగుదురు అని చెబుతున్నాడు. రూతు యోగ్యురాలని ఒక్క బోయజు మాత్రమే చెప్పుట లేదు. బోయజు జనులందరూ ఆమెను 'యోగ్యురాలు' అని అంటున్నారు. అలాగే మనమందరము భక్తితో మాత్రమే కాక భర్త పక్షమున ఉన్న భర్తగారి జనుల సాక్ష్యం కూడా పొందడం ఇంకెంత ధన్యకరమో కదా ! వారు సామె 3:11 సాక్ష్యము రూతు విషయమై చెప్పారంటే, రూతు వారందరికీ ఎంత ప్రేమించిందో కదా ! అట్టి యోగ్యురాలైన రూతును వినిపించే బంధువుగా బోయజు ప్రయత్నిస్తున్నాడు. అట్టి యోగ్యురాలిని ఒట్టి చేతులతో అత్త ఇంటికి పంపక నిండు చేతులతో అనగా 6 కొలల యవలు దుప్పటిలో వేసి పంపాడు. యోగ్యురాండ్రకు మన పరమ బోయజు ఈ లోక బోయజు చేసిన దానికంటే ఎక్కువగా చేయు దేవుడై యున్నాడు. ప్రియ సోదరీ ! అట్టి యోగ్యురాలైన జీవించుటకు ఇష్టపడతావా? నేడే నిశ్చయించుకో.

**7) ఫలించే భార్య :–** కీర్తన 128:3 నీ లోగిట నీ భార్య ఫలించు ద్రాక్షవల్లివలె ఉండును అనుమాట ప్రకారము ప్రతి భార్య ఫలించవలసిన భార్యగా ఉన్నది. ఆది 1:28లో దేవుడు "మీరు ఫలించి అభివృద్ధి పొంది, విస్తరించి, భూమినివ నిండించి దానిని లోపరచుకొనడి" అని చెప్పారు. కనుక భార్య ఫలించు ద్రాక్షావల్లిగా ఉండాలి. కుమారులు యెహోవా

అనుగ్రహించు స్వాస్థ్యము గర్భఫలము ఆయన ఇచ్చు బహుమానము అన్న వాక్యము ప్రకారము గొడ్రాండైన పితరుల భార్యలందరూ ప్రభువు కృపవలన గర్భఫలము పొందారు. హన్నా కూడా ప్రార్థించి సమూయేలును పొందింది. లేయా ప్రేమించమని తన భర్త కొరకు 6గురిని కనింది. మన ప్రభువు మనల్ని ప్రేమిస్తూ ఉండగా ఆ పరమ భర్త కొరకై ఆత్మీయముగా ఎంతమందిని కన్నాము ? లేయా 6 గురు పిల్లల్ని యాకోబును కనింది. సువార్త చెప్పి ఎంతమందిని ప్రభువు కొరకు కన్నాము ? పరలోకానికి వట్టి చేతులతోనే వెళ్తారా ? ఆత్మలను మీ వెంట తీసుకెళ్తారా ? ఆత్మల కొరకై ప్రార్థించుడి. భక్తులందరూ తమ వెంట అనేక ఆత్మలను ప్రభువు దగ్గరకు తీసుకువెళ్తారు. మరి నీ సంగతేంటి ?

ప్రియ సోదరీలారా ! మనమును ప్రభువు కొరకు ఆత్మలను రక్షించుదము గాక ! నీతి మార్గమును అనుసరించునట్లు ఎవరు అనేకులను త్రిప్పుదురో వారు నక్షత్రములవలె నిరంతరము ప్రకాశించెదరని దానియేలు 12:3వ.లో వ్రాయబడినట్లు మనము కొందరినైన, ప్రభువు వైపు త్రిప్పుదుము గాక ! పౌలు 1 కొరిం 9:19లో ఎక్కువ మందిని సంపాదించుకొనుటకై అందరికీ నన్ను నేను దాసునిగా చేసుకొంటిని అన్నాడు. 20 వ.లో యూదులను సంపాదించుకొనుటకై యూదులకు యూదునివలె ఉంటిని. ధర్మశాస్త్రమునకు లోబడిన వారిని సంపాదించుటకు ఉంటిని అన్నాడు. నేను ధర్మశాస్త్రమునకు లోబడనివాడను కాకపోయినను ధర్మశాస్త్రమునకు లోబడనివాని వలె ఉంటిని అన్నాడు. ధర్మశాస్త్రము లేనివానిని సంపాదించుకొనుటకై ధర్మశాస్త్రము లేనివారికి ధర్మశాస్త్రము లేనివానివలె ఉంటిని. 22వ. బలహీనులను సంపాదించుటకై బలహీనులకు బలహీనుడనైతిని. ఏ విధము చేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరికి అన్ని విధములవంటివాడనై యున్నానని చెప్పడంలో ఆత్మలను కనుటలో ఆయనకున్న భారము, ఆయన దీక్ష ఎంతో గొప్పవో అని అనిపిస్తుంది. పౌలుకున్న ఈ భారము మనకునూ, దినదినము అధికమగును గాక ! కావున స్త్రీలమైన మనము శరీరరీతిగా మనము కన్న మన కుమారులు, కుమార్తెలను సువార్త వాక్యము చెప్పి వారిని ఆత్మీయంగా కూడా కనవచ్చు. వారే మనకు శారీరకంగా, మరియు ఆత్మీయంగా రెండు విధాలుగా పిల్లలవుతారు. రెండు విధాలుగా మనం ఫలించు ద్రాక్షవల్లులుగా ఉంటాము.

పై బాధ్యతలన్ని ఇంటిలో స్త్రీ నిర్వహించడానికి క్రైస్తవ విశ్వాస సోదరులమైన మనకే దైవకృప ఎంతో అవసరం. అవన్నీ నిర్వహించగల కృపా సమయాన్ని తప్పకుండా ప్రభువు మనకిస్తారు. "కృప మీ అందరికి తోడైయుండును గాక!" అను హెబ్రీ 13:25లో ఉన్న కృపా సహిత వచనాన్ని గుర్తు చేసికొని ప్రార్థనాపూర్వకముగా ముందుకు సాగుదాం.

# పరిశుద్ధ ఆభరణములు

ఈ లోకంలో అలంకరణ కొఅకు, అందాన్ని పెంపొందించుకునేందుకు ఆభరణములను వాడుతారు. పరిశుద్ధ ఆభరణములు అంటే ఆత్మీయమైన ఆభరణములు అని అర్థం. శరీర సంబంధమైన ఆభరణాలు కూడా ఉన్నాయి. ఈ శరీర సంబంధమైన ఆభరణాలు లోకమంతటా ఎక్కడంటే అక్కడ పుష్కలంగా దొరుకుతాయి. పరిశుద్ధ ఆభరణాలు ప్రభువు దగ్గరే దొరుకుతాయి. ఈ దినాలు అందానికి అర్రులు చాచే రోజులు. తినే ఆహారం కొఅకు పెట్టే ఖర్చు కంటే ఆభరణాలకు పెట్టే ఖర్చు ఎక్కువగా వుంటోంది. 'మింగ మెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె' అన్నట్లు ఒకరిని చూచి మరొకరు వాటితో అలంకరించుకొనే స్తోమత లేకున్నా అప్పులు చేసైనా ఆభరణాల కొఅకు పాటుపడు తున్నారు. ఆ ఆభరణాలు ధరించకపోతే లోకం తమను చిన్న చూపు చూస్తుందేమో అని అనుకునేవారు లేకపోలేదు. శరీర సంబంధమైన బాహ్యా ఆభరణాలను మనుషులు చూస్తారు. కానీ దేవుడు ఆత్మీయ ఆభరణాలని అనగా అక్షయ అలంకారాన్ని చూస్తాడు. అయితే ఈ ఆత్మీయ ఆభరనాలు ఏవేవి ? అని వాక్య ఆధారంగా మనం చూచుకుందాం.

**1) రక్షణ అనే ఆభరణం :-** కీర్తన 149:4లో వున్నట్లు విశ్వాసికి దేవుడిచ్చిన మొదటి ఆభరణము రక్షణ. ఆయన దీనులను తన రక్షణతో అలంకరించును అని వ్రాయబడింది. పాపాత్ములమైన మన అందరి పాపములనుండి మనలను విడిపించివ తన కుమారుని రక్తధారలతో కడిగి పవిత్రపరచి, పాప ఫలితమైన నిత్యాగ్ని గుండము నుండి తప్పించి రక్షించారు మన ప్రభువు. ఆ రక్షణయే మన మొదటి ఆభరణము. అమ్మా ! నీకు లోకరీతి ఆభరణాలెన్నో ఉండవచ్చు. ప్రభువిచ్చే రక్షణ ఆభరణముందా ? అది లేకపోతే మోక్షం లేదు. నరకమే నీ గతి. చేసిన పాపం ప్రభువు దగ్గర ఒప్పుకో. రక్షణ నీదౌతుంది.

ప్రభువిచ్చే మరికొన్ని పరిశుద్ధ ఆభరణాలను గురించి...

**2) అణకువ అనే ఆభరణం :-** 1 తిమోతి 2:9 నుండి 15వ. వరకు వ్రాయబడ్డాయి. 9వ వచనంలో అణుకువ అనే ఆభరణం గురించి వ్రాయబడింది. స్త్రీలకు అణుకువ ఎంతో అవసరం. ఎగిరెగిరి పడే తత్వం ఉండకూడదు. ఏమీ లేని ఆకు ఎగిరెగిరి పడుతుందట. మనలో ఏ మంచితనము లేకపోయినా ఏవో గొప్పలు చెప్పుకునే తత్వం మనలో ఉండకూడదు. ఉదా :- ఆది 16:9. హాగరు దాసిగా వున్నపుడు గర్వపడి శారా యింటినుండి పారిపోతూ వుండగా దేవునిదూత బుగ్గయొద్ద ఆమెను కనుగొని 'నీవు నీ యజమానురాలి యొద్దకు వెళ్ళి అణిగియుండమన్నాడు. హాగరుకు అణిగిమణిగి వుండే తత్వము లేదన్నమాట. అలాగు ఏమిలేని మనల్ని దేవుడు దీవించి ఏమైనా యిస్తే వాటిని బట్టి మనం గర్వపడకుండా అణిగిమణిగి తగ్గించుకొని జీవించాలి. అది మనకు అలంకారాన్నిచ్చే ఆభరణము.

**3) స్వస్థత అనే ఆభరణం :-** 1 తిమోతి 2:9 వచనంలోనే స్వస్థబుద్ధి అనే ఆభరణం కూడా వ్రాయబడింది. శరీరానికి స్వస్థత ఏలాగు అవసరమో బుద్ధికి స్వస్థత అవసరం. స్వస్థబుద్ధి అంటే సుబుద్ధి లేక మంచిబుద్ధి అని అర్థం. బుద్ధి దేవుడిష్టపడే అభరణము. అబీగయీలు సుబుద్ధి గల స్త్రీ. ఆమె బుద్ధి ఆమె పంపిన కానుకలో కనబడుతుంది. రొట్టెలలో, గొఱ్ఱెలలో, అంజూరలలో, ద్రాక్షలలో, ధాన్యములో దావీదుకు భాగము పంపింది. అర్జంట్‌గా అంత కానుక పంపింది. నిదానంగానయితే యింకెంత కానుక పంపేదో కదా ! ఆ కానుక చూచి, దావీదు నీ సుబుద్ధి నీకు ఆశీర్వాదమిచ్చును గాక అన్నాడు. అమ్మా ! మన సుబుద్ధి కూడా మన కానుక సంచిలో కనబడుతుంది. ఆ బుద్ధి మనకు ఆశీర్వాదాన్ని తెచ్చేదిగా వుందా ? లేక తగిన దానికన్నా తక్కువ యివ్వటం వల్ల లేమిని తెస్తుందా ? అలాగైతే సుబుద్ధి కూడా మనకు ఆభరణమేనట. దుష్టుడైన తన భర్త దావీదు చేత చచ్చిపోవడం యిష్టంలేక ఆ దుష్టుని కొఱకు దావీదును ప్రార్థించి తన సుబుద్ధిని అబీగయీలు చూపింది.

**4) సత్క్రియ అనే ఆభరణం :-** 1 తిమోతి 2:10 వ వచనంలో సత్క్రియలలో అలంకరించుకోమన్నారు. ప్రభువు బైబిల్‌లో సత్క్రియలకు పేరు పొందిన స్త్రీగా అ.కా. 9:36-43లో దొర్కాను చూడవచ్చు. ఆమె విధవరాండ్రకు అంగీలు కుట్టించేది. ఆమె చనిపోయినా ఆమె సత్క్రియలు చావలేదు. అవి ఆమెను గూర్చి సాక్ష్యమిచ్చాయి. దొర్కావుంటే విధవరాండ్రకు వస్త్రసమృద్ధి ఉన్నట్లే అటువంటి ఆమెను బ్రతికించింది ఆమె సత్క్రియలే అనిపిస్తుంది. ఆమె బ్రతికిన విషయము విని యొప్పేలో అనేకులు ప్రభువుని విశ్వసించారు. ప్రియ సోదరీ ! నీకు చేతనైన నీకందుబాటులో నున్న ఈలాటి సత్క్రియలు చేస్తే అవే నీకు ఆభరణాలు. నీ సత్క్రియల ద్వారా కూడా ఆత్మలను ప్రభువు దగ్గరకు నడిపించవచ్చు.

**5) మౌనము అనే ఆభరణము :-** 1 తిమో 2:11లో మౌనముగా ఉండుటయే మరొక ఆభరణముగా వ్రాయబడింది. స్త్రీ మౌనముగా వుండాలి అంటే ఎక్కడ మౌనంగా వుండాలి? సంఘములో జనుల ప్రవర్తనను గురించి తిమోతికి పౌలు ఈ పత్రిక వ్రాస్తున్నాడు కాబట్టి సంఘములలో స్త్రీలు మౌనముగా ఉండాలి. 1 కొరిం 14:4. సంఘములో స్త్రీ ఉపదేశించుటకైనను, పురుషుని మీద అధికారము చేయుటకైనను ప్రభువు సెలవియ్యడము లేదు. ఎందుకంటే స్త్రీ మొదట అపరాధములో పడిపోయింది. ఆ తరువాతే ఆదాము స్త్రీ సంపూర్ణ విధేయతతో తన భర్త దగ్గర యింటిలో నేర్చుకోవాలి. స్త్రీ సంఘంలో మౌనంగా ఉండాలని ధర్మశాస్త్రము కూడా చెబుతుంది. స్త్రీ కుటుంబంలో కూడా ఎంత మౌనంగా వుంటే అంత మంచిది. మార్కు 14:3-8 వరకు వ్రాయబడిన భాగములో సీమోను మరియ అచ్చజటామాంసి అత్తరు శేరున్నర ఎత్తు తీసికొని ప్రభువు పాదములకు పూసినపుడు యూదా ఆమె మీద ఆక్షేపణ చేశాడు. అటువంటి సమయంలో ఆమె ఏమియూ మాటలాడలేదు. ఆమె

మౌనంగా వున్నపుడు ప్రభువే తన నోరు తెరచి ఈమె నా నిమిత్తమై మంచి కార్యము చేసింది. ఆమె జోలి పోకుడి అని ఆమెకు అండగా నిలిచి మాట్లాడారు.

ప్రియ సోదరీ ! అనేక విషయాల్లో మౌనంగా వుండాల్సిన మనం మన నిర్దోషత్వాన్ని బయటపెట్టాలి అని అనేకసార్లు మన నోర్లు తెరుస్తున్నాం. మనం నోరు తెరిస్తే మన ప్రభువు మాట్లాడే అవకాశం లేదు. మనం నోరు మూస్తే ఆయన మన పక్షాన మాట్లాడుటకై తన నోరు తెరువొచ్చు. ఈ సందర్భంలో ఆయన వధకు తేబడినపుడు గొఱ్ఱె మౌనముగా వుందునట్లు, బొచ్చు కత్తిరించువాని దగ్గర గొఱ్ఱె మౌనముగా వున్నట్లు మనలను మౌనంగా ఉండడాన్ని జ్ఞాపకం చేసుకోవాలి. మౌనమే మన మరొక ఆభరణం.

**6) విశ్వాసమనే ఆభరణం :-** 1 తిమోతి 2:15లో మరో మూడు పరిశుద్ధ ఆభరణములను గూర్చి మనము చదువుచున్నాము. అవి విశ్వాసము, ప్రేమ, పరిశుద్ధతలు. ఇక్కడ విశ్వాసము అనగా రక్షించబడినపుడు వున్న విశ్వాసము మాత్రమే కాదు. దిన దిన జీవితములో విశ్వాసమే మన ఆభరణముగా ఉండాలి. సర్వాంగ కవచములో విశ్వాసము ఒక ఆయుధముగా చెప్పబడింది. ఈ దిన సమస్యల నుండి శోధనల నుండి, శ్రమల నుండి, ప్రభువు తప్పించి సహాయం చేస్తాడు అన్న దిన దిన విశ్వాసం మనకుండాలి. గతంలో వుంచిన విశ్వాసం మాత్రమే కాదు ఈ రోజు, ఈ క్షణం కూడా ప్రభువు మీద మనకు విశ్వాసముండాలి. నిన్నటి రోజు, నిన్నటి నెల, నిన్నటి సంవత్సరం ప్రభువు సహాయం చేశారుగానీ యిపుడు సహాయం చేస్తారో లేదో అనే అవిశ్వాసముంచకూడదు. ఇంతవరకు సహాయం చేసిన ఎబినెజరు దేవుడు ఇకముందుకును సహాయం చేస్తారన్న విశ్వాసమే మనం ఆభరణంగా కలిగి ఉండాలి. ఉదా :- హెబ్రీ 11:11లో విశ్వాసమును బట్టి శారాయు వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడని యెంచుకొని వయసు గతించినదైనను గర్భము ధరించుటకు శక్తిని పొందెను.

**7) ప్రేమ అనే ఆభరణము :-** 15వ వచనంలోనే 'ప్రేమ' అనే మరో పరిశుద్ధ ఆభరణాన్ని చూస్తున్నాం. సంఘములో స్త్రీ అందరినీ ప్రేమించాలి. అలాగే యింటిలోనూ అందరినీ ప్రేమించాలి. తీతు 2:5లో పతిప్రియులుగాను, శిశుప్రియులుగానూ ఉండాలని వ్రాయబడింది. పతి ప్రియులకు ఉదాహరణగా మీకాలును చూచుకుందాం. 1 సమూ 18:21లో సౌలు తన కుమార్తెను దావీకు ఉరిగానుండునట్లు ఆమను అతనికియ్యాలని పెండ్లి చేశాడు. కానీ వారి కాపురాన్ని సౌలు చూచినపుడు తన కుమార్తెయైన మీకాలు దావీదును ప్రేమించుట చూచాడు. మీకాలు సౌలు రాజకుమార్తె. అంతపురములో ఉండేది. దావీదు దరిద్రుడు. మీకాలును పెండ్లి చేసుకునేప్పుడు 50 వెండి రూకలు కూడా ఓలిగా యిచ్చుకునే స్తోమత లేనివాడు. అయినా దావీదును మీకాలు ప్రేమిస్తున్నది. ఆస్తి, అంతస్తులు, విద్య, హోదా బాగున్నపుడు సంపాదన

బాగున్నపుడు మాత్రమే కాదు. ఏమీ లేకున్నా మనం మన భర్తలను ప్రేమించగలుగుచున్నామా? మనల్ని మనలే ప్రశ్నించుకోవాలి. మనలో ఏ మంచీ, ఏ మెప్పూ, ఏ మహిమా లేనపుడే క్రీస్తుప్రభువు మనల్ని ప్రేమించాడు. ఏమీ లేనపుడు ప్రేమించేదే నిజమైన ప్రేమ. అలాగే 1 సమూ 25:40-44లో అబీగయీలు కూడా ఏమీలేని దావీదు తనను పెళ్ళి చేసుకోవాడానికి కబురు పంపగా, అబీగయీలు దావీదును పెళ్ళి చేసుకోవడానికి కాదట. దావీదు సేవకుల కాళ్ళు కడగటానికి వస్తానని చెప్పింది. దావీదు సేవకుల కాళ్ళు కడిగితే, దావీదు కాళ్ళు ఎంత ప్రేమగా కడిగేదో కదా ! అసలు దావీదు తన సేవకుల కాళ్ళు అబీగయీలుతో కడుగనిస్తాడా ? అయినా దావీదంటే అబీగయీలుకు ఎంత ప్రేమో కదా. కష్టాలలో వున్న దావీదును ప్రేమతో పెళ్ళిచేసుకుంది.

అదే సమయంలో శిశు ప్రియులుగా కూడా ఉండాలని వాక్యం చెబుతుంది. తన శిశువులను ప్రేమించిన తల్లులు తమ బిడ్డలను ఆశీర్వదించాలని యేసుప్రభువు దగ్గరకు వారిని తీసికొని వచ్చారు. మనము మన పిల్లల్ని నిజంగా ప్రేమిస్తున్నామంటే వారిని మనము ప్రభువు దగ్గరకు నడిపించాలి. లూకా 18:15.

1 రాజు 3:23-27 వరకు ఉన్న భాగములో బ్రతికియున్న బిడ్డ తల్లి తన కుమారుడు కత్తితో రెండు భాగములు చేయబడకుండా బిడ్డ విషయమై పేగులు తిరుగుకొనిపోయినదై బిడ్డగా ఎంతమాత్రము చంపక రెండవ దానికే యిప్పించుమని మనవి చేసింది. శిశు ప్రియురాలైన ఆ తల్లి తన బిడ్డ కొఱకు ప్రేగులు తరుగుకొనిపోయినదై ప్రార్థించింది. కనుక మనము మన పిల్లలను ప్రేమిస్తున్నామంటే వారికొఱకు మామూలు ప్రార్థన కాక ప్రేగులు తరుక్కునిపోయేట్లు ప్రార్థించాలి. అలాంటి ప్రార్థనలే, కన్నీటి ప్రార్థనలే, ఉపవాస ప్రార్థనలే జవాబును తెస్తాయి. కనుక స్త్రీలమైన మనకు ప్రేమ ఒక గొప్ప ఆభరణము. ఏలయనగా అన్నింటిలో శ్రేష్ఠమైనది ప్రేమయే. అలాగున భర్తలకుగాని, పిల్లలకుగానీ, మరెవ్వరికైనా మనం చేసే పనులు ప్రేమతోనే చేయాలి. ఇది ఎంతో ప్రయాసతో కూడినదైనా ప్రేమను మనకు గొప్ప ఆభరణముగా ప్రభువిచ్చాడు. ఈ ఆభరణం మన అందాన్ని పెంపొందించేదిగా ఉంది.

**8) పరిశుద్ధత అనే ఆభరణం :-** 1 తిమో 2:15 వచనంలో కపటమైన స్త్రీ వలపుతీరా తృప్తి పొందుదము. పురుషుడు యింటలేడు అని ఆహ్వానిస్తుంది. ఇది అపవిత్ర ప్రవర్తన. 1 తిమో 3:1లో ఈ పవిత్ర ప్రవర్తనను చూచి వాక్యానికి అవిధేయులైన భర్తలు ప్రభువు నొద్దకు రాబట్టబడే అవకాశముందని వాక్యంలో ప్రభువు వ్రాయించారు. మాటలో, చూపులో, తలంపులో, నడతలో పవిత్రత అవసరం. సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులై వుండాలి. 1 థెస్స 4:3లో పరిశుద్ధులగుటయే అనగా జారత్వానికి దూరముగా ఉండుటయే దేవుని

చిత్తమని వ్రాయబడింది. 1 థెస్స 4:7లో పరిశుద్ధులగుటకే దేవుడు మనలను పిలిచెనుగాని అపవిత్రులుగా ఉండుటకు పిలువలేదు. కాబట్టి పరిశుద్ధత కూడా ఒక ఆభరణముగా ప్రభువు మనకిచ్చాడు.

**9) లోబడుట అను ఆభరణము :–** ఈ పరిశుద్ధ ఆభరణము 1 పేతురు 3:1–6 వరకూ వున్న వాక్యభాగంలో కనిపిస్తుంది. 3:1లో స్వపురుషులకు లోబడియుండుడని వ్రాయబడింది. 5వ వచనంలో అటువలె పూర్వము దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీలును, తమ స్వపురుషులకు లోబడియుండుట చేత తమ్మును తాము అలంకరించుకొనిరని వ్రాయబడింది. ఈ మాట ప్రకారం క్రీస్తు తన భర్తకు లోబడియుండుట ఆమెకు ఆభరణమే. ఎన్నిసార్లు లోబడి వుండాలి. ఎంతకాలం లోబడి వుండాలి, అంటే ఎఫెసి 5:24లో భార్యలు ప్రతి విషయములోను తమ భర్తలకు లోబడవలెను అని వ్రాయబడింది. ఎఫె 5:23 ప్రకారం ప్రభువునకు వలె మీ సొంత పురుషులకు లోబడి వుండవలెను అని వ్రాయబడింది. ప్రభువుకు మనం ఎదురుచెప్పము కదా ! అలాగే భర్తలకు కూడా ఎదురు చెప్పక లోబడి వుండాలి. వీరు (భర్తలు) ప్రభువులు కాకపోయినా ప్రభువునకు వలె లోబడి ఉండాలని ప్రభువు ఆజ్ఞ. ఇది మనము పాటించి తీరాలి. ఇష్టమున్నా, ఇష్టము లేకపోయినా వినాల్సిందే, లోబడాల్సిందే.

ఇలా లోబడిన స్త్రీలలో శారాను ఉదాహరణకు వాక్యములో దేవుడు చూపిస్తున్నాడు. ఆమె అబ్రహాముకు లోబడుచు, తన భర్తను యజమానుడని పిలచుచుండెనని 1 పేతురు 3:6లో వ్రాయబడింది. ఈ కాలంలో స్త్రీలు తమ భర్తలను పేర్లతోను కొద్దిమంది ఓయ్ అని, కొద్దిమంది ఏమీ..? అని మరికొద్దిమంది అండీ... అని ఒక్కొక్కరు ఒక్కోలాగున పిలుచుకుంటున్నారు. కానీ, శారా తన భర్తను పిలుచుటలో కూడా మాదిరి కలిగి 'యజమానుడు' అని పిలిచేదిగా కనబడుతుంది. పిలుపుతో మాత్రమే కాక జీవితంలో కూడా విధేయురాలుగా లోబడింది. ఆది 18:6లో త్వరపడి 3 మానికల మెత్తని పిండి తెచ్చి పిసికి రొట్టెలు చేయమన్నాడు. ఎదురుచెప్పక శారా చేసి పెట్టింది. అప్పుడామె వయస్సు 89 సం॥ల వృద్ధురాలు.


స్త్రీ ధర్మము, బలము ఉడిగిపోయిన రోజులవి. వృద్ధురాలు త్వరపడాలట. 3 మానికల మెత్తటి పిండి పిసికి రొట్టెలు చేయాలట. వచ్చిన ముగ్గురు దూతలకు ఎంత పిండి, ఎలాటి పిండి తీసుకోవాలని ఎలా రొట్టె చేయాలో ఆమెకు తెలియదా ? మెత్తటి పిండి 3 మానికలు, పిసికి చేయమని చెప్తున్నాడు అబ్రహాము. అలాంటప్పుడు శారా పైకి యజమానుడా అని పిలుస్తూ వచ్చిన వారు ముగ్గురైతే 3 మానికల పిండి ఎందుకంటే ! మెత్తని పిండి తీసుకోవాలనీ, పిసికి రొట్టె చేయాలని నాకు తెలియదా ? మీరు నేర్పాలా ? పైగా యిప్పుడే ఎండవేళ భోజనం చేశాక విశ్రాంతి తీసికొనకుండా మళ్ళీ వంటపెట్టాలా! అని ఎదురు చెప్పలేదు. 89 యేళ్ళ వృద్ధురాలు 3 మానికలనగా ఆరు శేర్ల పిండి పిసికింది అంటే ఆమె చేతులెంత నొప్పి

పెట్టాయో, రొట్టెలు చేసి, కాల్చింది. కాల్చుటకు ఎంతో సమయము ఖర్చు చేసింది. అబ్రహాము దేవదూతలు యింటికి వచ్చినపుడు వారితో కూడా భోజనానికి తన ఇంట వున్న దాసులను కూడా ఆహ్వానించి ఉన్నాడేమో తెలియదు. అన్ని రొట్టెలు చేయించాడు కదా మరి. ముగ్గరికి మూడు మూడు చొప్పున 9 రొట్టెలు చాల్లేండి. అనలేదు శారా. భర్త చెప్పినట్లు చేసింది. నవయవ్వన స్త్రీ చేసినట్లు త్వరపడి చేసింది. ఇది మనందరికీ ఎంతో మంచి మాదిరి. లోబడటం మనకు అలంకరణిచ్చే ఆభరణము అని ఎప్పుడైనా తలస్తున్నామా? నిత్యమై భర్తలకు లోబడే వాళ్ళు నిత్యమూ ఆభరణాలంకృతులుగానే కనబడతారు. నిత్య వధువుగా వుంటారు. ప్రియ సోదరీ నీవిలా కనబడాలంటే ఎప్పుడూ స్వంత పురుషునికి లోబడాలి మరి !

**10) సాధువైన మృదువైన ఆభరణము :-** 1 పేతురు 3:4 వ.లో సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణము అనే ఆభరణము కనబడుతోంది. జంతువులలో సాధువైన జంతువులున్నాయి. అవి ఏ హానియూ చేయవు. కనుక వాటిని యిళ్ళలో కూడా పెంచుకుంటాము. క్రూర జంతువుల జోలికి వెళ్ళము. మనతో సాధు జీవితముంటే అందరూ మన దగ్గరకొస్తారు. అందరూ మనలతో సహవాసం చేయడానికిష్టపడతారు. కనుక సాధువైన గుణము ఇతరులను మన మాటలతోగానీ, మన ప్రవర్తనతోగానీ గాయపరచని జీవితం అవసరం. మృదువైన గుణము అనగానే మన ఆహార పదార్థాలలో అతి మెత్తనిదైన వెన్న గుర్తుకొస్తుంది. వెన్నను ఎంత పిసికినా కఠిన పదార్థమేదీ కనిపించదు. అంతా మెత్తని పదార్థమే. అలాగే మనలో యితరులు ఎంత వెదికినా కఠినత్వంకాక మెత్తని స్వభావమే కనబడాలి. ప్రభువును సిలువ వేసినా, కొట్టినా, హింసించినా, వీడు, వాడు దుర్మార్గుడు అనినా ప్రభువు నోరు తెరువగా సాధువైన గొఱ్ఱెపిల్ల వలె మౌనంగా వున్నాడు. నోరు తెరచినా వారిని క్షమించమని తండ్రిని వేడుటకై తెరిచాడు. ఇదే సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణము. ఈ గుణమే మన ఆభరణము.

పై ఆభరణాలన్నీ మనము ధరించుకున్నపుడే లేక కలిగియున్నపుడే ప్రభువు మనలను పర 6:4 ప్రకారం “నీవు సౌందర్యవంతురాలవు” అని పిలువగలడు. ఎందుకంటే కీర్త 45:11 ప్రకారం నీ ప్రభువు నీ సౌందర్యమును కోరుచున్నాడు. పై ఆభరణాలన్నీ 1 పేతు 3:5 ప్రకారం మనల్ని మనమే అలంకరించుకోవాలి. ఒకరు అలంకరించేవి కావు. లోకంలో పెళ్ళిళ్ళ సమయంలో పెళ్ళి కుమార్తెను ఎంతోమంది కలసి అలంకరిస్తారు. కానీ ప్రభువు యొక్క పెళ్ళికుమార్తెయైన మనము మనల్ని మనమే పై పరశుద్ధ ఆభరణాలతో అలంకరించుకోవాలి. ఇలా అలంకరించబడిన పెళ్ళికుమార్తెను చూచి పెండ్లికుమారుడైన ప్రభువు సంతోషిస్తారు.




Visit our website :
www.telugubiblestudy.org

రచయిత :
కెజియా వరప్రసాదరెడ్డి
షాలోం క్రిస్టియన్ అసెంబ్లీ
# 1/183, విద్యానగర్, J.N.T.U.C. పోస్టాఫీసు, అనంతపురము - 2.
(A.P.) S. India
Cell : 94402 85883, 94406 69494

శ్రీలత ఆఫ్‌సెట్, తెనాలి. 9247872191